ధర్మవ్యాధోపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ నందూరి రామకృష్ణమాచార్య

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2019

DHARMAVYADHOPAKHYANAM
with Commentary

Commentary by
Dr. Nanduri Ramakrishnamacharya

T.T.D. Religious Publications Series No.1366
© All Rights Reserved
First Print : 2019

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **“మహాభారతం”** అయ్యింది.

“యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్”

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలవ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **ధర్మవ్యాధోపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

ధర్మవ్యాధ(స) గీత

సౌభ్రాత్ర సౌహృదముఖాన్ హృదయస్య ధర్మాన్
ఆబధ్య ధీపరిణతీరుత రాజనీతీః ।
దేశస్యయే హృదయ శీర్షతయా చకాస్తః
రామాయణ తదథ భారతమేవ వన్దే ॥

తోడబుట్టినవాళ్లలాగ మంచిమనస్సుతో కలసిమెలసి ఉండడంవంటి హృదయధర్మాలను, మంచి తెలివితేటలు, జ్ఞానానికి పరాకాష్ఠ అయిన రాజనీతులను విశదీకరిస్తూ భారతదేశానికి హృదయం, శిరస్సులాగ ప్రభాసించే మహాగ్రంథాలు రామాయణ, మహాభారతాలకు నమస్కరిస్తున్నాను అని ఆ శ్లోకానికి అర్థం.

స్నేహం, దయ, ప్రేమ, సోదరప్రేమ, దేశప్రేమ, పెద్దలపట్ల భక్తివంటి హృదయధర్మాలను రామాయణం బోధిస్తుంది. ఆలోచనాశక్తి, నైతిక ప్రవృత్తి, కార్యనిర్వహణాచతురత, సదసద్వివేకం, కష్టాలను అధిగమించే ఓర్పు, నేర్పు వంటి శిరస్సుకు చెందిన ధర్మాలను మహాభారతం ప్రబోధిస్తుంది. వీటిని ఆదరిస్తూ, గౌరవప్రదమయ్యేవాడే నిజమైన భారతీయుడు.

వ్యాసభగవానుని విరాడ్రూపం ముందు ఈ ప్రపంచమంతా ఒక పిపీలిక. భారత, భాగవతాలు ఆ మహాత్ముని ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు. అందులో భారతం సకల కౌతుకాలకు జన్మస్థానం. వివేకతరువులు పెరిగిన ఉద్యానవనం. జ్ఞానసముద్రం. పరిపూర్ణమైన నవరస సుధాబ్ధి. భువికి నడిచివచ్చిన వైకుంఠం. సకల విద్యలకు మూలపీఠం. సకల శాస్త్రాలకు ఒరిపిడి రాయి. సకల ధర్మాలకు పుట్టినిల్లు. సజ్జనుల జిహ్వాకు అలంకారం. శారదాదేవికి లావణ్యరత్న భాండాగారం. ఉదయభానుని లేలేత కిరణాలకు జగత్తు ప్రకాశించినట్లుగా, వ్యాసుని మేధాశక్తికి లోకమంతా బంగారుమయమైంది.

ప్రతి యుగంలోను ఉత్పన్నమయ్యే సమస్యలకు ఈ మహాగ్రంథంలో కాలదోషం పట్టని పరిష్కారాలున్నాయి. నైతిక, ఆధ్యాత్మిక ధర్మాలను స్థాపించే అందలి భావాలకు అంతర్జాతీయ ప్రఖ్యాతిగల రాజకీయ నాయకులే ప్రభావితులయ్యారు. అందుకే జ్ఞానేశ్వర మహారాజు తన భగవద్గీత వ్యాఖ్యలో జగత్త్రయం వ్యాసోచ్ఛిష్టమని అభివర్ణించారు.

మహాభారతంలో అనేక ఉపాఖ్యానాలున్నాయి. ప్రతిపాదించబడిన విషయాన్ని ఈ ఉపాఖ్యానాలు సులభతరం చేస్తాయి. అందుకే వ్యాసభగవానుడు కూడా –

'ఉపాఖ్యానైః సహ జ్ఞేయం ఆద్యం భారతముచ్యతే'

అని మహాభారతాన్ని ఉపాఖ్యానాలతోనే తెలిసికోమని చెప్పాడు. అంతేకాదు –

అనాశ్రిత్యేద మాఖ్యానం కథాభువి న విద్యతే
ఆహార మనపాశ్రిత్య శరీరస్యేవధారణమ్

– 'మన శరీరానికి తిండి ఎలా అవసరమో, తత్త్వానికి కథ కూడా అలానే అవసరం. ఆఖ్యానం లేకుండా భూలోకంలో కథ ఉండదు' అని మరీ చెప్పాడు.

చెప్పదలచుకొన్న అంశం బాగా అర్థం కావాలంటే ఉపాఖ్యానాలు తప్పనిసరి. వేదం సూత్రప్రాయంగా చెప్పిన ధర్మాలను వ్యాసులవారు ఉపాఖ్యానాలద్వారా హృదయానికి హత్తుకొనేటట్లు చెప్పారు. కథ అనేది ఒక శరీరం. అది లేకుండా ఆత్మతత్త్వం అర్థంకాదు.

ఉపాఖ్యానం అంటే – ఉప, ఆఙ్ అనే రెండు ఉపసర్గలతో కూడిన ఖ్యా= కథనే ధాతువు నుండి ఉపాఖ్యానం అన్నపదం ఏర్పడుతోంది. 'ఆ సమంతాత్ కథనమ్' – అంటే తాను చెప్పదలచుకొన్న విషయాన్ని

సమగ్రంగా చెప్పడం అని అర్థం. ఉప – అనే ఉపసర్గకు 'సమీపం', 'దగ్గర' అన్న అర్థాలున్నాయి. అంటే మనస్సుకు హత్తుకొనేటట్లుగా ధర్మతత్త్వాదులను బోధించడం అని అర్థం చెప్పుకోవచ్చును.

'శ్రుతస్యార్థస్య కథనం ఉపాఖ్యానం ప్రచక్షతే' – అన్న లక్షణాన్ని అనుసరించి తాను విన్నదాన్ని ఇతరులకు చెప్పడాన్నే ఉపాఖ్యానం అంటారు. మన పూర్వులు, ఋషులు తాము పెద్దలవల్ల విన్న విషయాలను అందరికీ చెప్పి వ్యాపింపజేయడమే ధ్యేయంగా పెట్టుకొన్నవాళ్లు. వాళ్లచేత కూడా ప్రచారం చేయించేవాళ్లు. వ్యాసులవారు కూడ తన శిష్యులద్వారా భారతాన్ని భూలోకంలోను, గంధర్వలోకంలోను, దేవలోకంలోను ప్రచారు చేయించారు.

మహాభారతంలో మొత్తం 152 ఉపాఖ్యానాలున్నాయి. ఆదిపర్వం ప్రారంభంలోనే వ్యాసులవారు వాటిని పేర్కొన్నారు. కొన్ని ప్రతులలో అవి ఆయన చెప్పిన పేర్లతో లేవు. లోకంలో ప్రసిద్ధమైన శకుంతలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం కూడ ఈ వరుసలో లేవు.

ధర్మవ్యాధోపాఖ్యానం చాలా విశిష్టమైన ఆఖ్యానం. అంతేకాదు విలక్షణమైనది కూడ. భారతంలో పలుచోట్ల బ్రాహ్మణ్యాన్ని నిర్వచించింది. ధర్మవ్యాధోపాఖ్యానంలోనే అది సమగ్రతను సంతరించుకొన్నది. ఇటువంటి మహత్తరమైన బ్రహ్మవిద్యలు, తాత్త్వికతను ప్రబోధించే గ్రంథాలను గీత అంటారు. ఇటువంటి గీతలు మహాభారతంలో మొత్తం 16 ఉన్నాయి. అవి–

1. భగవద్గీత – భీష్మపర్వం
2. ఉతథ్యగీత – శాంతిపర్వం
3. వామదేవ గీత – శాంతిపర్వం
4. ఋషభగీత – శాంతిపర్వం
5. బ్రహ్మగీత – శాంతిపర్వం

6. షడ్జగీత – శాంతిపర్వం
7. శంపాకగీత – శాంతిపర్వం
8. మంకిగీత – శాంతిపర్వం
9. బోధగీత – శాంతిపర్వం
10. విచఖ్నుగీత – శాంతిపర్వం
11. హారీతగీత – శాంతిపర్వం
12. వృత్రగీత – శాంతిపర్వం
13. పరాశరగీత – శాంతిపర్వం
14. హంసగీత – శాంతిపర్వం
15. అనుగీత – శాంతిపర్వం
16. బ్రాహ్మణగీత – శాంతిపర్వం

భగవద్గీత, అనుగీతలు రెండు ఇంచుమించు ఒక్కటే. ఈ 16 గీతలేకాక ఆరణ్యపర్వంలోని అష్టావక్రవంది సంవాదం, ద్విజవ్యాఘ్ర సంవాదం, యక్ష యుధిష్ఠిర సంవాదం, ఉద్యోగపర్వంలోని సనత్సుజాతీయం, శాంతిపర్వంలోని మోక్షధర్మం, అశ్వమేధపర్వంలోని ధర్మవ్యాధోపాఖ్యానాలు కూడా గీతలని చెప్పదగినవి. అందుకనే ధర్మవ్యాధోపాఖ్యానాన్ని వ్యాధగీత అని పవిత్రంగా చెప్పుకొంటారు. ఇందులో వ్యాధుడు గురువు, బ్రాహ్మణుడు శిష్యుడు. అందలి కథ సంగ్రహంగా చూద్దాం.

కౌశికుడనే బ్రాహ్మణుడు చెట్టుక్రింద కూర్చుని వేదం వల్లిస్తున్నాడు. చెట్టుపైన ఉన్న కొంగ అతనిపై రెట్టవేసింది. కోపంతో ఆ పక్షిని చూశాడు. అది చచ్చి క్రిందపడింది. అయ్యో! అకారణంగా పక్షిని చంపానే – అని పశ్చాత్తాపం చెందాడు. మధ్యాహ్నమయింది. వికలమైన మనస్సుతో ఒక బ్రాహ్మణుని ఇంటిముందు నిలబడి 'భిక్షాందేహి' అన్నాడు. ఆ ఇల్లాలు భిక్షకోసం పాత్ర సిద్ధం చేసే సమయానికి ఆమె భర్త ఆకలితో ఇంటికి వచ్చాడు. భర్తకు సపర్యలు చేశాక ఆ బ్రాహ్మణునికి భిక్ష వేయడానికి వచ్చింది. అతడు ఆగ్రహించాడు. 'బ్రాహ్మణుణ్ణి ఇలా అవమానిస్తావా బ్రాహ్మణకోపం ప్రపంచాన్ని బుగ్గి చేస్తుందని తెలియదా' అని కళ్లెర్రజేశాడు. అందుకామె సతికి పతిసేవ మించిన ధర్మంలేదు. నీవు ముక్కోపివని తెలుసు. నీ కోపానికి ఒక కొక్కెర చనిపోయిందని కూడ నా పాతివ్రత్యం వల్ల తెలిసికొన్నాను. క్రోధ లోభాలు రెండు భయంకరమైన శత్రువులు. వాటిని జయిస్తేనే బ్రాహ్మణునికి గౌరవం, అని కొన్ని ధర్మాలు చెప్పింది. నీకు ధర్మాలు తెలుసు కాని, ధర్మసూక్ష్మాలు తెలియవు. మిథిలానగరంలో ఉన్న ధర్మవ్యాధుని దగ్గరకు వెళ్లి ధర్మసూక్ష్మాలు తెలిసికోమని చెప్పి పంపింది.

మిథిలలో మాంసంముక్కలు కొట్టి అమ్ముతున్న ధర్మవ్యాధుడిని చూసి రోతపడ్డాడు కౌశికుడు. అతని రాకను తన తపశ్శక్తితో గ్రహించాడు ధర్మవ్యాధుడు. వెళ్లి నమస్కరించాడు. "నీకు ధర్మం బాగా తెలుసు. అయినా మాంసం కొట్టి అమ్ముతున్నావు. ఇది జీవహింస కదా? అన్నాడు కౌశికుడు. అందుకు ధర్మవ్యాధుడు – ఎవరి ధర్మం వారు ఆచరించాలి. ఇది నా కులధర్మం. నా ధర్మాన్ని నేను నిర్వర్తిస్తున్నాను. ఇతరులు చంపితెచ్చిన మాంసాన్ని కొని, కొద్దిపాటి లాభానికి అమ్మి ఆ ధనంతో జీవిస్తాను. కోర్కెలు పెంచుకోను. అసూయపడను. పొగడ్తకు పొంగను. తెగడ్తకు కుంగను అని కొన్ని ధర్మసూక్ష్మాలు చెప్పాడు.

క. **తన కులధర్మము విడువక**
మనుట పరమధర్మమండ్రు మాన్యులు; చిత్తం
బున గృపగలుగుట ముఖ్యపుఁ
బని సైరణవలయు నఖిలభావము లందున్

ఆ.వె. **విడువ వలయు విషయ విషమవాంఛలనెద**
విడుపుఁబోరు గుణము వెదకియెందు
గానరైరి బుధులు గలదె పరిత్యాగ
శీలునకు నసాధ్యసిద్ధియెందు **– ఆరణ్య 5-37, 38**

దయ, సహనం, త్యాగం – మానవశీలానికి ఆభరణాలు. దయాగుణం ఉత్కృష్టమైనది. సహనం దానిని మించినది. త్యాగం ఈ రెంటినీ మించినది. స్వధర్మాన్ని పాటిస్తూ, ఇతరుల అభిప్రాయాలను గౌరవిస్తూ, ఇంద్రియ సుఖాలను త్యజిస్తూ సాగే జీవితం ఆదర్శప్రాయం. త్యాగశీలికి అసాధ్యం లేదు. వేదం కూడా – **'న కర్మణా న ప్రజయా, న ధనేన త్యాగేనైకే, అమృతత్వ మానశుః'** – అని ప్రవచించింది.

సాధువులను పూజించాలి. కోర్కెలను ధర్మమార్గంలో తీర్చుకోవాలి. వేదప్రామాణ్యాన్ని అంగీకరించాలి. పశ్చాత్తాపం మనస్సును శుభ్రం చేస్తుంది.

క. మది మఱవునఁ బాపము దన
కొదవుటయును బిదపవగచి యొక సగమును నే
నిదిసేయ నింక ననియెడు
మదిఁ బెఱసగమును నరుఁడు మలుఁగు నఘంబుల్ (5-41)

మనకు తెలియకుండా తప్పు జరిగింది. చిత్తశుద్ధితో పశ్చాత్తాపపడితే సగం పాపం పోతుంది. ఆ తప్పు మరలా చెయ్యకూడదని నిర్ణయించుకోవడం వల్ల మిగతా పాపం పోతుంది. కోపం, లోభం చాలా చెడ్డవి. వీటిని గెల్చినవాడు మహాత్ముడు. కొన్ని మార్గాలు గడ్డిబావుల్లాగ ధర్మాలుగా కన్పిస్తాయి. ఆ కపట ధర్మాలను త్యజించాలి. శిష్టాచారాలను పాటించాలి' – అని ధర్మవ్యాధుడు చెప్పాడు. శిష్టాచారాలంటే ఏమిటని కౌశికుడు ప్రశ్నించాడు.

అప్పుడు ధర్మవ్యాధుడు – శిష్టాచారం అనేక సద్గుణాల సమాహారం. దానం, సత్యం, తపస్సు, యజ్ఞం, ఋజువర్తనం, కామ క్రోధ మద మాత్సర్యాలను విడుచుట, తల్లిదండ్రులు, గురువులను మన్నించడం, కోపం లేని శాంతం, ఇంద్రియ నిగ్రహం, నిత్యసంతోషం, శీలరక్షణ, తీర్థయాత్రలు, భూతదయ, మితభాషణ – ఇవన్నీ శిష్టాచారాలు. మోహం అనేది ఒక

సముద్రం. అందులో కామక్రోధాలు మొసళ్లు. ఇంద్రియార్థాలు నీళ్లు. స్థిరధైర్యమనే పడవతోనే ఆ సముద్రాన్ని దాటగలము – అంటూ ధర్మవ్యాధుడు అహింసాస్వరూపాన్ని కూడ ఇలా వివరించాడు.

'నా మాంసవిక్రయం హింసకాదా' అని అడిగావు. 'ఇది హింస, ఇది అహింస అని స్పష్టంగా ఎవరూ నిర్వచించలేరు. జీవుల చావుకు వాటి కర్మలు మాత్రమే కారణం. శిబిచక్రవర్తి తన మాంసాన్ని కోసి ఇంద్రాగ్నులకు ఇచ్చాడు. రంతిదేవుడు వెయ్యేండ్లపాటు ఆవులను చంపి సంతర్పణం చేశాడు. యజ్ఞయాగాలలో విప్రులు పశువులను బలి ఇస్తున్నారు. వీరంతా ఉత్తమ గతులు పొందారు గదా! కనుక మాంసాహారాన్ని కేవలం హింసగా పరిగణించగూడదు. శ్రాద్ధకర్మలలో మాంసనైవేద్యం పెడతారు. రైతు పొలం దున్నేటప్పుడు కర్రుదగిలి ఎన్నో జీవులు చస్తున్నాయి. మనం నడిచేటప్పుడు మన కాళ్లకిందపడి ఎన్నో జీవులు నశిస్తున్నాయి. ఇదంతా హింస కాదా! కనుక ఎంతో కొంత హింస తప్పదు. కందమూలాలు తినే ఋషులు మేము హింస చేయడంలేదని అనుకుంటారు. ఆ కందమూలాలకు కూడా ప్రాణం ఉంది కదా! కనుక –

గీ. హింస చేయనివాడు లేఁడిజ్జగమున
నొక్కఁడైనను దమతమ యోపినట్లు
హింస తెరువునకెడఁగల్గి యేఁగవలయు
నదియ చూవె యహింస నా నతిశయిల్లు (5-60)

ఈ ప్రపంచంలో హింస చేయనివాడు ఒక్కడూ లేడు. అయినా వీలయినంతవరకు హింస చేయకుండానే బ్రతకాలి. అలా సాధ్యమైనంత వరకు ప్రాణిపీడనం చేయకపోవడమే అహింస. ఇదీ ధర్మం.' ఇందలి ధర్మసూక్ష్మాలు –

ఉ. భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చుఁద
ద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంగునట్ల! ప్రా
ణాతురుఁడైనచోఁ బరిణయంబున యందును బల్కుబొంకు స
త్యాతిశయంబ యండ్రు మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్మముల్
(5-62)

'ధర్మాలలో అనేక సూక్ష్మాంశాలుంటాయి. ఎలాగంటే – జీవుల మేలు కోసం చెప్పే అసత్యం – సత్యంకన్నా గొప్పది. జీవులకు కీడు చేసే సత్యం అసత్యంతో సమానం. ప్రాణరక్షణ, పెండ్లి జరిపించడానికి ఆడే అసత్యాలు సత్యంకంటే గొప్పవి – ఇవీ ధర్మసూక్ష్మాలు.'

ఎవడి కర్మఫలితం వాడు అనుభవించాల్సిందే. ఇందులో దేవుడు కేవలం సాక్షిమాత్రమే. కొన్ని పనులు ఫలిస్తాయి. కొన్ని ఫలించవు. చనిపోయాక తన కర్మపరిపాకం నిర్దేశించిన చోటుకే వెళతాడు – అని చెప్పాడు ధర్మవ్యాధుడు. అప్పుడు కౌశికుడు పాపపుణ్యాల వలన వచ్చే జన్మలు ఎలా ఉంటాయని అడిగాడు.

శాశ్వత పుణ్యకార్యాలు చేస్తే దేవతాజన్మ లభిస్తుంది. పాపపుణ్యాలు రెండు చేస్తే మానవజన్మ లభిస్తుంది. కేవలం పాపాలే చేస్తే జంతువులుగా, పురుగులుగా పుడతారు. ధర్మాలు చేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఇంద్రియసుఖాలు వ్యర్థమని తెలుస్తుంది – అన్నాడు ధర్మవ్యాధుడు. ఇంద్రియాల వలన లాభనష్టాలున్నాయా" అని ప్రశ్నించాడు కౌశికుడు. అప్పుడు ధర్మవ్యాధుడు –

చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు – ఈ ఐదు ఇంద్రియాలు. శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం – ఈ ఐదు ఇంద్రియార్థాలు. వీటికి తోడు ఆరవది మనస్సు, ఏడవది బుద్ధి, ఎనిమిదవది అహంకారం. సత్త్వం,

రజస్సు, తమస్సు – ఈ మూడు త్రిగుణాలు. ఇంద్రియాలు భోగసాధనాలలో చిక్కుకొని విచ్చలవిడిగా ప్రవర్తిస్తాయి. కనుక పండితుడు వాటిని అదుపులో ఉంచుకోవాలి. సర్వభూతాలలో తనను తెలిసికొంటాడు. తనలోసర్వభూతాలను తెలిసికొంటాడు.

చ. అరదము దేహ, మింద్రియము లశ్వము, లాత్ముఁడు సూతుఁడమ్మహా
తురగచయంబు ధైర్యమను తోరపుఁబగ్గములన్ దృఢంబుగా
నురువడిఁ బోకయుండ వెరవొప్పఁగఁ బట్టినవాఁడు సేమపుం
దెరువుననేఁగు నప్పరమధీరుఁడు సువ్వె యుదారుఁ డెయ్యెడన్
(5-92)

ఈ దేహం ఒక రథం. ఇంద్రియాలు అశ్వాలు. రథసారథి ఆత్మ. ధైర్యమనే పగ్గాలతో ఆ గుర్రాలను అదుపులోపెట్టి నడవగలిగినవాడే ధీరుడు. ఇంద్రియాలు నచ్చినచోటుకల్లా మనస్సు పరుగులు తీస్తుంది. వాటిని అదుపులో పెట్టుకొన్నవాడే ధ్యానయోగి అని ధర్మవ్యాధుడు చెప్పాడు. సత్త్వ, రజ, స్తమోగుణాలను వివరించమన్నాడు కౌశికుడు. అప్పుడు ధర్మవ్యాధుడు–

సత్త్వగుణం జ్ఞానమయం. తమోగుణం చాలా చెడ్డది. ఈ రెంటి కలయికే రజోగుణం.

చ. అనఘుఁడు సాత్త్వికుండగు మహాత్ముఁడు బోధనిరూఢి సర్వముం
గనికొని లోకవృత్తములు గావని రోసి సమస్త సంగ భం
గ నిరతుఁడై తొరంగు మమకారవికార మహంక్రియాచ్యుతిం
బనువడి సంయమప్రకట భావనసుత్తమ శాంతిఁగైకొనున్ (5-98)

జ్ఞానం వలన సాత్త్వికుడు – వైరాగ్యం పెంచుకొంటాడు. అన్ని ఆసక్తులను విడిచిపెడతాడు. మమకార, వికారాలను త్యజిస్తాడు. ఇంద్రియ నిగ్రహం పొంది శాంతుడవుతాడు. సాత్త్వికుడు ఈ జన్మలో శూద్రుడైనా,

వచ్చే జన్మలో వైద్యుడు, ఆపై జన్మలలో క్షత్రియుడు, బ్రాహ్మణునిగా పుట్టి చివరకు జన్మరాహిత్యం పొందుతాడని ధర్మవ్యాధుడు చెప్పాడు. ధాతువుల వల్ల అగ్ని ఎలా జ్వలిస్తుందని అడిగాడు కౌశికుడు. అందుకు ధర్మవ్యాధుడు–

ఆత్మ అనబడే అగ్ని, నాభినుంచి శిరస్సు వరకు వ్యాపిస్తుంది. ప్రాణుడు అనే వాయువు ఆ నిప్పుమధ్య శిరస్సులో తిరుగుతుంది. ప్రాణుడికి తోడు అపానుడు ఎప్పుడు ఆ అగ్నిని జ్వలింపజేస్తుంటాడు. అపానుడు ముడ్డి, పొత్తికడుపు మధ్య అగ్నిచే చుట్టుకొని ఉంటాడు. ఉదానుడు అనే వాయువు కంఠంలో నివసిస్తాడు. వ్యానుడు అనే వాయువు అన్ని అవయవాలు ఒకదానితో ఒకటి కలిసేచోట ఉంటుంది. ప్రాణుడు, అపానుడు అనే వాయువులతో కలిసి అన్ని శరీరాల్లో చరించే అగ్నియే జీవాత్మ. ఆ జీవాత్మ దేహంలో నిర్లిప్తంగా ఉంటాడు. ఆ జీవాత్మయే పరమాత్మ.

జ్ఞాని నిర్లిప్తుడుగా ఉంటాడు. సుఖదుఃఖాలకు అతీతుడు. సమత్వం పాటిస్తారు. అటువంటి మహాత్ముడు ప్రతిరోజు యోగసాధన చెయ్యాలి. మితాహారంతో ఇంద్రియాలను నిగ్రహించాలి. అప్పుడే ఆత్మలో పరమాత్మను దర్శించి స్థితప్రజ్ఞతను పొందుతాడు. నాకు తెలిసినంత వరకు ఈ ధర్మసూక్ష్మాలను చెప్పాను” అన్నాడు ధర్మవ్యాధుడు. అందుకు కౌశికుడు – నీ వల్ల నేను ఆధ్యాత్మికంగా మేల్కొన్నాను. నీవు సర్వజ్ఞుడివి అన్నాడు. నా సర్వజ్ఞత్వానికి కారణాన్ని చూపిస్తాను రా' అంటూ అతనిని తన ఇంట్లోకి తీసికెళ్లాడు ధర్మవ్యాధుడు.

అక్కడ సుఖాసనాల మీద అతని తల్లిదండ్రులు నచ్చిన తిండి తిని హాయిగా విశ్రాంతి తీసికొంటున్నారు. వాళ్ల కాళ్లకు మొక్కి అతడు వాళ్ల యోగక్షేమాలడిగాడు. అందుకు వాళ్లు – నీవంటి కొడుకుండగా మాకేమి లోటు. నువ్వు రక్షిస్తున్న ధర్మమే నిన్ను రక్షిస్తుంది. నీవల్ల మన వంశం

పవిత్రమైంది అన్నారు. అపుడు ధర్మవ్యాధుడు కౌశికునితో నా తల్లిదండ్రులకు సేవ చెయ్యడం వల్లనే నాకీ జ్ఞానం లభించింది. అందరూ కోర్కెలు తీర్చుకోవడానికి దేవతలను పూజిస్తారు. నాకు నా తల్లిదండ్రులే దేవతలు. వీళ్లను చందనచర్చతో, పూలతో, పండ్లతో, నచ్చిన తిండితో పూజిస్తాను. నా భార్యాబిడ్డలతో కలిసి సేవ చేస్తాను అదే యజ్ఞం, అదే వేదం నాకు. కాని, నీపట్ల నాకొక వెలితి ఉంది. నీ తల్లిదండ్రులు ముసలివాళ్లు. నీ మీదే ఆశలు పెట్టుకొని బ్రతుకుతున్న వాళ్లను నువ్వు వదిలిపెట్టావు. కనీసం వారిని వదిలిపెట్టేప్పుడైనా నువ్వు వాళ్ల అనుమతి తీసుకోలేదు. నీకోసం ఎదురుచూచి చూచి వాళ్ల కళ్లు పోయాయి. వారిసేవ చేయకుండా నువ్వెంత వేదాధ్యయనం చేసినా వ్యర్థమే. ఇప్పుడైనా వెళ్లి వారి సేవ చేసి తరించు అన్నాడు.

అందుకు కౌశికుడు – నువ్వు నా కళ్లు తెరిపించావు. నా పాలిటి దేవుడివి. నీ ఈ శూద్రజన్మకు కారణం చెప్పమని కోరాడు. నేను పూర్వజన్మలో విప్రుడిని. ఒకరోజు కొడుకుతో వేటకు వెళ్లాను. నా బాణం ఒక మునిని కూల్చింది. బ్రాహ్మణ కులధర్మానికి విరుద్ధంగా హింస చేశావు. కనుక శూద్రునిగా పుట్టమని శపించాడా ముని. పిదప నా ప్రార్థనను మన్నించి – ఎరుకవై పుట్టినా నీకు ధర్మాధర్మజ్ఞానం ఉంటుంది. తల్లిదండ్రులకు సేవ చేసి తరిస్తావు – అని అనుగ్రహించాడు. ఆ ముని శరీరం నుంచి చిన్నగా బాణం తీసి, సేవలు చేసి బ్రతికించాను. అలా నాకు శూద్రజన్మ కల్గింది అని చెప్పాడు ధర్మవ్యాధుడు. అప్పుడు కౌశికుడు –

ఆ.వె. పాపవర్తనుండు బ్రాహ్మణుండయ్యును
నిజముశూద్రు కంటె నీచతముండు
సత్యశౌచధర్మశాలి శూద్రుండయ్యు
నతఁడు సద్ద్విజుండ యనిరిమునులు (5-137)

చెడ్డప్రవర్తన కలవాడు బ్రాహ్మణకులంలో పుట్టినా శూద్రునికంటే అధముడే. సత్యశౌచధర్మశాలి శూద్రకులంలో పుట్టినా బ్రాహ్మణుడే. నీవు నిజంగా బ్రాహ్మణుడివి. నన్నుద్ధరించావు. నా తల్లిదండ్రులకు సేవచేసి తరిస్తాను అని ధర్మవ్యాధుని వద్ద సెలవు తీసుకొన్నాడు. ఇదీ కథ.

ఈ కథలో ఒక ఆశ్చర్యం ఉంది. కౌశికుడు బ్రాహ్మణుడన్న గౌరవం ధర్మవ్యాధునికి ఉంది. కాని నిజానికి బ్రాహ్మణత్వం ధర్మవ్యాధునిలో ఉంది. దానిని కౌశికుడు గ్రహించాడు. బ్రాహ్మణం – జన్మబ్రాహ్మణం, కర్మబ్రాహ్మణం అని రెండు రకాలు. కౌశికుడు జన్మ బ్రాహ్మణుడు. ధర్మవ్యాధుడు కర్మబ్రాహ్మణుడు. బ్రాహ్మణుడంటే బ్రహ్మజ్ఞానం కలవాడని అర్థం. అది లేకపోతే ధర్మవ్యాధుడు కౌశికునికి ఇంత బోధ చెయ్యలేడు కదా! ఇక్కడ కౌశిక పదం సార్థకమైనది. కౌశిక అంటే గుడ్లగూబ అని అర్థం. అది లౌకిక తేజస్సుని చూడలేదు. ఇక స్వస్వరూపం, పరస్వరూపం ఎలా తెలుసుకుంటుంది. **'న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకమ్ నేమా విద్యుతో భాన్తి కుతోయ మగ్నిః'** అన్న శ్రుతి (కఠోపనిషత్తు) ననుసరించి అలౌకిక దివ్యతేజోమయుడైన పరమాత్మను గుడ్లగూబ ఎలా దర్శించగలదు.

'కౌశిక' శబ్దానికి ఇంద్రుడు, విశ్వామిత్రుడు అన్న అర్థాలు కూడ ఉన్నాయి. ఇంద్రుడు అధికారంలో ఉన్నా ఎన్నో తప్పులు చేశాడు. విశ్వామిత్రుడు రజస్తమోగుణాలను త్యజించడానికి పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఇలా చూస్తే ఈ కౌశికులందరు కించిద్గర్వభూయిష్ఠమైన సారూప్యతను కల్గి ఉన్నారు.

ఇందులో బ్రాహ్మణుని నిర్వచించిన తీరు తైత్తిరీయోపనిషత్తు శిక్షావల్లిలో చెప్పినదానికి, మహాభారత యక్షప్రశ్నలలోను, నహుష ప్రశ్నలలోను ధర్మరాజు చెప్పినదానికి సమానంగా ఉంది. **శాంతి, దాంతి, దయ, పవిత్రత, ఆస్తిక్య బుద్ధి కలవాడే బ్రాహ్మణుడు. ఒకరిని చూసి కాకుండా, తన మనస్సులో**

అనిపించి ఫలితం కోరకుండా ఎవడు ధర్మం ఆచరిస్తాడో అతడే బ్రాహ్మణుడు. అంతేకాని, జన్మనుబట్టి కాదు. గీతలో కృష్ణుడు చెప్పిన దానికిది సరిపోలుతుంది. మంచిపనుల వల్ల హృదయంలో జ్ఞానదీపం వెలుగుతుంది. అందులో జగత్తు కనపడదు. పరబ్రహ్మమే కనబడతాడు. ఆ దర్శనమే నిజమైన జ్ఞానం. చెయ్యవలసింది, చెయ్యకూడనిది హృదయం నుంచే ప్రభువు ప్రబోధిస్తుంటారు. సందర్భోచితంగా అతనికి ఈశ్వరుని సందేశం అందుతుంది. అప్పుడు ఐహికపు చిక్కులనుండి ముక్తుడవుతాడు.

నిజమైన బ్రాహ్మణుడు తన జ్ఞానాన్ని ఇతరులకు పంచడంవల్ల ప్రయోజనాన్ని ఆశించడు. మనిషి సృష్టించిన సంపదలను కోరడు. లోకహితమైన కర్మయందు నమ్మకం కల్గి ఉంటాడు. నిందాస్తుతులు పట్టించుకోడు. అతని ప్రశాంతికి, ఆనందానికి ఎవరి ప్రవర్తన భంగం కల్గించదు. అవన్నీ అతనికి అంతర్యామి యొక్క క్రీడలుగా దర్శనమిస్తాయి.

జీవుడు కర్మాధీనుడు అంతా తన అధీనంలో ఉంటే ఆపదలు, రోగాలు, చావులు లేకుండా ఉండవచ్చు. అందుకనే ఈ కథలో – **"కర్మవశత జూవె కలుగు దేహము దేహ, వర్తనంబు గర్మవశత బుట్టు, దేహపాతమైన దేహస్థుడగు జీవు, దరుగు, గర్మవిహితమైన కడకు"** అని చెప్పబడింది. ఇది విశిష్టాద్వైతానికి పట్టుగొమ్మ. జీవుడు చేసిన పాపపుణ్యాలననుసరించి అతనికి మరలా దేహం ప్రాప్తిస్తుంది. **అయితే మోక్షం పొందడానికి పాపంవలెనే పుణ్యమూ అడ్డమే. మోక్షం పొందే జీవుడికి పాపపుణ్యకర్మల ఫలం అవసరం లేదు. ఆ రెంటిని త్యజించాలని శ్రుతులు చెబుతున్నాయి.**

యదాపశ్యః పశ్యతే రుక్మవర్ణం
కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్ ।
తదావిద్వాన్ పుణ్యపాపే విధూయ
నిరంజనం పరమం సామ్యముపైతి ॥ (ముండకోపనిషత్తు)

దేహం అస్థిరం. కాని, ఆత్మ అలా కాదు. నరుడు చిరిగిన గుడ్డలాగ శరీరాన్ని విడుస్తాడు. ఆత్మ శస్త్రంతో ఛేదింపబడదు. అగ్నిచే దహించబడదు. నీటిచే తడుపబడదు. గాలిచే శోషింపబడదు (భగవద్గీత). ఆత్మనిత్యం నిత్యమైన ఆత్మకు కర్మఫలానుభవం ఉంది. పరమాత్మ కదిలేదు. అదే జీవేశ్వరులకున్న తేడా. దాన్ని శ్రుతులు ఇలా చెప్పాయి.

ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరేకః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్యన్యో అభిచాకశీతి (ముండకోపనిషత్తు)

ఇది చాలా ప్రసిద్ధమైన మంత్రం. దీని తాత్పర్యాన్నే ధర్మవ్యాధుడు కౌశికునికి చెప్పాడు. ఇందులో ప్రకృతి – అంటే పంచభూతాత్మకమైన ఈ జగత్తు వృక్షమయింది. దానికి రెండువైపులా రెండు పక్షులు స్నేహంగా ఉన్నాయి. ఈ రెండు పక్షులు జీవేశ్వరులు అంటే చిదీశ్వరులు. వీరు నిత్యులు. ఈ నిత్యులైన జీవేశ్వరులు సత్యమైన వృక్షాన్ని ఆశ్రయించాయి. అదే ప్రకృతి. కనుక ప్రకృతి సత్యమనుట. ప్రకృతి అంటే అచిత్తు. అంటే చిదచిదీశ్వర తత్త్వాలు మూడూ నిత్యములనుట. ఈ రెండు పక్షులలో జీవేశ్వర భేదం ఎలా తెలిసికోవాలో శ్లోకం ఉత్తరార్థం చెబుతుంది. అందొకటి పిప్పలాన్ని అనుభవిస్తున్నది. పిప్పలమంటే పూర్వజన్మకృతమైన సుకృతదుష్కృత రూప కర్మానుభవం. **'పిప్పలం కర్మ నిష్పన్నం సుఖదుఃఖ లక్షణం ఫలం'** అని శంకర భాష్యం చెబుతుంది. ఈ కర్మానుభవం కలవాడు జీవుడు. జీవుని కర్మానుభవం, అతని పారతంత్ర్యాన్ని ధర్మవ్యాధుడు ఇందులో స్పష్టంగా నిరూపించాడు.

వేదకాలం నుండి వర్ణవ్యవస్థ ఉంది. భారతకాలం నాటికి అది దెబ్బ తిన్నది. పరిణామక్రమంలో వచ్చిన మార్పు అది. అందుకు ధర్మవ్యాధోపాఖ్యానమే

ఉదాహరణ. జ్ఞానం ఒకరి సొత్తు కాదు. అందునా బ్రాహ్మణుని సొంతం కాదు. అందువల్లనే ఒక వేదపండితుడికి ఒక స్త్రీ, ఒక బోయవాడు జ్ఞానోపదేశం చెయ్యవలసి వచ్చింది. ఈ కథలో శ్రమణ సంప్రదాయం (దీనినే పరివ్రాజక సంప్రదాయం అనికూడ అంటారు) ఉందని **'ఏసిటిక్ లిటరేచర్ ఇన్ ఏన్షియంట్ ఇండియా'** అన్న గ్రంథంలో **ఎం.వింటర్నిట్జ్ వ్రాశాడు.** బౌద్ధగ్రంథాల్లో, అశోకుని శాసనాల్లో, మెగస్థనీస్ వ్రాతల్లో శ్రమణులు, బ్రాహ్మణులు వేరువేరుగా చెప్పబడ్డారు. దాని ఆధారంగా వింటర్నిట్జ్ అలా వ్రాశాడు. కాని, శ్రమణులు బౌద్ధసన్యాసులు. కాని, ఇందులో ఉపదేష్ట లిద్దరు (పతివ్రత, ధర్మవ్యాధుడు) సంసారులే. కనుక శ్రమణ సంప్రదాయం ఇందులో కన్పించదు.

చివరగా ధర్మవ్యాధోపాఖ్యానం చెప్పిన ధర్మసూక్ష్మాలు ఇలా పొందుపరుస్తాను.

1. వేదాధ్యయనం కన్నా ధర్మాచరణమే ప్రధానం.
2. పుట్టుకతో లభించిన కులవృత్తిగాని లేక తన ఇష్టానుసారం స్వీకరించిన వృత్తిగాని దేనినైనా చిత్తశుద్ధితో నిర్వహించడమే పరమధర్మం.
3. మాతాపితృ శుశ్రూషను మించిన ధర్మం మరొకటి లేదు.
4. కులంతో నిమిత్తం లేకుండా ధర్మతత్పరుడైన సజ్జనుడే గురుపీఠాన్ని అధిష్ఠించదగినవాడు.
5. భర్తసేవతో భార్య సిద్ధి పొందుతుంది.
6. అగ్నిని ఉపాసించి బ్రాహ్మణుడు సిద్ధి పొందుతాడు.
7. తల్లిదండ్రులను సేవించి బ్రాహ్మణేతరుడు సిద్ధి పొందుతాడు.
8. యోగి ఆత్మధ్యానంతో సిద్ధి పొందుతాడు.

ఇవి సార్వజనీనకమైన, సార్వకాలికమైన సత్యాలు, ధర్మాలు. కాని ఇవాళ పాశ్చాత్యీకరణ వల్ల ఆత్మజ్ఞాన సంపదకన్నా మనిషి సృష్టించిన సంపదపై ఆసక్తులు పెరిగాయి. కపట ధర్మాలు పెరిగాయి. దాంతో ఈ ధర్మాలన్నీ తలక్రిందులయ్యాయి. ఫలితంగా వృద్ధాశ్రమాలు, గృహహింస, కులసంఘాలు వంటి అవాంఛనీయ కుహనాధర్మాలు ప్రబలమయ్యాయి. ఈ స్థితిని కొన్ని వేల ఏండ్లనాడే 'క్రాంతదర్శి'గా గ్రహించి తరణోపాయం సూచించిన ఆ కృష్ణద్వైపాయనునికి నా శతకోటి వందనాలు.

ప్రసన్నకవి
ఉన్నం జ్యోతివాసు
వేములపాడు
9542459957

విళంబి - పుష్య - శు.పాడ్యమి
07.01.2019

ధర్మవ్యాధోపాఖ్యానం

సీ. 'సమధిక దర్పదుర్జయములై నిగిడెడు ।
నింద్రియంబులఁ గుదియించి తెచ్చి
మనసు పొందున నిడి మన సహంకారంబు ।
పజ్జకుఁ బాపి సద్భక్తియుక్తి
నెరయంగ ననిశంబు నిజభర్తృ శుశ్రూష ।
యందు సమాహిత యైన వనిత
యఖిలలోకోత్కృష్ట యని యెప్పు నూహింతు; ।
నరయఁ బతివ్రత లైన వారి

తే. చరిత మత్యంతధర్మసూక్ష్మంబుఁ గరము ।
దుష్కరము గాదె తలఁప నిర్ధూత దురిత!
యట్లు గావున విన వేడ్క యయ్యెఁ జెప్ప ।
వయ్య ! పుణ్యసతీ ప్రభావంబు నాకు. 1

ప్రతిపదార్థం:నిర్ధూత, దురిత!= విసరివేయబడిన పాపాలు కలవాడా!; సమధిక, దర్ప, దుర్జయములు+ఐ= మిక్కిలి ఎక్కువ అయిన గర్వం కలిగిఉండటంచేత గెలువరానట్టివై; నిగిడెడు= విజృంభించెడు; ఇంద్రియంబులన్= జ్ఞానకర్మేంద్రియాలను; కుదియించి; తెచ్చి= అణగారేటట్లుగా చేసిపెట్టి; మనసు, పొందునన్+ఇడి= మనస్సుకు లోబడేటట్లుగా చేసి; మనసు+ అహంకారంబు, పజ్జకున్+పాపి= మనస్సును-నేను నాది అనే భావం దగ్గరనుండి వేరు చేసి; సత్+భక్తి, యుక్తి= మంచి భక్తితో కూడికొని ఉండటం; నెరయంగన్= ఒప్పునట్లుగా; అనిశంబున్= ఎల్లప్పుడును; నిజ, భర్తృ, శుశ్రూషయందున్= తనయొక్క పెనిమిటికి పరిచర్య ఒనరించటంలో; సమాహిత+ఐన= కూడిఉన్నట్టిదైన; వనిత= స్త్రీ; అఖిల, లోక+ఉత్కృష్ట=

సమస్త జగాలలో గొప్పది; అని; ఎప్డున్= ఎల్లప్పుడును; ఊహింతున్= భావన చేస్తాను; అరయన్= చూడగా; పతివ్రతలు+ఐన వారి, చరితము= భర్తను భక్తితో సేవించటంలోనే నిమగ్నురాం డ్రయిన భార్యల నడవడి; అత్యంత, ధర్మ, సూక్ష్మంబున్= మిక్కిలిలోతుగా పరిశీలిస్తేగాని తెలియనట్టి ధర్మంతో కూడినట్టిదిన్నీ; కరము= మిక్కిలి; దుష్కరము= ఆచరించేందుకు కష్టం అయినట్టిదిన్నీ; కాదె= అవుతుందికదా; తలఁపన్= ఆలోచించగా; నాకున్, పుణ్య, సతీ, ప్రభావంబు= గొప్ప పతివ్రతల మహిమ; వినన్= వినటానికి; వేడ్క+అయ్యెన్= సంబరమైనది. అట్లు+కావునన్= ఆ విధంగా ఉన్నది కాబట్టి; చెప్పవయ్య= దయచేసి చెప్పుము.

తాత్పర్యం: పాపాలను పటాపంచలు చేయగలిగిన ఓ మార్కండేయ మహర్షీ! గొప్ప పతివ్రతల మాహాత్మ్యలను గూర్చిన కథలు వినవలెనని నాకు మిక్కిలి వేడుకగా ఉన్నది. దయచేసి అట్టి కథలు నాకు వినిపించ వేడికోలు. అరికట్టటానికి వీలు లేని ఇంద్రియాలను అరికట్టి, వాటిని మనస్సుకు లోబడేటట్లుగా చేసి, ఆ మనస్సును అహంకారానికి లోను గాకుండగా చేసి, తన పెనిమిటికి ఎల్లప్పుడు సేవ చేసే వనిత - అన్ని జగాలలో గొప్పది అని నా అభిప్రాయం. అట్టి పతివ్రతల నడవడిలో ధర్మ సూక్ష్మాలు ఇమిడే ఉంటాయి. కావున అట్టి పుణ్యకథలు వినిపింపుము.

విశేషం: 'ధర్మసూక్ష్మము' అనే ప్రయోగంలోని స్వారస్యం అరయ దగింది. ధర్మం తెలియటం కష్టం. స్థూలదృష్టికి 'ధర్మము'గా గోచరించినట్టిది - తరచి విచారించినప్పుడు అనగా సూక్ష్మ దృష్టితో పరికించినపుడు అధర్మం కావచ్చును. రాబోయే ధర్మవ్యాధుడి కథలో పెక్కు 'ధర్మ సూక్ష్మములు' వివరించబడినవి.

వ. మఱియుఁ దల్లిదండ్రు లిరువురయందును బుత్త్రనిమిత్తం బైన యాయాసం బెవ్వరి కెక్కుడు? వారలయెడం బుత్త్రుం డెట్టివాఁడు గావలయు? హీనయోని జాతుం డైన పురుషుం డేమి తెఱంగు నడవడిం బరమధార్మికుల లోకంబులు వడయు? నివి యన్నియు వివరింప నీవ యర్హుండ' వనిన నమ్మహాముని యమ్మహీపతి కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; తల్లిదండ్రులు= మాతా పితలు; ఇరువురయందును= ఇద్దరియందును; పుత్త్ర నిమిత్తంబు+ఐన= కొడుకునుగూర్చిన; ఆయాసంబు= శ్రమ; ఎవ్వరికిన్+ఎక్కుడు= ఎవరికి మిక్కుటంగా ఉంటుంది; వారలయెడన్= ఆ తల్లిదండ్రుల పట్ల; పుత్త్రుండు= కొడుకు; ఎట్టివాఁడు, కావలయున్= ఏ విధంగా ప్రవర్తించదగినవాడు అయిఉండాలి; హీనయోని జాతుండు+ఐన= తక్కువ కులంలో పుట్టినట్టి; పురుషుండు= మనుజుడు; ఏమి తెఱంగు, నడవడిన్= ఏ విధమైన ప్రవర్తనవలన; పరమ, ధార్మికుల, లోకంబులు= గొప్ప పుణ్యాత్ములు పొందే లోకాలు - స్వర్గాలు; పడయున్= పొందుతాడు; ఇవి+అన్నియున్= ఇట్టి విషయాలు అన్నిటిని; వివరింపన్= వెల్లడించటానికి; నీవు+అ= నీవ=నీవు మాత్రమే; అర్హుండవు= తగిన వాడవు; అనినన్= అని చెప్పగా; ఆ+మహాముని= గొప్పవాడయిన ఆ ఋషి; ఆ+మహీ పతికిన్= ఆ రాజుకు (ధర్మరాజుకు); ఇట్లు+అనియెన్= ఆ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విషయాలే గాక, మఱికొన్నిటిని గూర్చి కూడ తాము దయచేసి వివరించ వేడికోలు. సంతాన విషయాన, తలిదండ్రులు ఇరువురూ పడే శ్రమలో ఎవరిది అధికం అని చెప్పవచ్చును? తలిదండ్రుల విషయంలో పుత్రుడు ఎట్టి నడవడి కలవాడై ఉండదగును? తక్కువ కులంలో జన్మించిన మనుజుడు గొప్ప ధర్మాత్ముడు పొందే లోకాలను ఏవిధంగా పొందగలడు? ఈ ప్రశ్నలకు సరిఅయిన సమాధానం చెప్పగల అర్హత నీయందు మాత్రమే ఉన్నది' అని ధర్మరాజు పలుకగా మార్కండేయమహర్షి ఈ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

సీ. ‘జతనంబు మిగుల మాసములు దొమ్మిది యుద ।
రంబునం గరము భరంబుతోడ
భరియించి పదపడి ప్రాణసంశయ దశ ।
నొంది పుత్త్రునిఁ గాంచు నెందుఁ దల్లి;
తపములు యజ్ఞముల్ దానముల్ వ్రతములు ।
దేవతా సజ్జన సేవనములుఁ
గావించుఁ బుత్త్రునిఁ గామించి జనకుఁ; డి ।
ట్లిరువుర పాటును సరియె తలఁపఁ;

తే. దనయుఁ గని తల్లిదండ్రులు దమకు నతఁడు ।
భక్తుఁ డగుటకు ధర్మానురక్తుఁ డగుట
కాసపడుదురు; విను మట్టియాస సిద్ధిఁ ।
బొందఁ జేయు నతఁడ చువ్వె నందనుండు. 3

ప్రతిపదార్థం: ఎందున్= ఏ పరిస్థితుల్లో అయినా; తల్లి= మాత; పుత్త్రునిన్= కొడుకును; ఉదరంబునన్= కడుపులోపల; మాసములు= నెలలు; తొమ్మిది; జతనంబు= యత్నము; మిగులన్= ఎక్కువ అగునట్లుగా; కరము= మిక్కిలి; భరంబుతోడన్= బరువుతో; భరియించి= మోసి; పదపడి= పిదప; ప్రాణ, సంశయ, దశన్+ఒంది= అసువులు కోల్పోవునేమో అనే సందేహ స్థితిని పొంది; కాంచున్= కంటుంది, జనకుడు= తండ్రి; పుత్త్రునిన్= కొడుకును; కామించి= కోరి; తపములు= శరీరక్లేశాన్ని కలిగించే ఉపవాసాది వ్రతాలు; యజ్ఞముల్= క్రతువులు; దానముల్= తన ద్రవ్యాన్ని ఇతరులకు సమర్పణ చేయటాలు; వ్రతములు= నోములు; దేవతా, సత్+జన, సేవనములున్= దేవతలను, మంచి మనుష్యులను అర్చించటాలు; కావించున్= చేస్తాడు; ఇట్లు= ఈ రీతిగా; ఇరువుర పాటును= ఇద్దరూ పడే శ్రమకూడా; తలఁపన్= ఆలోచించగా; సరియె= సమానాలైనవే; తల్లిదండ్రులు= మాతయు

పితయును; తనయున్= కొడుకును; కని= పొంది; తమకున్= తమకు (తల్లిదండ్రులకు); అతఁడు= ఆ కొమరుడు; భక్తుఁడు+అగుటకున్= అర్చించేవాడు కావటానికి; ధర్మ+అనురక్తుఁడు= ధర్మంలో ఎక్కువ ఇష్టం కలవాడు కావటానికి; ఆస, పడుదురు= కోరుకొంటారు; వినుము= ఆలకింపుము; అట్టి+ఆస= అటువంటి కోరిక; సిద్ధిన్+పొందన్+చేయు+ అతఁడు+అ= నెరవేరేటట్లుగా ఒనరించే అతడు మాత్రమే; నందనుండు= కొడుకు; చువ్వె= చుమ్ము+ఎ= సుమా. (నిశ్చయార్థకం).

తాత్పర్యం: ‘కొడుకును తల్లి - తొమ్మిది నెలలు తన కడుపులో మోసి, మిక్కిలి ప్రయత్నంతో మిక్కుటమైన శ్రమకు ఓర్చి, ఆస్థితిలో అసువులు కోల్పోతానేమో అనే సందేహ స్థితికి వచ్చి ప్రసవిస్తుంది. తండ్రి - కొడుకు పుట్టవలెననే కోరికతో ఉపవాసాది వ్రతాలు చేసి, క్రతువులు నిర్వహించి, దాన ధర్మ కార్యాలు సలిపి, నోములు నోచి, దేవతలను సజ్జనులను పూజిస్తాడు. ఈ విధంగా సంతానానికై పడే శ్రమ తలిదండ్రులు ఇరువురకూ సమానమైనదే అని చెప్పవచ్చును. తలిదండ్రులు - కొడుకు పుట్టిన పిదప ఆతడు తమయెడ ప్రేమ కలిగి తమను ఆరాధించాలనీ ధర్మాచరణలో ఆసక్తికలవాడు కావాలనీ కోరుకొంటారు. అందుచేత, తలిదండ్రుల కోరిక లీడేర్చేవాడే నిజమైన పుత్రుడు అని చెప్పాలికదా!

విశేషం: నందనుడు అనే శబ్దానికి అర్థం - ‘సంతోషింప చేసేవాడు’. తలిదండ్రులను సంతసింపజేసేవాడే నిజమైన నందనుడు. ఇట్టి నందన శబ్ద ప్రయోగంలోని స్వారస్యం గుర్తించ తగింది.

క. జననియు జనకుఁడు నెవ్వని ।
యనువర్తనమునఁ బ్రియంబు నందుదు రెదఁ ద
త్తనయుఁడు ధర్మముఁ గీర్తియు ।
ననూనముగఁ బడయుఁ బొందు నక్షయగతులన్. 4

ప్రతిపదార్థం: జననియున్= తల్లియును; జనకుఁడున్= తండ్రియును; ఎవ్వని+అను వర్తనమునన్= ఏ(కుమారుడి) నడవడి వలన; ఎదన్= హృదయంలో; ప్రియంబున్+ అందుదురు= సంతోషం పొందుతారో; తత్+తనయుఁడు. ఆ కొడుకు; ధర్మమున్= ధర్మాన్ని; కీర్తియున్= యశస్సునూ; అనూనముగన్= ఎక్కువగా; పడయున్= పొందుతాడు; అక్షయ, గతులన్= నాశనం పొందని స్థితులను అనగా గొప్ప పుణ్యలోకాలను; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఏ కుమారుడు తనను కన్న తలిదండ్రులకు తన నడవడికవలన మిక్కుటమైన సంతోషాన్ని కలిగిస్తాడో ఆ కొమరుడే ధర్మాన్ని, కీర్తిని గొప్పగా సంపాదిస్తాడు. అట్టివాడే శాశ్వతమైన పుణ్యలోకాలను ఆర్జిస్తాడు.

మార్కండేయుఁడు ధర్మజునకుఁ బతివ్రతా మాహాత్మ్యంబు సెప్పుట (సం. 3-196-20)

వ. మఱియు నిజభర్తృ శుశ్రూషయందు నిత్యాసక్తయయిన పతివ్రతకు నఖిలయజ్ఞదానతపఃఫలంబులు సులభంబు లగు; నొక్కయితిహాసంబు సెప్పెద; నందు నీ యడిగిన యర్థంబు లన్నియుఁ దేటపడు నాకర్ణింపుము; కౌశికుం డను బ్రాహ్మణుండు ధర్మతపశ్శీలుండు సంతతాధ్యయనతత్పరుం డయి యొక్క విశిష్టగ్రామంబున నుండు; నతం డొక్కనాఁడు గ్రామ సమీపంబునం దొక్క వృక్షమూలంబున నాసీనుండై వేదంబులు గుణియించుచుండం దదీయ శాఖాగతం బైన యొక్క కొక్కెర యాతనిపై రెట్ట వెట్టిన, నమ్మహాద్విజుం డలిగి చూచుటయు నది యప్పుడ నిశ్చేతనం బై నేలంబడినం గనుంగొని యతండు. 5

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; నిజ, భర్తృ, శుశ్రూషఅందున్= తనయొక్క పెనిమిటియొక్క పరిచర్యలో; నిత్య+ఆసక్త+అయిన= ఎల్లప్పుడు ఇష్టం కలిగినట్టిది అయిన; పతివ్రతకున్= సాధ్వికి; అఖిల, యజ్ఞ, దాన, తపస్+

ఫలంబులు= అన్ని క్రతువులు, దానాలు, కఠిన వ్రతాలు చేస్తే సంక్రమించే పుణ్యాలు; సులభంబులు+ అగున్= సులువుగా లభిస్తాయి; ఒక్క+ ఇతిహాసంబు+చెప్పెదన్= ఒక యథార్థ గాథ వినిపిస్తాను; అందున్= ఆ ఇతిహాసంలో; నీ+ అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థంబులు+అన్నియున్= భావాలు అన్నియును; తేటపడున్= వెల్లడి ఔతాయి; ఆకర్ణింపుము= వినుము; కౌశికుండు+అను, బ్రాహ్మణుండు= కౌశికుడు అనే పేరుకల విప్రుడు; ధర్మ, తపస్+శీలుండు= ధర్మాన్ని, తపస్సును ఆచరించే స్వభావం కలవాడు; సంతత+అధ్యయన, తత్పరుండు+అయి= ఎల్లప్పుడు వేదాలు చదువుకొనటం లోనే నిమగ్నుడైనవాడయి; ఒక్క, విశిష్ట, గ్రామంబునన్= పేర్కొనదగిన ఒకపల్లెటూరిలో; ఉండున్= నివసించేవాడు; అతండు= ఆ బ్రాహ్మణుడు; ఒక్క, నాఁడు= ఒక్క రోజున; గ్రామసమీపము నందున్= ఆ ఊరికి దగ్గరలో; ఒక్క, వృక్ష, మూలంబునన్= ఒక చెట్టు మొదట; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడై; వేదంబులు= వేదాలు; గుణియించుచుండన్= వల్లెవేస్తుండగా; తదీయ, శాఖాగతంబు+ఐన= ఆ చెట్టు కొమ్మమీద ఉన్న; ఒక్క, కొక్కెర= ఒక కొంగ; ఆతనిపైన్= ఆ కౌశికుడిమీద; రెట్ట+పెట్టినన్= మలవిసర్జనం చేయగా; ఆ+మహా, ద్విజుండు= ఆ గొప్ప బ్రాహ్మణుడు; అలిగి, చూచుటయున్= కోపించి, చూడటంచేత; అది= ఆ కొక్కెర; అప్పుడు+అ= అప్పటికప్పుడే; నిస్+చేతనంబు+ఐ= పోయిన ప్రాణాలు కలదై - అనగా చనిపోయి; నేలన్+ పడినన్= భూమిమీద పడగా; కనుంగొని= చూచి; అతండు= ఆ కౌశికుడు.

తాత్పర్యం: అంతేకాదు; తన పెనిమిటికి సేవ చేయటంలో ఎల్లప్పుడూ ఇష్టం గల పతివ్రతకు సమస్త యజ్ఞాలు, దానాలు, తపస్సులు చేసిన పుణ్యాలు లభిస్తాయి. ఈ విషయాన్ని రూఢి చేసే ఒక యథార్థగాథను నిదర్శనంగా నీకు వినిపిస్తాను. ఆ ఇతిహాసంలో నీవు అడిగిన ప్రశ్నలకు అన్నిటికిని సరైన సమాధానం లభిస్తుంది. పూర్వం కౌశికుడు అనే బ్రాహ్మణుడు ఒకానొక పల్లెటూరులో నివసిస్తూ ఉండేవాడు. ఆతడు ధర్మాత్ముడు. తపస్వి. ఎల్లప్పుడూ

వేదాలను వల్లె వేసేవాడు. ఒకనాడు అతడు ఒకచెట్టు మొదట కూర్చొని వేదాలు వల్లెవేస్తుండగా, ఆ చెట్టుకొమ్మపై వాలిఉన్న ఒకకొంగ అతడిపై రెట్ట వేసింది. అంతట ఆ కౌశికుడికి మిక్కుట మైన కోపం వచ్చింది. అతడు ఆగ్రహంతో ఆ పక్షిని చూచాడు. వెంటనే ఆ పక్షి ప్రాణాలు కోల్పోయి నేలపై పడిపోయింది. అప్పుడు అతడు (పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు.)

క. 'అక్కట! నాహృదయము గడు ।
నక్కటికము లేనిదయ్యెఁ; ననిమిత్తమ యీ
కొక్కెర నిటు సేసితి; నా ।
కెక్కడి శాంతి?' యని వికలహృదయుం డగుచున్. 6

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; నాహృదయము= నాగుండె; కడున్= మిక్కిలి; అక్కటికము= దయ; లేనిది+అయ్యెన్= లేనట్టిది అయింది; అనిమిత్తము+అ= ఎటువంటి కారణం లేకుండానే; ఈ కొక్కెరన్= ఈ కొంగను; ఇటు+చేసితిన్= ఈవిధంగా చేశాను అనగా ఈ రీతిగా చంపాను; నాకున్+ఎక్కడి, శాంతి+అని= నాకు ఏవిధంగా శాంతి లభిస్తుంది అని; వికల, హృదయుండు+అగుచున్= కలత చెందిన ఎడద గలిగినవాడు ఔతూ;

తాత్పర్యం: 'అయ్యో! నా గుండె దయలేనిది అయింది కదా! నిష్కారణంగా నావలన ఈ కొంగ ప్రాణాలు పోగొట్టుకుంది. నేను ఘోరపాపానికి ఒడిగట్టాను, ఇక నాకు ఏవిధంగా శాంతి లభించగలదు?' అని వాపోతూ ఆ కౌశికుడు కలత చెందిన ఎడద కలవా డయ్యాడు.

వ. పెక్కుభంగుల వగచి, మధ్యాహ్నం బగుటయుఁ గృతాహ్నికవిధానుండై గ్రామంబున కరిగి, యందు శుచు లైన విప్రగృహంబుల కరిగి భిక్షాచరణంబు సేయుచు, నం దొక్క పుణ్యగృహంబువాకిట నిలిచి 'భిక్షాం దేహి'యనుటయు, నా యింటియవ్వయు నతిసంభ్రమంబున భిక్ష యిడుటకుం బాత్రశోధనంబు సేయు నెడ. 7

ప్రతిపదార్థం: పెక్కు, భంగులన్= పలురీతుల; వగచి= విచారించి; మధ్య+అహ్నంబు+ అగుటయున్= పట్టపగలు నడిమిప్రొద్దు కావటంచేత (మధ్యాహ్నం పండ్రెండు గంటలు-నేటి భాషలో); కృత+ఆహ్నిక, విధానుండు+ఐ= పగలు నెరవేర్చవలసిన కృత్యాలు కలవాడై అనగా పగలు నడిప్రొద్దున చేయదగు విధులు చేసినవాడై; గ్రామంబునకున్+అరిగి= పల్లెటూరికి వెళ్లి; అందున్= ఆ గ్రామంలో; శుచులు+ఐన= పవిత్రులు, అయిన; విప్ర, గృహంబులకున్= బ్రాహ్మణుల ఇండ్లకు; అరిగి= వెళ్లి; భిక్షా+ఆచరణంబు= బిచ్చమెత్తుకొనటం; చేయుచున్= చేస్తూ; అందు+ఒక్క= (ఆ గృహాలలో ఒక); పుణ్య, గృహంబు, వాకిటన్= సుకృతం ఆర్జించిన వారు నివసించే ఇంటి గడప ముందు; నిలిచి= నిలబడి; 'భిక్షాందేహి'= బిచ్చాన్ని ఇమ్ము; అనుటయున్= అని అనటమున్నూ; ఆ+ఇంటి+అవ్వయున్= ఆ ఇంటిఇల్లాలును; అతిసంభ్రమంబునన్= మిక్కిలి వేగిరపాటుతో; భిక్ష+ఇడుటకున్= బిచ్చం వేయటానికి; పాత్ర, శోధనంబు= పాత్రను శుద్ధిచేయటం; చేయు+ఎడన్= చేసే తరుణంలో.

తాత్పర్యం: పలురీతుల విచారించి, అప్పుడు మిట్టమధ్యాహ్నసమయం కావటంచేత, ఏతత్కాలకృత్యాలైన సంధ్యావందనాదికాలు నిర్వర్తించి, సమీపగ్రామానికి వెళ్లి, పరిశుభ్రత, పవిత్రత కల బ్రాహ్మణ గృహాలకు పోయి, "భిక్షాం దేహి" అన్నాడు. అట్లా అంటూ ఒక పుణ్యగృహంముందు నిలిచి భిక్షను కోరాడు. అంతట- ఆ ఇంటి ఇల్లాలు మిక్కిలి వేగిరపాటుతో ఆ బ్రాహ్మణయోగికి భిక్ష సమర్పించటానికై పాత్రను కడుగసాగింది. ఆ సమయంలో.

ఉ. ఆ యెలనాఁగభర్త కడు నాఁకటఁ దూలుచు వచ్చె; వచ్చినం
దోయజనేత్ర సంభ్రమముతోఁ దగుపీఠము వెట్టి పాద్యముం
బాయక మజ్జనక్రియయు భక్తి నొనర్చి ప్రియోక్తు లొప్పఁగా
నాయనఁ బ్రీతుఁ జేసె రుచిరాన్నరసంబులఁ జేసి చెచ్చెరన్. 8

ప్రతిపదార్థం: ఆ+ఎలనాఁగ, భర్త= ఆ మగువ పెనిమిటి; కడున్= మిక్కిలి; ఆఁకటన్= ఆకలిచేత; తూలుచున్= తొట్రుపడుతూ; వచ్చెన్= వచ్చాడు; వచ్చినన్= అట్లా రాగా; తోయజనేత్ర= పద్మాలవంటి కన్నులు కల ఆ మగువ; సంభ్రమముతోన్= వేగిరపాటుతోడ; తగు= తగిన; పీఠము, పెట్టి= కూర్చుండే ఆసనం ఉంచి; పాద్యమున్= కాళ్లు కడుగుకొనటానికి నీటిని (ఇచ్చి); పాయక మజ్జన, క్రియయున్= వదలక తలనిండా స్నానం చేయించుటయున్నూ; భక్తిన్= పూజ్యభావంతో; ఒనర్చి= చేసి; ప్రియ+ ఉక్తులు+ఒప్పఁగాన్= మనస్సుకు ఇష్టాలైన మాటలు విలసిల్లేటట్లుగా; రుచిర+అన్న, రసంబులన్+చేసి= కమ్మని అన్నాన్ని వడ్డించి పానీయాలు సమర్పించటం చేత; చెచ్చెరన్= వేగంగా; ఆయనన్= అతడిని, తన భర్తను; ప్రీతున్+చేసెన్= సంతృప్తి చెందిన వాడినిగా చేసింది.

తాత్పర్యం: అంతలో, ఆ ఇల్లాలి పెనిమిటి ఆకలితో తూలుతూ ఇల్లు చేరాడు. భర్తను చూడటంతోనే ఆమె కన్నులు తామర పువ్వులవలె వికసించాయి. ఆమె వేగిరపాటుతో భర్తకు ఎదురేగి కాళ్లు కడుగుకొనటానికి నీటిని అందించింది. పూనికతో అతడికి తలఅంటి స్నానం చేయించింది. అనురాగంతో మంచి మాటలు చెప్తూ అతడికి అన్నం వడ్డించింది. పానీయాలు అందించింది. భర్తకు సంపూర్ణ సంతుష్టి కల్పించింది.

చ. కుడిచినపిమ్మటం గుసుమకోమలి విస్తృతసంస్తరంబుగా
నొడికపు సెజ్జ చేసి ప్రియుఁ డొయ్యన యందు శయింపఁ దమ్ములం
బిడి చరణంబు లొత్తి మదిరేక్షణ యంతటిలోఁ దలంచె ము
న్నడరఁగ భిక్షకై నిలిచినట్టి మహీసురముఖ్యు నాత్మలోన్. 9

ప్రతిపదార్థం:కుడిచినపిమ్మటన్= (భర్త) భోజనం చేసిన పిదప; కుసుమకోమలి= పువ్వువలె మృదువైనది; విస్తృత, సంస్తరంబుగాన్= విశాలంగా పరచిన పరుపు కలదిగా; ఒడికము+సెజ్జ, చేసి= మనోహరమైన మెత్తని శయ్యను ఏర్పరచి; ప్రియుఁడు= భర్త; అందున్= ఆ శయ్యపై; ఒయ్యన= తిన్నగా; శయింపన్= పండుకొనగా; తమ్ములంబు+ ఇడి= తాంబూలం అందించి; చరణంబులు+ ఒత్తి= కాళ్లు పిసికి; మదిరా+ఈక్షణ= మత్తెక్కించే కన్నులు కలది, మగువ; అంతటిలోన్= ఆ సమయంలో; మున్ను= అంతకు ముందు; అడరఁగన్= పూనికతో; భిక్షకై= బిచ్చానికై; నిలిచినట్టి= వాకిట నిలబడినట్టి; మహీసుర, ముఖ్యున్= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడైన వాడిని; ఆత్మలోన్= మనస్సులో; తలంచెన్= స్మరించింది. జ్ఞాపకం చేసికొన్నది.

తాత్పర్యం: ఆమెభర్త సంతృప్తిగా భోజనం చేసిన పిదప, ఆ పూబోడి అతనికి మెత్తని శయ్యను ఏర్పరచింది. భర్త ఆ పరుపుపై హాయిగా పవళించిన పిమ్మట అతడికి ఆమె తాంబూల మిచ్చింది. కాళ్లు పిసికింది. భర్తకు సమస్తపరిచర్యలు చేసిన పిదప, అంతకుముందు తన వాకిలివద్ద భిక్షకొరకు నిలిచిన బ్రాహ్మణశ్రేష్ఠుడిని స్మరించింది.

విశేషం: మదిరేక్షణ అనే పదానికి కాటుకపిట్ట వంటి కన్నులు గలది (స్త్రీ) అని కూడా అర్థం చెప్పవచ్చు.

వ. ఇట్లు దలంచి భిక్ష గొనుచుం జనుదెంచిన నమ్మగువం జూచి
కౌశికుండు రోషరంజితలోచనుం డగుచు ని ట్లనియె. 10

ప్రతిపదార్థం:ఇట్లు= ఈవిధంగా; తలంచి= యోచించి; భిక్షన్+కొనుచున్+ చనుదెంచినన్= బిచ్చం (ఇవ్వటానికి అన్నాన్ని) తీసికొనిరాగా; ఆ+మగువన్+ చూచి= ఆ వనితను చూచి; కౌశికుండు= కౌశికుడు; రోష, రంజిత, లోచనుండు+అగుచున్= కోపంచేత, ఎర్రబడిన కన్నులు కలవాడు ఔతూ; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా ఆలోచించి, ఆ బ్రాహ్మణ బ్రహ్మచారికి బిచ్చం పెట్టటానికై పాత్రలో అన్నం నింపికొని వచ్చిన ఆ ఇల్లాలిని చూచి కౌశికుడు, కోపంచేత ఎర్రబడిన కన్నులు కలవాడై ఇట్లా అన్నాడు.

క. 'అడిగినయప్పుడ చెచ్చెరఁ ।
గడపినఁ బో నవ్వ! యేను గడుదుర్మతి వై

పడఁతి! నను నిలిపి భిక్షం ।
బిడక కడు నవజ్ఞ సేసి తేల మదమునన్?' 11

ప్రతిపదార్థం: అవ్వ!= అమ్మా!; అడిగిన+అప్పుడు+అ= నేను బిచ్చం వేడిన వెనువెంటనే; చెచ్చెరన్= శీఘ్రంగా; కడపినన్= వెడలు మని అంటే; ఏను= నేను; పోను+అ= పోన= వెళ్లిపోయి ఉండేవాడను కదా; కడున్= మిక్కిలి, దుర్మతివి+ఐ= చెడుబుద్ధి కలిగిన దానివై; పడతి!= ఓవనితా!; ననున్= నన్ను; నిలిపి= ఆపి; భిక్షంబు+ఇడక= బిచ్చం వేయక; మదమునన్= గర్వంతో; కడున్= మిక్కిలి; అవజ్ఞ= అవమానం; చేసితి+ఏల= ఎందుకు చేశావు?

తాత్పర్యం: అమ్మా! అడిగినప్పుడు వెంటనే పొమ్మని అంటే నేను పోయి ఉందునుగదా! మిక్కిలి దుర్బుద్ధి గలదానివై గర్వంతో నన్నిట్లా నిలబెట్టి భిక్షం పెట్టకుండా మిక్కిలి అవమానం ఎందుకు చేసినావమ్మా?

చ. అనినఁ బతివ్రతాతిలక మాతని కిట్లను 'నయ్య! మత్ప్రియుం
డనుపమితక్షుధాకలితుఁడై చనుదెంచిన భక్తి నమ్మహా
త్మునకు సపర్యసేయుచు మిమున్ మదిలోనఁ దలంపఁజాల నై
తి; నిదియుఁ దప్పుగాఁ గొనక ధీరత యొప్ప సహింపఁగాఁ దగున్.' 12

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; పతివ్రతాతిలకము= పతివ్రతలలో శ్రేష్ఠురాలైన ఆమె; ఆతనికిన్= ఆ కౌశికుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; అయ్య!= ఆర్యా!; మత్+ప్రియుండు= నా మగడు; అనుపమితక్షుధా+ కలితుఁడు+ఐ= సాటిలేని అనగా మిక్కిలి ఎక్కువైన ఆకలిచేత కూడినవాడై; చనుదెంచినన్= రాగా; భక్తిన్= పూజ్యభావంతో; ఆ+మహా+ ఆత్మునకున్= ఆ గొప్పఆత్మ గల మహనీయుడికి; సపర్య+చేయుచున్= సేవలు సల్పుతూ; మిమున్= మిమ్ము; మదిలోనన్= మనస్సులో; తలంపన్+చాలను+ఐతిన్= స్మరించ లేక పోయితిని; ఇదియున్= ఈ విధంగా మిమ్ము స్మరించక పోవటం; తప్పుగాన్+కొనక= అపరాధంగా గ్రహించక; ధీరత+ఒప్పన్= సహనం విలసిల్లేటట్లుగా; సహింపఁగాన్+తగున్= ఓర్చుకొనటం మంచిది.

తాత్పర్యం: ఆ కౌశికుని అధిక్షేపణకు సవినయంగా ఆ ఇల్లాలు ఇట్లా బదులు పలికింది. 'అయ్యా! నా పెనిమిటి మిక్కిలి ఆకలితో ఇంటికి వచ్చాడు. అందుచేత భక్తితో ఆ మహాత్ముడికి సేవలు చేస్తూ మిమ్ము స్మరింపజాలక పోయాను. దీనిని మీరు అపరాధంగా గ్రహించరాదు. సహనంతో ఓర్చుకొనదగును.

వ. అనిన నమ్మహీదేవుం డప్పతివ్రత కి ట్లనియె. 13

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+మహీదేవుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ+పతివ్రతకున్= ఆ సాధ్వికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా ఆ బ్రాహ్మణుడు ఆ పతివ్రతకు ఈవిధంగా బదులు పలికాడు.

ఉ. 'నీ మగఁ డంత యెక్కుడె? మనీషులు భూసురు లింత తక్కువే?
కోమలి! యేల యిట్లు గడుఁ గ్రొవ్వునఁ గానవు లోకవంద్యులన్?
భూమిసురేంద్రులన్ దివిజపుంగవుఁ డాదిగ భక్తిఁ గొల్చుచో
నేమిట నొక్కొవారు గడు నెల్లిద మై రిటు నీకు నిచ్చటన్. 14

ప్రతిపదార్థం: కోమలి!= ఓ వనితా!; నీ మగఁడు= నీ భర్త; అంత+ఎక్కుడు+ ఎ= అంత గొప్పతనం కలవాడా?; మనీషులు= గొప్పమేధ కలిగినవారు, విద్వాంసులు; భూసురులు= బ్రాహ్మణులు; ఇంత, తక్కువ+ఏ?= ఇంత హీనత కలవారా?; ఏల= ఎందులకు; ఇట్లు= ఈవిధంగా; లోక, వంద్యులన్= లోకంలోని ప్రజలచేత నమస్కరించ తగినవారిని; కడున్= మిక్కిలి; క్రొవ్వునన్= మదంతో; కానవు= చూడవు; భూమిసుర+ఇంద్రులన్= బ్రాహ్మణశ్రేష్ఠులను; దివిజపుంగవుఁడు+ఆదిగన్= వేల్పులలో శ్రేష్ఠుడైన

ఇంద్రుడు మున్నగువారు; భక్తిన్= పూజ్యభావంతో; కొల్చుచోన్= ఆరాధిస్తుంటే; వారు= ఆ బ్రాహ్మణులు; నీకున్; ఇచ్చటన్= ఇచ్చట; ఇటు= ఈవిధంగా; కడున్= మిక్కిలి; ఏమిటన్+ఒక్కొ= ఎందుకో మఱి; ఎల్లిదము+ఐరి= చులకన అయినారు?

తాత్పర్యం: 'ఏమమ్మా! నీ భర్తయే అంత గొప్పవాడని తలపోస్తున్నావా? నీ ఉద్దేశంలో విజ్ఞానులైన విప్రులు అంత తక్కువవా రయినారా? బ్రాహ్మణులు జగత్సంపూజ్యులు. దేవేంద్రుడు సయితం బ్రాహ్మణులను భక్తితో ఆరాధిస్తాడుకదా! నీవు మాత్రం గర్వంతో అట్టివారిని చులకనగా చూడటం నాకు మిక్కిలి ఆశ్చర్యకరంగా ఉన్నది.

క. అవమానితు లై ధరణీ ।
దివిజులు గ్రోధాగ్నిశిఖల దీపించి మహా
ద్రి వనద్వీపంబులతో ।
నవని నయినఁ బొడవడంతు రప్రతికారుల్. 15

ప్రతిపదార్థం: ధరణీ, దివిజులు= బ్రాహ్మణులు (పుడమివేల్పులు); అవమానితులు+ఐ= అగౌరవింపబడినవారై; క్రోధ+అగ్ని, శిఖలన్= కోపం అనే అగ్నిజ్వాలలచేత; దీపించి= మండిపోయి; అప్రతికారుల్= తిరుగు లేనివారు; మహా+అద్రి, వన, ద్వీపంబులతోన్= గొప్పకొండలతో అడవులతో దీవులతో పాటుగా; అవనిన్+అయినన్= భూమిని సయితం; పొడవు+ అడంతురు= నాశనం చేయగలరు.

తాత్పర్యం: బ్రాహ్మణులు అవమానించబడితే వారి కోపం అగ్నిజ్వాలలవలె ఎగసి, ఈ పుడమిని సమస్తాన్నీ కొండలతో, అడవులతో, దీవులతో పాటుగా దహించివేస్తుంది. వారి మహిమ తిరుగు లేనిది సుమా!

వ. నీ వింత నెఱుంగ నొల్ల వైతివి గాకేమి' యనిన నయ్యంగన యిట్లనియె. 16

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఇంతన్= ఈ విషయం, ఎఱుంగన్+ఒల్లవు+ ఐతివి+ కాక+ఏమి= తెలియలేకపోయావు గదా; అనినన్= అని అనగా; ఆ+అంగన= ఆ వనిత; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నీవు ఈ విషయం తెలుసుకోలేకపోయావు అని చెప్పగా ఆ పతివ్రత ఇట్లా బదులు పలికింది.

సీ. 'దేవతాసములు భూదేవతావరు లౌట ।
యేను దన్మాహాత్మ్య మెఱుఁగ నయ్య!
యొక విప్రుఁ డలిగి పయోనిధిజలము ల ।
పేయముల్ గాఁగ శపింపఁ డెట్లు;
దండకవిషయంబు దగ్ధంబు సేయండె ।
యలుకమై నొక్క మహాద్విజుండు;
వాతాపి యను దైత్యవరు మ్రింగి యఱిగించు ।
కొనఁడె భూదేవుఁ డొక్కొరుఁడు గినిసి;

తే. ధరణి మఱియును బెక్కు విధంబులందు ।
బ్రహ్మవిదు లైన బ్రాహ్మణప్రభుల మహిమ వినమె!
యెఱిఁగి యెఱింగి సద్వినుత చరిత!
కొఱవి గొని వెట్టినే తలఁ గోఁకి కొనఁగ? 17

ప్రతిపదార్థం: సత్+వినుత, చరిత!= మంచివారలచేత పొగడబడిన ప్రవర్తన కలవాడా!; భూ, దేవతావరులు= పుడమివేల్పు లైన విప్రులు, దేవతాసములు+ ఔట= వేల్పులతో సమానులు; అగుట; ఏను= నేను; తత్+మాహాత్మ్యము= వారి మహిమ; ఎఱుఁగన్+అయ్య!= తెలియనిదాననా?; ఒక, విప్రుఁడు= ఒక బ్రాహ్మణుఁడు; అలిగి= కోపించి; పయస్+నిధి, జలంబులు= సముద్రంలోని నీళ్ళు; అపేయముల్+కాఁగన్= త్రాగకూడనివయ్యేటట్లుగా; శపింపఁడు+ఎట్లు= శాపం ఇవ్వలేదా?; ఒక్క, మహా, ద్విజుండు= ఒక గొప్ప బ్రాహ్మణుడు;

దండక, విషయంబు= దండకం అనే పేరు గల అరణ్య ప్రదేశం; అలుకమైన్= కోపంతో; దగ్ధంబు+చేయండు+ఎ= తగులబడేటట్లుగా చేయడా?; భూదేవుఁడు+ఒక్కొరుఁడు= ఒకానొక విప్రుడు; కినిసి= కోపించి; వాతాపి+అను, దైత్యవరున్= వాతాపి అనే పేరుగల రాక్షస శ్రేష్ఠుడిని; మ్రింగి= భక్షించి; అఱిగించుకొనఁడు+ఎ= జీర్ణంచేసికొనడా?; ధరణిన్= భూమిలో; మఱియును= ఇంకను; పెక్కు, విధంబులందున్= పలురీతులలో; బ్రహ్మవిదులు+ఐన= బ్రహ్మజ్ఞానం తెలిసిన; బ్రాహ్మణ, ప్రభుల మహిమ= విప్రులలో శ్రేష్ఠులైన వారి గొప్పదనం; వినమె= ఆలకించమా?; ఎఱిఁగి, ఎఱింగి= తెలిసి తెలిసి; కొఱవిన్+కొని= మండేకట్టెను తీసికొని; తలన్= శిరస్సును; గోఁకికొనఁగన్= బరుకుకొనటానికి, వెఱ్ఱినే= పిచ్చిదాననా?

తాత్పర్యం: 'పుడమివేల్పులైన బ్రాహ్మణులు దేవతలతో సమానులే. నాకు వారి గొప్పతనం తెలియదా? ఒక బ్రాహ్మణుడు కోపించి సముద్ర జలాలు త్రాగకూడనివయ్యేటట్లుగా శపించలేదా? మరొక బ్రాహ్మణోత్తముడు దండక ప్రదేశం తగులబడిపోయేటట్లుగా చేయలేదా? ఒక విప్రుడు వాతాపి అనే గొప్ప రక్కసిని, తిని జీర్ణించుకొనలేదా? అంతేకాక, భూలోకంలో బ్రాహ్మణోత్తములమహిమ వినమా? మంచివారలచేత పొగడబడిన నడవడి గల ఓ విప్రోత్తమా! తెలిసి తెలిసి నేను బ్రాహ్మణులను అవమానించి కొరవితో తలగోకుకొనే పిచ్చిదాననా?

విశేషం: సముద్ర జలాలను త్రాగగూడనివిగా శపించిన విప్రుడు దుర్వాసుడు; దండకారణ్యాన్ని కోపంతో దహింపజేసిన విప్రుడు శుక్రాచార్యుడు; వాతాపిని జీర్ణించుకొన్న బ్రాహ్మణుడు అగస్త్యుడు.

వ. నా తెఱంగు సెప్పెద నాకర్ణింపుము. 18

తాత్పర్యం: నేను అనుసరించే మార్గాన్ని వివరించి చెప్పుతాను; దయచేసి వినుము.

తే. పతియచూవె నాపాలికిఁ బరమదైవ; ।
మేను వాఙ్మనఃక్రియలఁ దద్ధితమ యెపుడుఁ
గోరి యొనరింతు; దీని మిగులఁగ నొండు ।
ధర్మువులు గాన నెందును దలఁచి చూచి. 19

ప్రతిపదార్థం: పతి+అ= పతియ, చూవె= భర్త మాత్రమే కదా; నాపాలికిన్= నాయెడల; పరమదైవము= గొప్పదేవుడు - పరమాత్మ, ఏను= నేను; వాక్+మనస్+క్రియలన్= మాటలచేత, మనస్సుచేత, పనులచేతను; తత్+హితము+అ= ఆతడియొక్క శ్రేయాన్నే; ఎపుడున్= ఎల్లప్పుడున్నూ; కోరి= అభిలషించి; ఒనరింతున్= చేస్తాను; దీని మిగులఁగన్= దీనిని మినహాయించి; ఒండుధర్మువులు= వేరైన ధర్మాలు; తలఁచి, చూచి= ఆలోచించి చూచి; ఎందును= ఎక్కడకూడా కానన్= చూడను.

తాత్పర్యం: నా దృష్టిలో నా పాలికి గొప్ప దేవుడు నా భర్తమాత్రమే. నేను త్రికరణశుద్ధిగా, మనస్సుచేత, మాటలచేత, కర్మలచేత నా పతి శ్రేయస్సునే కాంక్షిస్తాను. ఆ విధంగానే నా ఆచరణను తీర్చిదిద్దుకొంటాను. ఎంత ఆలోచించి తరచి చూచినా, ఇంతకంటె గొప్ప ధర్మాలు నాకు కనుపించటం లేదు సుమా!

వ. నీ వతిక్రోధనుండ వగుటయు నెఱుంగుదు; నీకోపంబున నొక్కకొక్కెర నిహతం బయ్యెం గాదె! యిది మదీయపాతివ్రత్యమహిమం జేసి కాంచితిం; గాన క్రోధంబు గొనియాడుట లగ్గు గా' దని యి ట్లనియె. 20

ప్రతిపదార్థం: నీవు= ఓ కౌశికా!; అతిక్రోధనుండవు= మిక్కిలి కోపంతో కూడిన స్వభావం కలవాడివి; అగుటయున్= అగుటయును; ఎఱుంగుదున్= తెలిసినదానను; నీకోపంబునన్= నీ ఆగ్రహంవలన; ఒక్క, కొక్కెర= ఒక కొంగ; నిహతంబు+ అయ్యెన్+కాదె= చచ్చిపోయిందికదా; ఇది= ఈ విషయం (కొంగ చనిపోవటం); మదీయ, పాతివ్రత్య, మహిమన్+చేసి= నాయొక్క పాతివ్రత్య ప్రభావంచేత; కాంచితిన్= చూచాను; కాన= కావున;

క్రోధంబు= కోపాన్ని; కొని+ఆడుట= ఆదరించటం; లగ్గు, కాదు= మేలు కాదు; అని= అని పలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నీవు తీవ్ర కోపంతో కూడిన స్వభావం కలవాడ వని నాకు తెలియును. నీ కోపంవలన ఒకకొంగ చనిపోయింది కదా! ఈ విషయం నా పాతివ్రత్య మహిమవలన నేను తెలిసికొన్నాను. కావున కోపాన్ని వహించటం మంచిది కాదు సుమా!' అని చెప్పి, మఱియు ఆమె ఇట్లా అన్నది.

తే. 'క్రోధ మోహ నామకు లైన ఘోరశత్రు ।
లిరువు రెరియించుచుండుదు రెపుడు నంత
రంగ మయ్యుభయంబు నడంగకున్న౯ ।
గలదె యూరక బ్రాహ్మణ్యగౌరవంబు? 21

ప్రతిపదార్థం: క్రోధ, మోహ, నామకులు+ఐన= కోపం, మోహం అనే పేర్లు గలవారైన, ఘోర, శత్రులు= భయంకరమైన విరోధులు; ఇరువురు= ఇద్దరు, ఎపుడున్= ఎల్లప్పుడు; అంతరంగమున్= హృదయాన్ని; ఎరియించుచున్+ఉండుదురు= తగులబెట్టు తుంటారు; ఆ+ఉభయంబున్= ఆ రెండున్నూ; అడంగక+ఉన్నన్= నశించకపోతే; బ్రాహ్మణ్య= బ్రాహ్మణు లకు సంబంధించిన, గౌరవంబు= గొప్పతనం; ఊరక కలదె?= నిష్కారణంగా ఏర్పడుతుందా?

తాత్పర్యం: మానవుల హృదయాలలో, కోపం మోహం అనేపేర్లు కల శత్రువులు ఇద్దరు మిక్కిలి భయంకరమైన వారు నివసిస్తుంటారు. వారిని ఇద్దరను అణచివేయకపోతే, బ్రాహ్మణులకు నిజమైన గొప్పతనం ఎట్లా ఏర్పడుతుంది?

సీ. ఎవ్వఁడు సత్యంబ యెప్పుడుఁ బల్కు హిం ।
సావిదూరుఁడు గురుజనహితార్థి
యింద్రియంబుల నోర్చి యెల్లవారలఁ దన ।
యట్ల కాఁ జూచు ధర్మాభిరతుఁడు
గామంబు దగులండు కర్మంబు లాఱును ।
సముచిత సంప్రయోజ్యత నొనర్చు

నట్టి పుణ్యాత్ముని ననఘు బ్రాహ్మణుఁడని ।
యనిశంబుఁ గీర్తింతు రమరవర్యు;

ఆ. లార్జవంబు శమము నధ్యయనంబును ।
బరమధనము సువ్వె బ్రాహ్మణునకు
ధర్మగతికి నివియ తగు సాధనంబులు ।
వేదవిహితముఖ్యవిధులు నివియ. 22

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఎవడు; సత్యంబు+అ= నిజాన్ని మాత్రమే; ఎప్పుడున్= సతతం; పల్కున్= మాటాడుతాడో; హింసా, విదూరుండు= ఎవరికిని ఎట్టిపీడ చేయనివాడో; గురు, జన, హిత+అర్థి= గురువులు అయిన వారల మేలు కోరే వాడో; ఇంద్రియంబులన్+ఓర్చి= ఇంద్రియాలను నిర్జించి; ఎల్లవారలన్= అందరను; తన+అట్ల, కాన్+చూచు= తనవంటివారలనుగానే చూచే; ధర్మ+అభిరతుఁడు= ధర్మంలో మిక్కిలి ఇష్టం కలవాడో; కామంబు= కోరికయందు; తగులండు= చిక్కుకొనడో; కర్మంబులు+ ఆఱును= ఆరుపనులను (షట్ కర్మములను); సముచిత, సంప్రయోజ్యతన్+ఒనర్చున్= తగిన పద్ధతిలో ఆచరించునో అట్టి= పైనచెప్పబడినట్టి విధంగా ఉన్న వాడిని; పుణ్య+ఆత్మునిన్= సుకృతాలు ఆర్జించే మహానుభావుడిని; అనఘున్= పాపరహితుడైనవాడిని; అమరవర్యులు= వేల్పులలో శ్రేష్ఠులు; బ్రాహ్మణుఁడు+అని= బ్రహ్మజ్ఞానం కలవాడని; అనిశంబున్= ఎల్లప్పుడును; కీర్తింతురు= పొగడుతారు; బ్రాహ్మణునకున్= బ్రహ్మజ్ఞానంగలవిప్రుడికి; ఆర్జవము= తిన్ననైన ప్రవర్తన; శమమున్= అంతరింద్రియనిగ్రహం; అధ్యయనంబును= వేదాలను చదవటం; పరమ, ధనము+చువ్వె= ధనాలలో గొప్పధనం సుమా; ఇవి+అ= ఇవియే (అనగా పూర్వోక్తాలైన గొప్పగుణగణాలు మాత్రమే); ధర్మగతికిన్= ధర్మమార్గానికి; తగు= ఉచితమైన; సాధనంబులు= ఉపకరణాలు; ఇవి+అ= ఇవియే; వేద, విహిత, ముఖ్య, విధులు= వేదాలచేత నిర్ణయించబడిన కర్తవ్యాలు.

తాత్పర్యం: ఎవడు బ్రాహ్మణుడు? ఎవడికి బ్రాహ్మణ్యగౌరవం చెందదగింది? ఎవడు ఎల్లప్పుడును సత్యాన్నే పలుకుతాడో; ఎవడు ఎప్పుడును ఎవరినీ పీడించడో, ఎవడు తల్లితండ్రులు ఒజ్జలు మొదలైన గురువులకు మేలు తలుస్తాడో, ఎవడు సర్వభూతాల యెడ సానుభూతి కలిగి ఉంటాడో, ఎవడు కోరికలను విసర్జిస్తాడో, ఎవడు షట్కర్మలను తగినట్లుగా ఆచరించే అనుష్ఠానవేదాంతియో, అట్టి పుణ్యాత్ముడే, అట్టి మహాత్ముడే బ్రాహ్మణుడు. అట్టి మహానుభావుడినే అచ్చమైన బ్రాహ్మణుడిగా దేవతలు ప్రస్తుతిస్తారు. ఆర్జవ, ఇంద్రియనిగ్రహ, వేదాధ్యయనాలే బ్రాహ్మణుడికి గొప్పధనాలు. ధర్మపథానికి ఇట్టి సద్గుణగణాలే సాధనాలు. ఇవియే వేదాలచేత ఆదేశించబడిన కర్తవ్యాలు.

విశేషం: (i) గురుజనులు:- తండ్రి, మేనమామ, అన్నగారు, చదువు చెప్పిన ఉపాధ్యాయుడు, మంత్రమును ఉపదేశించినవాడు మున్నగువారు గురుజనాలుగా పరిగణించబడతారు. (ii) షట్కర్మలు:- 1.యజనం 2. యాజనం 3. అధ్యయనం 4. అధ్యాపనం 5. దానం 6. ప్రతిగ్రహం.(iii) ధమ్మపదంలో 'ఎవడు బ్రాహ్మణుడు' అని ఒక ప్రత్యేక ప్రశ్న పరంపర ఉన్నది. అందును ఎన్నో సద్గుణగణాలు కలవాడే బ్రాహ్మణుడని చెప్పబడింది. మహాభారతంలోను, వైదికవాఙ్మయంలోను బ్రహ్మజ్ఞానం, సౌశీల్యం, సద్గుణగణసంచయాలే బ్రాహ్మణత్వ లక్షణాలుగా పలుమారులు నొక్కి వక్కాణించబడ్డాయి. జన్మచేత బ్రాహ్మణత్వాన్ని ఎన్నటం అర్వాచీన లౌకిక సంప్రదాయమే.

వ. ధర్మంబు బహుమార్గదృష్టంబయి సూక్ష్మంబయియుండు; నీవు కేవల స్వాధ్యాయపరుండవు గాని ధర్మ సూక్ష్మత యెఱుంగవు; గావునం దడయక మిథిలానగరంబున కరుగు; మందు జితేంద్రియుండును సత్యవాదియు మాతాపితృభక్తుండును నయినవాఁడు ధర్మవ్యాధుం డను కిరాతుండు నీకు నఖిలధర్మంబులు నెఱింగించి, సంశయచ్ఛేదంబు సేయు; నాదెసం బ్రసన్నుండ

వగునది; వనితలకుం బరిజ్ఞానంబు లేదు గావున వా రెట్టి యపరాధంబు సేసినను సహింపవలయుఁ గదా!' యనినఁ గౌశికుం డి ట్లనియె. 23

ప్రతిపదార్థం: ధర్మంబు= ధర్మం; బహు, మార్గ దృష్టంబు+అయి= పెక్కు తెరువులలో తిరుగాడేదిగా కన్పించేది అయి; ఉండున్= ఉంటుంది; ఈవు= నీవు; కేవల, స్వాధ్యాయ, పరుండవు= వేదాలు వల్లెవేయటంలో మాత్రమే నిష్ఠ కలిగినవాడవు; కాని= అంతేకాని; ధర్మ, సూక్ష్మత= ధర్మాధర్మవిచక్షణత లోని ఆంతర్యం; ఎఱుంగవు= తెలియనివాడవు; కావునన్= కాబట్టి; తడయక= ఆలస్యం చేయక; మిథిలా, నగరంబునకున్= మిథిల అనే పేరు కల పట్టణానికి; అరుగుము= వెళ్లుము; అందున్= ఆ మిథిలలో; జిత+ ఇంద్రియుండును= జయించబడిన ఇంద్రియాలు కలవాడును- విషయ లోలత్వాన్ని అతిక్రమించిన వాడును; సత్యవాదియున్= నిజాన్ని భాషించే వాడును; మాతాపితృభక్తుండునున్= తల్లిదండ్రులయెడ పూజ్యభావం కలవాడును; అయినవాఁడు; ధర్మవ్యాధుండు+అను, కిరాతుండు= ధర్మవ్యాధుఁ డు అనే నామం పొందిన బోయవాడు; నీకున్; అఖిల ధర్మంబులున్= సమస్త ధర్మాలూ, ఎఱింగించి= తెలిపి; సంశయచ్ఛేదంబు+చేయున్= సందేహాలను తెగగొట్టి వేస్తాడు; నాదెసన్= నాయెడల; ప్రసన్నుండవు+ అగుము= అనుగ్రహం కలవాడవు కమ్ము; వనితలకున్= ఆడువారికి; పరిజ్ఞానంబు= ఎక్కువ తెలివిడి; లేదు= ఉండదు; కావునన్= కాబట్టి; వారు= ఆడువారు; ఎట్టి= ఏవిధమైన; అపరాధంబు= నేరం; చేసినను= చేసినప్పటికీ; సహింపవలయున్+కదా= ఓర్చుకొనవలసిందే కదా!; అనినన్= అని చెప్పగా; కౌశికుండు= కౌశికుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మం మిక్కిలి క్లిష్టమైనది. స్థూలదృష్టికి ఒక విధంగా, సూక్ష్మదృష్టికి మరొక తీరుగా కన్పిస్తుంది. ధర్మంయొక్క తీరుతీయాలు పెక్కు తెరగులు. నీవు వేదాలను వల్లెవేయటంలో మాత్రమే ఎక్కువనిష్ఠ కలవాడవు గాని

ధర్మసూక్ష్మత గుర్తించగలిగిన విచక్షణ ఉన్నవాడవు కావు. కావున నీవు మిథిలానగరానికి వెళ్లి, ఆ పట్టణంలో 'ధర్మవ్యాధుడు' అనే పేరుతో విలసిల్లే బోయవాడిని సందర్శించు. అతడు జితేంద్రియుడు. మాతాపితృభక్తుడు. ధర్మసూక్ష్మవేత్త. అతడు నీసంశయాల నన్నింటిని పోగొట్టి నీకు విచక్షణాజ్ఞానం ప్రసాదించగలడు. నాయెడ అనుగ్రహం చూపుము. ఆడువారికి విజ్ఞానం ఉండదుకదా! అజ్ఞానంలో పడి కొట్టుకొనే నాబోటి ఆడువారు ఎటువంటినేరం చేసినా క్షమించవలెను కదా' అని ఆమె చెప్పిన మాటలు విని కౌశికుడు ఈవిధంగా బదులు పలికాడు.

క. 'నిను దూఱఁదగదు నీకత ।
మున నాచిత్తము ప్రశాంతిఁ బొరసెఁ బురంధ్రీ
జన వినుత! పోయి వచ్చెద ।
ననుపమశోభనసమృద్ధు లయ్యెడు నీకున్.' 24

ప్రతిపదార్థం: పురంధ్రీ, జన, వినుత= మగడు బిడ్డలుగల అనగా ఇల్లాండ్ర సముదాయంచేత పొగడబడినదానా!; నినున్= నిన్ను; దూఱన్+తగదు= నిందించ రాదు; నీ, కతమునన్= నీకారణాన; నా చిత్తము= నా మనస్సు; ప్రశాంతిన్= మిక్కిలి శాంతిని; పొరసెన్= పొందింది; పోయివచ్చెదన్= వెళ్ళివస్తాను (మిథిలా నగరానికి నీఆదేశం ప్రకారం వెళ్ళుతాను); నీకున్= నీకు; అనుపమ, శోభన, సమృద్ధులు= సాటిలేనటువంటి శుభాల పెంపు; అయ్యెడున్= కలిగెడుగాక.

తాత్పర్యం: 'అమ్మా! నీవు కేవలం ఒక ఆడుదానివి కావు. మేటి ఇల్లాండ్రకు మేలుబంతివై కర్మయోగిని వైన నీ మూలాన నాకు జ్ఞానోదయం అయింది. నా మనస్సుకు ప్రశాంతి లభించింది. నీ ఆదేశం ప్రకారం నేను మిథిలానగరానికి వెళ్ళుతాను. నీకు మేలు కలుగుగాక!'

కౌశికుం డను బ్రాహ్మణుండు ధర్మవ్యాధుని యొద్దకుఁ బోవుట (సం. 3-197-1)

వ. అని యా క్షణంబ యమ్మహాద్విజుండు ధర్మవ్యాధ దర్శనలాలసుండై కదలి పతివ్రతయెఱుకకు విస్మయం బందుచు దన్నుం గృతాపరాధునింగాఁ దలంచుచు ననేకనగర గ్రామంబు లతిక్రమించి చని, యనుపమానశోభాస నాథం బయిన మిథిలానగరంబు సొచ్చి, రాజమార్గంబు దఱిసి, యచ్చటి జనంబుల ధర్మవ్యాధుం డున్నయెడ నడిగి, వా రెఱింగింప నట యేఁగి ముందట నల్పమృగమాంసఖండంబు లంగడిం బచరించి యమ్ముచున్న వాని, ననవరత విక్రయాగత జనసమావృతు నక్కిరాతుం గని, యతి జుగుప్సితం బయిన సూనాపణంబు సేర నొల్లక తొలంగి యొక్కయెడ నుండె; నంత. 25

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; ఆ క్షణంబు+అ= ఆ క్షణంలోనే; ఆ+మహా, ద్విజుండు= ఆ గొప్పబ్రాహ్మణుడు; ధర్మవ్యాధ, దర్శన, లాలసుండు+ఐ= ధర్మవ్యాధుడిని చూడవలె ననే కోరిక కలవాడై; కదలి= అచ్చటి నుండి వెడలి; పతివ్రత, ఎఱుకకున్= పతివ్రతయొక్క తెలివిడికి; విస్మయంబు+అందుచున్= ఆశ్చర్యం చెందుతూ; తన్నున్= తనను; కృత+అపరాధు నిన్+కాన్= దోషం చేసిన వాడినిగా; తలంచుచున్= మనసులో ఎన్నుకొంటూ; అనేక, నగర, గ్రామంబులు= పెక్కు పట్టణాలు, పల్లెటూళ్లు; అతిక్రమించి= దాటి; చని= వెళ్లి; అనుపమాన, శోభా, సనాథంబు+అయిన= సాటిలేని వైభవంతో కూడినట్టి; మిథిలా, నగరంబు+చొచ్చి= మిథిల అనే పట్టణాన్ని చేరి; రాజమార్గంబు= రాజుగారు ఊరేగేతెరువు; తఱిసి= సమీపించి; అచ్చటి= అక్కడున్న; జనంబులన్= ప్రజలను; ధర్మవ్యాధుండు+ ఉన్న+ఎడన్= ధర్మవ్యాధుడు నివసించే చోటును; అడిగి= ప్రశ్నించి; వారు= (ఆజనులు); ఎఱింగింపన్= తెలుపగా; అట+ఏగి= ఆ చోటికి వెళ్లి; ముందటన్ ఎదురుగా; అల్ప, మృగ, మాంస, ఖండంబులు= చిన్న చిన్న ముక్కలుగా

చేయబడిన లేడి మాంసాలు; (లేక జంతువుల మాంసపు ముక్కలు); అంగడిన్= దుకాణంలో; పచరించి= ఏర్పరచి పెట్టి; అమ్ముచున్నవానిన్= విక్రయిస్తున్న వాడిని; అనవరత, విక్రయ+ఆగతజన, సమావృతున్= ఎడతెగకుండా కొనటానికై వస్తున్న ప్రజలచేత చుట్టుకొనబడినవాడిని; ఆ+కిరాతున్= ఆ బోయవాడిని; కని= చూచి; అతిజుగుప్సితంబు+అయిన= మిక్కిలి రోతపుట్టించేది అయిన; సూన+ ఆపణంబు= జంతువులను చంపి వాటి మాంసాన్ని అమ్మే అంగడి; చేరన్+ఒల్లక= సమీపించటానికి ఇష్టపడక; తొలంగి= దూరంగా నిలిచి; ఒక్క+ఎడన్= ఒకచోట; ఉండెన్; అంతన్= పిమ్మట.

తాత్పర్యం: అంతట కౌశికుడు ఆ గృహిణిని వీడ్కొని వెళ్ళాడు. అతడు ఆ పతివ్రత జ్ఞానానికి ఆశ్చర్యపోయాడు. తాను తప్పుచేసినవాడుగా లోలోపల పశ్చాత్తాపం పొందాడు. అట్లే- అతడు ఎన్నో పల్లెలు, పట్టణాలు దాటి పయనించి ఎట్టకేలకు మిథిలానగరం చేరి, ఆ రాజధానిశోభను తిలకించి, రాజమార్గంలోని పౌరులను అడిగి, ధర్మవ్యాధుడు ఉండేచోటు తెలిసికొన్నాడు. అక్కడికి కౌశికుడు చేరినప్పుడు, ధర్మవ్యాధుడు తన అంగడిలో మాంసాన్ని ముక్కలుచేసి అమ్ముతున్నాడు. మాంసాన్ని కొనుగోలు చేసే జనులచేత ఆ అంగడి క్రిక్కిరిసి ఉండింది. రోత పుట్టించే ఆ దృశ్యాన్ని చూడలేక ఆ బ్రాహ్మణుడు ప్రక్కకు ఒదిగి ఒకచోట నిలబడి ఉన్నాడు.

ఆ. వాఁడు నతనిరాక పోఁడిగ నిజబుద్ధి।
నెఱిఁగి యతనియున్నయెడకు వచ్చి
పరమభక్తిమ్రొక్కి ధరణీసురేశ్వరుఁ।
గుశల మడిగి ప్రియము గొనలు నిగుడ. 26

ప్రతిపదార్థం: వాఁడున్= (ఆ ధర్మవ్యాధుఁడును); అతనిరాక= ఆ కౌశికుడు రావటం; పోఁడిగన్= ఒప్పుగా; నిజ, బుద్ధిన్= తనమనస్సుచేత; ఎఱిఁగి= తెలిసికొని; అతని+ఉన్న+ఎడకున్= అతడు ఉన్న చోటికి; వచ్చి= చేరి; పరమ, భక్తిన్= మిక్కిలి పూజ్యభావంతో; మ్రొక్కి= నమస్కరించి; ధరణీ, సుర+ఈశ్వరున్= బ్రాహ్మణోత్తముడిని; కుశలము= యోగక్షేమాలను; అడిగి= ప్రశ్నించి తెలిసికొని; ప్రియము= సంతోషం; కొనలు నిగుడన్= విస్తరించగా.

తాత్పర్యం: ఆ ధర్మవ్యాధుడు కౌశికుడు తనవద్దకు ఆ రీతిగా రావటం తన మనశ్శక్తిచేత తెలిసికొని, ఆ విప్రుడు నిలిచిఉన్న చోటికి చేరి అభివాదం చేసి, మిక్కిలి ప్రీతితో అతడిని సంభావించాడు.

విశేషం: అతిథులు అభ్యాగతులు తమవద్దకు వచ్చినపుడు వారి యోగక్షేమాలు అడగటం స్వాగతమర్యాదలో అంతర్భాగం.

చ. 'అనఘ! నితంబినీతిలక మైన పతివ్రత నా తెఱంగు సె
ప్పినఁ జనుదెంచి తీవు ననుఁ బ్రీతిఁ గనుంగొన; నీమనోరథం
బును మదిలో నెఱుంగుదుఁ; బ్రమోదముఁ బొందితి; రమ్ము మద్గృహం
బున' కని పల్కి తోడుకొనిపోయె నతండు మహీసురోత్తమున్. 27

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; నితంబినీ, తిలకము+ఐన= ఆడువారిలో ఉత్తమురాలు అని చెప్పదగిన; పతివ్రత= భర్తను సేవించే గొప్ప ఇల్లాలు; నాతెఱంగు= నా తీరుతెన్నులు; చెప్పినన్= వచించగా; ఈవు= నీవు; ననున్= నన్ను; ప్రీతిన్= ప్రేమతో; కనుంగొనన్= చూడటానికి; చనుదెంచితి= వచ్చావు; నీ, మనో, రథంబును= నీ కోరికను; మదిలోన్= మనస్సులో; ఎఱుంగుదున్= తెలిసికొంటిని; ప్రమోదమున్= సంతోషాన్ని; పొందితిన్= చెందితిని; మత్+గృహంబునకున్= నా యింటికి; రమ్ము+అ= రమ్ము; అనిపల్కి= అని వచించి; అతండు= (ఆ ధర్మవ్యాధుడు); మహీసుర+ఉత్తమున్= బ్రాహ్మణులలో గొప్పవాడయిన ఆ కౌశికుడిని; తోడుకొని పోయెన్= తనవెంట తీసికొని వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! నీకు నన్నుగూర్చి ఆ పతివ్రత చెప్పింది గదా! అందుచేత నీవు నన్ను చూడవలెననే కోరికతో నా దగ్గరకు విచ్చేశావు.

ఈ విషయాన్ని నేను నా మనస్సుచేత తెలిసికొనగలిగాను. ఎంతో సంతోషం పొందాను. దయచేసి నాయింటికి రమ్ము' అని సగౌరవంగా స్వాగతం చెప్పి, ధర్మవ్యాధుడు బ్రాహ్మణోత్తము డైన కౌశికుడిని తన యింటికి తీసికొని వెళ్ళాడు.

వ. కౌశికుండును ధర్మవ్యాధునెఱుక కచ్చెరు వంది పతివ్రతయెఱుకయుం దలంచి 'యిది రెండవు నాశ్చర్యంబు గంటి పొ' మ్మని తలంచుచుఁదదీయ భవనంబున కరిగి వానిచేతంబూజితుం డయి యిష్టకథాప్రసంగంబున నుండి యతని కి ట్లనియె. 28

ప్రతిపదార్థం: కౌశికుండును= కౌశికుడనబడే ఆ బ్రాహ్మణుడును; ధర్మవ్యాధు+ ఎఱుకకున్= ధర్మవ్యాధుడి తెలివిడికి; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం పొంది; ఇది= (పతివ్రత తనను మిథిలకు వెళ్ళి ధర్మవ్యాధుడిని సందర్శించు మని చెప్పిన విషయం ఆవ్యాధుడికి తెలియటం); రెండు+అవు+ ఆశ్చర్యంబు= రెండవది అయిన వింత; (మొదటి వింత కొక్కెర చనిపోయిన సంగతి పతివ్రతకు తెలియటం); కంటిన్ పొమ్ము+ అని= చూచాను గదా అని; తలంచుచున్= అని ఆలోచిస్తూ; తదీయభవ నంబునకున్= ఆతడి యొక్క అనగా ధర్మవ్యాధుడియొక్క ఇంటికి; అరిగి= వెళ్ళి; వానిచేతన్= అతడి చేత; పూజితుండు+అయి= ఆరాధించబడినవాడై; ఇష్ట, కథా, ప్రసంగంబునన్= నచ్చినట్టి కథలను గూర్చిన సంభాషణలలో; ఉండి= కడపి; అతనికిన్= ఆ ధర్మవ్యాధుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కౌశికుడికి ధర్మవ్యాధుడి మాటలు రెండవ వింతగా తోచాయి. అతడికి మొట్టమొదట వింతగొలిపినవి పతివ్రత మాటలు. ఈ రెండు వింతలనుగూర్చి ఆలోచిస్తూ కౌశికుడు ధర్మవ్యాధుడి ఇంటికి వెళ్లి, అచటి అతిథి సత్కారాలను పొంది, ఉచిత సంభాషణలు సలిపి, అతడితో ఈ విధంగా పలికాడు.

విశేషం: (i) కౌశికుడు ఎదుర్కొనినవి రెండు వింతలు. మొట్టమొదట అరణ్యంలో తాను ఏకాంతంగా వేదాధ్యయనం చేసేటప్పుడు తన ఆగ్రహానికి లోనయి చెట్టుమీది కొంగ కాలిపోయి నేలమీద పడటాన్ని పతివ్రత తెలిసికొనటం. (ii) రెండవ వింత: తాను సుదూరంగా ఎక్కడో ఆనాడు పతివ్రతతో నెరపిన సంభాషణ - మిథిలానగరంలో ఉన్న ధర్మవ్యాధుడికి ఇక్కడ తెలియటం.

తే. 'నీవు గడు ధర్మవిదుఁడవు జీవహింస ।
జీవనంబుగ నడచుట శిష్టపథమె?
యకట! యీ ఘోరకర్మంబునకు మదీయ ।
బుద్ధి దద్దయు దుఃఖంబు వొందె నిపుడు. 29

ప్రతిపదార్థం: నీవు= నీవు; కడున్= మిక్కిలి; ధర్మవిదుఁడవు= ధర్మాన్ని తెలిసినవాడవు; జీవహింస= ప్రాణులకు పీడ కలిగించటం; జీవనంబుగన్= బ్రదుకుతెరువుగా; నడచుట= వర్తించటం; శిష్ట, పథము+ఎ?= మంచి మార్గం కాగలదా?; అకట!= అయ్యో!; ఈఘోర, కర్మంబునకున్= ఈ భయంకరమైన పనికి; మదీయ, బుద్ధి= నామనస్సు; తద్దయున్= మిక్కుటంగా; ఇపుడు= ఈసమయంలో; దుఃఖంబు+పొందెన్= విషాదాన్ని పొందింది.

తాత్పర్యం: 'ఓమహానుభావా! నీవు ధర్మమార్గం అనగా ఎట్టిదో బాగా తెలిసినవాడవు కదా! 'జీవహింస'ను బ్రదుకుతెరువుగా గైకొని ప్రవర్తించటం న్యాయమా? నీవు చేస్తున్న భయంకరమైన ఈ పాపకృత్యంవలన నా మనస్సు మిక్కిలి పరితపిస్తున్నది.

వ. అనుటయు లుబ్ధకుం డి ట్లనియె; 'బ్రాహ్మణులకుఁ దపస్స్వాధ్యాయ సత్యశౌచబ్రహ్మచర్యంబులును, రాజులకు దండనీతియు, వైశ్యులకుఁ గృషిపశుపాలనవాణిజ్యంబులును, శూద్రులకు శుశ్రూషయు నెట్లు పరమధర్మం

బయి చెల్లు; నట్ల మాకును మృగమాంసోపజీవనంబు పరమధర్మంబు;
విశేషించి యిది వంశక్రమాగతం బయిన యాచారంబు; విను; మదియునుం
గాక యీ దేశంబునకు రాజైన జనకుండు రాజధర్మతత్పరుండయి
సకలవర్ణధర్మరక్షణంబు వదలకుండు; నట్లుగాన యాత్మకర్మంబులు
విడుచువానిం దనపుత్త్రునైనను దండితుం జేయుఁ గావున నేనును
నిజకర్మపరిత్యాగంబు సేయ నోడుదు; నీదృశప్రవర్తనుండ నయ్యును. 30

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పటంతో; లుబ్ధకుండు+ఇట్లు+ అనియెన్= వ్యాధుడు(ధర్మవ్యాధుడు) ఈవిధంగా అన్నాడు;బ్రాహ్మణులకున్= విప్రులకు; తపస్+స్వాధ్యాయ, సత్య, శౌచ, బ్రహ్మచర్యంబులును= తపస్సుచేయటం, వేదాలను వల్లెవేయటం, నిజం చెప్పటం, పరిశుభ్రతను పాటించటం, ఇంద్రియనిగ్రహంతో కూడిన జ్ఞానాన్ని ఆర్జించటం; రాజులకున్= క్షత్రియు లైన పాలకులకు; దండనీతియున్= దుష్టులను శిక్షించటం శిష్టులను రక్షించటంతో కూడిన పాలన; వైశ్యులకున్= కోమట్లకు; కృషి= వ్యవసాయం; పశుపాలన= పశురక్షణ; వాణిజ్యంబులును= వర్తకమున్నూ; శూద్రులకున్= నాలవజాతివారికి; శుశ్రూషయున్= సేవయును; ఎట్లు= ఏవిధంగా; పరమ, ధర్మంబు+అయి= మిక్కిలి గొప్పది అయిన ధర్మం ఔతూ; చెల్లున్= తగును; అట్లు+అ= అదే విధంగా; మాకును= మాబోటి వారలకును; మృగ, మాంస+ఉపజీవనంబు= జంతువుల మాంసంపై ఆధారపడి బ్రతకటం; పరమ, ధర్మంబు= గొప్పదైన ధర్మం; విశేషించి= విశదీకరించి వివరిస్తే; ఇది= మృగమాంసోపజీవనం; వంశ, క్రమ+ఆగతంబు+ అయిన= కుటుంబంలో వరుసగా వస్తున్న; ఆచారంబు= సంప్రదాయం; వినుము; అదియునున్+కాక= అంతకంటె మిక్కుటంగా ఎన్నదగింది; ఈదేశంబునకున్= ఈ(మిథిలా) రాజ్యానికి; రాజు+అయిన= ప్రభువు అయిన; జనకుండు; రాజ, ధర్మ, తత్, పరుండు+అయి= ప్రభుత్వం నిర్వహించే విధులను నిష్ఠతో ఆచరించే వాడయి; సకల, వర్ణ, ధర్మ రక్షణంబు=

అన్ని కులాలవారు నెరవేర్చవలసిన ధర్మాలను రక్షించటాన్ని; వదలక+ఉండున్= మీరకుండ కాపాడుతుంటాడు; అట్లు+కాన= ఆవిధంగా చేస్తాడు కాబట్టి; ఆత్మ, కర్మంబులు= తాను చేయవలసిన కర్మలను; విడుచువానిన్= త్యజించేవాడిని; తన పుత్త్రున్+ఐనను= తన కొడుకును అయినప్పటికిని; దండితున్+చేయున్= శిక్షను అనుభవించేవాడినిగా చేస్తాడు; కావునన్= కాబట్టి; ఏనును= నేను సయితం; నిజ, కర్మ, పరిత్యాగంబు= నాదైన పనులను వదలటం; చేయన్+ఓడుదున్= చేయటానికి జంకుతాను; ఈ, దృశప్రవర్తనుండన్+అయ్యునున్= ఈ విధంగా కనిపించే నడవడి కలవాడనైనప్పటికిని.

తాత్పర్యం: అంతట, ధర్మవ్యాధుడు కౌశికుడితో ఇట్లా చెప్పాడు. 'ఎవరికి అనువైన ధర్మాలు వారు ఆచరించవలసి ఉన్నది. బ్రాహ్మణులు నిర్వహించవలసిన ధర్మాలు - తపస్సు, వేదాలను చదవటం, పరిశుభ్రత పాటించటం, ఇంద్రియనిగ్రహంతో కూడి జ్ఞానసముపార్జనం చేయటం; క్షత్రియప్రభువులు పాటించవలసినధర్మం శిష్టరక్షణం దుష్టశిక్షణంతో గూడిన పరిపాలన; వైశ్యులు ఆచరించవలసిన ధర్మాలు - వ్యవసాయం, వర్తకం, పాడిపంటలు అభివృద్ధిచేయటం; శూద్రులకు విహితమైన ధర్మం పరిచర్య. అట్లే, వ్యాధులు నెరవేర్చదగిన ధర్మం మాంసవిక్రయం. మాంసోపజీవనం మాకు వంశక్రమంగా సంక్రమించిన ఆచారం. అంతేకాక, ఇది మిథిలారాజ్యం. ఈ దేశానికి ప్రభువు జనకమహారాజు ఎవరివంశవృత్తులు వారు నిర్వహించవలె నని శాసించేవాడు. ఆ శాసనం మీరేవాడు తన కొడుకైనాసరే దండన విధిస్తుంటాడు. ఇన్ని కారణాలచేత నేను నా స్వధర్మ మైన మాంసవిక్రయాన్ని వీడజాలకున్నాను. స్థూలదృష్టికి నా ప్రవర్తన ఈ రీతిగా కన్పించవచ్చును. కానీ.....

తే. జీవహింస యెన్నండును జేయ ననఘ!
యొరులు సంపి తెచ్చిన మాంస మొనర విలిచి
తగిన వెల కమ్మి బ్రదుకుదుఁ; దద్ధనమున ।
నమలమానసశాంతి నా యర్థ మెందు. 31

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! ఓకౌశికమహర్షీ!; జీవహింస= ప్రాణులను పీడించటం; ఎన్నండును= ఎప్పుడు కూడా; చేయన్= చేయను; ఒరులు= ఇతరులు; చంపి= సంహరించి; తెచ్చిన= తీసికొనివచ్చిఇచ్చిన; మాంసము= మాంసం; ఒనరన్= ఒప్పేటట్లుగా; విలిచి= కొని; తగినవెలకున్= సరియైన ధరకు; అమ్మి= విక్రయించి; తత్+ధనమునన్= ఆ విధంగా సంక్రమించిన డబ్బువలన; బ్రదుకుదున్= జీవిస్తాను; అమల, మానస, శాంతి= స్వచ్ఛమైన మనస్సుకు సంబంధించిన తృప్తి; ఎందున్= అన్ని విధాలుగా; నా, అర్థము= నా సంపద, అనగా జీవిత పురుషార్థమని భావం!

తాత్పర్యం: నా అంతట నేను ఎప్పుడూ ఎట్టి జీవహింసకూ పాల్పడను. ఇతరులు మృగాలను చంపి తెచ్చి ఇచ్చిన మాంసాన్ని నేను కొని, కొద్ది లాభాన్ని మాత్రమే చూచికొని సరిఅయిన ధరకు విక్రయిస్తాను. ఆ విధంగా లభించిన ధనంవలన జీవిస్తాను. నా ధనంవలన నాకు మనశ్శాంతికూడ కలుగుతుంది. అదే నా పరమార్థం.

విశేషం: బ్రతకటానికి కావలసిన ధనం - న్యాయార్జితమైనదానిని, అధికలాభానికి దురాశకు పాల్పడక సంపాదిస్తాననీ, దానివలన తనకు తృప్తి కలుగుతుందనీ ధర్మవ్యాధుడు నొక్కి వక్కాణించాడు. 'జీవించుటకొరకు మాత్రమే ధనం- గాని ధనం కొరకే జీవించటం కూడదు' అని అతడి సందేశం.

చ. వినయము విస్తరిల్ల గురువృద్ధజనాతిథి విప్ర దేవతా
ర్చన లొనరింతు, సత్యమును శౌచము నేమఱ, నీగి మన్ననం
దనుపుదు భృత్యబంధుతతిఁ, దాల్మి వహింతు, నసూయఁ జేయ, నెం
దును మదిఁ దృష్ణ సొన్పఁ, బరదోషకథావిముఖుండ నెప్పుడున్. 32

ప్రతిపదార్థం: వినయము= అణకువతో కూడిన ప్రవర్తన; విస్తరిల్లన్= వర్ధిల్లేటట్లుగా; గురు, వృద్ధ, జన+అతిథి, విప్ర, దేవతా+ అర్చనలు= ఒజ్జలకు

ముసలివారికి అతిథులకు బ్రాహ్మణులకు దేవతలకు పూజలు; ఒనరింతున్= చేస్తాను; సత్యమును= నిజం పలుకటం; శౌచమున్= పరిశుభ్రత పాటించటం; ఏమఱను= మరచిపోను; ఈగి= దానంచేత; మన్ననన్= మర్యాదలు చేయటం చేతను; భృత్యబంధుతతిన్= సేవకులను, చుట్టాలను; తనుపుదున్= తృప్తి చెందిస్తాను; తాల్మిన్= ఓర్పును; వహింతున్= వహిస్తాను; అసూయన్+ చేయన్= మాత్సర్యాన్ని చెందను; ఎందును= ఎట్టి విషయంలోనైనా; మదిన్= మనసులో; తృష్ణ+చొన్పన్= దాహాన్ని (ఎక్కువ అభిలాషను) ప్రవేశపెట్టను; ఎప్పుడున్= ఏ సమయంలోనైనా; పర, దోష, కథా, విముఖుండన్= ఇతరుల తప్పులను గూర్చిన ప్రసంగాలను ఎన్నబోను.

తాత్పర్యం: నేను మిక్కిలి అణకువతో కూడిన ప్రవర్తనతో గురువులను, పెద్దలను, అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను పూజిస్తాను. సత్యవ్రతాన్ని పాటిస్తాను. పరిశుభ్రతను ఎన్నడూ మరవను. సేవకులకు దానా లిస్తాను. బంధువులను మర్యాదలు చేసి మన్నిస్తాను. ఓర్పును వహిస్తాను. అసూయ చెందను. ఎట్టి విషయాలలోను మిక్కుటమైన కోరికలను పెంచుకోను. ఎప్పుడూ ఇతరుల దోషాలను గూర్చిన ప్రసంగాలను వినను.

క. సతతోపవాసనియమ
వ్రతములఁ జరియింతు నేకవనితాప్రియుఁడన్
ఋతుకాలరతుఁడ నిందా
స్తుతులందు మనంబు నాకుఁ దుల్యత నుండున్. 33

ప్రతిపదార్థం: సతత+ఉపవాస, నియమ, వ్రతములన్= ఆహారాన్ని గైకొనకుండే నిబంధనలతో, నోములతో ఎల్లప్పుడును; చరియింతున్= నడుస్తాను, (ఆచరిస్తానని భావం); ఏక, వనితా, ప్రియుఁడన్= ఒకే స్త్రీయందు ప్రీతికలవాడను - ఏకపత్నీవ్రతం పాటించేవాడిని; ఋతు, కాల, రతుఁడన్= కాలానుగుణమైన సమయాలలోనే సంభోగించటంలో ఇష్టం కలవాడను; నిందా, స్తుతులందున్= తెగడ్తలలో, పొగడ్తలలో; మనంబు= మనస్సు; నాకున్; తుల్యతన్= సమభావంతో; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: నేను ఎల్లప్పుడున్నూ ఆహార విహారాలలో నిష్ఠ, నియమాలను పాటిస్తాను. ఉపవాస వ్రతాలను పాటిస్తాను. ఏకపత్నీవ్రతుడను. ఋతుకాలాలను అనుసరించి సంభోగిస్తాను. నామనస్సులో పొగడ్తకు ఉబ్బను. తెగడ్తకు వెతచెందను.

వ. అట్లగుటం జేసి హీనయోనిజుండ నయ్యును నిర్మలుండ నైతిం; బ్రసంగవశంబున నింత సెప్పవలసె; నీవు ధర్మబోధార్థంబు నాయున్నయెడకుం జనుదెంచితి గావున నీకు ధర్మవిశేషంబు లెఱింగించెద; నవధానతత్పరుండ వయి యాకర్ణింపుము. **34**

ప్రతిపదార్థం: అట్లు+అగుటన్+చేసి= ఆవిధంగా జరగటంవలన; హీన, యోనిజుండన్+ అయ్యును= తక్కువకులంలో పుట్టిన వాడను అయినప్పటికిన్నీ; నిర్మలుండన్+ఐతిన్= స్వచ్ఛమైన శీలం కలవాడను అయినాను; ప్రసంగ, వశంబునన్= సంభాషణ ధోరణినిబట్టి; ఇంత+ చెప్పవలసెన్= ఇంతమేర ఈ విధంగా చెప్పవలసి వచ్చింది; నీవు; ధర్మ, బోధ+అర్థంబు= ధర్మాన్ని తెలిసికొనటానికై; నా+ఉన్న+ఎడకున్= నేను ఉన్నచోటికి; చనుదెంచితి(వి)= వచ్చావు; కావునన్= కాబట్టి; నీకున్; ధర్మ, విశేషంబులు= ధర్మాలలోని ప్రత్యేకవిభాగాలు- ధర్మసూక్ష్మాలు; ఎఱింగించెదన్= తెలియపరుస్తాను; అవధాన, తత్, పరుండవు+అయి= ఏకాగ్రతలో నిష్ఠ కలవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అందుచేత, నేను తక్కువకులంలో పుట్టినప్పటికిన్నీ, మంచిశీలం ఏర్పరచుకొన గలిగాను; ఇది నీకు చెప్పటం నాగొప్పదనం చాటుకొనటానికి కాదు. సంభాషణ చేయ వలసివచ్చింది కాబట్టి చెప్పక తప్పింది కాదు. నీవు నా దగ్గరకు వచ్చింది ధర్మసూక్ష్మాలను తెలిసికొనటానికే కదా. నీకు ధర్మాలలోని ప్రత్యేకభేదాలను తెలుపుతాను. శ్రద్ధతో జాగరూకుడ వై వినుము.

విశేషం: ఇచట ధర్మవ్యాధుడు తననుగూర్చి తాను కొంత చెప్పుకొనవలసి వచ్చింది. అది ఆత్మస్తుతిగా భాసించటానికి కొంత సావకాశమున్నది. అందుచేత ధర్మవ్యాధుడు సంకోచించి, - 'ఇంత' చెప్పవలసె అని క్షమాపణ చెప్పుకొన్నాడు. ఇచట 'ఇంత' అను సార్థకప్రయోగంలోని స్వారస్యం గమనించ తగింది.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు ధర్మవిశేషంబు లెఱిఁగించుట (సం. 3-198-19)

క. తనకులధర్మము విడువక ।
మనుట పరమధర్మ మండ్రు మాన్యులు;
చిత్తం బునఁ గృప గలుగుట ముఖ్యపుఁ । బని;
సైరణ వలయు నఖిలభావములందున్. **35**

ప్రతిపదార్థం: మాన్యులు= గొప్పవారు; తనకులధర్మము= తనకులానికి చెందిన ధర్మం; విడువక= వదలక; మనుట= జీవించటం; పరమ, ధర్మము+అండ్రు= గొప్ప దైన ధర్మం అని అంటారు; చిత్తంబునన్= మనస్సులో; కృప= దయ; కలుగుట= ఉండటం; ముఖ్యము+పని= ప్రధాన మైన సంగతి; అఖిల, భావములందున్= అన్ని అభిప్రాయాల లోను; సైరణ= ఓర్పు; వలయున్= ఉండాలి.

తాత్పర్యం: పెద్దలు చెప్పే గొప్పమాట ఏమంటే - తన కులానికి చెందిన ధర్మాన్ని విడువకుండా ఆచరించటం మంచిది. అసలు మనస్సులో దయ అనేభావం ఉండాలి. దయాగుణమే అన్నిటికంటె గొప్పది. ఈ ప్రపంచంలో విభిన్నభావాలు ఎన్నో ఉండవచ్చును. తన అభిప్రాయమే మంచిది. ఇతరుల భావాలు చెడ్డవి అనే భావం మంచిది కాదు. అన్నిభావాలయెడ సహనం ఉండాలి.

విశేషం: ఈ పద్యంలో రెండు గొప్ప గుణాలు (i) దయ (ii) సహనం శీలానికి గీటురాళ్లుగా పేర్కొనబడినవి. తాను బ్రాహ్మణుడు కావచ్చును.

అహింసావ్రతాన్ని తాను పాటిస్తున్నట్లు తలపోయవచ్చును. కాని, మాంసవిక్రయం అధర్మమనే శీఘ్రనిర్ణయానికి పాల్పడరాదు. భిన్నభావాలయెడ సైరణ లేకపోతే ధర్మసూక్ష్మాన్ని ఎఱుగరాదుగదా!- 'సైరణ వలయు నఖిలభావములందున్' అనునది మహాభారతం అందించిన సందేశాలలో మేల్తరంగా ఎన్నదగింది.

ఆ. విడువవలయు విషయవిషమవాంఛల నెద ।
విడుపుఁబోలు గుణము వెదకి యెందుఁ
గానరైరి బుధులు గలదె పరిత్యాగ ।
శీలునకు నసాధ్యసిద్ధి యెందు. 36

ప్రతిపదార్థం: ఎదన్= హృదయంలో; విషయ, వాంఛలన్= శబ్దస్పర్శాదులకు సంబంధించిన వంకరటింకర కోరికలను; విడువవలయున్= వదలిపెట్టాలి; బుధులు= పెద్దలు; వెదకి= అన్వేషణంచేసి; విడుపున్+పోలు, గుణము= వదలిపెట్టుట (త్యాగం) అనే దానితో సమానమైన లక్షణాన్ని; ఎందున్= ఎచటను; కానరు+ఐరి= చూడలేక పోయారు; ఎందున్= ఎచట నైనను; పరిత్యాగశీలునకున్= వదలిపెట్టే స్వభావం కలవాడికి; అసాధ్యసిద్ధి= సాధించలేనట్టి ప్రయోజనం; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: ఇంద్రియసుఖాలపై గల కోరిక హృదయపూర్వకంగా వీడాలి. త్యాగంతో సరిసమానమైన లక్షణం ఎక్కడా కనపడదని అనుభవపూర్వకంగా అన్వేషించి పెద్దలు చెప్పిన తీర్పుమాట. - త్యాగంచేసే స్వభావం గలవాడికి ఎచటనైన అసాధ్యమైన దెక్కడైనా ఉన్నదా?

విశేషం: ప్రాచీనభారతీయసంస్కృతి - 'త్యాగము'ను వేనోళ్ల ప్రస్తుతించింది. సిద్ధార్థుడు బుద్ధుడైనది-రాముడు దేవుడైనది భారతభూమిలో త్యాగమాహాత్మ్యం వలననే. 'న కర్మణా న ప్రజయా, న ధనేన త్యాగే నై కే, అమృతత్వ మానశుః' - ఇది వేదవచనం.

సీ. సత్యహితాలాప చతురత యర్హంబు, ।
సంతత సుజన పూజనము వలయు,
విను కామసంరంభవిద్వేషములఁ జేసి ।
మతి గలంగినను ధర్మంబు దప్పఁ
ద్రొక్కక నడచు టత్యుత్తమసరణి; య ।
ప్రియములయందును బ్రియములందు
దైన్యహర్షంబులఁ దగులక యున్నట్టి ।
కల్యాణవర్తనకాంక్ష లెస్స;

తే. యెగ్గు సేసినవారికి హితము సేఁత ।
యార్యజనములు గీర్తింతు; రన్యదోష
కారి దనపాపమునఁ దాన కాలిపోవు; ।
వేఱ వానికిఁ గీడు గావింప నేల? 37

ప్రతిపదార్థం: సత్య, హిత+ఆలాప, చతురత= నిజాన్ని వచించటం, మేలు కలిగించే దానిని పలకటంలో నేర్పు; అర్హంబు= తగినట్టిది; సంతత, సుజన, పూజనము= ఎల్లప్పుడు మంచివారలను ఆరాధించటం; వలయున్= చేయతగినది; విను= వినుము; కామ, సంరంభ, విద్వేషములన్+చేసి= కోరికల త్రొక్కిసలాటచేత ఏర్పడే పగబూనుటల వలన; మతి+కలంగినను= బుద్ధి చెడిపోయినను; ధర్మంబు+ తప్పన్+త్రొక్కక= ధర్మమార్గాన్ని విడి పోవకుండగ; నడచుట= ప్రవర్తించటం; అతి+ ఉత్తమ+ సరణి= మిక్కిలి మంచిదైన పద్ధతి; అప్రియముల+అందును= తనకు ఇష్టం కాని సంగతు లలోనూ; ప్రియములందున్= ఇష్టా లైన సంగతులలోనూ; దైన్య, హర్షంబులన్= క్రుంగిపోవటంలో గాని, ఉబ్బిపోవటంలోగాని; తగులక= చిక్కుకొనక; ఉన్నట్టి= ఉండునట్టి; కల్యాణ, వర్తన, కాంక్ష= మేలినడవడి పెంపొందించుకొనే కోరిక; లెస్స= మేలు; ఎగ్గుచేసినవారికిన్= అపకారం

చేసిన వారికి; హితము+చేఁత= మేలుచేయటం; ఆర్యజనములు= పూజించ దగినవారు; కీర్తింతురు= పొగడుతారు; అన్య, దోషకారి= ఇతరులకు చెడు చేసేవాడు; తనపాపమునన్= తాను చేసిన దోషం (పాపం) వలన; తాను+అ= తానే; కాలిపోవున్= మండిపోతాడు; వేఱు+అ= భిన్నంగా, (అనగా అంత కంటె అదనంగా); వానికిన్= (అట్టి పాపికి); కీడు= హాని; కావింపన్+ఏల= ఎందుకు చేయాలి? (అనగా చేయ నవసరం లేదు).

తాత్పర్యం: ఎల్లప్పుడూ మంచివారిని పూజించాలి. సావధానంగా ఆలకించుము: ఒక్కొక్కవేళ కోరికలు సందడి కలిగించినప్పటికిని ధర్మమార్గాన్ని తప్పకుండగా తన నడవడి తీర్చి దిద్దుకొనాలి. ఇది మిక్కిలి మంచి పద్ధతి. తనకు శుభం కలిగినా, అశుభం ప్రాప్తించినా పొంగిపోరాదు. క్రుంగిపోకూడదు. అపకారం చేసినవారికి సయితం ఉపకారం చేయటమే ఆర్యులు పొగడే పద్ధతి. అపకారం చేసిన పాపాత్ముడు తనపాపంచేత తానే కాలిపోతాడు కదా! ఇక అట్టి పాపాత్ముడికి వేరే హాని చేయటం అనవసరం.

క. ధార్మికులు సలుపు నుత్తమ ।
కర్మముఁ జెడనాడు నాస్తికజనము; విను! మా
దుర్మతుల తెఱఁగు గైకొని ।
ధర్మమునెడఁ బ్రీతి వదలఁ దగదు బుధునకున్. 38

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; నాస్తికజనము= వేదప్రామాణ్యాన్ని అంగీకరించక దేవుడు లేడు అని వాదించే వారలకూటమి; ధార్మికులు= ధర్మాత్ములు; చలుపు= చేసే; ఉత్తమ, కర్మమున్= మంచిపనిని; చెడనాడున్= తెగడుతుంది; ఆ, దుర్మతుల తెఱఁగు= ఆ చెడ్డబుద్ధి కలవారల పద్ధతిని; కైకొని= అంగీకరించి, స్వీకరించి; బుధునకున్= మంచివాడికి; ధర్మము+ ఎడన్= ధర్మంపట్ల; ప్రీతి= అభిమానం; వదలన్+తగదు= వీడటం మంచిది కాదు.

తాత్పర్యం: వేదప్రామాణ్యాన్ని అంగీకరించక దేవుడు లేడు అని వాదించేవారు, ధర్మాత్ములు చేసే మంచిపనులను నిందిస్తారు. అట్టి దురాత్ముల పద్ధతిని అంగీకరించి, బుధుడు ధర్మంపట్ల అభిమానాన్ని వీడకూడదు.

విశేషం: నాస్తికుడు - అనేమాటకు లేదు అని ఎంచేవాడు అని అర్థం. వేదములందు, భగవంతుడియందు, పరలోకములందు నమ్మకం లేనివాడు అనే అర్థంలో నాస్తికశబ్దం బహుళంగా ప్రయోగించబడింది.

క. మది మఱపునఁ బాపము దన ।
కొదవుటయును బిదప వగచి యొక సగమును నే
నిది సేయ నింక ననియెడు ।
మదిఁ బెఱసగమును నరుండు మలుఁగు నఘంబున్. 39

ప్రతిపదార్థం: మది, మఱపునన్= మనస్సు ఏమరుపాటులో ఉన్నపుడు (అనాలోచితంగా); పాపము= దురితం; తనకున్+ ఒదవుటయును= తనకు సంప్రాప్తంకావటమున్నూ; పిదపన్= పిమ్మట; వగచి= దుఃఖించి; ఒక, సగమును= ఒక సగభాగాన్ని; ఏన్+ఇది+చేయన్+ఇంకన్= నేను ఇట్టిపనిని ఇక మీద చేయను; అనియెడు, మదిన్= అని తలపోసే మనస్సువలన; పెఱ, సగమును= ఇంకొక సగభాగాన్ని; అఘంబున్= పాపమును; నరుండు= మనుజుడు; మలుఁగున్= తొలగించుకొంటాడు.

తాత్పర్యం: ఆలోచించకుండ తనకు పాపం సంప్రాప్తమయినపుడు తాను చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెందితే చేసిన పాపంలో సగభాగాన్నీ, ఇక అట్టి పాపాన్ని తాను చేయనని అనుకొనటంవలన మిగిలిన సగభాగం పాపాన్నీ నరుడు తొలగించుకొనవచ్చును.

తే. పాపముల కెల్ల నెక్కుడు పాతకములు ।
సువ్వె క్రోధలోభంబులు సువ్రతాత్మ!
వాని రెంటి జయించినవాఁడు గాని ।
యెందుఁ బరమధార్మికుఁ డని యెన్నఁబడఁడు. 40

ప్రతిపదార్థం: సువ్రత+ఆత్మ!= మంచిదీక్ష కల ఆత్మను కలవాడా! (ఓకౌశిక మహర్షీ); పాపములకున్+ఎల్లన్+ఎక్కుడు, పాతకములు= దురితాలలో అన్నిటికంటె అధికమైన దురితాలు; క్రోధ, లోభంబులు+చువ్వె= కోపం; పిసినితనం కదా; వాని రెంటిన్= ఆ రెంటిని (అనగా కోపలోభాలను); జయించిన వాఁడు, కాని= నిగ్రహించిన మనుజుడు గాని; ఎందున్= ఎచటనైనను; పరమ, ధార్మికుఁడు+అని= గొప్ప ధర్మాత్ముడు అని; ఎన్నన్+పడఁడు= ఎంచబడడు.

తాత్పర్యం: ఓ మహర్షీ! అన్ని పాపాలలో మిక్కిలి చెడ్డవైన పాపాలు కోపం, లోభం. కోపలోభాలను జయించనివాడిని ధర్మాత్ములలో గొప్పవాడు అని ఎచటను ఎవరును ఎంచరు సుమా.

వ. శిష్టచరితంబులుగాని మార్గంబులుగొన్ని తృణసంవృతంబులైన కూపంబులుం బోలెఁగపట ధర్మ సంవృతంబులై యుండు; వాని దవ్వులన పరిత్యజించి శిష్టాచారంబుల నడపుట ధర్మలక్షణం' బనినం గౌశికుండు 'శిష్టాచారంబు లెయ్యవి? యెఱింగింపు' మనుటయు ధర్మవ్యాధుం డిట్లనియె. 41

ప్రతిపదార్థం: శిష్ట, చరితంబులు+కాని, మార్గంబులు= సజ్జనులచే ఆచరింపబడని పద్ధతులు కొన్ని; తృణ, సంవృతంబులు+ అయిన= గడ్డిచేత కప్పబడినవి అయిన; కూపంబులున్+పోలెన్= నూతులు వలెనే; కపట, ధర్మ, సంవృతంబులు+ఐ= తప్పుడుధర్మాలచేత కూడినవి అయి; ఉండున్= ఉంటాయి; వానిన్= వాటిని; దవ్వులన్+అ= దూరంనుండే; పరిత్యజించి= వదలిపెట్టి; శిష్ట+ఆచారంబులన్= సజ్జనుల సదాచారాలను; నడపుట= ఆచరించటం; ధర్మ, లక్షణంబు= ధర్మంయొక్క ప్రత్యేకస్వభావం; అనినన్= అని చెప్పగా; కౌశికుండు; శిష్ట+ఆచారంబులు= మంచివారి ప్రవర్తనలు (మంచి ప్రవర్తనలు); ఏ+అవి= ఎయ్యవి; ఎఱింగింపుము= తెలియజేయుము; అనుటయున్= అని చెప్పటమున్నూ; ధర్మవ్యాధుండు= ధర్మవ్యాధుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: సజ్జనులు పాటింపని కొన్ని మార్గాలు పైకి ధర్మాలుగా కన్పించవచ్చును. దట్టంగా మొలచిన గడ్డిచేత కప్పబడిన నూతులు పైకి నేలమాదిరిగానే గన్పించినా లోపల లోతైన గోతులుగానే ఉండి తెరువరులకు భ్రాంతి కల్పించవచ్చును. అందుచేత, దూరంనుండే కపటధర్మాలను పరిత్యజించాలి. శిష్టాచారాలను స్వీకరించి ఆచరించటం ధర్మలక్షణం' అని ధర్మవ్యాధుడు చెప్పగా విని, కౌశికుడు, 'మహాత్మా! శిష్టాచారాలు ఏవి?; తెలుపుము' అని ప్రార్థించాడు. అంతట, ధర్మవ్యాధుడు కౌశికుడికి ఇట్లా బదులు చెప్పాడు.

సీ. 'దానంబు, సత్యంబుఁ, దపము, యజ్ఞము, నార్జ ।
వముఁ, గామలోభాది వర్జనంబు
గురుజన శుశ్రూష, క్రోధ రాహిత్యంబు ।
దమము, సంతోష, మధ్యయన నిరతి,
దాంభికత్వము లేమి, దైన్యంబు వొరయమి ।
యనసూయ, యనహంక్రియాభియుక్తి,
దలఁపంగ నాద్యమై తనరు ధర్మమ యెప్డుఁ ।
గొనియాట, నాస్తికగోష్ఠిఁ జనమి,

తే. శీలసంరక్ష, తీర్థసంసేవ, శౌచ, ।
మఖిలభూతంబులందు దయార్ద్రుఁ డగుట,
మితహితోక్తులు, సంశ్రితమిత్త్రగుప్తి ।
యిన్నియును శిష్టచరితంబు లిద్ధచరిత! 42

ప్రతిపదార్థం: ఇద్ధచరిత!= వెలుగొందే గొప్ప ప్రవర్తన కలవాడా!; దానంబు= పరోపకారార్థం తన ధనాన్ని ఇతరులకు ఇవ్వటం; సత్యంబున్= నిజం

పలకటం; తపము= మనస్సును ఇంద్రియాలను నిగ్రహించటం; యజ్ఞమున్= క్రతువులను నిర్వహించటం; ఆర్జవమున్= ఋజుత్వం - పరులను మోసపుచ్చని నడవడిక; కామ, లోభ+ఆది, వర్జనంబు= కోరికలను, దురాశలను మున్నగు వాటిని వీడటం; గురు, జన, శుశ్రూష= గురువులకు సేవ చేయుటం; క్రోధ, రాహిత్యంబు= కోపం లేకపోవటం; దమము= బహిరింద్రియ నిగ్రహం; సంతోషము= తృప్తితో కూడిన ఆనందం; అధ్యయన నిరతి= వేదాలను చదవటంలోని దీక్ష; దాంభికత్వము లేమి= పటాటోపం లేకపోవటం; దైన్యంబు+ పొరయమి= హీనతను పొందకుండటం; అనసూయ= అసూయ లేకపోవటం; అనహంక్రియా+అభియుక్తి= అహంకారంతో కూడి ఉండక పోవటం; తలఁపంగన్= యోచించగా; ఆద్యము+ఐ= మొట్టమొదటిదై; తనరు= ఒప్పునట్టి; ధర్మము+అ= ధర్మమే; ఎప్డున్= ఎల్లప్పుడును; కొనియాట= ఆదరించటం; నాస్తిక, గోష్ఠిన్‌చనమి= నాస్తికుల కూటమిలోకి వెళ్ళకుండటం; శీల, సంరక్ష= ప్రవర్తనను కాపాడుకొనటం; తీర్థ, సంసేవ= పుణ్యక్షేత్రాలను సేవించటం; శౌచము= పరిశుభ్రత పాటించటం; అఖిల, భూతములందున్= అన్ని జీవరాసులలో; దయా+ ఆర్ద్రుఁడు+అగుట= దయచేత తడిసిన చిత్తంకలవాడు కావటం; మిత, హిత+ఉక్తులు= తక్కువగా మాట్లాడటం, శ్రేయస్కర మైన పలుకులు పలకటం; సంశ్రిత, మిత్ర, గుప్తి= ఆశ్రయించిన స్నేహితులను కాపాడటం; ఇన్నియును= ఇన్ని లక్షణాలు అన్నియును కలిసి; శిష్ట చరితంబులు= మంచివారి ప్రవర్తనలు.

తాత్పర్యం: మహానుభావా! ఎన్నియో గొప్పగుణాలు కలిసినగాని శిష్టాచారం సిద్ధించదు. శిష్టాచారాన్ని వింగడిస్తే ఈ క్రింది గుణాలను ఎన్నవచ్చును. ఉపకారార్థం తన ద్రవ్యాన్ని ఇవ్వటం, ఎల్లప్పుడును నిజమే మాట్లాడటం; ఇంద్రియాలను మనస్సును నిగ్రహించటం, క్రతువులను నిర్వహించి విశ్వశ్రేయం ఒనగూర్చటం, ఇతరులను మోసగించ నట్టి నిర్మల శీలం అలవరచుకొనటం, కామం కోపం మున్నగు గుణాలను అనగా కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను ఉజ్జగించటం, తల్లి తండ్రి విద్యాదానం

చేసిన ఉపాధ్యాయుడు మున్నగు వారిని సదా మన్నించటం, కోపం లేని శాంతస్వభావాన్ని ఆర్జించటం, ఇంద్రియనిగ్రహం దీక్షతో సాధించటం, ఎల్లప్పుడు సంతోషంతో సంతృప్తితో ఉండటం, వేదాధ్యయన తత్పరత్వం, పటాటోపం ప్రదర్శించక సదా వినయం గలిగి ఉండటం, ఎన్నడును నీచత్వానికి దిగజారి పోవకుండటం, నాస్తికుల కూటమిలో చేరకుండటం, శీలాన్ని కాపాడుకొనటం, తీర్థయాత్రలు చేయటం, అఖిల భూతాలపట్ల దయకలిగిన ఎడద గలిగిఉండటం, మితభాషణం చేయటం, హితభాషణం చేయటం, ఆశ్రయించిన స్నేహితులను కాపాడటం.

విశేషం: ఈ పద్యంలో ఇంచుమించుగా సనాతన భారతీయ సంస్కృతి అంతయు వివరించబడి ఉన్నది. దానం అనగా త్యాగంతో కూడిన ఈవి. దశదానాలు కలవు. షోడశ దానాలు ఉన్నవి. ఇచట సందర్భాన్ని బట్టి త్యాగపూరితమై పరోపకారార్థం ఇచ్చే ద్రవ్యం అనే అర్థమే చెప్పుకోవాలి. (చతురుపాయాలలో దానం ఉన్నది కాని అది ఇచట వర్తించదు.) యజ్ఞం అనగా పూజ, యజ్ఞయాగాలు బహుళాలు. పంచమహాయజ్ఞాలు పేర్కొన దగినవి. 1. బ్రహ్మయజ్ఞం, 2. దేవయజ్ఞం, 3. పితృయజ్ఞం, 4. భూతయజ్ఞం, 5. మనుష్యయజ్ఞం. (ధర్మవ్యాధుడు చేసిన మాతాపితృ శుశ్రూష యజ్ఞంగానే పేర్కొనదగింది.)

క. విను శిష్టచరిత గైకొని ।
యనసూయత నడవ నడవ నంతఃకరణం
బునఁ బొదలు నట్టి సమ్మద ।
మనఘా! దుర్లభము సూవె యన్యపథములన్. 43

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓపుణ్యాత్ముఁడా!; విను= ఆలకింపుము; శిష్టచరిత= మంచి ప్రవర్తన; కైకొని= అవలంబించి= అనసూయతన్, నడవన్ నడవన్= అసూయ లేని ప్రవర్తన తీర్చిదిద్దుకొనగా;

అంతఃకరణంబునన్= లోపలి మనస్సులో; పొదలునట్టి= ఏర్పడే; సమ్మదము= సంతోషం; అన్యపథములన్= ఇతర మార్గాలలో; దుర్లభము+చూవె= లభించటం మిక్కిలి కష్టం సుమా.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓ కౌశికమునీ! ఆలకింపుము. సత్ప్రవర్తనతోకూడి, అసూయను విడనాడి ప్రవర్తిస్తే లభించే సంతోషం ఇతర మార్గాలను అనుసరిస్తే అంత సులభంగా దొరకదు సుమా.

విశేషం: 'వ్యాధగీత' అని ప్రసిద్ధి నార్జించిన ధర్మవ్యాధోపాఖ్యానం అందించే సందేశం సుస్పష్టం. కర్మయోగం వ్యాధగీతకు అంతరాత్మ. ఇందు ముఖ్యపాత్రలుగా ఎన్నదగిన పతివ్రత కర్మయోగిని. అట్లే ధర్మవ్యాధుడును కర్మయోగియే. భర్తృశుశ్రూషచేత ఇల్లాలు తరించింది. మాతాపితృసేవచేత, కులధర్మం మాంసవిక్రయంచేత వ్యాధుడు 'ధర్మ' వ్యాధుడయ్యాడు. అందుచేత 'శిష్టచరిత' వలన లభించే సమ్మదం ఇతర పథాలలో అంత సులువుగా దొరకదని ధర్మవ్యాధుడు చాటిచెప్పగలిగాడు. అయిన ఆ 'ఇతర పథములు' ఏవి? అవి భక్తి జ్ఞానాదులు. ధర్మవ్యాధుడు జ్ఞాని కాకపోలేదు. అయినను అతని నిష్ఠ, కర్మయోగంలోనే ఉంది. ఇచట ధర్మవ్యాధుడు కర్మయోగి తదుపరి జ్ఞానయోగి. తలిదండ్రుల సేవ ఉజ్జగించిన కౌశికుడు 'కేవల స్వాధ్యాయ నిరతుడు'. అందుచేత ధర్మవ్యాధుడు కౌశికుడితో, 'నీవు చేసిన యకార్యం బొక్కటి గలదు' - అది మాతాపితృ సేవ విడనాడటం అని నొక్కి వక్కాణించవలసి వచ్చింది.

వ. కావున శిష్టాచారనియతిం జేసి గురుశుశ్రూష సలిపి కృతాధ్యయనుండ వై పరమజ్ఞానపరిపక్వం బైన చిత్తంబుతోడం గామక్రోధ మహామకర సంకీర్ణయు విషయజలపరిపూర్ణయు నైన మోహజలధి నస్ఖలితధైర్యం బను తెప్పం జేసి యశ్రమంబున నిస్తరించి కృతార్థుండ వగు' మని మఱియు నిట్లనియె. 44

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; శిష్ట+ఆచార, నియతిన్+చేసి= మంచి నడవడికలోని దీక్షచేత; గురు, శుశ్రూష, సలిపి= గురువులైనవారలకు సేవ చేసి; కృత+ అధ్యయనుండవు+ఐ= వేదాలను చదివినవాడవై; పరమ, జ్ఞాన, పరిపక్వంబు+ఐన= గొప్పతెలివిడిచేత పండినది అయిన; చిత్తంబుతోడన్= మనస్సుతో; కామ, క్రోధ, మహా, మకర, సంకీర్ణయున్= కోరికలు కోపం అనే గొప్ప మొసళ్లతో నిండినదియున్నూ; విషయ జలపరిపూర్ణయును= ఇంద్రియార్థములనే నీళ్లతో నిండినదియున్నూ; ఐన= ఐనట్టి; మోహ, జలధిన్= భ్రాంతి అనెడి సముద్రాన్ని; ఆస్ఖలిత, ధైర్యంబు+అను= జారనట్టి గంభీరత అనెడి; తెప్పన్+చేసి= పడవచేత; అశ్రమంబునన్= సులువుగా; నిస్తరించి= దాటి; కృత+అర్థుండవు+అగుము= ధన్యుడవు కమ్ము; అని= అని చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కాబట్టి నీవు శిష్టాచారంచొప్పున నీప్రవర్తన తీర్చిదిద్దుకొని, గురుజను లైనవారి పరిచర్య చేయునది. తదుపరి సంక్రమించే జ్ఞానంచేత పండిన మనస్సు కలవాడవై మోహసముద్రాన్ని దాటునది. ఆ మోహసముద్రం కామక్రోధా లనెడి మొసళ్లతో కూడి, ఇంద్రియార్థములనెడి నీటితో నిండిన గొప్పసముద్రం. ఆ సముద్రాన్ని దాటటానికి ధైర్యం అనెడి పడవ అవసరం. అప్పుడు నీవు ధన్యుడవు కాగలవు' అని చెప్పి, మఱియు ఇట్లు పలికాడు.

విశేషం: అలం: రూపకం. మోహజలధి అనుటకు మోహ మహానది అనే పాఠాంతరం ఉన్నది.

క. 'క్రమమున శిష్టాచార ।
క్రమ మెఱుఁగఁగ ధర్మమునకుఁ
గడు వాటం బై విమలం బగుఁ జిత్తము స ।
త్యమును నహింసయును దనకుఁ దావలములుగన్. 45

ప్రతిపదార్థం: చిత్తము= మనస్సు; క్రమమునన్= వరుసగా; శిష్ట+ఆచార, క్రమము= మంచి నడవడిక విధానం; ఎఱుఁగఁగన్= తెలియుగా;

ధర్మమునకున్; కడున్= మిక్కిలి; వాటంబు+ఐ= అనువు అయినదై; సత్యమును= నిజాన్ని; అహింసయును= ఏ(ప్రాణికి పీడచేయక పోవుటయున్నూ; తనకున్= తనకు; తావలములుగన్= ఉనికిపట్టులుగా; విమలంబు+అగున్= నిర్మలం కాగలదు.

తాత్పర్యం: మంచి నడవడికయొక్క వరుస తెలిసినప్పుడు ఆచరించినప్పుడు, ధర్మానికి మిక్కిలి అనువైనదై, అహింస సత్యం తనకు ఉనికిపట్టులు కాగా, మనస్సు స్వచ్ఛత సంపాదించుకొంటుంది. అనగా - చిత్తం నిర్మల మై ధర్మానికి నెలవు కావటానికి కావలసిన అంశం అహింసతో సత్యంతో జతగూడిన శిష్టాచారం.

ఆ. విను మహింస ధర్మవితతి కెల్లను మేటి; ।
యదియు సత్యయుక్త మైన వెలయు
ననఘ! శిష్టచరితలందు సత్యమ కడు ।
నధిక మనిరి శ్రుతుల నరసి బుధులు. 46

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేనివాడా! ఓపుణ్యాత్ముడా!; వినుము= ఆలకింపుము; ధర్మ, వితతికిన్+ఎల్లను= వివిధ ధర్మాలలోను; అహింస= ఏప్రాణికీ ఎట్టిపీడ కలిగించకుండటం; మేటి= గొప్పది; అదియున్= అదియే (ఆ అహింసయే); సత్యయుక్తము+ఐనన్= నిజంతో జతకూడిన యెడల; వెలయున్= వెలుగొందుతుంది; శిష్టచరితలందున్= మంచి ప్రవర్తనలందు; సత్యము+అ= నిజమే; బుధులు= పండితులు; శ్రుతులన్= వేదాలను; అరసి= చూచి; కడున్= మిక్కిలి; అధికము= గొప్పది; అనిరి= అన్నారు.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓకౌశికమునీ! ఆలకింపుము. అన్నిధర్మాలలోను అహింస గొప్పది. ఆ అహింస సత్యంతో కూడిన యెడల వెలుగొందుతుంది. శిష్టాచారంలో సత్యమే గొప్పదైనదని పెద్దల ప్రవచనం.

తే. వేద విహితంబులును శాస్త్రవిహితములును ।
శిష్టచరితంబులును ననఁ జెప్ప నొప్పి
ధర్మములు మూఁడువిధములఁ దనరుచుండుఁ ।
గడఁగి యిన్నియు సద్గతికారణములు. 47

ప్రతిపదార్థం: వేద, విహితంబులును= వేదాలచేత కూర్చబడినవిన్నీ; శాస్త్ర, విహితములును= శాస్త్రాలచేత కూర్చబడినవిన్నీ; శిష్ట, చరితంబులును= మంచి నడవడికలును; (మంచివారి ప్రవర్తనలును); అనన్+చెప్పన్+ఒప్పి= అని వర్ణించటానికి అనువై; ధర్మములు; మూడు, విధములన్= మూడురీతులుగా; తనరుచుండున్= ఒప్పుతూ ఉంటాయి. కడఁగి= పూని; ఇన్నియున్= ఇవి అన్నియును; సత్+గతి, కారణములు= ఉత్తమ మార్గానికి (మోక్షానికి) హేతువులు.

తాత్పర్యం: ధర్మాలు మూడు తెరగులు. ఒకటి వేదాలచేత విధించబడినట్టివి. రెండు-శాస్త్రాలచేత నిర్దేశించబడినట్టివి. మూడు-పెద్దల మంచినడవడికలు. పైమూడు పద్ధతులున్నూ సద్గతికి హేతువులే.

మ. అనయంబున్ శ్రుతవంతుఁడై వినుతశిష్టాచారమార్గంబులం
జను పుణ్యాత్ముఁడు దుర్గముల్ గడచి ప్రజ్ఞాహర్మ్యసంరూఢుఁడై
కనుచుండుం బటు మోహపంకజలమగ్నం బైన లోకంబు వీఁ
క నధోభాగమునందు డింది కడుదుఃఖం బొందఁగా నవ్వుచున్.' 48

ప్రతిపదార్థం: అనయంబున్= ఎల్లప్పుడును; శ్రుతవంతుఁడు+ఐ= వేదాలలో పరిపూర్ణమైన జ్ఞానం కలవాడై; వినుత, శిష్ట+ఆచార, మార్గంబులన్= పొగడబడిన మంచినడవడికల యొక్క తెరువులలో; చను= వెడలే; పుణ్య+ఆత్ముఁడు= సుకృతం చేసికొన్నవాడు, దుర్గముల్= దాటటానికి వీలులేని కోటలను; కడచి= అతిక్రమించి; ప్రజ్ఞా, హర్మ్య, సంరూఢుఁడు+ఐ= సామర్థ్యంతో కూడినబుద్ధి అనే మేడపై అధివసించెడివాడై; పటు, మోహ,

పంక, జల, మగ్నంబు+ఐన= మిక్కిలి భ్రాంతి అనెడి బురదనీటిలో మునిగి ఉండినట్టి; లోకంబు= లోకము; అధోభాగము+అందున్+ఉండి= క్రింది భాగంలో పడి; వీఁకన్= దైన్యంతో; కడు దుఃఖంబు= మిక్కిలి విచారము; ఒందఁగాన్= పొందగా; నవ్వుచున్= హసించుచు; కనుచున్+ఉండున్= చూస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఎల్లప్పుడును వేదాలలో పరిపూర్ణజ్ఞానం కలిగిన విద్వాంసుడు ప్రజ్ఞ అనెడి మేడను అధివసించి, క్రింద ఉన్న మోహమనే బురదనీటిలో కూరుకుపోయి దైన్యంతో మిక్కిలి దుఃఖించే లోకాన్ని చూచి నవ్వుకొంటాడు.

విశేషం: అలం: రూపకం.

ధర్మవ్యాధుఁడు కౌశికున కహింసాస్వరూపంబు సెప్పుట (సం. 3-199-1)

వ. అని పలికి ధర్మవ్యాధుండు మఱియు నిట్లనియె; 'నయ్యా! నీవు దొలుత నావర్తనంబు గనుంగొని యిది హింసా బహుళంబు గాదె? యని పలికితివి; దాని కేను దగు తెఱంగు సెప్పితి; నది య ట్లుండె; హింస యిట్టిది యహింస యిట్టి దని విభాగింప నెవ్వరికి నేర నగు? 49

ప్రతిపదార్థం: అని, పలికి= అని చెప్పి; ధర్మవ్యాధుండు= ధర్మవ్యాధుడు; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు; అయ్యా!= ఆర్యా!; నీవు; తొలుతన్= మొదట; నావర్తనంబు= నా నడవడికను; కనుంగొని= అరసి; ఇది= (ఈనాప్రవర్తన); హింసాబహుళంబు+కాదు+ఎ= ప్రాణులకు పీడ కలిగించే క్రియలతో కూడినట్టిది కాదా; అని, పలికితివి= అని అన్నావు; దానికిన్= (ఆ విమర్శకు); ఏను= నేను; తగుతెఱంగు+ చెప్పితిన్= సముచిత సమాధానం పలికితిని; అది+అట్లు+ఉండెన్= ఆ విమర్శ అట్లాగే ఉండుగాక; హింస= ప్రాణులను పీడించే క్రియ; ఇట్టిది= ఇటువంటిది; అహింస= ప్రాణులను పీడించనట్టి క్రియ; ఇట్టిది+అని= ఇటువంటిది, అని;

విభాగింపన్= వింగడించటం; ఏ+వారికిన్= ఏ మనుజులకు; నేరన్+అగు= వీలు అవుతుంది?

తాత్పర్యం: అని చెప్పి, ధర్మవ్యాధుఁడు ఇంకనూ ఇట్లా అన్నాడు: 'ఆర్యా, నీవు మొదట నాకొక ప్రశ్న వేశావు. నేను చేస్తున్న మాంసవిక్రయం హింసాయుతమైన కార్యం గదా? అని అప్పుడు అడిగావు. ఆ ప్రశ్నకు అప్పుడే నేను నాకు తోచిన ప్రత్యుత్తరం ఇచ్చాను. అది అప్పటికి సరిఅయిన సమాధానమే. ఇప్పుడు - ఆ విషయాన్నే సూక్ష్మంగా విమర్శించి చెప్పదలచాను. ఇది - 'హింస,' ఇది - 'అహింస' అని ఎవ్వరు సుస్పష్టంగా నిర్వచించగలరు? అట్టి నిర్వచనం సాధ్యం కాదని నా అభిప్రాయం.

క. మును తన చేసిన కర్మం ।
బునఁ జూవె నశించు భూతములు సంపెడు వాఁ
డు నిమిత్తమాత్ర మింతయె ।
యని చెప్పఁగ వినమె యంచితాచారులచేన్. 50

ప్రతిపదార్థం: మును= పూర్వకాలంలో (ఈజన్మంలో వెనుకటిజన్మంలో); తన చేసిన కర్మంబునన్= తాను ఒనరించిన కర్మవలన; చూవె= సుమ్ము; భూతములు= ప్రాణులు; నశించున్= నశిస్తాయి; చంపెడువాఁడు= సంహరించేవాడు; నిమిత్తమాత్రము= ఉపకరణం మాత్రమే; ఇంత+ఎ= ఇది ఇట్టిదే; అని చెప్పఁగన్= అని పలుకగా, అంచిత+ ఆచారులచేన్= ఒప్పారే పనులు చేసెడి పెద్దలవలన; వినము+ఎ= ఆలకింపమా?

తాత్పర్యం: పెద్దలు చెప్పెడిమాట, జనశ్రుతిలో తరచు వినబడుతున్నది, మనకు అందరికి తెలిసింది ఉన్నదికదా. ప్రాణులు క్షయం పొందటానికి మూలకారణం ఆ యాప్రాణులు చేసిఉన్న కర్మయే. చంపేవాడు కేవలం ఒక వ్యాజం మాత్రమే సుమా.

వ. అదియునుం గాక. **51**

తాత్పర్యం: అదీ కాకుండ.

క. ఫలమూలౌషధిశాకం ।
బులుఁ బశుమృగతతులు భక్ష్యములుగా భూతం
బుల కజుఁడు సేసె నని య ।
స్ఖలితంబుగ మ్రోయు శ్రుతులఁ గాదన వశమే! **52**

ప్రతిపదార్థం: ఫల, మూల, ఓషధి, శాకంబులున్= పండ్లున్నూ, వేళ్లున్నూ, సస్యములూ, కూరగాయాలూ; పశు, మృగతతులు= జంతువులు మున్నగునవి; భూతంబులకున్= ప్రాణులకు; భక్ష్యములుగాన్= ఆహారపదార్థాలుగా; అజుఁడు= బ్రహ్మదేవుడు; చేసెన్= ఏర్పరిచాడు; అని; అస్ఖలితంబుగన్= సుస్పష్టంగా (జారకుండా); మ్రోయు= నినదించు (గట్టిగా వక్కాణించు); శ్రుతులన్= వేదాలను; కాదు+అనన్, వశమే= కాదు అని తిరస్కరించటానికి వీలు ఉన్నదా?

తాత్పర్యం: మఱియును, పండ్లు, వేళ్లు, ధాన్యాలు, కూరలు వివిధ జంతు సంతతులు ప్రాణులకు ఆహారంగా బ్రహ్మదేవుడు ఏర్పరచినట్లు వేదాలు నొక్కివక్కాణిస్తున్నాయి కదా! ఇక అట్టి వేదప్రామాణ్యాన్ని ఎట్లా తిరస్కరించ గలం?

సీ. అనఘ! యౌశీనరుం డగు శిబి నిజగాత్ర ।
హింస నింద్రాగ్నుల కిడఁడె మాంస;
మతనికి లేదయ్యె నయ్య యుత్తమ గతి?
రంతిదేవుం డనురాజు తొల్లి
యనుదినంబును గోసహస్రద్వయంబుఁ దా ।
వధియింపఁడే వేయి వత్సరములు;

దురిత మమ్మహితాత్ముఁ దొడరెనే? వేదార్థ ।
నిరతులై యత్యంత నియతు లైన **53**

తే. ధారుణీసురముఖ్యు లధ్వరములందుఁ ।
బశువరింపరే పశువులఁ; బరమపుణ్య
గతులు గలుగవె వారికిఁ? గడఁగి యగ్ను ।
లధికమాంసార్థు లని శ్రుతులందు వినమె! **54**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ఔశీనరుండు+అగు, శిబి= ఉశీనరుని కుమారు డైన శిబి; నిజ, గాత్ర, హింసన్= తన దైన దేహాన్ని పీడించి; ఇంద్ర+అగ్నులకున్= ఇంద్రుడికీ, అగ్నికిన్నీ; మాంసము= మాంసము (తన దేహంనుండి కత్తితో కోసి తీసిన మాంసాన్ని); ఇడఁడే= ఇవ్వలేదా; ఉత్తమ, గతి= మంచి మార్గం (అనగా పుణ్యపదవి); అతనికిన్= (ఆ శిబికి); లేదు+అయ్యెన్+అయ్య?= అయ్యా! కలుగక పోయిందా?; తొల్లి= పూర్వకాలంలో; రంతిదేవుండు+అను, రాజు= రంతిదేవుడు అనేపేరు గల ప్రభువు; అనుదినంబును= ప్రతిరోజు; గో, సహస్ర, ద్వయంబున్= రెండువేల ఆవులను; తాన్= తాను; వేయి, వత్సరములు= వేయిఏండ్లు; వధియింపఁడే= సంహరించలేదా; దురితము= పాపం; ఆ+మహిత+ఆత్మున్= ఆ గొప్ప ఆత్మకలవాడిని; తొడరెనే= పొందిందా?; వేద+అర్థ, నిరతులు+ఐ= వేదాలలోని భావాలను బాగా ఎరిగిన వారై; అతి+అంత, నియతులు+ఐన= మిక్కిలి గొప్ప దీక్షకలిగిన వారైన; ధారుణీ సుర ముఖ్యులు= బ్రాహ్మణులలో ఉత్తములు; అధ్వరములందున్= యజ్ఞాలలో; పశువులన్= జంతువులను; పశువరింపరే= బలిఇవ్వలేదా?; వారికిన్= (అట్టి బ్రాహ్మణోత్తములకు); పరమ, పుణ్య, గతులు+కలుగవు+ఎ= గొప్పవైన పుణ్యస్థానాలు లభించలేదా?; అగ్నులు= నిప్పులు; కడఁగి= పూని; అధిక, మాంస+అర్థులు+అని= మిక్కుటంగా మాంసాన్ని కోరుకొనేవి అని; శ్రుతులందున్= వేదాలలో; వినమె!= ఆలకించమా!

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓ కౌశికమునీ! ఉశీనరుడి పుత్రుడైన శిబిచక్రవర్తి తన శరీరంలోని మాంసాన్నే కోసి ఇంద్రుడికీ అగ్నిహోత్రుడికీ ఇవ్వలేదా? ఆ శిబిచక్రవర్తికి పుణ్యం లభించలేదా? రంతిదేవుడు అనే మహారాజు పూర్వకాలంలో వేయి సంవత్సరాలపాటు ప్రతిదినం రెండువేల ఆవులను వధించి సంతర్పణం చేయలేదా? ఆ మహానుభావుడికి పాపం చుట్టుకొన్నదా? వేదవేదాంగ పారంగతు లైన బ్రాహ్మణోత్తములు యజ్ఞయాగాదులలో పశువులను సంహరించలేదా? వారికి పుణ్యలోకాలు సమకూరలేదా? అగ్నులు మాంసాహారాన్ని మిక్కుటంగా కోరేవి అని వేదాలు ఘోషించటం లేదా? అందుచేత మాంసాహారం కేవలహింసగా పరిగణించటానికి వీలు లేదు.

క. **పిత్రుదైవత కార్యములం ।**
దతిభక్తిని మాంస మిడుట యర్హమనియుఁ ద
త్పితృదైవశేషములు స ।
మ్మతి భోజ్యము లనియు మునులమతములు గావే. 55

ప్రతిపదార్థం: పితృ, దైవత, కార్యములందున్= శ్రాద్ధక్రియలలోను, దేవతలకు బలినివేదన చేసే క్రియలలోనూ; అతిభక్తిని= మిక్కుటమైన పూజ్యభావంతో; మాంసము+ఇడుట= మాంసంపెట్టటం; అర్హము+అనియున్= సరైన పద్ధతే అనిన్నీ; తద్+పితృ, దైవశేషములు= ఆ విధంగా శ్రాద్ధాలలో పితరులకు నైవేద్యం చేయగా మిగిలినవి, దేవతలకు నైవేద్యం చేయగా మిగిలినవి (అయినమాంసాలు); సమ్మతిన్= మంచిబుద్ధితో; భోజ్యములు= భుజించదగినవి; అనియున్= అనిన్నీ; మునుల, మతములు+కావే= ఋషీశ్వరుల అభిప్రాయాలే కదా.

తాత్పర్యం: పితృదేవతలకు శ్రాద్ధక్రియలలో నైవేద్యంగా మాంసం సమర్పించటం సరైన పద్ధతి అనిన్నీ, ఆ శ్రాద్ధాలలో నివేదించబడిన పిమ్మట మిగిలిన మాంసం ఆహారంగా స్వీకరించదగింది అన్నీ పెద్దలైన ఋషుల అభిప్రాయమే కదా.

మ. **హలికుం డెంతయు నోజతో దునఁగ సీరాగ్రంబునం జోఁకి ప్రా**
ణు లనేకంబులు సచ్చు, హింస యది యౌనో కాదొ! వేయేల? మ
ర్త్యులు నేలం జరియించుచోఁ బదములం ద్రొక్కంబడుం బెక్కు జం
తులు హింసావిధి గాదనంగ వశమే దోషజ్ఞ! యూహింపుమా! 56

ప్రతిపదార్థం: దోషజ్ఞ!= ఓ పండితుడా!; హాలికుండు= వ్యవసాయదారుడు; ఎంతయున్= మిక్కుటమైన; ఓజతోన్= ఉత్సాహంతో; దునఁగన్= దున్నగా; సీర+అగ్రంబునన్+చోఁకి= నాగలికర్రు తాకి; ప్రాణులు+అనేకంబులు= పెక్కుజీవాలు; చచ్చున్= మరణిస్తాయి; అది= (ఆవిధంగా నాగలిక్రిందబడి జీవాలు చావటం); హింస= ప్రాణిపీడ; ఔనో, కాదొ= అవునా? కాదా? అనేది చర్చించవలసిన విషయమేకదా; వేయి+ఏల= వేయిమాటలు ఎందుకు పలుకవలె?; మర్త్యులు= మనుజులు; నేలన్+చరియించుచోన్= నేలమీద నడచేటప్పుడు; పెక్కు, జంతులు= అనేక జీవాలు; పదములన్= పాదాలతో త్రొక్కన్+పడున్= త్రొక్కివేయబడతాయి; హింసావిధి= ప్రాణిపీడనంజరిగే పద్ధతి; కాదు+అనంగన్, వశమే= (అది) కాదు అని చెప్పటానికి వీలు ఉన్నదా?; ఊహింపుమా= యోచన చేయుము.

తాత్పర్యం: ఓ పండితోత్తమా! నాగలితో రైతు భూమిని దున్నేటప్పుడు, ఆ నాగలికర్రును తాకి ఎన్ని జీవాలు చచ్చిపోవటం లేదు? అది హింస కాదని వాదించటానికి వీలున్నదా? తర్జన భర్జనలు అనవసరం. మనుజులు నేలపై నడచేటప్పుడు కూడ వేలకొలది ప్రాణులు చనిపోతున్నాయి. అది హింస కాదని వాదించటానికి వీలు లేదు కదా! ఈ విషయాన్ని దయచేసి నీవే ఆలోచించి తెల్సుకొనుము.

విశేషం: ఇచట ధర్మవ్యాధుడు కౌశికుడిని, 'దోషజ్ఞ' అని సంబోధించాడు. దోషజ్ఞ అనే శబ్దానికి 'పండితుడు' అని రూఢ్యర్థం. వాచ్యార్థం - దోషాలను ఎరిగినవాడు. ఈ ప్రకరణంలో దోషజ్ఞ శబ్ద ప్రయోగంలోని స్వారస్యం గమనించదగింది. కౌశికుడు ధర్మవ్యాధుడిని మాంసవిక్రయాన్ని దోషంగా ఎన్నిఉన్నాడు గదా!

చ. సలిలము లుర్వి యాకసము సర్వము జంతుమయంబు గావునం
గలుగు నవశ్యమున్ సకలకర్మములందును హింస, హింసకుం
దొలఁగిన దేహయాత్రయును దుర్ఘట మైనటు లుండు; నింతయుం
దలఁపరు హింస సేయ మని తారు తలంతురు గొంద ఱిమ్మహిన్. 57

ప్రతిపదార్థం: సలిలములు= నీళ్లు; ఉర్వి= భూమి; ఆకసము= ఆకాశం; సర్వము= అంతయున్నూ; జంతుమయంబు= ప్రాణులతో కూడిఉన్నట్టిది; కావునన్= కాబట్టి; సకల, కర్మములందును= అన్ని పనులలోను; హింస= ప్రాణిపీడనం; అవశ్యమున్+ కలుగున్= తప్పక ఏర్పడుతుంది; హింసకున్+తొలఁగినన్= ప్రాణిపీడనానికి దూరమైతే; దేహయాత్రయును= జీవితం నడపటం కూడ; దుర్ఘటము+ఐన+అటులు+ఉండున్= సాధ్యం కానట్లు తోస్తుంది; ఇమ్మహిన్= ఈ భూమిలో; కొందఱు= కొంతమంది మనుషులు; ఇంతయున్+తలఁపరు= దీనిని ఆలోచించరు; హింస+ చేయము+అని= ప్రాణిపీడన చేయము అని; తారు= తాము; తలంతురు= తలపోస్తారు.

తాత్పర్యం: జలాలు, భూమి, ఆకాశం, అన్నీ ప్రాణుల సమూహాలతో నిండిఉన్నవి. కాబట్టి, అన్ని పనులలోను ఏదో కొంత హింస జరుగక తప్పదు. హింస అసలే చేయకుండ మానవజీవితం సాగించటం సాధ్యం కాదు. కొందరు ఈ విషయాన్ని గుర్తించక తాము ఎప్పుడూ ఎట్టి హింస చేయమని అహింసావ్రతుల మని అనుకొని భ్రమిస్తుంటారు.

విశేషం: పాశ్చాత్యశాస్త్రజ్ఞులు ఇటీవలనే గాలిలో నీళ్లలో ఆకాశంలోను, వేలకువేలు సూక్ష్మజీవులు కలవని కనుగొన్నారు. ఈ విషయం నిష్కర్షగా నిర్వచించబడింది.

క. పనివడి యహింస వ్రతముగఁ ।
గొని వనమున నున్న మునులకుం దొడరదె హిం

సనము తరుమూల ఫలశా ।
కనిపీడన మదియు హింస గాదొకొ తలఁపన్. 58

ప్రతిపదార్థం: పని+పడి= పూని; అహింస= ప్రాణులకు ఎట్టి పీడను చేయక పోవటం; వ్రతముగన్+కొని= దీక్షగా పాటించటానికి పూనుకొని; వనమునన్+ఉన్న= అడవిలో నివసిస్తున్న; మునులకున్= ఋషులకు; హింసనము= ప్రాణులను హింసించటం; తొడరదె?= కలుగదా?; తలఁపన్= యోచనచేయగా; తరు, మూల, ఫల, శాక, నిపీడనము+అదియున్= చెట్లు, వేళ్లు, పండ్లు, ఆకుకూరలు గట్టిగా తరగటం కోయటం అనేవి కూడ; హింస+కాదొకొ?= ప్రాణులను హింసించటం కాదా?

తాత్పర్యం: తాము కేవలం అహింసావ్రతాన్నే పాటిస్తూ అరణ్యాలలో నివసిస్తున్నవారం అనుకొని కందమూల ఫలాలను ఆహారంగా స్వీకరించే మునులు కూడ నిజానికి అహింసావ్రతులు కాజాలరు. ఏలన, కందమూలఫలాలలో కూడ ప్రాణం ఉన్నది. అదికూడా జీవహింసయే అని యోచన చేస్తే తేటతెల్లం అవుతుంది.

తే. హింస సేయనివాఁడు లేఁ డిజ్జగమున ।
నొక్కఁడైనను, దమతమ, యోపినట్లు
హింసతెరువున కెడఁగల్గి యేఁగవలయు ।
నదియ చూవె యహింసనా నతిశయిల్లు. 59

ప్రతిపదార్థం: ఈ+జగమునన్= ఈలోకంలో; హింస+చేయనివాఁడు= ప్రాణిపీడ చేయనివాడు; ఒక్కఁడు+ఐనను= ఒకడు కూడ; లేఁడు= లేడు; తమతమ+ఓపినట్లు= తమకు తామకు వీలు అయినట్లుగా; హింస తెరువునకున్+ఎడన్+కల్గి= ప్రాణిపీడ చేసే మార్గానికి దూరంగా ఉండి; ఏఁగవలయున్= నడవాలి; అది+అ+చూవె= అట్టిదే సుమా; అహింస+నాన్= అహింస అనగా; అతిశయిల్లున్= శోభిల్లుతుంది.

తాత్పర్యం: ఈలోకంలో హింస చేయనివాడు ఒకడైనా ఉండడు. అయినప్పటికిని తమకు వీలైనంతమేరకు హింస చేయకయే జీవయాత్ర సాగించాలి. ఆవిధంగా యథాశక్తి ప్రాణిపీడన చేయకపోవటమే 'అహింస' అని చెప్పనొప్పును.

వ. ధర్మంబు బహుప్రకారం బై యుండుఁ; దదీయసూక్ష్మగతి దురవబోధంబు; గావున శ్రుతిప్రమాణంబువలనను వృద్ధాచారనిదర్శనంబులను నెఱింగి కొనునది. 60

ప్రతిపదార్థం: ధర్మంబు= ధర్మం (లోకమును మంచిస్థితిలో నిలబెట్టేది); బహు ప్రకారంబు+ఐ+ ఉండున్= ఎన్నో రీతులలో ఉంటుంది; తదీయ, సూక్ష్మ, గతి= ఆ (ధర్మంయొక్క) అగోచరమైనంత అల్పరూపత్వంయొక్క నడక; దురవబోధంబు= తెలియజాలనట్టిది; కావునన్= కాబట్టి; శ్రుతి, ప్రమాణంబువలనను= వేదాలయొక్క నిరూపణంమూలంగానూ; వృద్ధ+ ఆచార, నిదర్శనంబులనున్= పెద్దల నడవడికలవలన ఏర్పడిన ఉదాహరణల వలననూ; ఎఱింగి కొనునది= తెలియునది.

తాత్పర్యం: ధర్మాన్ని తెలియటం కష్టం. ధర్మం పెక్కురకాలుగా ప్రవర్తిల్లుతుంది. ధర్మసూక్ష్మత తెలియరానట్టిది. కాబట్టి ధర్మాన్ని తెలియటానికి వేదాల ప్రమాణం, పెద్దల నడవడిక, ఆధారాలుగా గ్రహించదగును.

విశేషం: ఇచట - 'వేదప్రమాణము' అనే ప్రయోగం మిక్కిలి అర్థవంతమైనది. చార్వాకులు మున్నగు నాస్తికులు హేతువాదులు ప్రత్యక్ష ప్రమాణాన్ని మాత్రమే అంగీకరిస్తారు. వేదప్రమాణాన్ని అంగీకరించరు. ప్రాచీనులు తార్కికులు సత్యనిరూపణానికి కొన్ని ప్రమాణాలను నిర్వచించారు. అందులో ముఖ్యమైనవి: 1. ప్రత్యక్షం, 2. అనుమానం, 3. ఉపమానం, 4. శబ్దం, 5. అర్థాపత్తి, 6. అనుపలబ్ధి, 7. సంభవం, 8. ఐతిహ్యం. ఇందు మొదటి

నాలుగింటిని తార్కికులు, ఆరింటిని వేదాంతులు, ఎనిమిదింటిని పౌరాణికులు అంగీకరిస్తారు. శబ్దప్రమాణం అనగా శ్రుతిప్రమాణం.

ఉ. భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చుఁ; ద
ద్భూతభయాస్పదం బగు ప్రభూతపుసత్యము బొంకు నట్ల; ప్రా
ణాతురుఁ డైనచోఁ, బరిణయంబునయందును బల్కు బొంకు స
త్యాతిశయంబ యండ్రు; మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్మముల్.'61

ప్రతిపదార్థం: మహిత+ఆత్మక!= గొప్పఆత్మకలవాడా!; భూత, హితంబుగాన్= జీవులకు మేలుకలిగించేటట్లుగా; పలుకు= మాట్లాడే; బొంకును= అసత్యం కూడ; సత్యఫలంబున్+ఇచ్చున్= నిజం పలికిన ఫలితాన్నే ఇస్తుంది; తద్+భూత, భయ+ ఆస్పదంబు+అగు= ఆ జీవులకు భీతికి నెలవైన; ప్రభూతము+సత్యము= ప్రభూతపు సత్యము= గొప్ప దైన నిజం; బొంకు+అట్లు+అ= అసత్యం వంటిదే; ప్రాణ+ఆతురుఁడు+ఐనచోన్= ప్రాణం పోవునేమో అనే భయం కలిగి నప్పుడు; పరిణయంబునఅందున్= పెండ్లిలోనూ; పల్కు= వచించే; బొంకు= అసత్యం; సత్య+అతిశయంబు+అ= సత్యంకంటె గొప్పదే; అండ్రు= అంటారు; ధర్మసూక్ష్మముల్= ధర్మాన్ని ప్రస్తరించేటప్పుడు ఏర్పడే అగోచరా లైన ముఖ్యమైన చిన్న అంశాలు; ఇట్టివి= ఇటువంటివి.

తాత్పర్యం: ఓ మహానుభావా! ధర్మాన్ని ప్రస్తరిస్తే అగోచరా లైనను ముఖ్యమైన చిన్న అంశాలుగా విడివడుతుంది. ప్రాణికోటికి మేలు జరగటానికై చెప్పబడిన అసత్యం సత్యం కంటె కూడ గొప్పది. ప్రాణికోటికి కీడు గలిగించే సత్యం అసత్యంతో సమానం. ప్రాణరక్షణకూ వివాహం జరిపించటానికీ ఆడిన అసత్యం సత్యం కంటె ఘనమైనది. ఇవి ధర్మ సూక్ష్మాలు సుమా!

విశేషం: భాగవతంలో శుక్రప్రోక్తమైన సుప్రసిద్ధపద్యం ఇప్పట్టున స్మరింపదగింది - "వారిజాక్షులందు వైవాహికములందు । ప్రాణవిత్తమాన భంగమందు చకిత

గోకులాగ్రజన్మరక్షణయందు । బొంకవచ్చు నఘము వొంద దధిప!''
భాగవతంలోని ఈ పద్యం వామన చరిత్రఘట్టంలోనిది. భారత పద్యంలో చెప్పబడిన తాత్పర్యంలో పరోపకారపారీణతతో కూడిన విశ్వశ్రేయం, స్వార్థరహితమైన త్యాగం జీవనాడి.

వ. అని తెలిపి మఱియు నతండు. 62

ప్రతిపదార్థం: అని తెలిపి= అని వివరించి చెప్పి; మఱియున్= వెండియును; అతండు= (ఆ ధర్మవ్యాధుడు).

తాత్పర్యం: అని తెలియజెప్పి ధర్మవ్యాధుడు ఇంకా (ఇట్లా అన్నాడు).

క. 'ఒప్పెడునది యైనను గడు ।
నొప్పనియది యైన నిజకులోచితపథముం
దప్పఁ దగదండ్రు ధార్మికు ।
లప్పని నిజభాగ్యవిహిత మని యుండఁదగున్. 63

ప్రతిపదార్థం: ధార్మికులు= ధర్మంతోకూడిన నడవడి కలవారు; ఒప్పెడున్+అది+ఐనను= సరిపడునట్టిది అయినను; కడున్= మిక్కిలి; ఒప్పని+అది+ఐనన్= సరిపడనట్టిదే అయినను; నిజ, కుల+ఉచిత, పథమున్= తనకులానికి తగినట్టి మార్గాన్ని; తప్పన్+తగదు+అండ్రు= తప్పరాదు అని చెప్తుతారు; ఆ+పని= ఆకార్యం (అనగా కులవృత్తి); నిజ, భాగ్య, విహితము= తనఅదృష్టం చేత ఏర్పడింది; అని= అని తలపోసి; ఉండన్+తగున్= ఉండదగును.

తాత్పర్యం: తన కులవృత్తి సరిపడేది కావచ్చును; సరిపడనిది కావచ్చును. ఎట్లయినా అట్టికులవృత్తిని వీడరా దని ధార్మికులు చెప్తుతారు. అట్టి కులవృత్తి తనకు దైవంచేత ఏర్పరచబడినట్లుగనే భావించుకొనాలి.

క. విను, పూర్వకర్మఫలములు ।
దనకు వశము గాక పొందుఁ దఱితో వానిం;
గనుఁగొననేరక మూఢుఁడు ।
దన కాపద యైనచోట దైవము దూఱున్. 64

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; పూర్వ, కర్మఫలములు= లోగడ చేసిన కర్మలవలన ఏర్పడిన ఫలాలు; తనకున్ వశము+కాక= తనకు శక్యం గాకుండగా; తఱితోన్= తగిన సమయంలో; పొందున్= అనుభవిస్తాడు; మూఢుఁడు= అవివేకి; వానిన్= అట్టివాటిని అనగా అట్టి పూర్వకర్మఫలాలను; కనుఁగొననేరక= అరయజాలక; తనకున్+ఆపద+ఐన, చోటన్= తనకు విపత్తు ఏర్పడిన చోట; దైవమున్= దేవుడిని; దూఱున్= నిందిస్తాడు.

తాత్పర్యం: ఎవడు చేసిన కర్మలఫలితం వాడు అనుభవించక తప్పదు. వాటిని ఆపటానికి ఎవరికీ శక్యం కాదు. ఆయా వేళల అవి సంప్రాప్తిస్తాయి. ఆ సంగతి తెలియని మూఢుడు తనకు ఆపదవచ్చినప్పుడు దేవుడిని దూషిస్తాడు.

విశేషం: కర్మ సిద్ధాంతంలో భగవంతుడు కేవలం సాక్షిమాత్రుడే. ప్రతిజీవి తాను చేసిన కర్మలనుబట్టి ఫలితాలను అనుభవించక తప్పదు.

తే. కార్యఫలములయెడఁ దాన కర్త ననుట ।
కడు నెఱుంగమిఁ జువ్వె! తాఁ గర్తయేని
తగిలి తనదైన కార్యజాతంబు నెల్లఁ ।
జెడక ఫలియించునట్లుగాఁ జేయరాదె! 65

ప్రతిపదార్థం: కార్యఫలముల+ఎడన్= చేసిన పనులయొక్క ఫలితాలను పొందటంలో; తాను+అ= తానే; కర్తన్+అనుట= చేసే సామర్థ్యం కలవాడను; అనుట= అని భావించటం; కడున్= మిక్కిలి; ఎఱుఁగమిన్+చువ్వె= అజ్ఞానంచేత సుమా!; తాన్= తాను; కర్త+ఏని= తానే పనులను నిర్వహించే సమర్థుడు అయితే; తగిలి= పూని; తనదు+ఐన= తాను చేయునట్టివైన; కార్య, జాతంబున్+ఎల్లన్= అనేక రకాల పనులు అన్నియున్నూ; చెడక= వ్యర్థం కాకుండగా; ఫలియించున్+అట్లుగాన్+చేయన్‌రాదె= విజయం

పొందునట్లుగనే చూడరాదా?

తాత్పర్యం: తాను చేసే పనులు కొన్ని ఫలిస్తాయి; కొన్ని ఫలించవు; కాబట్టి తాను చేసే పనులయొక్క జయాపజయాలు తన సామర్థ్యంమీదనే ఆధారపడి ఉంటాయి అని భావించటం అజ్ఞానం కదా! అట్లుగాక, తాను చేసేపనులకు తానే సర్వసమర్థుడైన యెడల, అన్ని పనులలో విజయాన్నే సాధించవచ్చును కదా!

వ. అది యెట్లంటేని. 66

తాత్పర్యం: అది ఏవిధంగా జరుగుతుంది అని నీ వడిగితివా (సమాధానం ఇదిగో).

సీ. నీతిమంతులు ధర్మనిరతులు దక్షులు ।
నగువారు సేయు కార్యములు గొన్ని
సిద్ధిఁ బొందవు, దుష్టచిత్తులు క్రూరు లై ।
చేయఁ గొన్ని విశేషసిద్ధిఁ బొందు;
నూరక యుండంగ నొందుఁ గొందఱ విపు ।
లార్థముల్; గొంద ఱాయాస పడియు
నిష్ఫలారంభు లై నిలుతురు; గొందఱు ।
పేదవారికిఁ బ్రజ పెల్లు వొడము

తే. నర్థవంతులు గొందఱ కర్థి నధిక ।
దానములు ధర్మములు సువ్రతములుఁ జేయఁ
బ్రజలు వుట్టరు; విను మిట్టిభంగి సుమ్ము ।
కర్మఫల మాత్మతంత్రంబు గాక యుండు. 67

ప్రతిపదార్థం: నీతిమంతులు= న్యాయమైన నడవడిక కలవారు (యథోచిత మైన తత్త్వాన్ని ఎఱిగి పాటించేవారు); ధర్మనిరతులు= ధర్మంలో దీక్ష కలవారు; దక్షులున్+అగువారు= సామర్థ్యం కలవారు; చేయు, కార్యములు= చేసే

పనులు; కొన్ని= కొన్ని(పనులు); సిద్ధిన్+పొందవు= జయప్రదాలు కావు; దుష్ట చిత్తులు= చెడ్డ మనస్సుకలవారు; క్రూరులు+ఐ= హింసతో కూడినట్టి భయంకర మైన కృత్యాలు చేసేవారును ఐ; చేయన్= ఆచరించగా; కొన్ని= కొన్ని(పనులు); విశేషసిద్ధిన్+పొందున్= గొప్ప విజయం పొందుతాయి; ఊరక+ఉండంగన్= ఏపని చేయకుండ ఉన్నా; కొందఱున్= కొంతమందిని; విపుల+అర్థముల్= గొప్ప ధనాలు (విజయాలు); ఒందున్= పొందు తాయి; కొందఱు= కొంతమంది; ఆయాసపడియున్= శ్రమ పడికూడా; నిష్ఫల+ఆరంభులు+ఐ= ఫలం శూన్యం అయిన ప్రయత్నాలు కలవారై; నిలుతురు= ఉంటారు; కొందఱు= కొంతమంది; పేదవారికిన్= దరిద్రులకు; ప్రజ= సంతానం; పెల్లు+పొడమున్= అధికంగా కలుగుతుంది; అర్థవంతులు కొందఱుకున్= ధనవంతు లైన కొంతమందికి; అర్థిన్= కోరికతో; అధిక, దానములు, ధర్మములు, సువ్రతములున్+ చేయన్= ఎక్కువగా తమ ద్రవ్యాలను ఇతరులకు ఉచితంగా పంచిపెట్టి పలువురకు ఉపయోగపడే మంచిపనులు; మంచినోములు చేసినను; ప్రజలు+పుట్టరు= సంతానం కలుగదు; వినుము; కర్మఫలము= లోగడ చేసిన కర్మలవలన ఏర్పడేఫలితం; ఇట్టిది+సుమ్ము= ఇటువంటిది సుమా; (కర్మఫలము) ఆత్మతంత్రంబు= తన ఇష్టానుసారంగా నడచేది; కాక+ఉండున్= కానట్టిది.

తాత్పర్యం: 'ఆ కర్మఫలకర్తృత్వం ఎటువంటిది?' అని నీవు అడిగితే నా సమాధానం వినుము. ఈ ప్రపంచంలో అన్నివిషయాలు ఏ యే రీతులలో జరుగుతాయో ఆ యా పద్ధతులను న్యాయాన్ని తెలిసి ప్రవర్తించేవారున్నూ, ధర్మాత్ములున్నూ, సామర్థ్యం కలవారున్నూ చేసే పనులు కొన్ని జయప్రదాలు కాకపోవచ్చును. దుర్మార్గులు, క్రూరులు, అవివేకులు అయిన వారు చేసే పనులు కొన్ని విజయవంతాలు కావచ్చును. కొందరు, ఏపనీ చేయక ఊరకే కూర్చొనిఉన్నప్పటికీ, వారికి ఐశ్వర్యవిజయాలు లభించవచ్చును. కొందరు ఎంతో కష్టించి, గొప్ప పరిశ్రమ చేసినా వారికి జయం లభించదు. నిరుపేదలకు మిక్కుటంగా సంతానం కలుగుతుది. ధనవంతులైన కొందరికి దానధర్మాలు

యజ్ఞయాగాలు ఎన్ని చేసినా, సంతానం కలుగదు. ఇది కర్మవిపరిపాకం. తన అభీష్టానుసారంగా కర్మఫలం లభించదు.

క. పురుషుఁడు కర్మాధీనత ।
నరుగక తనవశమ యనిన నాపదలు రుజల్
మరణంబును నివి యేమియుఁ ।
బొరయక యుండంగ బ్రదుకఁబోలదె చెపుమా! 68

ప్రతిపదార్థం: పురుషుఁడు= మనుజుడు; కర్మ+అధీనతన్= లోగడ చేసిన కర్మలవలన ఏర్పడే పరిపాకానికి లోబడి; అరుగక= ప్రవర్తింపక; తన, వశము+అ+అనినన్= అంతయు తన అధీనంలోనే ఉన్నది అనినట్లయితే; ఆపదలు= విపత్తులు; రుజల్= రోగాలు; మరణంబును= చావును; ఇవి= (పైన చెప్పబడినవి); ఏమియున్+ పొరయక+ ఉండంగన్= ఏవియు సంప్రాప్తించకుండగా, బ్రదుకన్+పోలదె= జీవించరాదా; చెపుమా= వచించవయ్యా.

తాత్పర్యం: మనుజుడు కర్మాధీనుడు కాకుండగా, తన ఇష్టప్రకారమే అంతా తీర్చిదిద్దుకోగలిగితే - తనకు ఇక్కట్టులు, రోగాలు, చావు మున్నగునవి ఏవీ సంప్రాప్తించ కుండానే జీవితాన్ని గడపవచ్చునుగదా? నీవే చెప్పుము.

ఆ. కర్మవశతఁ జూవె కలుగు దేహము; దేహ ।
వర్తనంబు కర్మవశతఁ బుట్టు;
దేహపాత మైన దేహస్థుఁ డగు జీవుఁ ।
డరుగుఁ గర్మవిహిత మైన యెడకు'. 69

ప్రతిపదార్థం: దేహము= శరీరం; కర్మవశతన్+చూవె= లోగడ చేసిన కర్మల వలన ఏర్పడే పరిపాకంచొప్పుననే; కలుగున్= ఏర్పడుతుంది; దేహవర్తనంబు= శరీరపు నడవడిక; కర్మవశతన్+ పుట్టున్= కర్మకు లోబడి ఏర్పడుతుంది; దేహపాతము+ఐనన్= దేహంపడిపోయినప్పుడు అనగా మరణించినప్పుడు;

దేహస్థుఁడు+అగు, జీవుఁడు= దేహంలో ఉన్న ఆత్మ; కర్మ, విహితము+ఐన+ ఎడకున్= కర్మంచేత ఏర్పడిన చోటుకు; అరుగున్= వెళ్ళుతాడు.

తాత్పర్యం: పూర్వం చేసిన కర్మవిపరిపాకంచేతనే మానవశరీరం ఏర్పడుతుంది. శరీర ప్రవర్తనకూడా కర్మపరిపాకాన్ని బట్టియే ఏర్పడుతుంది. మరణించిన పిదప జీవుడూ తన కర్మపరిపాకం నిర్దేశించిన చోటికే వెళ్ళుతాడు.

విశేషం: పూర్వజన్మలో చేసిన కర్మలను బట్టియే మనుజులకు మరుజన్మ కలుగుతుంది. ఆ జన్మలో మనుజుడి ప్రవర్తనకు పూర్వజన్మకర్మపరిపాకమే మూలం. 'బుద్ధిః కర్మానుసారిణీ!'

వ. అనినం గౌశికుండు 'జీవుం డెట్టివాఁ?' డని యడిగిన లుబ్ధకుం డి ట్లనియె. 70

ప్రతిపదార్థం: లుబ్ధకుండు= బోయవాడు;

తాత్పర్యం: అని ధర్మవ్యాధుడు చెప్పగా, కౌశికుడు 'జీవుడు ఎటువంటివాడు?' అని ప్రశ్నించాడు. తిరిగి ధర్మవ్యాధుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు జీవలక్షణంబులు సెప్పుట (సం. 3-200-26)

క. 'విను జీవుండు సనాతనుఁ ।
డనఘుఁడు నిజకర్మవశత నధ్రువదేహం
బునఁ బొందు దేహపాతం ।
బున నెప్పుడుఁ జెడఁ డతండు భూసురవర్యా! 71

ప్రతిపదార్థం: భూసురవర్యా!= ఓ బ్రాహ్మణోత్తమా!; విను; జీవుండు= జీవుడు; సనాతనుఁడు= శాశ్వతంగా ఉండేవాడు; అనఘుఁడు= పాపంలేనివాడు; నిజ, కర్మ, వశతన్= తనకర్మకు లోబడి; అధ్రువ, దేహంబునన్+పొందున్= శాశ్వతంగాని అనగా నశించే శరీరాన్ని పొందుతాడు; దేహ, పాతంబునన్= మరణించినప్పుడు; ఎప్పుడున్= ఎప్పుడున్నూ; అతండు= (ఆ జీవుడు) చెడఁ డు= నశించడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణులలో ఉత్తముడవైన ఓ కౌశికమహర్షీ! వినుము. జీవుడు శాశ్వతంగా ఉండేవాడు. పాపరహితుడు. అతడు తన కర్మవశాన అశాశ్వతమై నశించే శరీరాన్ని తాలుస్తాడు. దేహం మరణసమయాన నశిస్తుంది కాని శాశ్వతు డైన ఆ జీవుడు నశించడు సుమా!

క. ఈ యొడలు విడిచి వేఱొక ।
కాయముఁ గైకొని శరీరి కర్మవశగతిం
బోయి సుఖదుఃఖములు గనుఁ; ।
బాయక వెండియును దేహబంధముఁ బొందున్.' 72

ప్రతిపదార్థం: ఈ+ఒడలు= ఈ దేహం; విడిచి= వదలిపెట్టి; వేఱు+ఒక, కాయమున్= ఇంకొక శరీరాన్ని; కైకొని= స్వీకరించి; శరీరి= శరీరం ధరించిన జీవుడు; కర్మ, వశ, గతిన్= కర్మకు లోబడిన తెరువున; పోయి= వెడలి; సుఖ, దుఃఖములు+కనున్= సౌఖ్యాన్నీ, శోకాన్నీ పొందుతాడు; పాయక= విడువక; వెండియును= మరల మరల; దేహ బంధమున్= పునర్జన్మను; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ శరీరాన్ని విడిచి, జీవుడు తాను చేసిన కర్మకు అనురూప మైన ఇంకొక జన్మలో సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. అట్లే అతడు ఎన్నో జన్మలు పొందుతాడు.'

వ. అనిన విని బ్రాహ్మణుండు లుబ్ధకునితోడం 'బుణ్యపాపానురూపంబు లయిన దేహబంధంబు లెట్టి?' వనిన వాఁ డి ట్లనియె. 73

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; బ్రాహ్మణుండు= (కౌశికుడు); విని; లుబ్ధకుని తోడన్= వ్యాధుడితో; పుణ్య, పాప+అనురూపంబులు+అయిన= పుణ్యానికీ, పాపానికీ తగినవి అయిన, దేహబంధంబులు= జన్మలు; ఎట్టివి?= ఏవిధాలైనవి?; అనినన్= అని అడుగగా; వాఁడు= (ధర్మవ్యాధుడు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని ధర్మవ్యాధుడు చెప్పాడు. ఆ మాటలు విని, కౌశికుడు ధర్మవ్యాధుడిని మరల ఈ విధంగా ప్రశ్నించాడు. 'పుణ్యకర్మలవలన ఎట్టి పునర్జన్మ ఏర్పడుతుంది? పాపకర్మలవలన ఏర్పడే మరు జన్మ ఎటువంటిది?' అని. ధర్మవ్యాధుడు ఆ ప్రశ్నకు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

చ. 'స్థిరమగు పుణ్యకర్మమున దేవభవం బగుఁ, బుణ్యపాప సం
కరమున మానుషత్వ మగుఁ, గల్మషముల్ పశుకీట భావముం
బొరయఁగఁ జేయు; నిప్పగిదిఁ బుట్టుచుఁ జచ్చుచు మోహవార్ధిలోఁ
దిరుగుచునుండుఁ గాని యొకతీరము సేరఁడు జీవుఁ డెన్నఁడున్. 74

ప్రతిపదార్థం: స్థిరము+అగు, పుణ్య, కర్మమునన్= శాశ్వతమైన పుణ్యం కలిగించే పనులవలన; దేవభవంబు+అగున్= దేవతా జన్మ ఏర్పడుతుంది; పుణ్య, పాప, సంకరమునన్= పుణ్యాపాపాలతో మిశ్రితమైన కర్మవలన; మానుషత్వము+అగున్= మనుజులకు సంబంధించిన (జన్మ) కలుగుతుంది; కల్మషముల్= పాపాలు; పశు, కీట, భావమున్= జంతువులకు పురుగులకు సంబంధించిన జన్మలను; పొరయఁగన్+చేయున్= సంభవింపజేస్తాయి; ఈ+పగిదిన్= ఈరీతిగా; పుట్టుచున్, చచ్చుచున్, మోహ, వార్ధిలోన్= భ్రాంతి అనే సముద్రంలో; తిరుగుచున్+ఉండున్+కాని= పరిభ్రమిస్తుంటాడే కాని; జీవుఁడు; ఎన్నఁడున్= ఎప్పటికిని; ఒక, తీరము+చేరఁడు= ఒక గట్టుకు చేరుకొనడు. అనగా జన్మరాహిత్యాన్ని పొందలేడని భావం.

తాత్పర్యం: శాశ్వత మైన పుణ్యకార్యాలు చేస్తే దేవలోకంలో జన్మ లభిస్తుంది. పుణ్యాలు పాపాలు కలగలిపి చేస్తే మనుజజన్మ కలుగుతుంది. కేవలం పాపాలే చేస్తే, జంతువులుగా పురుగులుగా పుట్టుతారు. ఈ విధంగా జీవుడు పుట్టుతూ చస్తూ సదా సంసారమనే భ్రాంతిసాగరంలో తిరుగాడుతాడే కాని ఎన్నటికిని ఒక ఒడ్డు చేరుకొనలేడు.

చ. ఇది సకలంబుఁ గాంచి బుధుఁ డెన్నఁడుఁ బాపము పొంతఁ బోక ని
ర్మదనిరహంక్రియాత్ముఁడును మత్సరదూరుఁడు నై చరించుఁ బెం

పొదవఁగ ధర్మమార్గమున నొయ్యన ధర్మము తీ పెఱింగి తా
వదలఁడు సత్క్రియావిధము వారక యెక్కు డొనర్చు ధర్మముల్. **75**

ప్రతిపదార్థం: బుధుఁడు= పండితుడు; ఇది= దీనిని (జీవుడు మోహ సముద్రంలో పడి చావుపుట్టుకల చక్రంలో తిరుగుతూ ఉండటాన్ని); సకలంబున్= అంతటిని; కాంచి= చూచి, గమనించి; ఎన్నఁడున్= ఏనాడుకూడా, ఎప్పుడుకూడా; పాపము, పొంతన్= దోషమైన పని దగ్గరకు; పోక= పోకుండా; నిర్మద, నిరహంక్రియా+ఆత్ముఁడును= పొగరులేని, అన్నింటికీ నేనేకర్తననే అహంకారంలేని, చిత్తంకలవాడున్నూ; మత్సర, దూరుఁడును+ఐ= అసూయ లేనివాడున్నూఅయి; పెంపు+ఒదవఁగన్= అభివృద్ధి కలిగేటట్లు; ధర్మమార్గమునన్= ధర్మం తప్పనిబాటలో; చరించున్= నడుస్తాడు; ఒయ్యన= క్రమంగా; ధర్మము, తీపు+ఎఱింగి= ధర్మంలోని రుచి మరిగి; సత్+క్రియా, విధమున్= మంచిపనులు చేసే పద్ధతిని; తా(న్)= తాను; వదలఁడు= వదలిపెట్టడు; వారక= ఆపకుండా; ఎల్లప్పుడూ, ధర్మముల్= విధివిధానంగా ఉండే పనులు; ఎక్కుడు= అధికంగా; ఒనర్చున్= చేస్తాడు.

తాత్పర్యం: జీవుడు మోహసముద్రంలో పడి చావుపుట్టుకల చక్రంలో తిరుగుతూ ఉంటాడన్న సంగతి నంతా పండితుడైనవాడు బాగా గమనించి ఎప్పుడూ పాపపు పనులజోలికి పోకుండా, పొగరు అహంకారంలేని మనస్సుతో, అసూయను వదలిపెట్టి ధర్మమార్గంలో నడుస్తూ పెంపును పొందుతాడు. అట్లా ధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించటం వలన దానిలోని రుచిని మరుగుతాడు. దానివలన మంచిపనులు సదా చేస్తుంటాడు. ధర్మకార్యాలను ఎక్కువగా చేస్తుంటాడు.

చ. చిరముగ ధర్మముల్ నడపఁ జిత్తము దేఱుఁ బ్రసన్నచిత్తుఁ డై
పరువడి నింద్రియార్థముల భంగులు రిత్తలుగా నెఱింగి చె

చ్చెర నవి యంతవట్టు నిరసించి తపో దమ సత్యశీలతం
బరిణతి నొందుఁ బొందుఁ బిదపం బరమార్థపదప్రభావమున్.’ **76**

ప్రతిపదార్థం: చిరముగన్= చాలకాలం; ధర్మముల్= లోకాన్ని మంచి స్థితిలో నిలబెట్టే పనులను; నడపన్= ఆచరించగా; చిత్తము= మనస్సు; తేఱున్= నిర్మలమౌతుంది; ప్రసన్న చిత్తుఁడు+ఐ= తేరుకొనిన మనస్సు కలవాడై; పరువడిన్= శ్రద్ధతో; ఇంద్రియ+అర్థముల భంగులు= విషయసుఖాలకు సంబంధించిన భావాల రీతులు; రిత్తలుగాన్= వ్యర్థాలైనవిగా; ఎఱింగి= తెలిసికొని; చెచ్చెరన్= శీఘ్రంగా; అవి= (ఆ ఇంద్రియార్థాలు); అంత+పట్టు= అంతమేరకు; నిరసించి= త్యజించి; తపస్+దమ, సత్య, శీలతన్= చిత్తప్రసాదాన్నిగలిగించే శరీరక్లేశం మున్నగు పనులచేత, ఇంద్రియ నిగ్రహంచేత, నిజాన్ని సదా భాషించే స్వభావంచేత; పరిణతిన్+ఒందున్= గొప్పవికాసాన్ని పొందుతాడు; పిదపన్= తదుపరి; పరమ+అర్థ, పద, ప్రభావమున్= మిక్కిలిగొప్పదైన ఆధ్యాత్మికమైన ఉన్నతి యొక్క మహిమను; పొందున్= ఏర్పరచుకొంటాడు.

తాత్పర్యం: చిరకాలం ధర్మాలను ఆచరించటంవలన మనస్సు నిర్మల మౌతుంది. చిత్తం ప్రశాంతిని బొందటంచేత, ఇంద్రియ సౌఖ్యాలు వ్యర్థాలైనవి అని తెలుస్తుంది. అట్టి జ్ఞానం లభించిన వెంటనే వాటిని విడనాడి తపస్సు, ఇంద్రియనిగ్రహం, సత్యవ్రతం, మున్నగు సద్గుణాల చేత ఆధ్యాత్మికమైన ఉన్నతస్థితి మహిమ గోచరిస్తుంది. అదియే గొప్ప పరిణత స్థితి.’

వ. అనిన నమ్మహాద్విజుండు ధర్మవ్యాధున కి ట్లనియె. **77**

తాత్పర్యం: అనగా ఆ ఉత్తమబ్రాహ్మణుడైన కౌశికుడు ధర్మవ్యాధుడితో ఈవిధంగా అన్నాడు.

ఆ. ‘ఇంద్రియంబు లనఁగ నెయ్యవి? యవి నిగ్ర।
హింపకున్నఁ బాప మేమి దొడరు?

వాని నిగ్రహించువానికి నగు ఫలం ।
బెట్టి?' దనిన నాతఁ డిట్టు లనియె. **78**

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు+అనఁగన్+ఎయ్యవి?= ఇంద్రియాలు అనగా ఏవి?; అవి= (ఇంద్రియాలు); నిగ్రహింపకున్నన్= అదుపులో పెట్టకుంటే; పాపము+ఏమి+ తొడరున్= ఎట్టి దురితం సంక్రమిస్తుంది; వానిన్= (ఇంద్రియాలను); నిగ్రహించు వానికిన్= లోబరచుకొనే వాడికి; అగు ఫలంబు= లభించే ఫలం; ఎట్టిది= ఏవిధమై నట్టిది; అనినన్= అనగా (అని కౌశికుడు అడుగగా); ఆతఁడు= (ధర్మవ్యాధుడు); ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'ఇంద్రియాలు అనగా ఏవి? ఇంద్రియాలను అదుపులో పెట్టకపోతే కలిగే పాప మేమి? వాటిని నిగ్రహించేవాడికి కలిగే లాభ మేమి?' అని అడిగిన కౌశికుడి ప్రశ్నలకు ధర్మవ్యాధుడు ఈవిధంగా సమాధానం ఇచ్చాడు.

విశేషం: ఇంద్రియాలు అయిదు+అయిదు= పది. జ్ఞానేంద్రియాలు అయిదు; త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం, కర్మేంద్రియాలు అయిదు: వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ. మనస్సుతో కూడి ఏకాదశేంద్రియాలుగా ప్రాచుర్యం.

క. **'విను విషయజ్ఞానమునకు ।**
ననయంబును మనసు మూల; మది కామక్రో
ధనిరూఢ మగుచుఁ బురుషుని ।
ననిశము నెలయించు నింద్రియార్థక్రియలన్. **79**

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; విషయ, జ్ఞానమునకున్= ఇంద్రియార్థాల తెలివిడికి; అనయంబును= ఎల్లప్పుడును; మనసు= చిత్తం; మూలము= ఆధారం; అది= (ఆ మనస్సు); కామ, క్రోధ, నిరూఢము+అగుచున్= కోరికలతో, కోపతాపాలతో కూడుకొన్నది కావటంచేత; ఇంద్రియ+అర్థ, క్రియలన్= ఇంద్రియభోగాలకు సంబంధించిన పనులలో; పురుషునిన్= మనుజుడిని; అనిశమున్= ఎల్లప్పుడు; ఎలయించున్= ప్రవేశపెడుతుంది.

తాత్పర్యం: 'ఇంద్రియార్థాల తెలివిడికి ఆధారమైనది మనస్సు. అది కోరికలతో, కోపతాపాలతో కూడితే మనుజుడిని విషయభోగాలవైపు తరలిస్తుంది.

విశేషం: ఇంద్రియార్థాలు అయిదు. శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం.

సీ. **ఇంద్రియార్థంబుల కెలసిన పురుషుండు ।**
గాఢరాగంబునఁ గరఁగుచుండు;
రాగంబువలనఁ దిరంబగు లోభంబు ।
లోభియై కరుణకు లోనుగాఁడు;
మఱి సముద్ధతవృత్తి మరగుఁ బాపక్రియఁ ।
దగువారు సెప్పెడి తగవు వినఁడు;
కుజనుల దెసఁ బ్రీతి గొఱలుఁ; దుల్యంబులు ।
గాకుండు వాఙ్మనఃకర్మభంగు;

ఆ. **లిహమునందుఁ బుణ్యహీనుఁడై చెడిపోవుఁ ।**
బరమునందు దుఃఖభరము నొందుఁ;
గాన యింద్రియార్థగతిఁ బోక సాధుసం ।
సర్గఁ జేసి సుగతిఁ జనుట యొప్పు. **80**

ప్రతిపదార్థం: ఇంద్రియ+అర్థంబులకున్= విషయసుఖాలకు; ఎలసిన= లోనైన; పురుషుండు= మనుజుడు; గాఢ, రాగంబునన్= మిక్కుటమైన కామం చేత; కరఁగుచుండున్= ద్రవిస్తూ ఉంటాడు; రాగంబువలనన్= కామంవలన; లోభంబు= పిసినారితనం; తిరంబు+అగున్= ఎక్కువ కాలం నిలుస్తుంది; లోభి+ఐ= లోభం కలవాడై; కరుణకున్= దయకు; లోను+కాఁడు= లోబడడు; మఱి= అదనంగా; సమ్+ఉద్ధతి, వృత్తి= ఎక్కువ గర్వంతో కూడిన భావంచేత; పాపక్రియన్= దురితంతో కూడిన పనియందు; మరగున్= అభిలాష

పెంచుకొంటాడు; తగువారు= యోగ్యులు; చెప్పెడి= వచించెడి; తగవు= ధర్మం; వినఁడు= ఆలకించడు. కుజనుల+దెసన్= చెడ్డవారి యెడల; ప్రీతి= అభిమానం; కొఱలున్= అతిశయిస్తుంది; వాక్+మనస్+కర్మ, భంగులు= మాట, మనస్సు, క్రియల రీతులు; తుల్యంబులు= సమమైనవి; కాక+ఉండున్= కావు; ఇహమునందున్= ఈ లోకంలో; పుణ్య, హీనుఁ డు+ఐ= సుకృతం లేనివాడై; చెడిపోవున్= నశిస్తాడు; పరమునందున్= ఇంకొకలోకంలో; దుఃఖ, భరమున్= శోకపు బరువును; ఒందున్= పొందుతాడు; కాన= కాబట్టి; ఇంద్రియ+అర్థ, గతిన్= విషయ సుఖాల మార్గంవైపు; పోక= వెడలక; సాధు, సంసర్గన్+చేసి= మంచివారలతోడి కలయిక చేత; సుగతిన్= మంచి మార్గంలో; చనుట= వెడలటం; ఒప్పు= మంచిది.

తాత్పర్యం: విషయసుఖాలకు చిక్కిన మనుజుడు మిక్కుటమైన కామప్రవృత్తికి లోనౌతాడు. మిక్కుటమైన కామ ప్రవృత్తికి లోనుకావటంవలన చాలకాలం నిలిచే లోభం ఏర్పడుతుంది. లోభి కావటంవలన దయకు దూరమైనవా డౌతాడు. గర్వానికి లోనౌతాడు, పాపకార్యాలకు పాల్పడతాడు; యోగ్యులైన వారు చెప్పే ధర్మాన్ని ఆలకించడు. చెడ్డవారి స్నేహం చేస్తాడు. వాక్కుకు, మనస్సుకు, చేతలకు బొత్తిగా పొంతన కుదురదు. ఆ విధంగా అతడు ఈలోకంలో చెడిపోతాడు. పరం దక్కక అతడు దుఃఖమగ్నుడౌతాడు. కాబట్టి విషయభోగాలలో మనస్సును చిక్కనీయక, సాధుజనుల సహవాసం చేసి సుగతికి పోవటం మంచిది.

వ. ఇంద్రియంబు లన నెయ్యవి యనియు, నింద్రియ జయసిద్ధియు నీవు నన్నడిగితివి; తత్ప్రకారంబు బ్రహ్మవిద్యావిషయంబు మాబోఁటివారికి నవాచ్యం బై యుండు; నైనను నీవు బ్రాహ్మణప్రవరుండవు గావున సద్బ్రాహ్మణ ప్రియం బవశ్యకర్తవ్యంబు; పరమబ్రహ్మవిదు లైన బ్రాహ్మణవరులకు నమస్కరించి, బ్రహ్మవిద్యాప్రపంచం బెఱింగించెద; నవధాన పరుండ వై యాకర్ణింపుము. 81

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు+అనన్+ఎయ్యవి= ఇంద్రియాలు అనగా ఏవి; అనియున్= అనియున్నూ; ఇంద్రియ, జయ, సిద్ధియున్= ఇంద్రియాలపై గెలుపు ఎట్లా సిద్ధిస్తుంది అనిన్నీ; నీవు= నీవు; నన్నున్= నన్ను; అడిగితివి= ప్రశ్నించావు; తత్+ ప్రకారంబు= ఆవిధం; బ్రహ్మ, విద్యా, విషయంబు= ఆధ్యాత్మికజ్ఞానానికి సంబంధించిన సంగతి; మాబోఁటివారికిన్= నా వంటి వారలకు; అవాచ్యంబు+ ఐ+ఉండున్= చెప్ప నలవి కానట్టిదిగా ఉంటుంది. ఐనను= అయినప్పటికిని; ఈవు= నీవు; బ్రాహ్మణ, ప్రవరుండవు= విప్రులలో ఉత్తముడవు; కావునన్= కాబట్టి; సత్+ బ్రాహ్మణ, ప్రియంబు= మంచి విప్రులకు ఇష్టమైనది; అవశ్య కర్తవ్యంబు= తప్పనిసరిగా చేయవలసినట్టిది; పరమ బ్రహ్మవిదులు+ఐన= ఆధ్యాత్మిక తత్త్వాన్ని లెస్సగా తెలిసినవారైన; బ్రాహ్మణ వరులకున్= విప్రులలో శ్రేష్ఠు లైన వారికి; నమస్కరించి= వందనం చేసి; బ్రహ్మ, విద్యా ప్రపంచంబు= ఆధ్యాత్మిక తత్త్వం యొక్క విస్తారం అంతటిని; ఎఱింగించెదన్= తెలుపుతాను; అవధానపరుండవు+ఐ= ఏకాగ్రతతో కూడిన నిష్ఠ కలవాడవై; ఆకర్ణింపుము= ఆలకింపుము.

తాత్పర్యం: ఇంద్రియాలు అనగా ఏవి? ఇంద్రియనిగ్రహం ఎట్లా లభిస్తుంది? అని నీవు నన్ను ప్రశ్నించావు. అది ఆధ్యాత్మికతత్త్వం. అది నాబోటి వారు చెప్పటానికి అలవి కానిది; అయినను నీవు బ్రాహ్మణోత్తముడవు. జిజ్ఞాసువవు; తెలిసికొనటానికి యోగ్యత యున్నవాడవు. మంచి విప్రులకోరిక ఈడేర్చటం తప్పనిసరిగా చేయవలసినపని. కాబట్టి, మహానుభావులు ఆధ్యాత్మిక తత్త్వకోవిదులు అయిన బ్రాహ్మణోత్తములను ధ్యానించి, వారికి సవినయంగా నమస్కరించి, బ్రహ్మజ్ఞానాన్నిగూర్చి నీకు సవిస్తరంగా తెలుపగలను. ఏకాగ్రతతో కూడిన నిష్ఠతో ఆలకించుము.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు బ్రహ్మవిద్యాప్రపంచం బెఱింగించుట(సం. -201-16)

తే. అంబరము వాయు వగ్ని దోయమ్ము ధరణి ।
భూతపంచక మిది; క్రమంబున మహాత్మ!

శబ్ద సంస్పర్శ రూప రసములు గంధ ।
సంయుతంబుగ భూతపంచక గుణములు. 82

ప్రతిపదార్థం: మహా+ఆత్మ!= గొప్ప ఆత్మ కలవాడా!; అంబరము= ఆకాశం; వాయువు= గాలి; అగ్ని= నిప్పు; తోయమ్ము= నీరు; ధరణి= నేల; ఇది; క్రమంబునన్= వరుసగా; భూతపంచకము= పంచభూతాల సంపుటి(అవి); శబ్ద, సంస్పర్శ, రూప రసములు= నాదం, తాకుడు, ఆకృతి, ద్రవం; గంధ సంయుతంబుగన్= వాసనతో కూడినవై ఉండటం; భూత పంచకగుణములు= పంచభూతాల గుణాలు.

తాత్పర్యం: గొప్పఆత్మ గల ఓ కౌశికమహర్షీ! ఆకాశం, గాలి, నిప్పు, నీరు, నేల అనేవి పంచభూతాలు. వీటి గుణాలు వరుసగా నాదం, స్పర్శ, ఆకృతి, ద్రవం, వాసనలు. అనగా: ఆకాశ గుణం శబ్దం; వాయు గుణం స్పర్శం; అగ్ని గుణం రూపం; నీటి గుణం రసం; భూమి గుణం గంధం.

క. ఒనరఁగ నాకస మాదిగ ।
ననులోమముతోడ నిమ్మహాభూతము లే
నును బుట్టు నొకటి కొక్కటి ।
యనయముఁ బ్రతిలోమగతి లయంబునఁ బొందున్. 83

ప్రతిపదార్థం: ఒనరఁగన్= వరుసగా; ఆకసము+ఆదిగన్= ఆకాశం మొదలుగా; అనులోమము తోడన్= క్రిందివరుసగా; ఈ+మహాభూతములు+ఏనును= ఈ గొప్పభూతాలు అయిదున్నూ; పుట్టున్= ఉద్భవిస్తాయి; ఒకటికిన్+ఒక్కటి= ఒకదానివరుస ఒకటి; అనయమున్= ఎల్లప్పుడును; ప్రతిలోమగతిన్= పైవరుస క్రమాన; లయంబునన్= వినాశాన్ని; పొందున్= పొందుతాయి.

తాత్పర్యం: ఆకసం మొదలుగా పంచభూతాలు వరుసగా అనులోమ క్రమంలో పుట్టుతాయి. అవి ప్రతిలోమ క్రమంలో లయమౌతాయి. (అనగా ఆకాశంనుండి వాయువు; వాయువునుండి అగ్ని, అగ్నినుండి నీరు, నీటినుండి భూమి పుట్టుతాయి. ఇది అనులోమ క్రమం. ఇక ప్రతిలోమ క్రమాన ప్రళయకాలంలో భూమి నీటిలో, నీరు అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో లయిస్తాయి.

వ. శ్రోత్రంబును ద్వక్కును జక్షువును జిహ్వాయు ఘ్రాణంబును నను నియ్యేనగు నింద్రియంబులు శబ్ద స్పర్శ రూపరసగంధంబు లింద్రియ విషయంబు లై యుండు; నింద్రియపంచకంబునకు షష్ఠం బై మనస్సుప్రకాశిల్లు; సప్తమాష్టమంబు లై బుద్ధియు నహంకారంబును వర్తిల్లు; సత్త్వంబును రజస్సును దమస్సును గుణంబు లై యుండు; నీ చెప్పంబడిన మహాభూత ప్రముఖ ప్రపంచంబంతయు నవ్యక్తం బను తత్త్వంబునం దావిర్భావతిరో భావంబులం బొందుచుండు. 84

ప్రతిపదార్థం: శ్రోత్రంబును= చెవియున్నూ; త్వక్కును= చర్మమున్నూ; చక్షువును= కన్నున్నూ; జిహ్వాయున్= నాలుకయున్నూ; ఘ్రాణంబునున్= ముక్కున్నూ; అను+ఈ+ఏను+అగు= అనబడే ఈ అయిదు అయిన; ఇంద్రియంబులు= ఇంద్రియాలు; శబ్ద, స్పర్శ, రూప, రస, గంధంబులు= నాదం, తాకుడు, ఆకృతి, ద్రవం, వాసనలు; ఇంద్రియవిషయంబులు+ఐ+ఉండున్= ఇంద్రియార్థాలు అయి ఉంటాయి (వీటికి తన్మాత్రలు అని పేరు); ఇంద్రియ పంచకంబునకున్= అయిదు ఇంద్రియాలకు; షష్ఠంబు+ఐ= ఆరవది అయి; మనస్సు= చిత్తం; ప్రకాశిల్లున్= వెలుగొందుతుంది; సప్తమ+అష్టమంబులు+ఐ= ఏడవది ఎనిమిదివది అయినవి; బుద్ధియున్+ అహంకారంబును= తెలివియున్నూ, నేను అనెడి అభిమాన భావమున్నూ; వర్తిల్లున్= ఉంటాయి; సత్త్వంబును= సాధువులకుండే మంచితనం అనేగుణం; రజస్సును= భూలోకవాసులలో సర్వసాధారణంగా ఉండే అహంభావపూరిత మైన లక్షణం; తమస్సును= కోపతాపాలలో కూడిన మూఢత్వం (త్రిగుణములు= సత్త్వరజస్తమోగుణాలు); గుణంబులు+ఐ+ఉండున్= గుణాలు అయి ఉంటాయి; ఈ చెప్పంబడిన= ఈ విధంగా వివరించబడిన;

మహా, భూత, ప్రముఖ, ప్రపంచంబు+ అంతయున్= గొప్ప భూతాలతో కూడుకొనిన లోకం అంతయున్నూ; అవ్యక్తంబు+ అను, తత్త్వంబు నందున్= వ్యక్తం కానట్టి అనగా అగోచరమైనది అనే తత్త్వంలో; ఆవిర్భావ, తిరస్+భావంబులన్= పుట్టుక మరలిపోవటాలను; పొందుచుండున్= పొందుతూ ఉంటాయి.

తాత్పర్యం: చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు - ఇవి ఐదు ఇంద్రియాలు. శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం - ఇవి ఐదు ఇంద్రియార్థాలు: వీటికి పంచతన్మాత్రలు అని వ్యపదేశం. ఇంద్రియపంచకానికి తోడు ఆరవది మనస్సు. బుద్ధి ఏడవది. అహంకారం ఎనిమిదవది. సత్త్వం, రజస్సు, తమస్సు - ఇవి మూడున్నూ త్రిగుణాలు. ఈ భూతప్రపంచం సర్వమున్నూ 'అవ్యక్తం' అనే తత్త్వంలో ఉదయిస్తుంది. తిరిగి అందులోనే లయిస్తుంది.

విశేషం: ప్రపంచం : అనగా విస్తారం : విరివి. పెక్కు విధాలు గలిగిన విస్తరణ. బ్రహ్మవిద్యా ప్రపంచం అనగా వేదాంతజ్ఞాన విస్తారం. ఇందు 'తత్త్వమునందు ఆవిర్భావ తిరోభావంబులందు' అనే వాక్యం సృష్టినిగూర్చి ప్రళయాన్నిగూర్చి తెలుపుతుంది. సృష్టికి ఆద్యప్రకృతి అయిన మూలపదార్థాన్నిగూర్చి వివిధమతాలు వేరు వేరు సిద్ధాంతాలను నెలకొల్పినవి.

<u>మతాలు</u>

<u>తత్త్వాలు</u>

బౌద్ధం
శూన్యం

చార్వాకులు
పంచభూతాలు

అర్హతులు
జీవం - అజీవం

అర్హతులు (కొందరు)
జీవం - ఆకాశం - ధర్మం - అధర్మం - పుద్గలం.

సాంఖ్యులు
పంచభూతాలు 5, పంచతన్మాత్రలు 5, ఏకాదశేంద్రియాలు 11, అవ్యక్తం 1,

బుద్ధి 1, అహంకారం 1, ఆత్మ 1 = మొత్తం 25.

యోగులు
సాంఖ్యులు 25+ఈశ్వరుడు

ద్వైతులు
స్వతంత్రం+అస్వతంత్రం

విశిష్టాద్వైతులు
తత్త్వత్రయం = చిత్తు+అచిత్తు+ఈశ్వరుడు

అద్వైతులు
బ్రహ్మం.

క. అవ్యక్త తత్త్వ మరయఁగ ।
నవ్యక్తం బయ్యు నిట్టి దై లక్ష్య మగున్
సువ్యక్తేంద్రియ భూతా ।
ది వ్యవహారార్థ లింగదృష్టాకృతి యై. 85

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించగా; అవ్యక్త, తత్త్వము= వ్యక్తం కాకుండ అగోచరంగా ఉండే యాథార్థ్యం; అవ్యక్తంబు+అయ్యున్= వ్యక్తం కానట్టిదే అయినప్పటికిని; ఇట్టిది+ఐ= ఈ విధంగా ఏర్పడేదై; సువ్యక్త+ఇంద్రియ, భూత+ఆది, వ్యవహార+అర్థ, లింగ, దృష్ట+ ఆకృతి+ఐ= బాగా గోచరించునట్టిదై ఇంద్రియాలలో భూతములు మున్నగునట్టి వానితో కూడి లౌకికమైన వాడుకలు, భావప్రతీతి,

లింగ, భేదంతో కన్పించే రూపం కలదై; లక్ష్యము+అగున్= గ్రహించ దగినట్టిది ఔతుంది.

తాత్పర్యం: అవ్యక్తమై అగోచరమయ్యే తత్త్వం - అవాఙ్మానస గోచరం అనిర్వచనీయం అనుభవైకవేద్యం అయినదే అయినను, లోకవ్యవహారంలో, ఇంద్రియాలకు భూతాలకు అనువయిన భావనలో లింగభేదంతో కూడిన రూపంతో కన్పించవచ్చును. ఆవిధంగానే అవ్యక్తతత్త్వాన్ని లౌకికులైన మానవులు గ్రహించ వీలు కల్గుతుంది. అనగా అవ్యక్త తత్త్వం వ్యవహారంలో సాకారం కావచ్చును. అసలు అది నిరాకారం. అవ్యక్తం.

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. 86

తాత్పర్యం: అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

తే. అనఘ! శబ్దాది విషయంబులందుఁ దగిలి ।
యిచ్చఁ జరియించు నెప్పుడు నింద్రియములు;
బుధుఁడు దత్స్వభావముఁ దనబుద్ధి నెఱిఁగి ।
యేమఱక వానిఁ దగఁ గుదియింప వలయు. 87

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; శబ్ద+ఆది, విషయంబులందున్= శబ్దం మొదలైనవాటిలో; తగిలి= చిక్కుకొని; ఎప్పుడున్= ఎల్లప్పుడును; ఇంద్రియములు= భోగసాధనాలు; ఇచ్చన్= ఇష్టం వచ్చినట్లుగా; చరియించున్= తిరుగుతాయి; బుధుఁడు= తెలివిగలవాడు; తత్స్వభావమున్= వేదాంతాన్ని, యాథార్థ్యజ్ఞానాన్ని; తన బుద్ధిన్= తన తెలివితో; ఎఱిఁగి= తెలిసికొని; ఏమఱక= అవధానం పోగొట్టుకొనక; వానిన్= (ఆ ఇంద్రియాలను); కుదియింపవలయున్= నిగ్రహించాలి.

తాత్పర్యం: ఓ పుణ్యాత్ముడా! ఇంద్రియాలు శబ్దం మొదలైన భోగసాధనాలలో చిక్కుకొని, ఇష్టానుసారంగా నడుస్తూ ఉంటాయి. బుద్ధిమంతుడు ఏమఱుపాటు చెందక జ్ఞానాన్ని ఆర్జించి ఇంద్రియాలను నిగ్రహించాలి.

ఉ. ధీరుఁడు నిర్జితేంద్రియుఁడు దెల్లముగాఁ దనుఁ గాంచు భూత వి
స్తారనిగూఢ మైన పరతత్త్వముగాఁ, దనయందు భూత వి
స్తారము నెల్లఁ గాంచు సతతస్ఫుటదర్శనుఁ డై సమగ్ర వి
స్ఫారతఁ బొంది నిర్మలతపంబులయందుఁ జలింప కెన్నఁడున్. 88

ప్రతిపదార్థం: ధీరుఁడు= నిలుకడ కల చిత్తం కలవాడు; నిర్జిత+ఇంద్రియుఁడు= నిగ్రహించబడిన ఇంద్రియాలు కలవాడు- ఇంద్రియాలను జయించినవాడు; సతత, స్ఫుటదర్శనుఁడు+ఐ= ఎల్లప్పుడును బాగా కన్పించే చూపు కలవాడై సమగ్ర, విస్ఫారతన్+పొంది= పూర్ణమైన వికాసాన్ని పొందినవాడై; నిర్మల, తపంబుల+అందున్= స్వచ్ఛమైన తపస్సులు చేయటంలో; ఎన్నడున్= ఎప్పుడును; చలింపక= వణకక; తెల్లముగాన్= విశదంగా, స్పష్టంగా; భూత, విస్తార, నిగూఢము+ఐన= అన్ని పదార్థాలలో వ్యాపించి రహస్యంగా ఉన్నట్టి; పరతత్త్వముగాన్= పరబ్రహ్మంగా; తనున్+కాంచున్= తనను తెలిసికొంటాడు; తనయందున్= తనలోపల; భూత, విస్తారమున్+ఎల్లన్= ప్రపంచంలో విస్తరించిన పదార్థాల నన్నిటిని, కాంచున్= తెలిసికొంటాడు.

తాత్పర్యం: స్వచ్ఛమైన తపస్సులు చేసి జ్ఞానాన్ని ఆర్జించిన మహనీయుడు సర్వభూతాలలో తనను తెలిసికొంటాడు; తనయందు సర్వభూతాలను తెలిసికొంటాడు.

విశేషం: 'ఏకమ్ సత్ విప్రాః బహుధా వదంతి.' 'ఏక మేవాఽద్వితీయమ్' - మున్నగు ఉప నిషద్వాక్యాలకు అనురూప మైనది ఈ పద్యం. భిన్ననామరూపభేదాత్మక మైన ప్రపంచంలో అంతర్లీనంగా ఉన్న ఆత్మపదార్థాన్ని తపస్విఅయినవాడు ఇంద్రియనిగ్రహంతో గుర్తించగలడు.

క. తప మనఁగ సకల విషయ ।
వ్యపేత మగు నట్టి బుద్ధివైభవము సుమీ!
తపమున సుస్థిరుఁ డగు యో ।
గపరునకుం గలవె యొండు కర్తవ్యంబుల్. 89

ప్రతిపదార్థం: తపము+అనఁగన్= తపస్సు అనగా; సకల, విషయ, వ్యపేతము+అగు+ అట్టి= అన్ని విషయాలనుండి వెనుకకు మరల నట్టి; బుద్ధి, వైభవము, సుమీ= జ్ఞానంయొక్క గొప్పదనం సుమా; తపమునన్= తపస్సులో; సుస్థిరుఁడు+అగు= నిలుకడ చెందిన వాడగు; యోగపరునకున్= యోగాసక్తునకు; ఒండు= వేరే; కర్తవ్యంబుల్= నెరవేర్చవలసిన పనులు; కలవె= ఉన్నవా? (లేవు).

తాత్పర్యం: తపస్సు అనగా అన్ని విషయాలనుండి వెనుకకు మరలిన మనస్సుతో కూడిన వైరాగ్యమే కదా! తపస్సులో నిలుకడ కనిన యోగికి ఇక చేయవలసిన పనులు వేరేమీ ఉండవు.

క. స్వర్గనరకంబు లింద్రియ । వర్గ సమాచరణమునన వచ్చును వినవే!
స్వర్గ మగుఁ దన్నివారణ । దుర్గతి యగుఁ దన్నిరోధ దుర్బలతమెయిన్.90

ప్రతిపదార్థం: స్వర్గనరకంబులు= స్వర్గమున్నూ నరకమున్నూ; ఇంద్రియ, వర్గ, సమాచరణమునన్+అ= ఇంద్రియ సమూహాల యొక్క ప్రవర్తన వలన; వచ్చును= సంక్రమిస్తుంది; వినవే!= వినలేదా!; తద్+నివారణన్= ఆ (ఇంద్రియాలను) నిగ్రహించటంచేత; స్వర్గము+అగున్= స్వర్గం ప్రాప్తిస్తుంది; తత్+నిరోధ, దుర్బలత, మెయిన్= ఆ ఇంద్రియాలను నిగ్రహించటంలో ఏర్పడిన బలహీనతచేతనే; దుర్గతి= దుర్గతి, నరకం; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఇంద్రియాలను నిగ్రహించటం వలన స్వర్గం లభిస్తుంది. ఆ ఇంద్రియాలను నిగ్రహించజాలని బలహీనత వలననే నరకం ప్రాప్తిస్తుంది.

విశేషం: పాపాలు చేసినవారికి యమలోకం ప్రాప్తిస్తుందనిన్నీ, పుణ్యాలు చేసిన వారికి స్వర్గం లభిస్తుందనిన్నీ - పురాణ సాహిత్యంలో చెప్పబడిన అంశం. అర్థవాదరూపంగా గ్రహించనగునని భారత సందేశం.

> "న మోక్షో నభసః పృష్ఠే । న పాతాళే న భూతలే ।
> సర్వాశాసంక్షయే చేతః । క్షయో మోక్ష ఇతీర్యతే". 70 అన్నపూర్ణ అధర్వవేదం

మోక్షం అనేది ఆకాశం వెనుకగాని పాతాళంలో గాని భూమిమీద గాని ఉండే చోటు గాదు. ఆశాపరివృత మైన చిత్తవృత్తి నశించటమే నిజమైన మోక్షం - అన్న వేదవాక్య మిక్కడ అనుసంధించదగింది.

చ. అరదము దేహ, మింద్రియము లశ్వము, లాత్ముఁడు సూతుఁ డమ్మహా
తురగచయంబు ధైర్య మను తోరపుఁ బగ్గములన్ దృఢంబుగా
నురవడిఁ బోక యుండ వెర వొప్పఁగఁ బట్టినవాఁడు సేమపుం
దెరువున నేఁగు నప్పరమధీరుఁడు సువ్వె యుదారుఁ డెయ్యెడన్. 91

ప్రతిపదార్థం: దేహము= శరీరం; అరదము= రథం; ఇంద్రియములు= భోగానుభవ స్థానాలు; అశ్వములు= గుర్రాలు; ఆత్ముఁడు= ఆత్మ అనే పురుషుడు; సూతుఁడు= సారథి; ఆ+ మహాతురగచయంబు= ఆగొప్పగుర్రాల సమూహం; ధైర్యము+అను, తోరపున్+పగ్గములన్, తోరపున్+పగ్గములన్= నిలుకడ కలిగిన చిత్తం అనే గొప్పపగ్గాలతో; దృఢంబుగాన్= గట్టిగా; ఉరవడిన్= వేగంగా; పోకయుండన్= పారిపోవకుండేటట్లుగా; వెరవు+ఒప్పఁగన్= ఉపాయం భాసించేటట్లుగా; పట్టినవాఁడు= చేతిలో నిగ్రహించి పూనినవాడు; సేమము+తెరువునన్= క్షేమంగల మార్గాన; ఏఁగున్= వెళ్ళుతాడు; ఆ+పరమధీరుఁడు+చువ్వె= ఆశ్రేష్ఠుడైన, ధీరుడే సుమా; ఏ+ఎడన్= ఎక్కడైనా; ఉదారుఁడు= గొప్పవాడు.

తాత్పర్యం: ఈ దేహమే ఒక రథం. ఇంద్రియాలు ఈ రథానికి పూన్చిన గుర్రాలు - అని చెప్పవచ్చును. ఆత్మయే ఈ రథాన్ని నడిపే సారథి. చలించని చిత్తం అనే పగ్గాలను చేతబూని ఉపాయంతో ఎవడు ఈ గుర్రాలను తన అదుపులో పెట్టి నడపగలడో అట్టివాడే ధీరుడు. అట్టివాడే క్షేమమార్గాన పోయేవాడు.

విశేషం: ఈ దేహం ఒక రథం. ఇంద్రియాలు అనునవి గుర్రాలు. ఆ గుర్రాలను అదుపులో పెట్టి నడిపించవలసిన గొప్పసారథి - ఆత్మ.

అనుభవం మిక్కిలి ప్రాచీనమైనది. "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథ మేవ తు'' - ఇత్యాదులు, మరియు "యస్తువిజ్ఞానవాన్ భవతి । యుక్తేన మనసా సదా । తస్యేంద్రియాణి వశ్యాని । సదశ్వా ఇవ సారథేః'' అనే ఉపనిషద్వాక్యాలు ఇట స్మరించదగినవి.

తే. ఇంద్రియంబులు దివిచిన యెడక పాఱు ।
చుండు మన సెప్డు; దద్వేగ ముడుపకున్న
నెడలి చెడిపోవు బుద్ధి యుదీర్ణపవన ।
హతిఁ బయోనిధిలోఁ గల మవియు నట్లు. 92

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= శరీరంలో భోగస్థానా లైన అవయవాలు; తివిచిన+ఎడకు+అ= ఆకర్షించిన (లాగిన) చోటికే; మనసు= మనస్సు; ఎప్డున్= ఎపుడును; పాఱుచుండున్= ప్రవహిస్తూ ఉంటుంది; తద్+వేగము= ఆ ఇంద్రియాల శీఘ్రగమనం; ఉడుపక+ఉన్నన్= ఆపకపోతే; ఉదీర్ణ, పవన, హతిన్= పెనుగాలి తాకిడికి; పయస్+నిధిలోన్= సముద్రంలో; కలము= పడవ; అవియున్+అట్లు= నశించిపోయేటట్లుగా; బుద్ధి= తెలివి; ఎడలి= వికలం అయి; చెడిపోవున్= పాడయిపోతుంది.

తాత్పర్యం: ఇంద్రియాలు ఆకర్షించిన చోటికే మనస్సు సదా ప్రసరిస్తూ ఉంటుంది. ఆ ప్రసార వేగాన్ని అదుపులో పెట్టకపోతే సముద్రంలో పెనుగాలి తాకిడికి పగిలి నశించే పడవవలె, బుద్ధి పాడైపోతుంది.

క. ఏనింద్రియములు మనసును ।
బూని తనవశంబ యైన బురుషుండు గదా
ధ్యానసమాధిసమగ్రుఁడు ।
వానిం గీర్తింతు రమరవరులున్ మునులున్.' 93

ప్రతిపదార్థం: ఏను+ఇంద్రియములు= అయిదు ఇంద్రియాలు= 1. త్వక్కు, 2. చక్షువు, 3. శ్రోత్రం, 4. జిహ్వ, 5. ఘ్రాణం; మనసును= చిత్తమున్నూ;

పూని= దీక్షతో; తన, వశంబు+అ+ఐన= స్వాధీనమైన; పురుషుండు= మనిషి; కదా= సుమా; ధ్యాన, సమాధి, సమగ్రుఁడు= చిత్తచాంచల్యం లేక ఏకాగ్రంగా తలపోయటంలో సంపూర్ణమైన నిష్ఠ కలవాడు; అమరవరులున్= వేల్పులలో ఉత్తములు; మునులున్= ఋషులును; వానిన్= (అట్టి ధ్యానయోగిని); కీర్తింతురు= పొగడుతారు.

తాత్పర్యం: ఐదు ఇంద్రియాలను తన వశం చేసికొనినవాడే కదా ధ్యానయోగి; అట్టివాడినే గదా దేవతలు, ఋషులు పొగడుతారు.'

వ. అనిన నవ్విప్రుండు సత్త్వరజస్తమోగుణంబులతెఱం గెఱింగింపు మనిన నెఱు కి ట్లనియె. 94

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పినపిదప; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; సత్త్వ, రజః+తమః+గుణంబులతెఱంగు= సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాల విధం; ఎఱింగింపుము= తెలుపుము; అనినన్= చెప్పగా; ఎఱుక= బోయవాడు (ధర్మవ్యాధుడు); ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పిన కౌశికమునితో ధర్మవ్యాధుడు ఇట్లా పలికాడు.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు సత్త్వరజస్తమోగుణంబుల తెఱం గెఱింగించుట

(సం. 3-203-3)

క. అతినిందితము తమోగుణ ।
మతిబోధమయంబు సత్త్వ మనయంబుఁ బ్రకా
శత నొప్పు; నుభయగుణమి ।
శ్రతఁ బరఁగు రజోగుణంబు సన్నుతచరితా! 95

ప్రతిపదార్థం: సత్+నుత, చరితా!= మంచివారిచేత ప్రశంసించబడిన శీలం కలవాడా! ఓ కౌశికమునీ!; తమస్+గుణము= తమోగుణము= తమస్సు అనే చెడుగుణం; అతినిందితము= మిక్కిలి గర్హించతగింది; సత్త్వము=

సత్త్వం అనే మంచిగుణం; అతిబోధమయంబు= మిక్కుటమైన జ్ఞానంతో కూడినట్టిది; అనయంబున్= ఎల్లప్పుడును; ప్రకాశతన్+ఒప్పున్= వెలుగొందుతుంది; రజస్+గుణము= రజోగుణము= రజస్సు అనే గుణం; ఉభయ గుణమిశ్రతన్+పరఁగున్= రెండింటియొక్క కలయికచేత అనగా తమోగుణ సత్త్వగుణాల రెండిటియొక్క సమ్మేళనంవలన ఏర్పడుతుంది.

తాత్పర్యం: పొగడబడినశీలం కల ఓ కౌశికమునీ! తమోగుణం మిక్కిలి హేయమైనది. సత్త్వగుణం జ్ఞానంతో కూడి వెలుగొందేది. ఇక రజోగుణమూ, తమోగుణ సత్త్వగుణాల రెంటి యొక్క సమ్మేళనం.

మ. అసుఖాకారత నిద్ర దైన్యము విమోహం బక్షమత్వంబుఁ దా
మసభావంబులు; రాగలోభజడతామానంబు లూహింప రా
జసవృత్తంబులు; ధైర్యశాంతికరుణాసంతోషవిద్యాదు లిం
పెసఁగన్ సాత్త్విక చేష్టితంబులు; నిజం బి ట్లాత్మ గ న్మిన్నియున్. 96

ప్రతిపదార్థం: అసుఖ+ఆకారత= తృప్తి లేని రూపం; నిద్ర= కూర్కుచెందటం; దైన్యం= దురవస్థ; విమోహంబు= మిక్కుటమైన భ్రాంతి; అక్షమత్వంబున్= సహనం కోల్పోవటం; తామసభావంబులు= తమోగుణానికి చెందిన లక్షణాలు; ఊహింపన్= ఆలోచించగా; రాగ, లోభ, జడతా, మానంబులు= కోరికలు, పిసినారితనం, కదలిక లేకపోవటం, అహంకారం అనేవి; రాజసవృత్తంబులు= రజోగుణానికి సంబంధించిన అంశాలు; ధైర్య, శాంతి, కరుణా, సంతోష, విద్యా+ఆదులు= నిలుకడ కలిగిన చిత్తం, మనస్తృప్తి, దయ, ఆనందం, జ్ఞానం మొదలైనవి; ఇంపు+ఎసఁగన్= ప్రియం ఏపారేటట్లుగా; సాత్త్విక, చేష్టితంబులు= సత్త్వగుణానికి సంబంధించిన లక్షణాలు; నిజంబు= ఇది సత్యము; ఇట్లు= ఈ రీతిగా; ఆత్మన్= నీలోలోపల; ఇన్నియున్= వీటిని ఇన్నింటిని; కన్మ= కనుము; అరయుము= తెలిసికొనుము.

తాత్పర్యం: సంతృప్తిలేని రూపం, నిద్దురమత్తులో ఉండటం, హీనత్వం, మిక్కుటమైన భ్రాంతి, సహనం లేకపోవటం అనేవి తమోగుణాన్ని సూచించే లక్షణాలు. దురాశ, పిసినిగొట్టుతనం, జడత్వం, దురహంకారం, రజోగుణాన్ని సూచించే లక్షణాలు. ఆపద దాపురించినప్పటికీ చలించని చిత్తవృత్తి, మానసిక సంతృప్తి, జాలి, సంతోషం, తెలివితేటలు మొదలైనవి సత్త్వగుణాన్ని సూచించే లక్షణాలు. ఇది నిజం. ఇదంతా నీ మనస్సులో గ్రహించుము.

చ. అనఘుఁడు సాత్త్వికుం డగు మహాత్ముఁడు బోధనిరూఢి సర్వమున్
గనికొని లోకవృత్తములు గావని రోసి సమస్తసంగభం
గనిరతుఁ డై తొఱంగు మమకారవికార మహంక్రియాచ్యుతిం
బనుపడి సంయమప్రకట భావన నుత్తమశాంతిఁగైకొనున్. 97

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపం చేయనివాడు; సాత్త్వికుండు= సత్త్వగుణం కలవాడు; అగు= అయినట్టి; మహా+ఆత్ముఁడు= గొప్ప ఆత్మ గలవాడు; బోధ, నిరూఢిన్= జ్ఞానం స్థిరపడటంవలన; సర్వమున్= అంతటిని; కనికొని= అరసి తెలిసికొని; లోక, వృత్తములు= ఐహికానికి చెందిన అంశాలు; కావు+అని, రోసి= సరిఅయినవి కావు అని అసహ్యాన్ని చెంది; సమస్త, సంగ, భంగ, నిరతుఁడు+ఐ= అన్ని కలయికలను విడవటంలో ఆసక్తిగలవాడై; మమకార వికారము= ఇది నాది అనే భావాన్ని; (అహంకారాన్ని); తొఱంగున్= విడిచిపెట్టుతాడు; అహంక్రియాచ్యుతిన్= అహంకారం జారిపోవటంచేత; సంయమ, ప్రకట, భావన= ఇంద్రియనిగ్రహంతో గూడిన వైరాగ్యం విరిసిన ఆలోచన; పనుపడి= కుదురుకొనేటట్లుగా చేసి; ఉత్తమ శాంతిన్= గొప్పదైన ఆనందాన్ని; కైకొనున్= స్వీకరిస్తాడు.

తాత్పర్యం: పాపరహితు డైన మహానుభావుడు జ్ఞానాన్ని ఆర్జించి, ఐహికంలోని విషయాలు అన్నీ సరిఅయినవి కావని తెలిసికొని, వైరాగ్యభావాన్ని పెంపొందించుకొని, సంగమును త్యజించి, అహంకారాన్ని నిర్మూలించుకొంటాడు. అహంకారం జారిపోవటంచేత ఇంద్రియనిగ్రహం ఏర్పడినట్టి యోగీశ్వరుడు గొప్పశాంతిని అనుభవిస్తాడు.

వ. సత్త్వగుణనిబద్ధుం డగునేని శూద్రుం డైనను జన్మాంతరంబున వైశ్యత్వంబు నొంది క్రమంబున రాజభూసురభావంబులు భజించి భవవిముక్తుం డగు' నని చెప్పిన నమ్మహీదేవుం డమ్మహానుభావు నభినందించి. 98

ప్రతిపదార్థం: సత్త్వ, గుణ, నిబద్ధుండు+అగున్+ఏని= సత్త్వగుణాలతో కూడినవాడు అయి ఉంటే; శూద్రుండు+ఐనను= శూద్రుడుగా (ఈజన్మలో) పుట్టి ఉన్నప్పటికిని; జన్మ+అంతరంబునన్= మరియొక పుట్టుకలో; వైశ్యత్వంబున్+ఒంది= వైశ్యుడుగా పుట్టుకను పొంది; క్రమంబునన్= వరుసగా; రాజ, భూసుర, భావంబులు= క్షత్రియుడుగా, బ్రాహ్మణుడుగా పుట్టటం; భజించి= పొంది; భవ, విముక్తుండు అగున్+అని= జన్మరాహిత్యం పొందుతాడని; చెప్పినన్= వచించగా; ఆ+మహీ, దేవుండు= ఆ బ్రాహ్మణుడు-కౌశికుడు; ఆ+మహా+అనుభావున్= ఆ మహాత్ముడిని - ధర్మవ్యాధుడిని; అభినందించి= సంతోషంతో ప్రస్తుతించి.

తాత్పర్యం: సత్త్వగుణాలు కలవాడు ఈ జన్మలో శూద్రుడై పుట్టి ఉన్నప్పటికిన్నీ, మరుజన్మలో వైశ్యుడై పుట్టుతాడు. అట్లే వరుసగా - తదుపరి జన్మలలో క్షత్రియుడై, బ్రాహ్మణుడై పుట్టుతాడు. అప్పుడు జన్మరాహిత్యాన్ని పొందగలడు' - అని చెప్పగా, కౌశికుడు ధర్మవ్యాధుడిని అభినందించాడు.

తే. 'దేహమున ధాతు సంశ్రయదీప్తుఁ డగుచు ।
వహ్ని యెట్లుండు? శారీరవాయువులకు
నెలవు లెయ్యవి? యవి నాకు నిశ్చయముగఁ ।
జెప్పు' మనుటయు నిట్లని చెప్పె నతఁడు. 99

ప్రతిపదార్థం: దేహమునన్= శరీరంలో; ధాతు, సంశ్రయ, దీప్తుఁడు+అగుచున్= ధాతువులయొక్క ఆధారంచేత ప్రజ్వలించినవాడయి; వహ్ని= అగ్నిహోత్రుడు; ఎట్లు+ఉండున్= ఏ విధంగా మనుతుంటాడు? శారీరవాయువులకున్= దేహంలో ఉండే గాలులకు; నెలవులు= ఉండేచోటులు; ఏ+అవి= ఏవి?; అవి= ఆ విషయాలను; నాకున్; నిశ్చయముగన్= సందేహాలకు తావులేకుండ, ఖండితంగా; చెప్పుము= తెలుపుము; అనుటయున్= అని పలికినపిమ్మట; ఇట్లు+అని= ఈరీతిగా; అతఁడు= (ఆ ధర్మవ్యాధుఁడు);చెప్పెన్= పలికాడు.

తాత్పర్యం: మానవశరీరంలో ధాతువుల ఆశ్రయంచేత అగ్ని ఎట్లా ప్రజ్వలిస్తుంది? శరీరంలోని వాయువులకు ఆటపట్టులు ఏవి? ఈ విషయాలను దయచేసి నాకు సందేహాలకు ఆస్కారం లేని రీతిగా-వివరించి తెలుప వేడికోలు.

విశేషం: దేహం - అనేకధాతువులతో ఏర్పడేది. ధాతువు అనగా ఆధారభూతమైన పదార్థం అని అర్థం. ధాతువులు ఏడు : 1. వస, 2. అసృక్కు, 3. మాంసం, 4. మేదస్సు, 5. అస్థి, 6. మజ్జ, 7. శుక్రం, పక్షాంతరంలో మఱి కొందరు ధాతువు లనగా: 1. రోమం, 2. త్వక్కు, 3. మాంసం, 4. అస్థి, 5. స్నాయువు, 6. మజ్జ, 7. ప్రాణం. అందుచేత సంఖ్యాశాస్త్రంలో ధాతువుకు సప్త సంఖ్యాపరిగణనం ఏర్పడింది.

సీ. మూర్ధదేశమునకు వర్తితం బై పర్వు ।
నాత్మాగ్ని; నాభి దదాశ్రయంబు;
శిరమునఁ బావకాంతరమునఁ జరియించుఁ ।
బ్రాణుండు భూతాత్మభావుఁ డతఁడు;
వరుసఁ బ్రాణాపాను లిరువురు నయ్యగ్ని ।
వెలిగింతు రనపేతవృత్తు లగుచు;
గుదవస్తితలము లాస్పదములుగా వహ్ని ।
పరిగతుం డగుచు నపానుఁ డుండు;

తే. గడఁగి విణ్మూత్రనిర్గమకారి యతఁడు; ।
కర్మబలయత్నకారి యై కంఠతలము

నం దుదానుండు వర్తించు; నఖిలదేహ ।

సంధులందును వ్యానుండు సంచరించు. 100

ప్రతిపదార్థం: ఆత్మ+అగ్ని= ఆత్మ అనబడే అగ్ని; మూర్ధదేశమునకున్= తల ఉన్న చోటికి; వర్ధితంబు+ఐ= ఎదిగి, వ్యాపించినట్టిదై; పర్వున్= విలసిల్లుతుంది; నాభి= బొడ్డు; తద్+ఆశ్రయంబు= ఆ(ఆత్మాగ్నికి) ఆధారం; ప్రాణుండు= ప్రాణమనే పేరు గల వాయువు; శిరమునన్= తలలో; పావకాంతరమునన్= నిప్పుమధ్య; చరియించున్= తిరుగాడుతుంది; అతఁడు= ఆ ప్రాణుడు; భూత+ఆత్మ, భావుఁడు= సకలజీవులకు ఆత్మవంటి వాడు; ప్రాణ+అపానులు+ఇరువురున్= ప్రాణుడు, అపానుడు అనే వాయువులు రెండున్నూ; వరుసన్= క్రమంగా; ఆ+అగ్నిన్= ఆ అగ్నిని; అనపేతవృత్తులు+అగుచున్= ఎల్లప్పుడును తొలగని చేష్టలు కలవారౌతూ; వెలిగింతురు= జ్వలింపచేస్తారు; అపానుఁడు= అపానం అనే పేరు గల వాయువు; గుద, వస్తితలములు= మూడి, పొత్తికడుపులు అనేచోటులు; ఆస్పదములు+కాన్= నెలవులుగా; వహ్నిపరిగతుండు+అగుచున్= అగ్ని చేత చుట్టుకొనబడినవాడై; ఉండున్= నివసిస్తాడు. అతఁడు= వాడు; కడఁగి= పూని; విట్+మూత్ర, నిర్గమకారి= మలమున్నూ, మూత్రమున్నూ బయటికి పోయేటట్లు చేసేవాడు; ఉదానుండు= ఉదానుడు అనే పేరు గల వాయువు; కర్మ, బల, యత్నకారి+ఐ= కర్మయొక్క శక్తిని అనుసరించి ప్రయత్నించేసే వాడై; కంఠతలమునందున్= మెడచోటునందు; వర్తించున్= పనిచేయును; వ్యానుండు= వ్యానుడు అనే పేరుగల వాయువు; అఖిలదేహసంధులందున్= అన్ని అవయవాలు ఒకదానితో మరిఒకటి కలిసే చోటులందు; సంచరించున్= తిరుగాడుతాడు.

తాత్పర్యం: ఆత్మాగ్ని నాభినుండి శిరస్సువరకు వ్యాపిస్తూంటుంది. ప్రాణుడు అనే వాయువు, ఆ అగ్నిమధ్యగా శిరస్సులో చరిస్తూంటుంది. అతడు సర్వభూతాలకు జీవత్వాన్ని ప్రసాదించేవాడు. ప్రాణుడికి తోడుగా అపానుడు

ఎల్లప్పుడు ఆ అగ్నిని జ్వలింప చేస్తుంటాడు. అపానుడు ముడ్డి, పొత్తికడుపు మధ్య అగ్నిచేత పరివేష్టితుడై ఉంటాడు. అతడే మలమూత్రాలను విసర్జించేటట్లుగా చేస్తాడు. ఉదానుడు అనేవాయువు కంఠంలో నివసిస్తాడు. కర్మతంత్రాన్ని నడుపుతాడు. వ్యానుడు అనేవాయువు శరీరంలోని వివిధాలైన అవయవాలు ఒకదానితో మరియొకటి కలిసేచోటులలో ఉంటుంది.

విశేషం: పంచప్రాణాలు : 1. ప్రాణం, 2. అపానం, 3. ఉదానం, 4. వ్యానం, 5. సమానం - అనే పేరులు గల వాయువులు. ఈ పద్యంలో నాలుగు ప్రాణవాయువులను గూర్చి చెప్పబడింది. రాబోయే పద్యంలో సమానవాయువును గూర్చి వ్రాయబడింది.

క. విను, ప్రాణాపానులు న ।

య్యనలుఁడుఁ బ్రాపుగ సమానుఁ డన్నరసవిపా

చనుఁ డగుచు నాభిదేశం ।

బున నుండును సకలధాతుపోషకవృత్తిన్. 101

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; ప్రాణ+అపానులు= ప్రాణం అపానం అనేవాయువులు; ఆ+అనలుఁడున్+ప్రాపుగన్= ఆ అగ్నినాశ్రయించి సమానుడు అనే వాయువు; అన్న, రస, విపాచనుఁడు+అగుచున్= ఆహారపానీయాలను జీర్ణం చేసేవాడు ఔతూ; సకల, ధాతు, పోషక, వృత్తిన్= శరీరంలోని మూల పదార్థాల నన్నింటిని పెంపొందించే పనితో; నాభిదేశంబునన్= బొడ్డులో; ఉండును= నివసిస్తాడు.

తాత్పర్యం: సమానుడు అనేపేరు గల వాయువు నాభిప్రదేశంలో ఉండి, ఆహార పానీయాలను జీర్ణింపచేసి, శరీరంలోని ధాతువులు పెంపొందేటట్లుగా చేస్తుంది. సమానుడు ఆత్మాగ్నికి ప్రాణాపానులకు తోడై సహకరిస్తాడు.

క. ఇది పరమయోగదర్శన ।

విదితం; బిప్పాటఁ బవనవిదు లైన మునుల్

వదలక యభ్యాసవిధిన్ ।

ముదమున ధరియింతు రాత్మమూర్ధతలమునన్. 102

ప్రతిపదార్థం: ఇది= (ఈ పంచప్రాణాల విషయం); పరమ, యోగ, దర్శనవిదితంబు= శ్రేష్ఠమైన యోగశాస్త్రం చేత తెలియబడునది; ఈ+పాటన్= ఈరీతిగా; పవన, విదులు+ఐన, మునుల్= వాయువులను గూర్చి తెలిసికొనిన ఋషులు; వదలక= విడువక; అభ్యాసవిధిన్= నిరంతరం ఆచరించటంవలన; ముదమునన్= సంతసంతో; ఆత్మన్= ఆత్మను (ఆత్మాగ్నిని); మూర్ధతలమునన్= తలయందు; ధరియింతురు= వహిస్తారు.

తాత్పర్యం: పంచప్రాణాలను గూర్చినట్టి, ఆత్మాగ్నిని గూర్చినట్టి, ఈ పరిజ్ఞానం గొప్పయోగదర్శనం వలన మాత్రమే తెలియదగింది. అభ్యాసంవలన నిష్ణాతు లైన ఋషులు ఆత్మను మూర్ధప్రదేశంలో ధరిస్తారు.

విశేషం: 'యోగదర్శనము' - అనే ప్రయోగం మిక్కిలి అర్థవంతమైనది. దర్శనం అనగా క్రోడీకరించబడిన జ్ఞానం. 'షడ్దర్శనములు' - 'సర్వదర్శనసార సంగ్రహము' - మున్నగు శీర్షికలు అనుశీలించ దగినవి.

వ. ప్రాణాపానసమాహితుండై సకలదేహంబులందును జరియించుచున్న పావకుండు జీవాత్ముండుగా నెఱుంగు; మతండు జలంబుల నున్న కమలపత్త్రంబునుంబోలె దేహంబునం దుండియు నిర్లేపస్వరూప దీపితుం డయి వెలుంగుచుండు; నిట్టి జీవాత్ముండ కదా పరమాత్ముండు. 103

ప్రతిపదార్థం: ప్రాణ+అపాన, సమాహితుండు+ఐ= ప్రాణుడు అపానుడు అనే వాయువులతో చుట్టుకొనబడినవాడై; సకల, దేహంబులందును= అన్ని శరీరాలలో; చరియించుచున్న= తిరుగాడుతున్న; పావకుండు= అగ్ని; జీవ+ఆత్ముండుగాన్= జీవాత్మగా; ఎఱుంగుము= తెలిసికొనుము; అతండు= (ఆజీవాత్ముడు); జలంబులన్+ ఉన్న= నీళ్లలోఉన్న; కమల, పత్త్రంబునున్+ పోలెన్= తామరాకు వలె; దేహంబు నందున్+ఉండియున్= శరీరంలో ఉన్నప్పటికిని; నిర్లేప, స్వరూప, దీపితుండు+అయి= పూయబడని ఆకృతిచేత వెలుగొందుతూ (అనగా నీటిచేత తడువని తామరాకువలె); వెలుంగుచున్+ఉండున్= ప్రకాశిస్తుంటాడు; ఇట్టి= ఈవిధమైన; జీవ+ఆత్ముండు+అ, కదా= జీవాత్ముడు మాత్రమే కదా; పరమ+ఆత్ముండు= పరబ్రహ్మం (భగవంతుడు).

తాత్పర్యం: ప్రాణుడు అపానుడు అనబడే వాయువులతో కలసిమెలసి అన్ని శరీరాలలో నడయాడే అగ్నియే జీవాత్మ అని తెలిసికొనుము. నీటిలో తడిసిపోకుండగా ఉండే తామరాకువలె ఆ జీవాత్మ దేహంలో నిర్లిప్తుడై ఉంటాడు. ఆ జీవాత్మయే పరమాత్మ.

క. చేతన రహితక్షేత్రముఁ । జేతనముం బొరయఁ జేయు జీవాత్మ దశో

పేతుఁడు పరమాత్ముఁడు వి । ఖ్యాతుఁడు త్రైలోక్యసంప్రకల్పనుఁ

డనఘా!104

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓ కౌశికమునీ!; చేతన, రహితక్షేత్రమున్= కదలిక లేనట్టి శరీరం; చేతనమున్+ పొరయన్+చేయు= కదలేటట్లుగా చేసేవాడు; జీవ+ఆత్మ, దశ+ఉపేతుఁడు= జీవాత్మ అనెడి అవస్థతో కూడినవాడు; పరమ+ ఆత్ముఁడు= పరబ్రహ్మం - భగవంతుడు; విఖ్యాతుఁడు= కీర్తికెక్కినవాడు; త్రైలోక్య, సంప్రకల్పనుఁడు= మూడులోకాలను సృష్టించగల శక్తి కలవాడు.

తాత్పర్యం: అచేతనమైన దేహాన్ని చేతనంగా చేసేవాడు. 'జీవాత్మ'గా భాసించే ఆ పరమాత్మయే. అతడు సుప్రసిద్ధుడు. మూడు లోకాలను సృష్టించగల శక్తి కలవాడు.

క. భూతములయందు వెలిఁగెడు ।

భూతాత్ముని నెఱుఁగుదురు ప్రబుద్ధులు నిత్య

జ్యోతిర్మయు నవ్యయు న ।
ద్వైతం బగు బుద్ధి సూక్ష్మధర్మమువలనన్. **105**

ప్రతిపదార్థం: భూతముల+అందున్= పదార్థాల అన్నిటిలో; వెలిఁగెడు= ప్రకాశించే; భూత+ఆత్మునిన్= భూతాలకు ఆత్మఅయినవాడిని; జ్యోతిర్మయున్= ప్రకాశంతో నిండినవాడిని; అవ్యయున్= శాశ్వతుడిని; అద్వైతంబు+అగు= ఒకటియే అయిన; బుద్ధిన్= తెలివితో; సూక్ష్మ, ధర్మమువలనన్= వింగడించిన ధర్మాన్ని తెలియటంవలన; ప్రబుద్ధులు= గొప్పబుద్ధిగలవారు= జ్ఞానులు; ఎఱుఁగుదురు= తెలిసికొంటారు.

తాత్పర్యం: స్థూలదృష్టికి భిన్ననామరూపభేదాలచేత సాక్షాత్కరించే జగత్తులో అంతర్లీనంగా ఉన్న ఏకత్వాన్ని సూక్ష్మదృష్టితో గ్రహించగల జ్ఞానులు అద్వైత యోగం వలన జ్యోతిర్మయుడైన, శాశ్వతుడైన భూతాత్మునిగా గుర్తిస్తారు'.

విశేషం: ఎఱ్ఱాప్రెగడకు శంకరాచార్యులవారు ప్రతిపాదించిన 'అద్వైత' సిద్ధాంతంపై గల మక్కువ ఇక్కడ వ్యక్తమౌతున్నది.

వ. అని మఱియుఁ గౌశికునకు ధర్మవ్యాధుండు బ్రహ్మవిద్యా ప్రభావంబు తెఱంగు సంప్రయోగరహస్యంబు తెలియ ని ట్లనియె. **106**

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; ధర్మవ్యాధుండు; మఱియున్= ఇంకను; కౌశికునకున్= (జిజ్ఞాసువుగా తనవద్దకు వచ్చిన ఆ విప్రుడికి); బ్రహ్మ, విద్యా, ప్రభావంబు, తెఱంగు= ఆధ్యాత్మికమైన జ్ఞానానికి సంబంధించిన మహిమయొక్క విధానం; సంప్రయోగ రహస్యంబు= కార్యాచరణలో స్వయంవ్యక్తమయ్యే దాపరికం; తెలియన్= తెల్ల మయ్యేటట్లుగా; ఇట్లు+ అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి అంతటితో ఆగకుండా, ధర్మవ్యాధుడు వేదాంతజ్ఞానంయొక్క మహిమ ఆచరణలో ఎట్లా వెలువడుతుందో కౌశికుడికి ఇట్లా తెలియచెప్పాడు.

విశేషం: ఇట - 'సంప్రయోగరహస్యంబు తెలియన్' - అనే ప్రయోగం అనుశీలించదగింది. సిద్ధాంతం వేరు. దానిని అనుభూతిలోకి తెచ్చుకొని ఆచరణలోకి అనువదించటం వేరు. సిద్ధాంతం అందరకూ తెలిసినదే కావచ్చును. దాని ఆచరణలోకి దానిని అనువదించటానికి- 'సంప్రయోగ రహస్యములు' - తెలియవలెను. అవి నిగూఢ విషయాలు. ఆ రహస్యాలను వెల్లడించేది తరువాతి పద్యం. అనగా ధర్మవ్యాధుడు కౌశికుడికి కేవలసిద్ధాంత జ్ఞానాన్ని మాత్రమే తెలిపి ఊరకొనక, సంప్రయోగ రహస్యాలను కూడ వివరించాడు.

సీ. 'తెలివి నొందిన బుద్ధిగల మహాత్ముండు శు ।
భాశుభ కర్మములందుఁ జొరఁడు;
క్రమమున సౌఖ్యదుఃఖము లాదిగా నశే ।
షద్వంద్వములయందు సమత నుండు;
విను, మట్టిపుణ్యున కొనరింపవలయు కా ।
ర్యం బెఱింగించెద ననుదినంబు
నియతాశియును జితేంద్రియుఁడు నై పూర్వరా ।
త్రమ్మున నపరరాత్రమ్మునందు

తే. యోగధారణనిరతుఁడై యుండవలయు;
నపుడు బోధదీపంబున నాత్మ నాత్మ
యందుఁ గనుచు నివాతదీపానుకారి ।
యై వెలుంగుచు నమృతమయత్వ మొందు. **107**

ప్రతిపదార్థం: తెలివిన్+ఒందిన= జ్ఞానాన్ని ఆర్జించిన; బుద్ధి, కల, మహాత్ముండు= మేధావి అయిన గొప్పవాడు; శుభ+అశుభ, కర్మములందున్= మేలుకలుగునట్టి లేక, కీడు కలుగునట్టి పనులలో; చొరఁడు= ప్రవేశించడు; క్రమమునన్= వరుసగా; సౌఖ్య, దుఃఖములు= సుఖం, బాధ; ఆదిగాన్=

మొదలైన; అశేష, ద్వంద్వముల+అందున్= అన్ని జంటలలో; సమతన్+ ఉండున్= సమభావంతో ఉంటాడు; వినుము; అట్టి; పుణ్యునకున్= పుణ్యాన్ని ఆర్జించేవాడికి; ఒనరింపవలయు, కార్యంబు= చేయవలసిన పని, కర్తవ్యం; ఎఱింగించెదన్= తెలుపుతాను; వినుము; అనుదినంబున్= ప్రతిదినమున్నూ; నియత+అశియును= మితముగా భుజించువాడున్నూ; జిత+ ఇంద్రియుం డును+ఐ= ఇంద్రియాలను నిగ్రహించిన వాడును అయి; పూర్వరా త్రమ్మునన్+అపర రాత్రమ్మునందున్= రాత్రికి ముందు వేళలలో, రాత్రి అయిన తరువాతి వేళలో అనగా అన్నివేళలలో; యోగధారణ నిరతుం డు+ఐ= యోగసాధనలో పూనిక కలవాడై; ఉండవలయున్; అపుడు= ఆసమయంలో - అనగా యోగసాధన వేళలో; బోధ దీపంబునన్= జ్ఞాన మనెడి దీపంవలన; ఆత్మున్= పరమాత్మను; ఆత్మ+అందున్= తన ఆత్మలో; కనుచున్= చూస్తూ; నివాత, దీప+ అనుకారి+ఐ= గాలి లేనిచోట వెలుగొందే దీపాన్ని అనుకరించేవాడై; వెలుంగుచున్= ప్రకాశిస్తూ; అమృతమయత్వము= చావులేని స్థితప్రజ్ఞత్వస్థితిని, అమరత్వాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: 'జ్ఞానాన్ని ఆర్జించిన మహానుభావుడు మంచిపనులలో గాని చెడు పనులలోగాని నిర్లిప్తుడుగా ఉంటాడు. అట్టివాడు - సుఖ దుఃఖాలు మొదలైన ద్వంద్వాలకు అతీతుడు. అన్నిటియెడల ఆతడు సమభావాన్ని పెంపొందించుకొంటాడు. అట్టి పుణ్యాత్ముడు చేయవలసిన కర్తవ్యాలను వివరిస్తాను వినుము. ప్రతిదినం, ఎల్లవేళల అతడు యోగసాధన చేస్తూ మితాహారియై ఇంద్రియాలను నిగ్రహించాలి. ఇంద్రియాలను నిగ్రహించిన యోగి ఆత్మలో పరమాత్మను దర్శించి, గాలి లేనిచోట వెలుగొందే దీపంవలె నిశ్చలు డై ప్రకాశిస్తాడు. అమృతమయుడు ఔతాడు.

విశేషం: (i) "తమసో మా జ్యోతిర్గమయ, అసతో మా సద్గమయ, మృత్యో ర్మా అమృతం గమయ" - అనే వేదమంత్రాన్ని ఇక్కడ అనుసంధించుకోవాలి.

(ii) ద్వంద్వాతీతుడు అయిన స్థితప్రజ్ఞుడిని గూర్చి విపులంగా భగవద్గీత రెండవ అధ్యాయంలో వివరించబడింది.

క. కామంబును గ్రోధంబును ।
నేమఱక జయింపవలయు నెల్ల విధములన్
ధీమహిత! యిదియ సతత । సే
క్షమంకర మైన పథము గృతబుద్ధులకున్.108

ప్రతిపదార్థం: ధీమహిత!= బుద్ధిచేత గొప్పవాడయినవాడా, మేధావి వయిన ఓ కౌశికా!; కామంబును= కోరికలను పెంచుకొనటమున్నూ; క్రోధంబును= కోపమును; ఏమఱక= మరపులేకుండ; జయింపవలయున్= గెలువవలెను; ఎల్ల, విధములన్= అన్నిరీతులలోను; ఇది+అ= ఇదిమాత్రమే అనగా కామక్రోధాలను అణచివేయటమే; కృతబుద్ధులకున్= పరిపక్వం అయిన మనస్సు కలవారలకు; సతత, క్షేమంకరము+ఐన, పథము= ఎల్లప్పుడును మేలును ఒనగూర్చెడి మార్గం.

తాత్పర్యం: మేధావి అయిన ఓ కౌశికమహర్షీ! ఎల్లప్పుడును ఏమరక కామక్రోధాలను అణచిపెట్టాలి. మనస్సు పరిపక్వమైనవారలకు ఇది ఒక్కటి మాత్రమే శుభాన్ని చేకూర్చే ఉత్తమమార్గం.

క. నిత్యముఁ గర్మియుఁ గర్మఫ ।
లత్యాగియు నగుట లెస్స లౌల్యవియోగం
బత్యుత్తమ యోగము ద ।
త్పత్యయలక్ష్యుండు సూవె బ్రాహ్మణుఁడు మహిన్. 109

ప్రతిపదార్థం: నిత్యమున్= అనుదినం, ఎల్లప్పుడును; కర్మియున్= పనులు చేసేవాడును; కర్మ, ఫల, త్యాగియున్= చేసిన పనుల వలన సంక్రమించే ఫలితాన్ని విడిచేవాడును; అగుట; లెస్స= మంచిది; లౌల్య, వియోగంబు= కోరికలనుండి విడివడటం; అతి+ఉత్తమ, యోగము= మిక్కిలి మంచిదైన

యోగం; బ్రాహ్మణుఁడు= విప్రుడు (జ్ఞానాన్ని ఆర్జించిన వాడు); మహిన్= భూమిపై; (భూలోకంలో); తత్+ప్రత్యయ, లక్ష్యుండు+చూవె= ఆ ఆశయానికి తగిన ఉదాహరణం సుమా!

తాత్పర్యం: మనుజుడు ఎల్లప్పుడు కర్మను ఆచరిస్తూనే ఉండవలెను; కాని, ఆ కర్మలవలన కలిగే ఫలాన్ని మాత్రం విడనాడాలి. తాను చేసే పనులలోనే మునిగి తేలుతుండటం మంచిది కాదు. కర్మఫలితాలను విడనాడటమే మిక్కిలి మంచిదైన యోగం. నిజానికి జ్ఞానాన్ని ఆర్జించిన బ్రాహ్మణుడు ఈ ఆశయానికి నిదర్శనప్రాయుడుగా అనుష్ఠాన వేదాంతిగా బ్రదుకదగును.

చ. అరయఁగ జీవితంబు గడునస్థిర; మింత యెఱింగి యాత్మ నె
వ్వరిదెసఁ గీడురోయక ధ్రువం బగు మైత్రి భజించి సత్కృపా
నిరతుఁడు నిష్పరిగ్రహుఁడు నిత్యతపస్వియు నిత్యతృప్తుఁడుం
బరమశమాన్వితుండు నగు బ్రాహ్మణుఁ డొందు సనాతన స్థితిన్.110

ప్రతిపదార్థం: అరయఁగన్= యోచించగా; జీవితంబు= బ్రదుకు; కడున్= మిక్కిలి; అస్థిరము= నిలుకడలేనట్టిది; ఇంత+ఎఱింగి= ఈ విషయాన్ని అంతటిని సంపూర్ణంగా గ్రహించి; ఆత్మన్= మనస్సులో; ఎవ్వరిదెసన్= ఎవరియెడలను; కీడు= చెడుగును; రోయక= తలపోయక; ధ్రువంబు+అగు= నిజమైన; మైత్రి= స్నేహం; భజించి= నెరపి; సత్+కృపా+నిరతుఁడు= మంచిదయ కలిగినవాడు; నిష్పరిగ్రహుఁడు= ఎవరి దగ్గరనుండియు ఏమియు అడిగి పుచ్చుకొననివాడు; నిత్య, తపస్వియున్= ఎల్లప్పుడు తపస్సు చేసికొనే వాడును; నిత్య, తృప్తుఁడున్= ఎల్లప్పుడును తనివిచెందిఉండే వాడును; పరమ, శమ+అన్వితుండున్= మిక్కిలి గొప్ప దైన శాంతం కలవాడును; అగు= అయినట్టి; బ్రాహ్మణుఁడు= జ్ఞానాన్ని ఆర్జించిన విప్రుఁడు; సనాతన, స్థితిన్= శాశ్వతంగా ఆనందమయమైన స్థితిని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఆలోచన చేస్తే మానవుల బ్రతుకులు బొత్తిగా నిలుకడ లేనట్టివి. ఈ విషయాన్ని అనుభవపూర్వకంగా తనలో తెలిసికొనినవాడు ఎవరికిని

ఎట్టి అపకారాన్ని తలపోయడు. అందరియెడ ప్రేమపూర్వక మైన స్నేహభావాన్నే పెంపొందించుకొంటాడు. అట్టి జ్ఞాని ఎల్లప్పుడు జాలితో నిండిన గుండె కలవాడై, ఎల్లప్పుడు తపస్సు చేసికొంటూ ఎవరినీ యాచించడు. ఎవరిదగ్గరనుండి ఏమీ తీసుకొనడు. అతడు నిత్యసంతృప్తుడు. ఆ విధంగా గొప్పఇంద్రియనిగ్రహం సాధించిన బ్రాహ్మణుడు, శాశ్వతమైన ఆనందస్థితిని పొందగలడు.

వ. నీవడిగిన యఖిలధర్మంబులు సంక్షేపరూపంబున నెఱింగించితి; నింక నెయ్యది వినవల' తనినం గౌశికుండు' 'మహాత్మా! వినవలయునవి యెల్లను విశదంబుగా వింటిం; బ్రబుద్ధుండ నైతి; నీవు సర్వజ్ఞుండ వగుట దెల్లం బయ్యె' ననిన ధర్మవ్యాధుం డతని కి ట్లనియె. 111

ప్రతిపదార్థం: నీవు+అడిగిన= నీవు ప్రశ్నించిన; అఖిల, ధర్మంబులు= అన్ని ధర్మాలు; సంక్షేపరూపంబునన్= కుదించి; ఎఱింగించితిన్= తెలియజేశాను; ఇంకన్= ఇకమీదట; ఏ+అది= ఏది; వినవలతు(వు)= ఆలకించకోరుతున్నావు; అనినన్; కౌశికుండు; మహాత్మా!= గొప్పఆత్మ కల ఓ ధర్మవ్యాధుడా!; వినవలయునవి= వినవలసినవి; ఎల్లను= అన్నియున్నూ; విశదంబుగాన్= తేటతెల్లంగా; వింటిన్= ఆలకించాను; ప్రబుద్ధుండను+ఐతిన్= మిక్కుటంగా విజ్ఞానంచేత మేలుకొలుపబడిన వాడను అయినాను; నీవు= నీవు; సర్వజ్ఞుండవు+అగుట= అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలిసినవాడవు కావటం; తెల్లంబు+అయ్యెన్= స్పష్టంగా తెలిసింది; అనినన్= అనిచెప్పగా; ధర్మవ్యాధుండు; అతనికిన్= ఆకౌశికుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నీవు ప్రశ్నించిన విషయాలు అన్నిటిని గూర్చి నేను నాకు తెలిసినంతమేర కుదించి నీకు తెలియజేసి ఉన్నాను. ఇక, నీవు మఱియేవిషయాలనుగూర్చి తెలియగోరుతున్నావు?'- అని ధర్మవ్యాధుడు కౌశికుడిని అడిగాడు. అంతట కౌశికుడు, 'మహానుభావా! వినవలసిన

విషయాలను అన్నింటిని నీవు విశదంగా వివరించి చెప్పగా విన్నాను. నీవు చెప్పిన విషయాలవలన నేను ఆధ్యాత్మికంగా మేలుకొనగలిగాను. నీవు అన్ని విషయాలు తెలిసిన సర్వజ్ఞుడవు అని నేను గుర్తించగలిగాను' అని ధర్మవ్యాధుడికి ధన్యవాదాలు సమర్పించాడు. అప్పుడు కౌశికుడితో ధర్మవ్యాధుడు ఈవిధంగా చెప్పాడు.

ధర్మవ్యాధుఁడు కౌశికునిఁ దన జననీజనకులయొద్దకుఁ దోడ్కొని పోవుట

(సం. 3-204-3)

క. 'ఏ నిమ్మెయి నుత్తమ వి ।
జ్ఞానోన్నతి వడయుటకు నిజం బగు మూలం
బైనది గల దొక ధర్మము ।
భూనుత! యది నీకు దృష్టముగ నెఱిఁగింతున్.112

ప్రతిపదార్థం: భూనుత!= భూమియందలి ప్రజలచేత పొగడబడిన ఓ కౌశికమునీ!; ఏను= నేను; ఈ+మెయిన్= ఈ రీతిగా; ఉత్తమ, విజ్ఞాన+ఉన్నతి= మంచి దైన గొప్ప జ్ఞానంలోని ఆధిక్యం; పడయుటకున్= పొందటానికి; నిజంబు+అగు= సత్యమైన; మూలంబు+ఐనది= ఆధారం అయినది; ఒక ధర్మము= ఒక ధర్మం (మంచిపనులు చేయటానికి మూలమైన ఆశయానికి ధర్మం అని వ్యపదేశం); కలదు= ఉంది; అది= ఆధర్మం; నీకు; దృష్టముగన్= కంటికి కనిపించేటట్లుగా, ప్రత్యక్షంగా; ఎఱిఁగింతున్= తెలుపగలను. (ఈపద్యానికి ఆయువుపట్టు అని చెప్పదగిన శబ్దం- 'దృష్టముగ'.)

తాత్పర్యం: ఓ కౌశిక మహర్షీ!, నీవు నన్ను సర్వజ్ఞుడ వంటూ ప్రస్తుతించావు. ఈ రీతిగా, నాకు ఇంతటి విజ్ఞానం సంక్రమించడానికి మూల మైన ధర్మం ఒకటి ఉన్నది. ఆ ధర్మాన్ని నీకు కంటికి కనుపించేటట్లుగా ఎరిగించగలను.

విశేషం: (i) ధర్మం అనేది ఒక ఆశయం. విశ్వశ్రేయానికి ఆధారభూతమైన ఆదర్శం - 'ధర్మము'. ఆ ధర్మం కంటికి కనబడేది కాదు గదా! అయినను

- ధర్మవ్యాధుఁడు తనకు ఆధారమైన ఆ ధర్మాన్ని ప్రత్యక్షంగా కౌశికుడికి చూపించగలనని చెప్పుతున్నాడు! జననీ జనకులే తనకు ప్రత్యక్ష దైవాలు అనిన్నీ, మాతాపితలసేవ తన ఆదర్శం అనిన్నీ ధర్మవ్యాధుడు చెప్పి - కౌశికుడికి తన తలిదండ్రులను చూపించాడు.

(ii) ధర్మం అనిర్వచనీయం. సుప్రసిద్ధమైనది - పెద్దల నిర్వచనం ఈ క్రింది శ్లోకంలో కానవచ్చును.

శ్లో॥ ధృతి క్షమా దమో౽స్తేయం । శౌచ మింద్రియనిగ్రహః
ధీ ర్విద్యా సత్య మక్రోధో । దశకం ధర్మలక్షణమ్. ॥ - మనుస్మృతి 6-92.

వ. అభ్యంతరగృహంబునకురమ్మని యతనిం దోడ్కొని చని మనోహరంబై చతుశ్శాలంబై వివిధసౌరభసంవాసితం బైన హర్మ్యంబునందు మహితాసనాసీను లైన వారిం దన జననీ జనకుల నభిమతాహారపరి తోషితులఁ బరమాంబరాభరణ గంధమాల్యాలం కృతమూర్తుల నతనికిం జూపి, తానును దత్పాదప్రణామంబు సేసి, వారలఁ గుశలం బడిగిన, నయ్యిరువురుం బుత్త్రున కి ట్లనిరి. 113

ప్రతిపదార్థం: అభ్యంతర, గృహంబునకున్= లోపలఉన్న గదిలోకి; రమ్ము+అని= దయచేయుము అని ఆహ్వానించి; తోడ్కొని= వెంటపెట్టుకొని; చని= వెళ్లి; మనస్+హరంబై= మనస్సును ఆకర్షించేదై - అందమైనది అయి; చతుః+శాలంబు+ఐ= నాలుగు వైపులను వాకిళ్లు కలిగినదై; వివిధ, సౌరభ, సంవాసితంబు+ఐన= పెక్కు పరిమళాలచేత గుబాళించేదైన; హర్మ్యంబు నందున్= మేడపై; మహిత+ఆసన+ఆసీనులు+ఐన+వారిన్= గొప్ప గద్దెలపై కూర్చొనిఉన్నవారలను; తన, జననీ, జనకులను= తన తల్లిని తండ్రిని; అభిమత+ఆహార, పరితోషితులన్= వారికి ఇష్టమైన ఆహారంతినటంచేత సంతృప్తిచెంది ఉన్నట్టి వారలను; పరమ+అంబర+ఆభరణ, గంధ, మాల్య+ అలంకృతమూర్తులన్= గొప్ప వైన వస్త్రాలు, సొమ్ములు, పరిమళద్రవ్యాలు,

పువ్వులతో అలంకరించబడిన దేహాలు కలవారలను; అతనికిన్+చూపి= (ఆ కౌశికుడికి చూపించి); తానును= (ధర్మవ్యాధుడును); తత్+పాద, ప్రణామంబు+చేసి= ఆ తలిదండ్రుల కాళ్లకు మ్రొక్కి; వారలన్= వారిని; కుశలంబు= క్షేమంగా ఉన్నారా అని; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+ఇరువురున్= ఆతలిదండ్రులు ఇద్దరున్నూ; పుత్త్రునకున్= కొడుకుతో (ధర్మవ్యాధుడితో); ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: అంతట ధర్మవ్యాధుడు కౌశికమహర్షిని సగౌరవంగా ఆహ్వానించి, తన ఇంటిలో ఉన్న ఒక గదిలోకి తీసికొనివెళ్ళాడు; అది మిక్కిలి అందమైనది. ఆ అభ్యంతర గృహానికి నలువైపుల సావిడులు ఉన్నాయి. మంచి గాలి వెలుతురు అక్కడకు చేరు తున్నాయి. అది ఒక పెద్దమేడ. ఆ మేడపై పెక్కు పరిమళాలు గుబాళిస్తాయి. అందు, గొప్ప ఆసనాలమీద ధర్మవ్యాధుడి తలిదండ్రులు కూర్చొని ఉన్నారు. కోరిన ఆహారాన్ని వారు గైకొని, సంతృప్తిగా సేదతీరుతున్నారు. వారిదేహాలపై క్రొంగ్రొత్తపువ్వులు, ధగధగలాడే నగలు ఒప్పారుతున్నాయి. ధర్మవ్యాధుడు తన తలిదండ్రులను కౌశికుడికి పరిచయం చేసి, తాను వారలిరువురి పాదాలకు మ్రొక్కి, వారి యోగక్షేమాలను గుర్చి అడిగి తెలిసికొన్నాడు. అప్పుడు ధర్మవ్యాధుడి తలిదండ్రులు తమ తనయుడితో ఇట్లా పలికారు.

సీ. **'అన్న! కుమార! నీయట్టి సత్పుత్త్రుండు ।**
గలుగ మా కేమిటఁ గడమ సెపుమ!
నీ చేయు ధర్మంబ నీకుఁ దోడయ్యెడుఁ ।
బరమాయు రర్థసంపదలుఁ గనుము;
నీ చరిత్రంబున నిఖిలవంశముఁ బవి ।
త్రిత మయ్యె మానుషదేహ మేల
ధరియించితో కాని తత్త్వమారయఁ బర ।
దేవత వీవు; సందియము వలదు;

తే. **వాఙ్మనఃకర్మములఁ బితృవత్సలత్వ ।**
మొక్కరూపుగఁ జలుపుచు నున్నయట్టి
సద్గుణాకరు నిన్నెన్ని జామదగ్న్యు ।
నొకని నెన్నంగఁ దగుఁ గాక యొరులు గలరె!' **114**

ప్రతిపదార్థం: అన్న!= ప్రియమైనవాడా!; కుమార!= కొడుకా; నీ+అట్టి= నీవంటి; సత్+పుత్త్రుండు= మంచి కొడుకు; కలుగన్= ఉండగా; మాకున్+ఏమిటన్= మాకు ఎందులో; కడమ+చెపుమ= కొదువ కలదో చెప్పుము అనగా మాకు ఎట్టి లోటును లేదు అన్నమాట; నీచేయుధర్మంబు+అ= నీవు ఆచరించే ధర్మమే; నీకున్; తోడు+అయ్యెడున్= సాయం ఔతుంది; పరమ+ఆయుః+అర్థ, సంపదలున్+కనుము= గొప్పదైన ఆయుర్దాయం (చిరకాలం బ్రతకటం), ధనం, ఐశ్వర్యాలు పొందుము; నీచరిత్రంబునన్= నీ ప్రవర్తన వలన; నిఖిల, వంశమున్= మన వంశం అంతయు; పవిత్రతము+అయ్యెన్= పావనం అయింది; (నీవు) మానుష, దేహము= మనుజుడిగా పుట్టి మనుజుడి శరీరాన్ని; ఏల= ఎందుకు; ధరియించితి+ఓ, కాని= వహించావో కాని; తత్త్వము= నిజం; ఆరయన్= పరిశీలించగా; పరదేవతవు+ఈవు= నీవు దేవతలలో కెల్ల గొప్ప దేవతవు; సందియము, వలదు= ఎట్టి అనుమానానికి ఆస్కారం లేదు; వాక్+మనస్+కర్మములన్= త్రికరణశుద్ధిగా - వాక్కుతోడ, మనస్సుతోడ, ఆచరణయందును; పితృ, వత్సలత్వము= తలిదండ్రులపై ప్రేముడి; ఒక్కరూపుగన్= ఎడతెగకుండగ ఒకేవాదిరిగా; చలుపుచున్+ఉన్న+అట్టి= కొనసాగిస్తున్న; సత్+గుణ+ఆకరున్= మంచి లక్షణాలకు నెలవైన వాడిని; నిన్నున్+ఎన్ని= నిన్ను పరిగణనం చేసి; జామదగ్న్యున్= జమదగ్ని కొడుకు అయిన పరశురాముడిని; ఒకనిన్= మరియొకడిని; ఎన్నంగన్+తగున్+కాక= లెక్కించటం; తగునే కాని; ఒరులు= ఇతరులు; కలరె= ఉన్నారా? (లేరు అని భావం).

తాత్పర్యం: 'ప్రియమైన కుమారా! ధర్మవ్యాధా! నీ వంటి మంచికొడుకు మాకు ఉండగా, ఇక మా కేమి లోటు? నీవు ధర్మమూర్తివి. నీవు రక్షిస్తున్న ధర్మమే నిన్ను రక్షించగలదు. నీవు చిరకాలం జీవించి ధనధాన్యసంపదలతో తులతూగుదువు గాక, నీ ప్రవర్తన వలన మన వంశం పావనమైనది. నీవు కారణజన్ముడవు. నీవు దేవతలలో దేవతవు గాని మనుష్యమాత్రుడవు గావు. అసలు ఈ భూలోకంలో నీవు ఎందుకు ఈ మానవదేహాన్ని ధరించి అవతరించావో మాకు తెలియదు. నీవు త్రికరణశుద్ధితో తలిదండ్రులను ఆరాధిస్తున్నావు. ఇందుకు ఎంతమాత్రం సందియం లేదు. నీదీక్ష నిరుపమానం. తలిదండ్రులను ఆరాధించటంలో నిన్ను ముందు చెప్పి, తదుపరి పరశురాముడిని చెప్పాలి. మరి ఎవ్వరును నీకు సాటి రారు'.

విశేషం: పరశురాముడి కథ సుప్రసిద్ధం. ఆతడు పితృవాక్యపరిపాలనకై తల్లిని వధించి తదుపరి సంప్రీతుడైన తండ్రిచేత తల్లిని తిరిగి బ్రతికేటట్లు వరం సాధించాడు.

వ. పలికి; రప్పుడు ధర్మవ్యాధుండు వారికిం గౌశికుం జూపి, 'యిమ్మహాత్ముండు మనలఁ జూచువేడ్కనిటవచ్చె' నని చెప్పిన నావృద్ధు లతనికి నర్ఘ్యసత్కారంబులు గావించినం, గైకొని, యతండు వారలఁగుశలం బడిగెఁ; నంత నవ్విప్రునకు లుబ్ధకుం డి ట్లనియె. 115

ప్రతిపదార్థం: అని పలికిరి= అని అన్నారు; అప్పుడు= ఆసమయంలో; ధర్మవ్యాధుండు; వారికిన్= (తన తలిదండ్రులకు); కౌశికున్+చూపి= కౌశికుడిని చూపించి; ఈ మహా+ ఆత్ముండు= ఈ గొప్ప ఆత్మ కలవాడైన బ్రాహ్మణుడు; మనలన్; చూచువేడ్కన్= దర్శించ వలె ననే కుతూహలంతో; ఇట+వచ్చెన్= ఇచటికి వచ్చాడు; అని చెప్పినన్; ఆవృద్ధులు= ఆముదుసలులు; అతనికిన్= ఆ కౌశికుడికి; అర్ఘ్యసత్కారంబులు= తగిన గౌరవమర్యాదలు; కావించినన్= చేయగా; కైకొని= స్వీకరించి; అతండును= అతడును

(కౌశికుడును); వారలన్= వారలను అనగా ఆ వృద్ధులను; కుశలంబు+ అడిగెన్= యోగక్షేమాలనుగూర్చి ప్రశ్నించాడు; అంతన్= తదుపరి; లుబ్ధకుండు= వ్యాధుడు; ఆ+విప్రునకున్= ఆ బ్రాహ్మణుడితో (కౌశికునకు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పిన పిమ్మట ధర్మవ్యాధుడు తన తలిదండ్రులకు కౌశికుడిని చూపించి, 'ఈ మహానుభావుడు మనలను చూడవలె నని పూనికతో ఇక్కడికి వచ్చాడు' అని అన్నాడు. ఆ వృద్ధులు కౌశికుడికి స్వాగతమర్యాదలు చేశారు. కౌశికుడు వారి యోగక్షేమాలనుగూర్చి ప్రశ్నించాడు. అంతట ధర్మవ్యాధుడు కౌశికుడికి ఇట్లా చెప్పాడు.

సీ. 'జననుత! వీరు నా జననియు జనకుండుఁ ।
జూవె! వీరలకు శుశ్రూష సేసి,
యిట్టి పరిజ్ఞాన మేనుఁ బ్రాపించితి ।
నమరులఁ బూజింతు రర్థి నెల్ల
వారును; నొండు దైవంబుల నెఱుఁగ;
నీ వృద్ధుల నాపాలి వేల్పు లనఘ!
కమనీయ ఫలపుష్పగంధభూషణవస్త్ర ।
ములు మనోహరభక్ష్యభోజ్యములును

తే. వీరి కెపుడు నివేదింతు, వేడ్కఁ బుత్ర ।
దారసహితుండ నై నియతముగ సేవ
యాచరింతును; వేదముల్ యజ్ఞములు వ్ర ।
తంబులును వీర నా కను తలఁపు దృఢము. 116

ప్రతిపదార్థం: జననుత!= ప్రజలచేత కీర్తించబడినవాడా! కౌశికమునీ; వీరు= ఈ పెద్దలు; నా జననియున్, జనకుండున్= నా తల్లిగారు తండ్రిగారు; చూవె= సుమ్ము; వీరలకున్= వీరికి; శుశ్రూష= పరిచర్య; చేసి= సలిపి;

ఇట్టి= ఈ విధమైన; పరిజ్ఞానము= గొప్పజ్ఞానం; ఏనున్= నేనును; ప్రాపించితిన్= పొందాను; ఎల్లవారును= అందరును; అర్థిన్= కోరికతో; అమరులన్= దేవతలను; పూజింతురు= అర్చిస్తారు; ఒండుదైవములన్= వేరే దేవతలను; ఎఱుఁగన్= నేనెరుగను; ఈ వృద్ధులు+అ= ఈ ముదుసలి వారే; నా పాలి వేల్పులు= నాకు లభించిన దేవతలు; అనఘ!= పాపం చేయనట్టి ఓ పుణ్యాత్ముడా!; కమనీయ, ఫల పుష్ప, గంధ, భూషణ, వస్త్రములున్= కమ్మని పండ్లు, పూలు, పరిమళద్రవ్యాలు, నగలు, బట్టలు; మనస్+హర,భక్ష్యభోజ్యములును= మనస్సుకు అనువైన తినుబండారాలున్నూ; వీరికిన్; ఎపుడున్= ఎల్లప్పుడును; నివేదింతున్= సమర్పిస్తాను; వేడ్కన్= కుతూహలంతో; పుత్త్ర, దార, సహితుండను+ఐ= కొడుకులతో, భార్యతో కూడిన వాడనై; నియతముగన్= దీక్షతో; సేవ= పరిచర్య; ఆచరింతును= చేస్తాను; వేదముల్= వేదాలు; యజ్ఞముల్= క్రతువులు; వ్రతంబులును= నోములును; నాకున్= నాకు; వీరు+అ= వీరే; అను, తలఁపు= అనే ఆలోచన; దృఢము= గట్టిది.

తాత్పర్యం: 'ప్రజలచేత కీర్తించబడినవాడా! నాతలిదండ్రులు వీరే. వీరికి పరిచర్య చేయటంచేతనే నాకు ఈ పరిజ్ఞానం లభించింది. అందరూ వేడుకతో తమకోరికలు ఈడేరటానికై దేవతలను పూజిస్తారు. నాకు నాతలిదండ్రులే ప్రత్యక్షదేవతలు. వేరే దేవతలను నేను ఎఱుగను. ఈ ముదుసలులే నాపాలిటి వేల్పులు. వీరలను చందనచర్చతో, పండ్లతో, పూవులతో వారలకు కావలసిన తినుబండారాలతో అర్చిస్తాను. నా శ్రీమతితో నా బిడ్డలతో కలిసి వీరికి సేవ చేస్తాను. వారి సేవయే నేను చేసే యజ్ఞం. అదియే వేదాలు, నోములు - అనే భావమే నాలో లోతుగా నాటుకొని ఉన్నది.

తే. **జనని జనకుఁడు సద్గురుఁ డనలుఁ డాత్మఁ।**
డనఁగ నియ్యేవురును నే గృహస్థుచేత
సుగతివాంఛఁ బ్రసాదితు లగుదు రట్టి।
వాఁడ సూవె ధర్మాత్ముండు వసుధమీఁద'. **117**

ప్రతిపదార్థం: జనని=తల్లి; జనకుండు= తండ్రి; సత్+గురుఁడు= మంచిఒజ్జ; అనలుఁడు= అగ్ని; ఆత్ముఁడు= ఆత్మ; అనఁగన్= అని చెప్పబడెడి; ఈ+ఏవురునున్= ఈ అయిదుగురున్నూ; ఏగృహస్థుచేతన్= ఏ ఇంటియజమానిచేత; సుగతివాంఛన్= పుణ్యం లభించవలె ననే కోరికతో; ప్రసాదితులు+అగుదురు= సంతోషం పొందించబడిన వారు అగుదురో; అట్టివాఁడు+అ+చూవె= అట్టివాడే సుమా; వసుధమీఁదన్= భూమిపై; ధర్మ+ఆత్ముండు= ధర్మంతో కూడిన ఆత్మకలవాడు - సుకృతుడు.

తాత్పర్యం: పుణ్యంకోరే గృహమేధి-తల్లి, తండ్రి, గురువు, అగ్ని, ఆత్మ అనే అయిదుగురిని అర్చించి సంతోషపరచాలి. భూమిపై అట్టి గృహస్థుడే ధర్మాత్ముడు.'

వ. **అని చెప్పి యిట్లనియెఁ; 'బతివ్రత పనుపునం జేసి నీవు ధర్మజ్ఞానార్థంబు నాయున్నయెడకుం జనుదెంచిన నప్పతివ్రతవలని యనుగ్రహంబున నీకు నెల్లవియు నెఱింగించితిఁ గాని, నీదెస నాదు చిత్తంబు ప్రియంపడియుండదు; నీచేసిన యకార్యం బొక్కటి గల దది యెయ్యది యనిన;** **118**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు; పతివ్రతపనుపునన్+చేసి= గొప్పఇల్లాలు యొక్క నియోగంవలన; నీవు; ధర్మ, జ్ఞాన+అర్థంబు= ధర్మాన్నిగూర్చిన జ్ఞానాన్ని పొందటానికై; నా+ఉన్న+ఎడకున్= నేను ఉన్నచోటికి; చనుదెంచినన్= రాగా; ఆ+పతివ్రతవలని, అనుగ్రహంబునన్= ఆ మంచి ఇల్లాలి యొక్క దయవలన; నీకున్= నీకు; ఎల్లవియున్= సర్వమును; ఎఱింగించితిన్= తెలిపాను; కాని= అంతేకాని; నీదెసన్= నీయెడ; నా+చిత్తము= నాదు, మనస్సు; ప్రియంపడి, ఉండదు= ప్రీతిని చెందియుండ లేదు; నీ చేసిన= నీవు ఒనర్చిన; అకార్యంబు= చెడ్డపని; ఒక్కటి కలదు= ఒకటి ఉన్నది; అది+ఎయ్యది+అనినన్= ఆ (అకార్యం) ఏది అని అడిగితే.

తాత్పర్యం: అని చెప్పి ధర్మవ్యాధుడు ఇట్లు పలికాడు: ‘ ఆ పతివ్రత అనుగ్రహంతో నిన్ను పంపింది కాబట్టి, ఆమెపై నాకు గల గౌరవప్రపత్తి చేతను, నీవు జిజ్ఞాసువుగా నే నున్న చోటికే వచ్చి అడిగావు కాబట్టి నాకు తెలిసినమేరకు అంతయు నీకు తెలియజెప్పాను. కాని, నీయందు నాకు ప్రీతి యేర్పడ లేదు. దానికి ఒక మూలకారణం ఉన్నది. నీవు చేసినది ఒక చెడ్డపని ఉన్నది. ఆ చెడ్డపని ఏది అని అడిగితే.

ఉ. ఎంతయు వృద్ధు లై తమకు నీ వొకరుండవ తెప్ప గాఁగ న
త్యంతముదంబునన్ బ్రదుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని
శ్చింతుఁడ వై సదాధ్యయనశీలత వారియనుజ్ఞ లేక యే
కాంతమ యెమ్మెయిన్ వెడలి తక్కట! నీవు గరంబు క్రూరతన్. 119

ప్రతిపదార్థం: ఎంతయున్, వృద్ధులు+ఐ= మిక్కిలి ముసలివారై; తమకున్; నీవు+ఒకరుండవు+అ= నీవు ఒక్కడవు మాత్రమే; తెప్పకాఁగన్= ఆధారం కాగా; (తెప్ప= నదిని దాటే ఉడుపం); అత్యంత ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; బ్రదుకు= జీవించే; తల్లినిన్ తండ్రినిన్= తల్లిని తండ్రిని; ఉజ్జగించి= వదలిపెట్టి; అక్కట= అయ్యో!; నిశ్చింతుఁడవు+ఐ= విచారం లేనట్టివాడవై; సదా+అధ్యయన, శీలతన్= ఎల్లప్పుడును వేదాలను వల్లెవేసే స్వభావం చొప్పున; వారి+అనుజ్ఞ, లేక= ఆ తలిదండ్రులయొక్క అనుమతి లేకుండా; ఏకాంతము+అ= ఒంటరిగా; ఏ+మెయిన్= ఏరీతిగా; నీవు; కరంబు= మిక్కిలి; క్రూరతన్= కఠినత్వంతో; వెడలితి= వెళ్ళావు.

తాత్పర్యం: నీ తలిదండ్రులు మిక్కిలి ముసలివారు. వారికి నీవు ఒకడవే ఆధారం. నీమీదనే తమ ప్రేముడిని అంతయు పెట్టుకొని బ్రదుకుతున్న నీతలిదండ్రులను వదలిపెట్టావు. వారిని వదలివచ్చేటప్పుడు నీవు వారి అనుమతిని తీసికొన లేదు. నీవు వేదాధ్యయనం చేసి జ్ఞానాన్ని ఆర్జించి, తరింప నెంచావు. కాని, నీతలిదండ్రులగతి ఏమవుతుందో అని ఆలోచించలేదు. కఠినమైన నీ ప్రవర్తన నాకు నచ్చ లేదు.

ఆ. నీక వగచి వగచి నిర్భిన్నహృదయు లై।
విగతచక్షు లైరి వినవె? వార;
లరిగి యింక నైన నమ్ముదుసళ్ల యు।
దగ్రశోకవహ్ని నార్పవయ్య! 120

ప్రతిపదార్థం: నీకున్+అ= నీకోసమే; వగచి వగచి= మిక్కిలిదుఃఖించి; నిర్భిన్న హృదయులు+ఐ= పగిలిన గుండెలు కలవారై; వారు= (నీతలిదండ్రులు); విగతచక్షులు+ఐరి= పోయిన కన్నులు కలవారు అయ్యారు - గ్రుడ్డివార లయ్యారు. వినవె= ఆలకించవా?; అరిగి= వెడలి; ఇంకన్+ఐనన్= ఇకమీదట నైన; ఆ+ ముదుసళ్ల+ఉదగ్ర, శోక, వహ్నిన్= ఆ వృద్ధులయొక్కగొప్ప దైన దుఃఖం అనెడి అగ్నిని; ఆర్పవయ్య= ఉపశమింప చేయుము.

తాత్పర్యం: నీకోసమే మిక్కుటంగా గుండెలు పగిలేటట్లు నీ తలిదండ్రులు ఏడ్చి యేడ్చి గ్రుడ్డివారయ్యారు. ఆ సంగతి నీవు ఆలకించ లేదా? ఇకమీదట నైనా, నీవు వారిదగ్గరకు పోయి, ఆ ముదుసలుల శోకాగ్నిని ఆర్పవలెను సుమా!

క. నీయధ్యయనమ్మును సుకృ।
తాయాసము నిష్ఫలంబు లై చను గురుసే
వాయుక్తి లేక తక్కినఁ।
జేయుము నాపలుకు; మేలు సేకుఱు నీకున్.’ 121

ప్రతిపదార్థం: నీ+అధ్యయనమ్మును= నీ చదువున్నూ; సుకృత+ఆయాసమున్= పుణ్యాన్ని ఆర్జించటానికై పడెడి శ్రమయున్నూ; గురు, సేవా, యుక్తి, లేక తక్కినన్= తలిదండ్రుల పరిచర్య లేకపోతే; నిష్ఫలంబులు+ఐ= ఫలం లేనట్టివి అయి అనగా వ్యర్థాలై; చనున్=పోతాయి; నాపలుకు చేయుము= నేను చెప్పిన చొప్పున నడచుకొనుము; నీకున్= నీకు; మేలు= శుభం; చేకుఱున్= కలుగుతుంది.

తాత్పర్యం: నీ చదువు గాని, పుణ్యాన్ని ఆర్జించటానికై నీవు పడెడి శ్రమగాని, తలిదండ్రులకు పరిచర్య చేయకపోతే వ్యర్థా లౌతాయి సుమా! నేను చెప్పిన విధంగా నడచుకొనుము. నీకు మేలు కలుగుతుంది'.

విశేషం: గురుశబ్దానికి విశాల మైన అర్థం ఉన్నది. గురువులు= తలిదండ్రులు, మాతామహి పితామహులు, పినతండ్రి,అన్న, మేనమామ, ఉపాధ్యాయుఁడు, విద్య చెప్పినవాడు, మంత్రోపదేశం చేసినవాడు, గురుపరిచర్య - లేకుంటే జ్ఞానం కలుగదు అని సనాతన సంప్రదాయం.

వ. అనినఁ గౌశికుం డతని కిట్లనియె. 22

తాత్పర్యం: అనగా విని కౌశికుడు ఆ ధర్మవ్యాధుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'ఇది యట్టిద నీ చెప్పిన ।
సదమలహితవాక్యభంగి సకలము వింటిన్;
వదలక యిమ్మెయిన చరిం ।
చెద గురుజనములకుఁ బ్రీతిఁ జేసెద ననఘా! 123

ప్రతిపదార్థం: అనఘా!= పాపం లేనట్టివాడా!(ఓ ధర్మవ్యాధుడా!); ఇది= (నీవు చెప్పింది); అట్టిది+అ= అటువంటిదే, నిజమే; నీ, చెప్పిన= నీవు చెప్పిన; సత్+అమల, హిత, వాక్య, భంగి= మంచివి, స్వచ్ఛమైనవి, మేలుచేకూర్చేవి అయిన మాటలతీరు; సకలమున్= అంతయును; వింటిన్= ఆలకించాను; వదలక= విడిచిపెట్టక; ఈ+మెయిన్+అ= ఈవిధంగానే; చరించెదన్= నడచుకొంటాను; గురుజనములకున్= పెద్దలయిన తలిదండ్రులకు; ప్రీతిన్= సంతోషాన్ని; చేసెదన్= కల్గిస్తాను.

తాత్పర్యం: అని చెప్పిన ధర్మవ్యాధుడితో కౌశికుడు ఇట్లా పలికాడు: 'పుణ్యాత్ముఁడ వైన ఓ ధర్మవ్యాధుడా! నీవు చెప్పినమాటలు సరిఅయినవే. స్వచ్ఛమైనవే. నాకు మేలు చేకూర్చేవే. వాటిని సావధానంగా విన్నాను. నీవు చెప్పిన విధంగా నడచుకొంటాను. నా తలిదండ్రులకు పరిచర్య చేసి నా జన్మ ధన్యం చేసికొంటాను.

క. నాదైన భాగ్యవశమునఁ ।
గాదే నీతోడి చెలిమి గలిగెం, బరమా
హ్లాదమనస్కుఁడ నైతి, శు ।
భోదయముల కెల్ల నింక యుక్తుఁడ నైతిన్. 124

ప్రతిపదార్థం: నాదు+ఐన= నాకు సంక్రమించిన; భాగ్య, వశమునన్+కాదు+ఏ= అదృష్టంచొప్పున కదా; నీతోడి, చెలిమి= నీతో స్నేహం; కలిగెన్= ఏర్పడింది; పరమ+ఆహ్లాద, మనస్కుఁడన్+ ఐతిన్= మిక్కుటమైన సంతోషంతో నిండిన మనస్సు కలవాడను అయినాను; శుభ+ఉదయములకున్+ఎల్లన్= మేలు కలిగించే వాటి కన్నిటికిని; యుక్తుఁడను+ఐతిన్= యోగ్యుడిని అయినాను.

తాత్పర్యం: నీతో స్నేహం కలగటం నా అదృష్టం. నా మనస్సు అమితమైన సంతోషంతో నిండింది. నాకు కలుగబోయే శుభాల కన్నిటికిని ఇది సూచకం.

క. పాపకృతం బగు దుర్గతి । మోపుఁ గనకయుండ ననుఁ బ్రబోధాత్మక లీ
లాపరిణతుఁ గావించితి; । నాపాలిటి వేల్ప వీవ నరనుతచరితా! 125

ప్రతిపదార్థం: నర, నుత, చరితా!= జనులచేత పొగడబడిన ప్రవర్తన కలవాడా!; ఓ ధర్మవ్యాధుడా!; పాపకృతంబు+అగు= పాపం చేయటంచేత ఏర్పడిన; దుర్గతి= చెడుమార్గం; మోపున్+కనక+ఉండన్= బరువు కాంచక ఉండేటట్లుగా; ననున్= నన్ను; ప్రబోధ+ఆత్మక, లీలా, పరిణతున్+ కావించితి(వి)= జ్ఞానంవలన కలిగే మహిమతో గొప్పవాడిగా వికసించేటట్లుగా చేశావు; ఈవు+అ= నీవే; నాపాలిటి= నాకు సంబంధించిన; వేల్పవు= దేవతవు.

తాత్పర్యం: జనులచేత పొగడబడే ప్రవర్తన కలవాడా, ఓ ధర్మవ్యాధా! పాపం చేయటంచేత దుర్గతి ప్రాప్తించి ఆ బరువు మోస్తూ బ్రదుకకుండ నీవు నన్ను ఉద్ధరించి, నాకు జ్ఞానం గలిగించి, గొప్పవాడినిగా నేను వికసించేటట్లు చేశావు. నీవే నా పాలిటి దేవుడవు.

చ. అనుపమ మెట్టివారలకు నందదు ధర్మపథంబు ధాత్రిలోః
విను, పదివేవురం దొకఁడు విశ్రుతధర్మపరాయణుండు గ
ల్గునొ కలుగండొ సందియము; గోరి సనాతనధర్మ మూఁది యె
వ్వనికిని నీకుఁ బోలె బుధవత్సల! యిట్లు చరింపవచ్చునే. 126

ప్రతిపదార్థం: బుధవత్సల!= జ్ఞానులచేత ఆదరించబడెడివాడా!; విను= ఆలకింపుము; ధాత్రిలోన్= లోకములో; ధర్మ, పథంబు= ధర్మంతో గూడిన మార్గం; అనుపమము= సాటి లేనిది; ఎట్టివారలకున్= ఎటువంటి మనుజులకు ఐనను; అందదు= దొరకదు; పదివేవురందున్+ఒకఁడు= పదివేలమంది మనుజులలో ఒక్కడు; విశ్రుత, ధర్మ, పరాయణుండు= కీర్తికి ఎక్కిన ధర్మవ్రతుడు అనగా ధర్మాన్నే ఎల్లప్పుడు పాటించేవాడు అనే పేరు ప్రతిష్ఠలు ఆర్జించినవాడు; కల్గును+ఒ= కలుగునా?; కలుగండు+ఒ= కలుగడా?; సందియము= సంశయించవలసింది; కోరి= పూనికతో; సనాతనధర్మము+ ఊఁది= ప్రాచీనకాలంనుండి అనుస్యూతంగా ఆచరించబడుతున్న ధర్మాన్ని తెలిసి గ్రహించి; ఇట్లు= ఈవిధంగా; ఎవ్వనికిని= ఏమనుజుడికి ఐనను; నీకున్+పోలెన్= నీవు ఆచరిస్తున్న విధాన్ని పోలి; చరింపన్‌వచ్చున్+ఏ?= నడవడిక తీర్చిదిద్దుకొనటానికి వీలు ఉన్నదా?

తాత్పర్యం: జ్ఞానులచేత ఆరాధింపబడెడి ఓ ధర్మవ్యాధుడా!; ధర్మమార్గం మిక్కిలి సూక్ష్మమైనది. సాటి లేనిది, ఎట్టివారలకును అది అందుబాటులో ఉండనట్టిది. ఈ భూప్రజలలో పదివేలమంది జనులలో ఒకడైనను అచ్చమైన ధర్మాన్ని ఆచరిస్తున్నట్లు పేరుప్రతిష్ఠలు ఆర్జించినవాడు ఉన్నాడా? ఉన్నట్లు ఖండితంగా చెప్పలేం. సనాతనధర్మాన్ని నీవలె గ్రహించిన అనుష్ఠానవేదాంతి మరియొకడు లేడు.

చ. నిను నొక శూద్రుఁగాఁ దలఁపనేర గుణాకర; నీ చరిత్రముం
గన మది నద్భుతం బొలసెఁ; గావున నెయ్యది కారణంబుగా
నొనరఁగ నిట్టి జన్మమును నొందితి చెప్పుము; భూత భావివ
ర్తనములయందు నీకు విదితంబులు గానివి గల్గ వెమ్మెయిన్'. 127

ప్రతిపదార్థం: గుణ+ఆకర!= మంచి లక్షణాలకు నెలవైన వాడా! ఓ ధర్మవ్యాధుడా!; నినున్= నిన్ను; ఒక, శూద్రున్+కాన్= ఏదో ఒక శూద్రవంశంలో పుట్టిన సామాన్య మనుజుడిగా; తలఁపనేరన్= ఎంచలేను; నీచరిత్రమున్+కనన్= నీశీలమును అరయగా; మదిన్= మనసునందున; అద్భుతంబు+ఒలసెన్= వింత గలిగింది; కావునన్= కాబట్టి; ఏ+అది= ఏది; కారణంబు+కాన్= హేతువుగా; ఒనరఁగన్= పొసగేటట్లుగా; ఇట్టి= ఈవిధమైన; జన్మమును= పుట్టుకను; ఒందితి(వి)= పొందావో; చెప్పుము= వివరించుము; భూత, భావి, వర్తనములయందున్= లోగడ జరిగినట్టి ఘటనలలోగాని, ఇక ముందుకాలంలో జరుగబోయే ఘటనలలోగాని; నీకున్, విదితంబులు+కానివి= నీకు తెలియనట్టివి; ఏ+మెయిన్= ఏరీతిగా నైనను; కల్గవు= ఉండవు.

తాత్పర్యం: మంచి గుణాలకు నెలవైన ఓ ధర్మవ్యాధుడా! నీవు ఒక శూద్రుడవు మాత్రమే అని భావించలేను; నీ శీలాన్ని అనుశీలించగా నామనస్సులోఇది మిక్కిలి వింతగా ఉన్నది. నీవు ఏకారణంవలన శూద్రజన్మను పొందావో దయచేసి చెప్పుము. నీవు త్రికాలజ్ఞుడవు. నీకు తెలియని అంశాలు గతానికి సంబంధించినవి గాని భవిష్యత్తుకు సంబంధించినవి గాని లేవు.'

వ. అనిన నతనికి ధర్మవ్యాధుం డిట్లనియె. 128

తాత్పర్యం: అని కౌశికుడు పల్కగా, ధర్మవ్యాధుడు అతడికి ఈవిధంగా బదులు పలికాడు.

ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ దన పూర్వజన్మ వృత్తాంతంబు సెప్పుట
(సం. 3-205-21)

క. 'జననుత! నీ వెయ్యది యడి ।
గినఁ దెలుపుట నా కవశ్యకృత్యము గాదే!
విను చెప్పెదఁ; బూర్వభవం ।
బున నే నొక బ్రాహ్మణుండఁ బుణ్యచరితుఁడన్. 129

ప్రతిపదార్థం: జన, నుత!= ప్రజలచేత కీర్తించబడినవాడా!; నీవు+ఏ+అది+ అడిగినన్= నీవు దేనిని గూర్చి ప్రశ్నించినా; తెలుపుట= వివరించి చెప్పటం; నాకున్+అవశ్య, కృత్యము+కాదు+ఏ= నాకు తప్పనిసరిగా నెరవేర్చవలసిన పనియే సుమా; విను, చెప్పెదన్; పూర్వ, భవంబునన్= లోగడ పుట్టువునందు; ఏన్= నేను; ఒక, బ్రాహ్మణుండన్= ఒక విప్రుడను; పుణ్య చరితుఁడన్= సుకృతంతో కూడిన ప్రవర్తన కలవాడను.

తాత్పర్యం: ప్రజలచేత కీర్తించబడిన ఓ కౌశికమునీ! నీవు ఏ ప్రశ్నలు వేసినా వాటికి అన్నింటికి సమాధానాలు చెప్పటం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. గతజన్మలో నేను ఒక బ్రాహ్మణుడను. సుకృతాన్ని ఆర్జించే ప్రవర్తన గలవాడిని.

వ. వేదవేదాంగపారంగతుండ నై యుండుదు; నాకుం బ్రియసఖుం డైన యొక్క రాజపుత్త్రుతోడి సంగతిం జేసి ధనుర్వేదంబును నభ్యసించితి; నొక్కనాఁ డమ్మహీపతి వేఁట వోయిన నేనును నతనితోడన చని వనంబునం బెక్కు మృగంబుల నేయుచుండ నం దొక్కబాణంబు దృణలతాంతరితదేహుండైన మునివరు నొక్కరుం దాఁకిన నతఁడు హా! యనుచుం బడియె; నంత నేనును. 130

ప్రతిపదార్థం: వేద, వేదాంగ, (వేద+అంగ) పారంగతుండను+ఐ= వేదాల యొక్క వేదాంగాలయొక్క అవ్వలిఒడ్డును చేరినవాడనై, (అనగా సంపూర్ణంగా తెలిసిన వాడనై); ఉండుదున్= ఉండేవాడను; నాకున్+ప్రియ, సఖుండు+ఐన= నాకు మిక్కిలి ఇష్టుడైన మిత్రుడు అయిన; ఒక్క, రాజపుత్త్రు తోడి= ఒకానొక రాచకొడుకుతోడి; సంగతిన్+చేసి= కూడిక (స్నేహం) వలన; ధనుః +వేదంబును= విలువిద్యను; అభ్యసించితిన్= నేర్చుకొన్నాను; ఒక్కనాఁడు= ఒకానొకరోజున; ఆ+మహీ, పతి= ఆ రాజు; వేఁట+పోయినన్= వేటాడడానికై పోగా; నేనునున్= నేనుకూడ; అతనితోడన్+అ= ఆతడి వెనువెంటనే; చని= వెళ్లి; వనంబునన్ అడవిలో; పెక్కు, మృగంబులన్= అనేకజంతువులను; ఏయుచున్+ఉండన్= బాణాలతో కొట్టుతుండగా; అందున్+ఒక్క, బాణంబు= ఆ బాణాలలో ఒకబాణం; తృణ, లతా+ అంతరిత, దేహుండు+ ఐన= గడ్డిచేతను తీగలచేతను చుట్టుకొనబడిన శరీరం కలవా డయిన; మునివరున్+ఒక్కరున్= ఋషులలో శ్రేష్ఠుడు అయిన ఒకరిని; తాఁకినన్= తగులగా; అతఁడు= (ఆమునివరుడు); హా+అనుచున్+పడియెన్= హా అనే (బాధతోకూడినశోకము) ధ్వనితో పడిపోయాడు; అంతన్= పిమ్మట; ఏనును= నేనును.

తాత్పర్యం: పూర్వజన్మంలో నేను వేదాలను, వేదాంగాలను క్షుణ్ణంగా చదివినవాడినే. కాని, నాకు ఒక రాకుమారుడితో స్నేహం ఏర్పడటంచేత విలువిద్యను నేర్చాను. ఒకానొకరోజున ఆ మహారాజుతో నేనుగూడ అడవికి వేటకు పోయి పెక్కుజంతువులను సంహరించాను. అంతలో నాబాణ మొకటి, గడ్డిచేతను తీగెలచేతను కప్పబడిన ఒక మునివరుడి శరీరానికి తాకింది. వెంటనే ఆతడు హాహాకారం చేస్తూ బాధతో నేలపై ఒరిగిపోయాడు. అప్పుడు నేను.

విశేషం: వేదములు నాలుగు. 1.ఋగ్వేదం, 2.యజుర్వేదం, 3. సామవేదం, 4. అధర్వణవేదం. వేదాంగం అంటే వేదానికి అవయవం. వేదము యొక్క సరియైన అర్థాన్నీ, మంత్రోపయోగం మొదలైన వాటిని తెలిపేది. వేదాంగాలు ఆరు 1.శిక్ష, 2.వ్యాకరణం 3. ఛందస్సు 4. నిరుక్తం 5. జ్యోతిషం 6. కల్పం.

ఆ. డాయఁబోయి తీవ్రసాయకవిద్ధుఁ డై ।
పొరలుచున్న విప్రవరునిఁ జూచి
తలఁకి యనునయంపుఁ బలుకులు పలికినఁ, ।
గినిసి యిట్టు లనియె మునివరుండు. 131

ప్రతిపదార్థం: డాయన్+పోయి= సమీపించి; తీవ్రసాయకవిద్ధుఁడు+ఐ= వాడి అయిన బాణాలచేత కొట్టబడినవాడై; పొరలుచున్+ఉన్న= ఇటు అటూ బాధతో మెలికలు తిరుగుతున్నటువంటి; విప్రవరునిన్+చూచి= బ్రాహ్మణులలో ఉత్తముడైనవాడిని సందర్శించి; తలఁకి= భయపడి; అనునయంపు+న్+పలుకులు= ఓదార్పుమాటలు; పలికినన్= పలుకగా; ముని, వరుండు= ఋషులలో శ్రేష్ఠుడైనవాడు; కినిసి= కోపించి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అంతట నేను బ్రాహ్మణోత్తముడిని సమీపించాను. అతడు నాబాణంచేత ఛేదించబడిన శరీరం కలవాడై బాధచేత ఇటూఅటూ పొరలాడుతున్నాడు. ఆ దృశ్యాన్ని చూచి చలించినవాడనై నేను ఓదార్పుమాటలను పలుకగా, ఆవిప్రుడు మిక్కిలి ఆగ్రహించి ఈవిధంగా అన్నాడు.

ఆ. 'బ్రాహ్మణుండవయ్యుఁ బాపప్రవృత్తివై ।
శూద్రకర్మమునకుఁ జొచ్చి తీవు
గాన నిక్కువము మృగవ్యాధజన్ముండ ।
వగుము మీఁద' ననియె; నని ననేను. 132

ప్రతిపదార్థం: ఈవు= నీవు; బ్రాహ్మణుండవు+అయ్యున్= విప్రుడవై పుట్టికూడా; పాపప్రవృత్తివి+ఐ= చెడ్డపనులు చేసే స్వభావం కలవాడవై; శూద్ర, కర్మమునకున్= శూద్రులు చేసే పనికి; చొచ్చితి(వి)= చొరబడ్డావు; కానన్= కావున; మీఁదన్= తదుపరి (అనగా రాబోయే జన్మలో); మృగ, వ్యాధ, జన్ముండవు= జంతువులను హింసించి జీవించే బ్రతుకుతెరువు కలవాడవు; అగుము= కమ్ము; నిక్కువము= యథార్థం; అనియెన్= అని అన్నాడు (శపించాడు); అనినన్= అట్లా అనగా; ఏను= నేను;

తాత్పర్యం: 'నీవు పుట్టింది బ్రాహ్మణకులంలో. కాని, చెడ్డ వైన హింసాకృత్యాలు చేయటానికి పూనుకొన్నావు. హింస శూద్రుల కను వైనది కాని బ్రాహ్మణులకు తగినపని కాదు. కావున, నీవు రాబోయేజన్మలో శూద్రుడవుగా జన్మించి మృగవ్యాధవృత్తితో బ్రతుకగలవు. ఇది తథ్యం' అని శపించాడు. అపుడు నేను ఆ బ్రాహ్మణోత్తముడితో ఈ విధంగా నివేదించుకొన్నాను..

చ. 'ఎఱుఁగక తప్పు సేసితి సహింపఁగదే! కడుదుర్భవంబునం
బఱుపకుమయ్య!' నావుడుఁ గృపన్ మునినాథుఁడు 'దప్ప దివ్విధం;
బెఱుకుకులంబునందు జనియించియు ధర్మువు లెల్ల నిమ్ముగా
నెఱిఁగెదు, తల్లిదండ్రులకు నెంతయుఁ బ్రీతి యొనర్తు భక్తితోన్. 133

ప్రతిపదార్థం: ఎఱుఁగక= తెలియకపోవటంచేత; తప్పు= నేరం; చేసితిన్= చేశాను; సహింపన్‌కదే= క్షమించవలసినవాడవుకదా!; కడున్= మిక్కిలి; దుర్భవంబునన్= చెడ్డజన్మంలో; పఱుపకుమయ్య!= నియోగించకండి; నావుడున్= అని చెప్పగా; మునినాథుఁడు= ఋషులలో శ్రేష్ఠుడు; కృపన్= దయతో; ఈ+విధంబు= ఈరీతి; తప్పదు= జరుగక తీరదు; ఎఱుకు, కులంబునందున్= వ్యాధకులంలో; జనియించియున్= పుట్టినప్పటికిని; ధర్మువులు+ఎల్లన్= అన్నిధర్మాలను; ఇమ్ముగాన్= సంప్రీతితో; ఎఱిఁగెదు= తెలిసికొంటావు; భక్తితోన్= పూజ్యభావంతో; తలిదండ్రులకున్= మాతాపితలకు; ఎంతయున్= ఎక్కువగా; ప్రీతి= తృప్తిని; ఒనర్తు(వు)= చేయగలవు.

తాత్పర్యం: 'అజ్ఞానంచేత ఇట్టి అపరాధం చేశాను, క్షమించ వేడికోలు. నన్ను చెడుజన్మం పొందేటట్టుగా చేయకుమా మహానుభావా!' అని నేను ప్రార్థించాను.

అప్పుడు ఆ మునిశ్రేష్ఠుడు నాపై దయకలిగి 'నాశాపానికి తిరుగు లేదు. నీవు ఎఱుకవై జన్మించినప్పటికిన్నీ, ధర్మాధర్మపరిజ్ఞానం కలవాడవు కాగలవు. అంతేకాక, తల్లి దండ్రులకు భక్తితో శుశ్రూష చేసి తరించగలవు.

వ. గురుశుశ్రూషం జేసి నీకుఁ బరమశోభనం బగు; జాతిస్మరత్వంబునుం గలుగు; నవరజన్మంబునఁ బరమబ్రాహ్మణుండ వయ్యెద' వని యనుగ్రహించిన, నవ్విప్రుని దేహంబునందు నాటిన బాణంబు మెత్తన పెఱికి, యతనిం దదీయాశ్రమంబునకుం జేర్చితి; నా చేసినపుణ్యంబున నమ్మహాత్ముండు నపాయంబు వొందం డయ్యె; నాకు నిట్టిజన్మంబు నొంద వలసె' నని చెప్పినం గౌశికుం డిట్లనియె. 134

ప్రతిపదార్థం: గురు, శుశ్రూషన్+చేసి= పెద్దలకు పరిచర్య చేయటంవలన; నీకున్= నీకు; పరమ, శోభనంబు+అగున్= మిక్కుటమైన మేలు చేకూరగలదు; జాతిస్మరత్వంబునున్+ కలుగున్= పూర్వజన్మయొక్కజ్ఞాపకం లభిస్తుంది; అపర, జన్మంబునన్= తదుపరిపుట్టువులో; పరమ, బ్రాహ్మణుండవు= గొప్పవిప్రుడవు; అయ్యెదవు= కాగలవు; అని= అని చెప్పి; అనుగ్రహించినన్= దయచూపగా; ఆ+విప్రుని= ఆ బ్రాహ్మణుడి; దేహంబు నందున్= శరీరంలో; నాటిన= గ్రుచ్చుకొనిన; బాణంబు= అమ్ము; మెత్తన= మృదువుగా; పెఱికి= బయటకు లాగి; అతనిన్= ఆ బ్రాహ్మణుడిని; తదీయ+ఆశ్రమంబునకున్= అతనియొక్క తపోవనానికి; చేర్చితిన్= చేర్చాను; నా, చేసిన= నేను చేసిన; పుణ్యంబునన్= సుకృతంవలన; ఆ+మహా+ ఆత్ముండున్= ఆ గొప్ప ఆత్మ గలవాడును, ఆ మహానుభావుడును; అపాయంబు+పొందండయ్యెన్= ప్రమాదానికి లోనుకాలేదు; నాకున్+ఇట్టి, జన్మంబు= నాకు ఈవిధమైన పుట్టుక; ఒందవలసెన్= పొందవలసివచ్చింది; అని చెప్పినన్= అని వచించిన పిదప; కౌశికుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'పెద్దలకు (తలిదండ్రులకు) సేవ చేయటంవలన నీకు మిక్కుటమైన మేలు కలుగగలదు. అపుడు నీకు పూర్వజన్మపరిజ్ఞానంగూడ ఉంటుంది. తదుపరి జన్మలో మరల నీవు బ్రాహ్మణుడ వై పుట్టగలవు' అని ఆతడు దయతో పలికాడు. అంతట నేను ఆ బ్రాహ్మణోత్తముడి శరీరంలో గ్రుచ్చుకొనిన బాణాన్ని మృదువుగా పెరికి, బయటకు తీశాను. పిమ్మట ఆతడిని ఆతడి ఆశ్రమానికి చేర్చాను. నా పుణ్యంవలన ఆతడికి మృత్యుప్రమాదం తప్పింది. కాని, నాకు ఈ శూద్రజన్మ తారసిల్లింది' అని చెప్పిన ధర్మవ్యాధుడితో కౌశికుడు ఈవిధంగా అన్నాడు.

తే. 'జన్మ మిట్టిది, చరితంబు చంద మిట్టి ।
దెన్నఁడును నిట్టిచోద్య మే నెందుఁ జూడ;
నింక జన్మాంతరముదాఁక నేల? యిపుడ ।
పుణ్యచరిత మై నీవు విప్రుఁడవ కావె! 135

ప్రతిపదార్థం: జన్మము+ఇట్టిది= నీపుట్టుక ఇటువంటిది; చరితంబు చందము+ఇట్టిది= ప్రవర్తనతీరు ఇటువంటిది; ఎన్నఁడును= ఎప్పుడును; ఇట్టి= ఇటువంటి; చోద్యము= వింత; ఏన్= నేను; ఎందున్+చూడన్= ఎచటను చూడలేదు; ఇంకన్= ఇకమీద; జన్మ+అంతరముదాఁకన్+ఏల= వేరొకజన్మ ఏర్పడేవరకూ ఆగవలెనా?; ఇపుడు+అ= ఇప్పుడే; పుణ్య, చరితమైన్= సుకృతంతో కూడిన ప్రవర్తనవలన; నీవు; విప్రుఁడవు+అకావె!= బ్రాహ్మణుడవే కదా!

తాత్పర్యం: 'ప్రస్తుతం నీ జన్మ చూస్తే శూద్రజన్మం. కానీ, ప్రవర్తనతీరు అనుశీలిస్తే ఇది ఒక వింత. ఇట్టి వింత ఇంతవరకు నేను ఎన్నడూ చూచి ఉండలేదు. నీవు మరుజన్మం వరకు ఆగవలెనా? ఈ జన్మంలోనే పుణ్యచరిత్రుడ వయిన నీవు నిజంగా బ్రాహ్మణుడవే సుమా!

ఆ. పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును ।
నిజము శూద్రుకంటె నీచతముఁడు;

సత్యశౌచధర్మశాలి శూద్రుం డయ్యు, ।
నతఁడు సద్విజుండ యనిరి మునులు. 136

ప్రతిపదార్థం: పాపవర్తనుండు= చెడునడవడి కలవాడు; బ్రాహ్మణుండు+ అయ్యును= బ్రాహ్మణకులంలో పుట్టినవాడు అయినాకూడ; శూద్రుకంటెన్= శూద్రుని కన్ననూ; నీచతముఁడు= మిక్కిలి నికృష్టు డైన తుచ్ఛుడు; నిజము= సత్యమే(ఈమాట ముమ్మాటికి నిజం అనిభావం); సత్య, శౌచ, ధర్మశాలి= ఎల్లప్పుడు నిజాన్ని మాట్లాడేవాడున్నూ, పరిశుభ్రతను పాటించేవాడున్నూ, ధర్మాన్నే ఆచరించేవాడున్నూ; శూద్రుండు+అయ్యున్= శూద్రకులంలో పుట్టినవాడైనప్పటికిని; అతఁడు= వాడు; సత్+ద్విజుండు+అ= మంచిబ్రాహ్మణుడేఅని; మునులు= ఋషులు; అనిరి= పేర్కొన్నారు.

తాత్పర్యం: చెడుప్రవర్తన కలవాడు బ్రాహ్మణకులంలో పుట్టినప్పటికినీ శూద్రుడికంటె అధముడే. ఇది నిజం, పరిశుభ్రత పాటించి సత్యాన్నే పలికే ధర్మాత్ముడు శూద్రకులంలో జన్మించినప్పటికిన్నీ అతడు సద్బ్రాహ్మణుడే అని మునులు తీర్పుచెప్పారు.

విశేషం: 1) ద్విజుఁడు= రెండు జన్మలు కలవాడు. అనగా శారీరకమైన పుట్టువు ఒకజన్మం, జ్ఞానార్జన తదుపరి ఎత్తేది మరియొక జన్మం. జ్ఞానోదయమైతే తప్ప బ్రాహ్మణకుటుంబంలో పుట్టినవాడైనా నిజమైన ద్విజుడు (బ్రాహ్మణుడు) కాఁ జాలడు. 2) 'ఎవడు బ్రాహ్మణుడు? - ఈప్రశ్నను సనాతనవైదికమతానుయాయులే గాక బౌద్ధులు పాషండులుకూడ పలుసారులు వేసిఉన్నారు. మహాభారతం నిష్కర్షగా ఎవడును జన్మచేత బ్రాహ్మణుడు కాజాల డనిన్నీ 'సత్యశౌచధర్మశాలి' మాత్రమే నిజమైన బ్రాహ్మణుడనిన్నీ నిర్ణయించింది. అందుచేత ఈ పద్యం మిక్కిలి విలువ కలది, అంతేకాక, ఒకవేళ 'సత్యశౌచధర్మశాలి' శూద్రకులంలో జన్మించి ఉన్నప్పటికీ, ఆతడు నిజంగా బ్రాహ్మణుడే అని ఖండితంగా నొక్కివక్కాణించింది. ఇచ్చట- 'అనిరి మునులు' అనే ప్రయోగం అనుశీలించదగింది. లోకవ్యవహారంలో జన్మ 'కులమును'- నిర్ణయించవచ్చును గాని ఆర్షదృష్టిలో లేదు. మునులదృష్టిలో-

'సత్యశౌచధర్మశాలి' శూద్రకులంలో పుట్టినప్పటికీ బ్రాహ్మణుడే. కౌశికుడి దృష్టిలో ఈజన్మంలోనే శూద్రకులంలో పుట్టిన ధర్మవ్యాధుడు బ్రాహ్మణుడే.

క. అనయంబు నాత్మకర్మం ।
బున నతినీచ మగు భవముఁ బొందవలసెనే
యని నీవు నిరంతరమును ।
మనమున దుఃఖింపవలదు మహితచరిత్రా! 137

ప్రతిపదార్థం: మహిత చరిత్రా!= గొప్ప ప్రవర్తన కలవాడా! ఓధర్మవ్యాధా!; అనయంబున్= ఎల్లప్పుడును; ఆత్మకర్మంబునన్= తాను చేసిన కర్మవలన; అతినీచము+అగు= మిక్కిలి నికృష్టమైన; భవమున్= జన్మను; పొందవలసెనే= పొందవలసివచ్చింది కదా; అని; నీవు; నిరంతరమును= ఎల్లప్పుడును; మనమునన్= మనస్సులో; దుఃఖింపన్వలదు= విచారించబోకుము.

తాత్పర్యం: గొప్పదైన నడవడిగల ఓమహానుభావా! ధర్మవ్యాధుడా! పూర్వజన్మలో చేసిన కర్మయొక్క విపరిపాకంవలన ఈ జన్మలో నీచమైన జన్మం ఏర్పడింది కదా అని నీవు మనస్సులో సదా విచారించ వలదు.

చ. నిజగుణదోషకర్మముల నెట్టన మేలును గీడు వచ్చుఁ; ద
త్ప్రజనితసౌఖ్యదుఃఖములఁ బ్రాజ్ఞులు దుల్యమనస్కులై మనో
రుజలును దేహజంబు లగు రోగములున్ హితధర్మకర్మభే
షజములఁ జేసి పాపుదురు సర్వము సాత్త్వికదృష్టిఁ జూచుచున్. 138

ప్రతిపదార్థం:నిజ, గుణ, దోష, కర్మములన్= తనదైన మంచిచెడుపనులవలన; నెట్టన= అవశ్యం, తప్పనిసరిగా; మేలును= శుభమున్నూ; కీడున్= చెడుగున్నూ; వచ్చున్= దాపురిస్తాయి; తద్+ప్రజనిత, సౌఖ్య, దుఃఖములన్= ఆవిధంగా ఏర్పడిన సుఖదుఃఖాలయందు; ప్రాజ్ఞులు= పండితులు; తుల్య, మనస్కులు+ ఐ= సమమైన చిత్తం కలవారలై; మనస్+రుజలును= మానసికంగా ఏర్పడే

రోగాలును; దేహజంబులు+అగు= దేహంనుండి పుట్టిన; రోగములున్= వ్యాధులును; హిత, ధర్మ, కర్మ, భేషజములన్+చేసి= అనుకూలమైన ధర్మంతో కూడిన పనులు అనే వైద్యాలను చేసి; సర్వము= అంతటిని; సాత్త్విక, దృష్టిన్+ చూచుచున్= మంచితనంతో కూడిన చూపులతో చూస్తూ; పాపుదురు= తొలగద్రోస్తారు.

తాత్పర్యం: తాము లోగడ మంచిపనులను చేస్తే తదుపరి మేలు కలుగుతుంది. అట్లే చెడుపనులను చేసిఉంటే కీడు కలుగుతుంది. ఆవిధంగా ఏర్పడే సుఖదుఃఖాలను పండితులు సమబుద్ధితో అనుభవిస్తారు. అట్టిసాధుజనులు అన్నిటిని సాత్త్వికదృష్టితోనే చూస్తూ, తమకు ఏర్పడే మానసికవ్యాధులను, శారీరకవ్యాధులను అనువైన ధర్మకర్మలు చేయటంద్వారా పాపుకొంటారు.

క. ప్రియములు వాయుటయును న ।
ప్రియములు వెసఁ బొందుటయును బెల్లుగ నగుఁ ద
త్క్రియలందు మూఢమతికి హృ ।
దయతాపము పాయ దెపుడు దరికొనుచుండున్.

139

ప్రతిపదార్థం: ప్రియములు+పాయుటయును= ఇష్టాలైనవి ఎడబాయట మున్నూ; అప్రియములు= ఇష్టం కానివి; వెసన్= వేగంగా; పొందుటయును= లభించటమున్నూ; పెల్లుగన్+అగున్= ఎక్కువగా జరుగుతుంటాయి; తత్+క్రియలందున్= ఆ పనులలో; మూఢమతికిన్= అవివేకికి; హృదయ తాపము= గుండెయందు ఏర్పడేవేదన; ఎపుడున్= ఎప్పుడును; పాయదు= పోదు; దరికొనుచుండున్= మండుతూ ఉంటుంది.

తాత్పర్యం: శుభాలు దూరం కావటం, అశుభాలు దాపురించటం ఎక్కువగా ఏర్పడేటప్పుడు మూఢుడు మిక్కుటమైన హృదయపరితాపానికి లోనౌతూ ఉంటాడు. అందుమూలాన ఆ తాపం తగ్గదు సరిగదా, సదా మండుతూ ఉంటుంది.

తే. వగతుమన్న నెవ్వారికి వగవఁ జనదు ।
చిత్తమున నేమిటికి సంతసింపరాదు
కాన గతమునందును ననాగతమునందు ।
వగవ రార్యులు సంతోషవంతు లగుచు. 140

ప్రతిపదార్థం: వగతుము+అన్నన్= దుఃఖించవలసివచ్చింది అని చెప్పినప్పటికి; ఎవ్వారికిన్= ఎవరికైనను; వగవన్+చనదు= శోకించకూడదు; చిత్తమునన్= మనస్సులో; ఏమిటికిన్= ఎందులకైనను; సంతసింపరాదు= ఉబ్బరాదు; కాన= కాబట్టి; గతమునందునున్= జరిగిపోయినకాలాన్ని గూర్చియున్నూ; అనాగతమునందున్= రానట్టి అనగా భవిష్యత్కాలాన్ని గూర్చియున్నూ; ఆర్యులు= పూజ్యులు; సంతోషవంతులు+అగుచున్= సంప్రీతిని చెందినవారై; వగవరు= శోకించరు.

తాత్పర్యం: ఎంతటి కష్టాలు దాపురించినా దుఃఖించరాదు. అట్లే, ఎప్పుడును సంతోషించరాదు. ఆర్యులు జరిగిన కాలాన్ని గూర్చి గాని భవిష్యత్కాలాన్ని గూర్చిగాని శోకించక- సదా సంతృప్తులై ఉంటారు.

క. వగపునఁ దేజోహీనుం ।
డగు నాత్మహితక్రియలకు నక్షముఁ డగు న
వ్వగపు దొఱఁగి యుద్యోగము ।
దగఁ జేయఁగఁ గలుగు నంచితము లగు శుభముల్. 141

ప్రతిపదార్థం: వగపునన్= దుఃఖంవలన; తేజస్+హీనుండు+అగున్= కాంతి గోలుపోయినవాడు కాగలడు; ఆత్మహిత, క్రియలకున్= తనకు మేలు చేకూర్చే పనులకు; అక్షముఁడు+అగున్= సామర్థ్యం లేనివాడు కాగలడు; ఆ+వగపు+ తొఱఁగి= ఆ దుఃఖం వదలి; ఉద్యోగము= ప్రయత్నం; తగన్+చేయఁగన్= సరిపడేటట్లుగాచేస్తే; అంచితములు+అగు= ఒప్పారునట్టి; శుభముల్= మేళ్లు; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: దుఃఖంవలన కాంతి కోలుపోవటం సంభవిస్తుంది; దుఃఖంవలన, తనకు మేలు కలిగించేపనులు నిర్వహించే సామర్థ్యం కొరవడుతుంది. దుఃఖాన్ని వీడి, సరిఅయిన ప్రయత్నాలను చేస్తే మంచిగా శుభాలు కలుగుతాయి.

వ. కావున భూతంబుల సదసత్ప్రకారంబులు గనికొని ధీరుండ వై యుండు' మనిన ధర్మవ్యాధుండు 'మహాత్మా! నీ చెప్పినయంతవట్టు నిదర్శనంబులుగాఁగొని యేను నిఃఖేదుండ నై యున్నవాఁడ; భవిష్యత్కాలసద్భావంబునందు సమాహితుండ నై యుండువాఁడ' ననియె; నంత నా భూదేవుండు. 142

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; భూతంబుల, సత్+అసత్+ప్రకారంబులు= పదార్థాల ఆంతర్యాలకు సంబంధించిన సత్యం, అసత్యంయొక్క రీతులను; కనికొని= అరసి; ధీరుండవు+ఐ= స్థైర్యంకలవాడవై; ఉండుము= బ్రతుకుము; అనినన్= అని చెప్పగా; ధర్మవ్యాధుండు; మహా+ఆత్మ!= గొప్ప ఆత్మ కలవాడా!; (మహానుభావా); నీ చెప్పిన+ అంత+పట్టు= నీవు చెప్పిన మేరకు; నిదర్శనంబులు+కాన్= ఉదాహరణాలు అయ్యేటట్లుగా; కొని= కడగి; ఏను= నేను; నిః+ఖేదుండను+ఐ= దుఃఖంలేని వాడనై అనగా పూర్ణసంతృప్తి కలవాడనై; ఉన్నవాఁడన్= ఉన్నాను; భవిష్యత్+కాల+సత్+భావంబునందున్= రాబోయే సమయంలో మంచిజరుగుతుందనే ఆలోచనలో; సమాహితుండను+ఐ= నిష్ఠకలవాడనై; ఉండువాఁడన్= ఉన్నాను; అనియెన్= అని చెప్పాడు; అంతన్= పిమ్మట; ఆ భూదేవుండు= ఆ బ్రాహ్మణుడు (కౌశికుడు).

తాత్పర్యం: కాబట్టి సర్వపదార్థాల ఆంతర్యంలోని సత్యాసత్యసమీక్ష చేసి స్థైర్యంతో బ్రదుకుము అని కౌశికముని చెప్పాడు. అంతట ధర్మవ్యాధుడు 'మహానుభావా! నీవు చెప్పిన ఆదర్శాలకు ఉదాహరణప్రాయంగానే నేను నా బ్రతుకును తీర్చిదిద్దుకొంటున్నాను. నేను నిత్యసంతృప్తుడను. భవిష్యత్కాలంలో నాకు శుభం చేకూరగల దని నానమ్మకం' అని అన్నాడు. అంతట కౌశికముని ఈ విధంగా బదులుపలికాడు.

**చ. 'అతులిత పుణ్యమూర్తివి, కృతాత్ముఁడ వెందును నీవు ధర్మ మూ
ర్జితముగ నెప్పు డేమఱక చేయుచు నుండుము, నిత్యశోభన
స్థితి వెలుగొందు; మేను భవదీయసమాగతిఁ జేసి ధర్మ సు
స్థితమతి నైతి న న్ననుమతింపు గుణాకర! పోయి వచ్చెదన్.' 143**

ప్రతిపదార్థం: గుణ+ఆకర!= మంచిలక్షణాలకు నెలవైనవాడా, ఓధర్మవ్యాధా!; నీవు= నీవు; అతులిత పుణ్యమూర్తివి= సాటిలేని సుకృతాలు ఆకృతి తాల్చినవాడవు; కృత+ఆత్ముఁడవు= సిద్ధిపొందిన ఆత్మకలవాడవు అనగా ధన్యుడవు; ఎందును= ఎచ్చటను; నీవు= నీవు; ధర్మము= ధర్మమును; ఊర్జితముగన్= సదా వికసించేటట్లుగా; ఎప్పుడున్= ఎల్లవేళల; ఏమఱక= ఎట్టి మరపు లేకుండ; చేయుచున్+ఉండుము= ఆచరిస్తూ ఉండుము; నిత్య, శోభన, స్థితిన్= ఎల్లప్పుడూ శుభాలు ఏర్పడేటట్లుగా; వెలుగొందుము= ప్రకాశించుము; ఏను= నేను; భవదీయ, సమాగతిన్+చేసి= నీ కలయికవలన; ధర్మ, సు, స్థిత, మతిన్+ఐతిన్= ధర్మం ఎల్లప్పుడు పాదుకొని ఉండే బుద్ధికలవాడను అయినాను; నన్నున్+అనుమతింపుము= నాకు సెలవు దయచేయునది; పోయి వచ్చెదన్= నీదగ్గర వీడ్కోలు గైకొని వెళ్ళగలవాడను.

తాత్పర్యం: 'మంచిగుణాలకు నెలవైన ఓ ధర్మవ్యాధుడా! నీవు పున్నెములప్రోవవు. నీజీవితం ధన్యమైనది. సదా ధర్మాన్నే ఆచరించేవాడవై నీ బ్రతుకును తీర్చిదిద్దుకొనుము; నీ చరిత్రలవలన ధర్మం విస్తరించి వెలుగొందగలదు. నీకు ఎల్లప్పుడు మేలు కలుగు గాక. నిన్ను కలిసికొనటంచేత నా జన్మం ధన్యమైనదిగా భావిస్తున్నాను. నీవలన నేను ధర్మసూక్ష్మాలను తెలిసికొన గలిగాను. నీమూలాన నాకు జ్ఞానోదయమైనది. ఇక దయచేసి నాకు సెలవును అనుగ్రహించుము. నిన్ను వీడ్కొని నేను పోయి వస్తాను.'

వ. అని వానికిం బ్రదక్షిణంబు సేసి వీడ్కొని చని కౌశికుండు నిజజననీ జనకుల కతిభక్తి శుశ్రూష చేసి కృతార్థుం డయ్యెం; బాండవోత్తమా! నీయడిగిన

తెఱంగునం బతివ్రతామాహాత్మ్యంబును బితృశుశ్రూషావిశేషంబును హీనవర్ణుం డైనవాఁడు ధర్మంబు సలుపు నుపాయంబును జెప్పితి' ననిన విని ధర్మతనయుండు సంతసిలి మఱియు మార్కండేయు నిట్లని యడిగె.144

ప్రతిపదార్థం: అని= ఆరీతిగా పలికి; వానికిన్+ప్రదక్షిణంబు+చేసి= (ధర్మ వ్యాధుడికి) కుడివైపుగా చుట్టుదిరిగి (నమస్కరించి); వీడ్కొని= సెలవుగైకొని; చని= వెళ్ళి (మిథిలానగరినుండి స్వస్థలానికి వెళ్లి); నిజ, జననీజనకులకున్= తనతల్లికిని తండ్రికిని; అతిభక్తిన్= మిక్కుటమైన పూజ్యభావంతో; శుశ్రూష, చేసి= సేవ ఒనరించి; కృతార్థుండు+అయ్యెన్= ధన్యుడు అయ్యాడు (కౌశికుడు); పాండవ+ఉత్తమా!= పాండురాజు కొడుకులలో శ్రేష్ఠుడవు అయినవాడా! (ఓధర్మరాజా!); నీ+అడిగిన= నీవు ప్రశ్నించిన; తెఱంగునన్= పద్ధతిచొప్పున; పతివ్రతా, మాహాత్మ్యంబును= పతిసేవ చేసే సతుల గొప్పతనాన్ని; పితృ, శుశ్రూషా, విశేషంబును= (తలి)దండ్రులకు సేవచేయటం లోని గొప్పతనాన్ని; హీనవర్ణుండు+ఐనవాఁడు= తక్కువకులంలో పుట్టినట్టివాడు; ధర్మంబు= ధర్మాన్ని; సలుపు= చేసే; ఉపాయంబును= తెరువును; చెప్పితిన్= వచించాను; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; సంతసిలి= సంతోషించి; మఱియున్= ఇంకా; మార్కండేయున్= మృకండుడి కొడుకు అయిన మార్కండేయుడిని; ఇట్లు+అని= ఈ విధంగా; అడిగెన్= ప్రశ్నించాడు.

తాత్పర్యం: అంతట కౌశికముని ధర్మవ్యాధుడికి ప్రదక్షిణనమస్కారం చేసి అతడివీడ్కోలు గైకొని తన స్వస్థానానికి వెళ్ళాడు. అచట ఆతడు తన తలిదండ్రులకు సేవచేసి తరించాడు. ఓ ధర్మరాజా! ఇంతకుముందు నీవడిగిన ప్రశ్నలు 1) భర్తకు శుశ్రూష చేసి ధన్యత్వం చెందిన పతివ్రతలమహిమ, 2) తలిదండ్రులకు పరిచర్య చేయటంలోని విశేషం 3) తక్కువకులంలో పుట్టినవాడు ధర్మాత్ముడై వెలుగొందే విధానం గూర్చి నీకు సోదాహరణంగా

వివరించిఉన్నాను'- అని మార్కండేయ మహర్షి ధర్మరాజుతో అన్నాడు. ధర్మరాజు మిక్కిలి సంతోషించి మఱియు ఇట్లా పలికాడు.

తే. 'అగ్నిదేవుండు తొల్లి మహాతపంబు ।
సేసె నని విందు; నది యేల చేసె ననఘ!
యంగిరసుఁ డేమి కతమున నగ్ని యయ్యె? ।
నగ్ను లెన్ని విధంబుల నతిశయిల్లు? 145

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడ వైన ఓ మార్కండేయ మహర్షీ!; తొల్లి= పూర్వకాలంలో; అగ్ని దేవుండు= అగ్ని దేవుడు; మహా+తపము= గొప్ప తపస్సు; చేసెన్; అని; విందున్= వింటాను; అది= (అట్టి తపస్సు); ఏల= ఎందుకు; చేసెన్= చేశాడు?; అంగిరసుఁడు= అంగిరసుడు (అనే పేరుగల ముని); ఏమి, కతమునన్= ఏ కారణం వలన; అగ్ని+అయ్యెన్?= అగ్ని అయినాడు?; అగ్నులు= నిప్పులు; ఎన్ని విధంబులన్= ఎన్ని రీతుల; అతిశయిల్లున్?= ఒప్పారుతాయి?

తాత్పర్యం: 'మహానుభావా! అగ్నిదేవుడు పూర్వకాలంలో గొప్ప తపస్సు చేసి ఉన్నట్లు విని ఉన్నాను. ఆ విధంగా అగ్ని దేవుడు గొప్ప తపస్సు చేయటానికి గల కారణ మేమి? అంగిరసుడు అగ్నిగా మారినట్లు విన్నాను. దానికి కారణం ఏమిటి? అగ్నులు ఎన్ని విధాలు?

మార్కండేయుఁడు ధర్మరాజునకు నంగిరసుం డగ్నియైన తెఱంగు సెప్పుట
(సం.3-207-5)

వ. ఇంతయు వినవలతు' ననిన, నమ్మహాముని యిట్లని చెప్పె; 'నగ్నిదేవుండు దేవతలతోడి యలుకం జేసి హవ్యంబులు వహింప నొల్లక వనంబునకుం జని బహుకాలంబు ఘోరతపంబు సేయుచు నత్యంతకృశుం డై యాత్మ గతంబున. 146

ప్రతిపదార్థం: ఇంతయున్= దీనినంతటిని; వినవలతున్= ఆలకింప కోరుతున్నాను; అనినన్= అని చెప్పగా; ఆ+మహా+ముని= ఆ గొప్ప ఋషి; ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా వచించాడు; అగ్ని దేవుండు= అగ్ని దేవుడు; దేవతలతోడి అలుకన్+చేసి= దేవతలమీదికోపంచేత; హవ్యంబులు= యజ్ఞాలలో వేల్చబడే హోమ ద్రవ్యాలు; వహింపన్+ఒల్లక= మోయటానికి ఇష్టపడక; వనంబునకున్+చని= అడవికి వెళ్లి; బహుకాలంబు= పెక్కు నాళ్లు; ఘోర, తపంబు= మిక్కిలి భయంకరమైన తపస్సు; చేయుచున్= చేస్తూ; అత్యంత, కృశుండు+ఐ= మిక్కిలి చిక్కిపోయిన శరీరం కలవాడై; ఆత్మ గతంబునన్= తనలో తాను.

తాత్పర్యం: ఈ విషయాన్ని సవిస్తరంగా వినగోరుతున్నాను' అని ధర్మరాజు అడిగాడు. అంతట మార్కండేయ మహర్షి ఇట్లా బదులు పలికాడు: 'అగ్ని దేవుడు దేవతలపై కోపించి హోమద్రవ్యాలు మోయటానికి ఇష్టపడక, అడవికి పోయి మిక్కిలి కఠోర మైన తపస్సు చేయటానికి పూనుకొన్నాడు. నిరంతర తపస్సువలన అతడి శరీరం మిక్కిలి చిక్కిపోయింది. అప్పుడు అగ్నిదేవుడు ఈ విధంగా చింతించాడు.

విశేషం: సనాతన సంస్కృతిలో అగ్ని హవ్యవాహనుడుగా సుప్రసిద్ధుడు. యజ్ఞాలలో హోమద్రవ్యాలను అగ్నిలో వేలుస్తారు. అగ్ని వాటిని కొనిపోయి దేవతలకు అర్పిస్తాడని పురాణకథనం.

చ. 'అలుకమెయిం దొలంగి విపినాంతరభూమికి వచ్చి యిట్లు నే
వెలుఁగక యున్నచో భువనవృత్తము సర్వము నిల్చు, నిల్చినన్
జలరుహసూతి వేఱొకనిఁ జయ్యన నగ్ని పదంబునందుఁ దా
నిలుపక యున్నె? నే నిచట నిల్చుట పోలదు పోయెదన్ వెసన్'. 147

ప్రతిపదార్థం: అలుకమెయిన్= కోపవశాన; తొలంగి= ఉన్నచోటు విడిచి; విపిన+ అంతర, భూమికిన్= అడవి మధ్య భాగానికి; వచ్చి= చేరి; ఇట్లు=

ఈ విధంగా; నేన్= నేను; వెలుఁగక+ఉన్నచోన్= మండకుండా ఉంటే; భువన వృత్తము= లోక వ్యవహారం; సర్వమున్= అంతా; నిల్చున్= ఆగిపోతుంది; నిల్చినన్= ఆగిపోయిన యెడల; జలరుహసూతి= పద్మంలో పుట్టినవాడు- బ్రహ్మదేవుడు; వేఱు+ఒకనిన్= ఇంకొకరిని; చయ్యనన్= శీఘ్రంగా; అగ్ని పదంబునందున్= అగ్ని యొక్క పదవియందు; తాన్= తాను; నిలుపక+ఉన్నె= నిలబెట్టి ఉంచడా? నేన్= నేను; ఇచటన్= (అడవిలో); నిల్చుట= ఉండటం; పోలదు= ఉచితం కాదు; వెసన్= శీఘ్రంగా; పోయెదన్= తిరిగిపోతాను, అనగా అడవినుండి మరలి స్వస్థలానికి చేరగలను అని భావం.

తాత్పర్యం: దేవతలపై కోపించి నేను ఈ విధంగా ఈ అడవికి వచ్చి ఉన్నాను. నేను మండక పోతే లోక వ్యవహారం అంతా నిలిచి స్తంభించి పోతుంది కదా! అందుచేత సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు ఈ కర్తవ్యం నిర్వహించటానికై నాస్థానంలో మరియొకడిని నియమించడా? అందుచేత నేను ఇక్కడ చిరకాలం జాగు చేయటం మంచిది కాదు. కాబట్టి నేను ఇక్కడినుండి తిరిగి నా స్వస్థానానికి శీఘ్రమే మరలి పోతాను.

వ. అని తలంచి తపంబు సాలించి నిజపదంబున కున్ముఖుండై చని చని, యంతకు మున్న బ్రహ్మనియోగంబునం ద్రిలోకంబులకు నగ్నియై వెలుంగుచున్నవాని నధికతపో విజృంభితు నంగిరసుం గని, భయంపడి, యెప్పటి యట్ల మగిడిపోవు నెడ నంగిరసుం డతనిపాలికిం జనుదెంచి, యిట్లనియె. 148

ప్రతిపదార్థం: అని, తలంచి= అంటూ ఆలోచించి; తపంబు= తపస్సు; చాలించి= విడిచి పెట్టి; నిజ, పదంబునకున్= తన పదవికి; ఉన్ముఖుండు+ఐ= ఇష్టపడినవాడై; చని, చని= వెళ్లి వెళ్లి (అడవి నుండి బహుదూర ప్రయాణం చేసి అని అర్థం); అంతకున్, మున్ను+అ= అంతకు పూర్వమే; బ్రహ్మ, నియోగంబునన్= బ్రహ్మదేవుడి ఏర్పాటు వలన; త్రిలోకంబులకున్= మూడు

లోకాలకున్నూ; అగ్ని+ఐ= నిప్పు అయి; వెలుంగుచున్నవానిన్= ప్రకాశిస్తున్నవాడిని; అధిక, తపస్+విజృంభితున్= మిక్కుటమైన తపస్సుచేత అతిశయించి ఉన్నవాడిని; అంగిరసున్+కని= అంగిరసుడు (అనే వాడిని) చూచి; భయము+పడి= భీతిచెంది; ఎప్పటి+అట్లు+ఆ= యథా ప్రకారం (అనగా లోగడ ఉన్నట్లుగనే); మగిడిపోవు+ఎడన్= తిరిగి పోయేటప్పుడు; అంగిరసుండు; అతని పాలికిన్+చనుదెంచి= అగ్నిదేవుడి దగ్గరకు వచ్చి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు తనలో తాను ఆవిధంగా ఆలోచించుకొని, తన తపస్సు విరమించి, తిరిగి తన పదవిని అధిష్ఠించదలచి అడవిని వీడి తరలి వెళ్ళాడు. కాని అగ్నిదేవుడు స్వస్థానాన్ని చేరటానికి ముందే బ్రహ్మదేవుడు అగ్నిదేవుడి పదవిలో అంగిరసుడు అనే మునీశ్వరుడిని నియోగించి ఉన్నాడు. అంగిరసుడు త్రిలోకాలకు అగ్నిహోత్రుడై గొప్ప తేజస్సుతో ప్రకాశించి విజృంభించాడు. మహాతేజస్వి అయిన అంగిరసుడిని చూచి భయపడి అగ్నిదేవుడు మరలి పోసాగాడు. అంతట అంగిరసుడు అగ్నిదేవుడిని గుర్తించి, అతడి కడకు వెళ్లి ఇట్లా అన్నాడు.

చ. 'అనఘ! జగత్త్రయార్చితుఁడవై తిమిరాపహరుండవై తగన్
వనరుహగర్భుచేఁ బ్రథమవహ్నిపదంబునఁ గల్పితుండ వై
తనరుదు; రమ్ము! నీ దగు పదంబున నే నిటులుండ నోడుదున్;
ఘనముగ నీవు నీ పదము గైకొనవే! యవికల్పభావనన్'. 149

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! (ఓ అగ్ని దేవుడా); జగత్+త్రయ+అర్చితుఁడవు+ఐ= మూడులోకాల చేత పూజించబడిన వాడవై; తగన్= ఒప్పేటట్లుగా; వనరుహ గర్భుచేన్= బ్రహ్మదేవుడిచేత; ప్రథమ, వహ్ని, పదంబునన్= మొట్టమొదటి అగ్ని పదవిలో; కల్పితుండవు+ఐ= నియమించబడిన వాడవై; తనరుదు= విరాజిల్లుతావు; రమ్ము; నీదు+అగు, పదంబునన్= నీకు సంక్రమించిన పదవిలో; ఏన్= నేను; ఇటులు+ఉండన్+ఓడుదున్= ఉండటానికి జంకుతున్నాను; ఘనముగన్= గొప్పగా; ఈవు= నీవు; అవికల్ప, భావనన్= తిరుగు లేని ఆలోచనతో; నీ పదము= నీ పదవిని; కైకొనవే!= స్వీకరించుమయ్యా!.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ అగ్నిదేవుడా! నీవు మూడులోకాలచేత పూజించబడినవాడవు; మొట్టమొదట బ్రహ్మదేవుడిచేత అగ్నిహోత్రపదవిలో నెలకొల్పబడినవాడవు. నీ పదవిని తిరిగి నీవే చేపట్టటం ధర్మం. నేను నీ పదవిలో ఉండటానికి సరిపోను. నీవు తిరిగి నీ పదవిని గొప్పగా అలంకరించుము. నీకు ఎట్టి జంకు గొంకులు అవసరం లేదు సుమా! ఇది నేను చిత్తశుద్ధితో నీకు చేసే విన్నపం.

వ. అనిన నగ్నిదేవుం డిట్లనియె. 150

తాత్పర్యం: అనగా అగ్నిదేవుడు ఈ విధంగా అన్నాడు.

క. 'విను నా కీర్తి జగంబులఁ ।
బొనుఁగు పడియె; నీవు భువనపూజితవృత్తిం
బనుపడితి గానఁ దగు నీ ।
యనలపదము నీక; నాకు నలవడ దింకన్. 151

ప్రతిపదార్థం: విను(ము)= ఆలకింపుము; నా కీర్తి= నాయొక్క యశస్సు; జగంబులన్= లోకాలలో; పొనుఁగు పడియెన్= నిస్తేజమై పోయింది; ఈవు= నీవు; భువన, పూజిత, వృత్తిన్= లోకాలచేత ఆరాధించబడిన క్రియకు; పనుపడితివి= పూనుకొన్నావు; కానన్= కాబట్టి; ఈ అనలపదము= ఈ అగ్నిహోత్రుడి పదవి; నీకున్+అ= నీకే; తగున్= ఒప్పుతుంది; ఇంకన్= ఇకమీద; నాకున్= నాకు; అలవడదు= ఒప్పదు.

తాత్పర్యం: అని చెప్పిన పిదప, అగ్నిహోత్రుడు ఈవిధంగా బదులు పలికాడు. 'మహాశయా!, నా విన్నపం అవధరింప వేడికోలు. నా కీర్తి లోకంలో మరుగుపడింది. నీవా ఇప్పుడు జగజ్జేగీయమానంగా వెలుగొందుతున్నావు.

లోకాలు నిన్ను ఆరాధిస్తున్నవి. అందుచేత అగ్నిహోత్రపదవి నీకు మాత్రమే ఒప్పుతున్నది. ఆ పదవి నాకు ఇక సరిపడదు.

వ. 'నీవు ప్రథమాగ్నివైయుండు; మేను ద్వితీయంబగు ప్రాజాపత్యవహ్నినై వర్తించెద' ననిన నంగిరసుండు 'దేవా! యి ట్లానతీ వలదు; ప్రథమాగ్నిత్వంబు నీవ కైకొని, నన్ను నీకుం బ్రథమపుత్త్రుంగా నాదరింపు' మనినం. బావకుండు దాని కొడంబడియె; నివ్విధంబున నంగిరసుం డగ్నికి నగ్రతనయుం డై యగ్నిసారూప్యంబునం దేజరిల్లె; నయ్యంగిరసునకు శివ యను దానికి బృహత్కీర్తియు, బృహజ్జ్యోతియు, బృహద్బ్రహ్మయు, బృహన్మనసుండును, బృహన్మంత్రుండును, బృహద్భానుండును, బృహస్పతియు నన నేడ్వురు గొడుకులు, మఱియు భానుమతియును, రాగయు, సినీవాలియుఁ, గుహువు, నర్చిష్మతియు, మహిష్మతియు, మహామతియు నన నేడ్వురు గూఁతులుం బుట్టిరి. 152

ప్రతిపదార్థం: నీవు= నీవు; ప్రథమ+అగ్నివి+ఐ+ఉండుము= మొదటి అగ్నివి అయి ఉండునది; ఏను= నేను; ద్వితీయంబు+అగు= రెండవది అయిన; ప్రాజాపత్య, వహ్నిని+ఐ= ప్రాజాపత్యం అనే పేరుగల నిప్పునై; వర్తించెదన్= మెలగుతాను; అనినన్= అని చెప్పగా; అంగిరసుండు; దేవా; ఇట్లు+ఆనతి+ ఈవలదు=ఈవిధంగా శాసించవలదు; ప్రథమ+అగ్నిత్వంబు= మొదటి అగ్నిగా ఉండే పదవి; నీవు+అ= నీవు మాత్రమే; కైకొని= స్వీకరించి; నన్నున్; నీకున్+ప్రథమ, పుత్త్రున్+కాన్= నీ మొదటి కొడుకు వలె; ఆదరింపుము= కరుణతో కాపాడుము; అనినన్= అని చెప్పగా; పావకుండు= అగ్ని; దానికిన్= (ఆమాటకు); ఒడంబడియెన్= సమ్మతించాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; అంగిరసుండు; అగ్నికిన్; అగ్రతనయుండు+ఐ= మొదట కొడుకై; అగ్ని, సారూప్యంబునన్= అగ్నితో సమానమైన ఆకారంతో; తేజరిల్లెన్= వెలుగొందాడు; ఆ+అంగిరసునకున్; శివ+అనుదానికిన్= "శివ" అనే పేరు గల ఆమెకు; బృహత్కీర్తియున్; బృహత్+జ్యోతియున్; బృహత్+బ్రహ్మయున్; బృహత్+మనసుండును; బృహత్+ మంత్రుండును; బృహత్+భానుండును; బృహస్పతియున్; అనన్= అనే పేరులు గల వారలు; ఏడ్వురు, కొడుకులు= ఏడుగురు పుత్రులును; మఱియున్= అదనంగా; భానుమతియును; రాగయున్; సినీవాలియున్; కుహువున్; అర్చిష్మతియున్; మహిష్మతియున్; మహా మతియున్; అనన్= అని పిలువబడే; ఏడ్వురు+కూఁతులున్= ఏడుగురు పుత్రికలు; పుట్టిరి= జన్మించారు.

తాత్పర్యం: 'నీవు మొదటి అగ్నిపదవిలో ఉండుము. నేను ప్రాజాపత్యం అనే పేరు గల ద్వితీయ మైన అగ్ని పదవిలో ఉండగలను'. అని అగ్నిహోత్రుడు పలుకగా, అంగిరసుడు ఇట్లు బదులు పలికాడు. 'దేవా! నీవే ప్రథమాగ్ని హోత్ర పదవి గైకొని, నన్ను నీ అనుగు పుత్రుడిగా ఆదరించుము.' ఆ సూచనను అగ్ని ఆమోదించాడు. ఈ విధంగా అంగిరసుడు అగ్నిహోత్రుడికి మొదటి కొడుకు అయ్యాడు. అంగిరసుడికి శివ అనే భార్య వలన ఏడుగురు కొడుకులు- 1. బృహత్కీర్తి 2. బృహజ్జ్యోతి 3. బృహద్బ్రహ్మ 4. బృహన్మనసుడు 5. బృహన్మంత్రుడు 6. బృహద్భానుడు 7. బృహస్పతి పుట్టారు. అంతేకాక ఏడుగురు పుత్రికలు జన్మించారు. వారి పేర్లు వరుసగా ఇవి- 1. భానుమతి 2. రాగ 3. సినీవాలి 4. కుహువు 5. అర్చిష్మతి 6. మహిష్మతి 7. మహామతి.

విశేషం: అగ్నులు మూడు విధాలు 1. గార్హపత్యం 2. దక్షిణం 3. ఆహవనీయం. ఇందు ప్రాజాపత్యం అనే అగ్ని గార్హపత్యానికి సంబంధించింది. ప్రాజాపత్యము= (మీరిరువురు కూడి ధర్మం చేయండని వరుడితో సంభాషించి కన్యాదానం చేసే వివాహవిధికి ప్రాజాపత్యం అనిఅర్థం.)

క. తనయుఁడు బృహస్పతికి న ।
త్యనఘుఁడు శంయుండు పుట్టి యాగంబులలో
మునుమును హవిషాజ్యము దాఁ ।
గొనియెడు వాఁ డయ్యె నధికగుణయుక్తి మెయిన్. 153

ప్రతిపదార్థం: బృహస్పతికిన్= బృహస్పతి అనే కుమారుడికి; తనయుఁడు;= కొడుకు; అతి+అనఘుఁడు= పాపం ఏ మాత్రమున్నూ లేని మహానుభావుడు; శంయుండు; పుట్టి; యాగంబులలోన్= యజ్ఞాలలో; మును మును=

ముందుగా; హవిష+ఆజ్యము= హోమద్రవ్యంగా అగ్నిలో వేసే నేతిని; అధిక, గుణయుక్తిమెయిన్= హెచ్చిన మంచి గుణాలతో కూడి ఉండటం చేత; తాన్= తాను; కొనియెడువాఁడు+అయ్యెన్= స్వీకరించేవాడు అయ్యాడు.

తాత్పర్యం: అంగిరసుడి కుమారులలో బృహస్పతికి శంయుడు జన్మించాడు. ఆ శంయుడు మహానుభావుడు. గొప్ప గుణాలు కలవాడు. క్రతువులు జరిగేటప్పుడు హోమంలో వేల్చే నేతిని మొట్టమొదట శంయుడికి సమర్పించేవారు. అనగా- క్రతువులలో అతడికి మొదటి పీట వేసి, పూజించేవారు.

వ. ఆ శంయునకు ధర్మపత్ని యైన సత్యకు భరద్వాజుండును భరతుండును నా నిరువురు కొడుకులు పుట్టి; రందు భరతునకు భారతుం డను కొడుకును, భారతి యను కూఁతురుం బుట్టిరి; భరద్వాజునకు వీర యను దానికి వీరుండు పుట్టె. 154

తాత్పర్యం: ఆ శంయునకున్నూ ఆతని భార్య యైన సత్యకున్నూ భరద్వాజుడు భరతుడు అనే పేరులు గల ఇరువురు కొడుకులు జన్మించారు. ఆ భరతుడికి భారతుఁడు, అనే ఒక కొడుకు భారతి అనే ఒక కూతురు కలిగారు. భరద్వాజునకు అతడి భార్య వీర అనే ఆమెకును వీరుడు అనేవాడు జన్మించాడు.

క. వానికి సరయువునకుఁ బటు ।
భానుం డై పుట్టె సుతుఁడు భానుఁ డనఁగ; నా
భానునకు నిశ్చ్యవనుఁ డనఁ ।
గా నాత్మజుఁ డుద్భవించెఁ గడు నుజ్జ్వలుఁ డై. 155

ప్రతిపదార్థం: వానికిన్= ఆ వీరుడికి; సరయువునకున్= సరయువు అనే పేరు గల ఆతని భార్యకు; పటు భానుండు+ఐ= మిక్కిలిగా వెలుగొందువాడై; భానుఁడు+అనఁగన్= భానుడు అనే పేరు కలవాడుగా; సుతుఁడు= కొడుకు; పుట్టెన్= జన్మించాడు; ఆ భానునకున్; నిశ్చ్యవనుఁడు+అనఁగాన్= నిశ్చ్యవనుడు అనే పేరుకలవాడుగా; ఆత్మజుఁడు= కొడుకు; కడున్= మిక్కిలి; ఉత్+జ్వలుఁడు+ఐ= ప్రకాశించేవాడై; ఉద్భవించెన్= జన్మించాడు.

తాత్పర్యం: వీరుడు అనువాడికి తేజస్వి అయిన భానుడు పుట్టాడు. భానుడికి నిశ్చ్యవనుఁడు జన్మించాడు.

చ. అతనికిఁ బుట్టెఁ బుత్త్రుఁడు నిరంతరతేజుఁ డుదారకీర్తి ని
ష్కృతి యను పేరివాఁడు విను కిల్బిషభాజను లైన మానవుల్
సతతము నా కృశాను నతిసక్తమనస్స్థితిఁ గొల్చి దోష ని
ష్కృతిఁ దగఁ గాంతు; రట్లగుట గీర్తిత మయ్యెఁ దదాఖ్య వానికిన్. 156

ప్రతిపదార్థం: అతనికిన్= (ఆ నిశ్చ్యవనుడికి); పుత్త్రుడు= కొడుకు; నిరంతర, తేజుఁడు= ఎల్లప్పుడు కాంతితో వెలుగొందేవాడు; ఉదార, కీర్తి= గొప్ప యశస్సు కలవాడు; నిష్కృతి+అను, పేరివాఁడు= 'నిష్కృతి' అనే నామం కలవాడు; పుట్టెన్; విను; కల్బిష భాజనులు+ఐన= పాపానికి పాత్రు లైన; మానవుల్= జనులు; సతతమున్= ఎల్లప్పుడును; ఆ కృశానున్= ఆ అగ్నిని; అతి, సక్త, మనస్,+స్థితిన్= మిక్కుటంగా లగ్నమైన చిత్తంతో; కొల్చి= ఆరాధించి; దోష, నిష్కృతిన్= పాపాల నుండి విడుదలను; తగన్= ఒప్పిదముగా, కాంతురు= పొందుతారు; అట్లు+అగుటన్= ఆ విధంగా జరగటం చేత; వానికిన్= ఆ నిష్కృతి అనే పేరు గల వాడికి; తత్+ఆఖ్య= ఆ పేరు; కీర్తితము+అయ్యెన్= పొగడ్తకెక్కినది అయింది.

తాత్పర్యం: ఆ నిశ్చ్యవనుడికి మిక్కిలి తేజస్వి అయిన నిష్కృతి అనే పేరు కలవాడు జన్మించాడు. అతడు సార్థక నామధేయుడు. నిష్కృతి అనగా విడుదల. ఆ అగ్నిని ఆరాధించే మానవులకు సమస్త పాపాల నుండి విడుదల లభిస్తూ ఉంటుంది కాబట్టి ఆతడికి అట్టి పేరుప్రతిష్ఠలు ఏర్పడ్డాయి.

క. ఘనుఁడు రుజస్కరుఁ డనఁగా ।
జనియించెను నాతనికి; రుజస్కరునకు న

త్యనుపమకాంతిపరుం డై।
జనియించెం గ్రోధుఁ డనఁగ జనవరతిలకా! 157

ప్రతిపదార్థం: జనవర తిలకా!= రాజ శ్రేష్ఠుడా!; ఆతనికిన్= (ఆ నిష్కృతికి); ఘనుఁడు= గొప్పవాడు; రుజస్కరుఁడు+అనఁగాన్= రుజస్కరుడు అనే పేరు కలవాడు; జనియించెను= పుట్టాడు; రుజస్కరునకున్; అతి+ అనుపమ, కాంతి పరుండు+ఐ= మిక్కుటంగా ఉండి, సాటిలేనట్టిదైన వెలుగుతో వెలుగొందేవాడై; క్రోధుఁడు+అనఁగన్= క్రోధుడు అనే పేరు కలవాడు; జనియించెన్= పుట్టాడు.

తాత్పర్యం: రాజులలో గొప్పవాడ వయిన ఓ ధర్మరాజా! గొప్పవాడయిన ఆ నిష్కృతికి రుజస్కరుడు జన్మించాడు. ఆ రుజస్కరుడికి క్రోధుఁడు అనేవాడు ఉద్భవించాడు. అతడు అపరిమిత కాంతిమంతుడు.

వ. ఆ క్రోధునకు రసుండు వుట్టె; రసునకు స్వాహా యను కన్యకయుం గాముం డను కొడుకునుం బుట్టిరి; కామునకు నమోఘుండు పుట్టె; నమోఘునకు నుక్థుండు పుట్టె; మఱియుం గాశ్యపుండును వాసిష్ఠుండును బ్రాణుండును నాంగిరసుండును జ్యవనుండును నను వా రేవురు తేజస్వి యైన కొడుకుం బడయుదు మని యనేక వర్షంబులు ఘోర తపంబు సేసి మహావ్యాహృతిస్మరణంబు సేయుచున్నంత. 158

తాత్పర్యం: క్రోధుడికి రసుడు, రసుడికి స్వాహా అనే కన్యక, కాముడనే కొడుకు పుట్టారు. కాముడికి అమోఘుడు పుట్టాడు. అమోఘుడికి ఉక్థుండు పుట్టాడు. అంతియేకాక-కాశ్యపుడు వాసిష్ఠుడు ప్రాణుడు ఆంగిరసుడు చ్యవనుడు- అనే ఐదుగురున్నూ తేజస్వి అయిన కొడుకును పొందటానికి పెక్కేళ్ళు కఠోరమైన తపస్సు చేసి మహావ్యాహృతిమంత్రాన్ని జపిస్తూ ఉన్నారు.

విశేషం: 'వ్యాహృతి'= సంధ్యావందనం చేసే వేళలలో బ్రాహ్మణులు ఉచ్చరించే ఊర్ధ్వలోక నామ సంకీర్తన రూపమైన మంత్ర విశేషం.

చ. అనలము చాయ మస్తకము, నర్కనిభం బగు బాహుయుగ్మముం,
గనకసముజ్జ్వలంబు లగు కన్నులుఁ, జర్మము కృష్ణవర్ణతం
దనరిన జంఘలుం గల యుదాత్తపు దేహము దేజరిల్లఁగాఁ
దనయుఁడు పుట్టె వారలకుఁ దద్దయు నద్భుత మంద లోకముల్. 159

ప్రతిపదార్థం: అనలము= నిప్పు; చాయ= రంగు; మస్తకము= శిరస్సు; అర్క, నిభంబు+అగు= సూర్యుడితో సరిపోలునట్టి; బాహు, యుగ్మమున్= చేతుల జంటయును; కనక, సమ్, ఉత్+జ్వలంబులు+అగు= బంగరువలె మెరసిపోయే; కన్నులున్= నేత్రాలును; చర్మము= తోలు; కృష్ణవర్ణతన్= నల్లని రంగుతో; తనరిన= ఒప్పిన; జంఘలున్= కాలి పిక్కలును; కల= ఉన్న; ఉదాత్తపు దేహము= గొప్ప దైన శరీరం; తేజరిల్లఁగాన్= ప్రకాశించగా; వారలకున్= వారికి (ఆ యేవురకును); లోకముల్= భువనాలు; తద్దయున్= మిక్కుటంగా; అద్భుతము+అందన్= అచ్చెరువు పొందేటట్లుగా; తనయుఁడు= కొడుకు; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: ఆ యేవురకును జగములు అచ్చెరువు పొందేటట్లుగా ఒక కొడుకు జన్మించాడు. ఆ పుత్రుడి దేహం మిక్కిలి ఉదాత్తమైనది. ఆతడి శిరస్సు నిప్పురంగు కలది. రెండు చేతులు సూర్యుడి వలె మిరుమిట్లు కొల్పుతూ వెలుగొందు నట్టివి. కన్నులు బంగరు వన్నె ధగధగలు కలవి. అతడి శరీరం నల్లనిది. బలమైన పిక్కలు అతనికి ఉన్నాయి.

వ. ఇట్లు పుట్టిన యప్పావకుండు పంచజనకప్రభవుండు గావునం బాంచజన్యుం డను పేరం బ్రసిద్ధుం డై దశ సహస్రవర్షంబులు దపంబు సేసి నిజమస్తకంబున బృహద్రథంతరులనువారలను, వదనంబున హరిని, నాభియందు శివుని, బలంబున నింద్రునిం, బ్రాణముల వాయ్వగ్నులను, బాహుయుగదంత పుటంబుల విశ్వభూతంబుల సృజియించె మఱియును. 160

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పుట్టిన= జన్మించిన; ఆ పావకుండు= ఆ అగ్ని; పంచ, జనక, ప్రభవుండు= ఐదుగురు తండ్రులకు పుట్టిన వాడు;

పాంచజన్యుండు= పాంచజన్యుడు (అయిదుగురకు పుట్టినవాడు); అను, పేరన్= అనే పేరు మీద; ప్రసిద్ధుండు+ఐ= కీర్తి కెక్కిన వాడై; దశ, సహస్ర, వర్షంబులు= పది వేల ఏండ్లు; తపంబు+చేసి= తపస్సు ఆచరించి; నిజ, మస్తకంబునన్= తనదైన శిరస్సునందు; బృహద్రథంతరులు+అను, వారలను= బృహద్రథంతరులు అనే వారలను; వదనంబునన్= మొగము నందు; హరిని= విష్ణువును; నాభియందున్= బొడ్డునందు; శివునిన్= ఈశ్వరుడిని; బలంబునన్= శుక్లం వలన; ఇంద్రునిన్= వేల్పుల దొర అయిన ఇంద్రుడిని; ప్రాణములన్= అసువులనుండి; వాయు+అగ్నులను= గాలిని నిప్పును; బాహు, యుగ, దంత, పుటంబులన్= చేతుల జంటలోను పళ్ళ దొప్పలలోను; విశ్వ, భూతంబులన్= సమస్త పదార్థాలను; సృజియించెన్= నిర్మించాడు; మఱియును= ఇంకను.

తాత్పర్యం: ఈ రీతిగా జన్మించిన ఆ అగ్నిదేవుడు అయిదుగురుతండ్రులకు పుట్టినవాడు కావున 'పాంచజన్యుడు' అనే పేరుమీద విలసిల్లాడు. అతడు పదివేలసంవత్సరాలు తపస్సు చేశాడు. అతడిశిరస్సునుండి బృహద్రథంతరులు పుట్టారు. ఆతడి మొగంనుండి విష్ణువు ఉద్భవించాడు. నాభినుండి శివుడు పుట్టాడు. వీర్యం నుండి ఇంద్రుడు జన్మించాడు. ప్రాణాలనుండి వాయువు అగ్ని జన్మించారు. చేతులజంటనుండి దంతాల నుండి సమస్త భూతాలు ఆవిర్భవించాయి. అంతియకాక.

విశేషం: 'నిజ మస్తకంబున బృహదంతరు లను వారలను' అని పెక్కు తెలుగు వ్రాత ప్రతులలో ఉన్నది. కాని సంస్కృతమూలంలో "బృహద్రథంతరం మూర్ధ్నో వక్త్రా ద్వాతరసా హరౌ'' అని ఉన్నది. (చిత్రశాలా ప్రతి. 3-220-7).

క. తపుఁ డను వహ్ని నిరంతర ।
తపోనిరూఢుఁ డయి పంచదశపుత్త్రుల న
త్యపరిమిత ఘోర తేజో ।
విపులాత్ములఁ గనియెఁ గపటవృత్తినిపుణులన్. 161

ప్రతిపదార్థం: తపుఁడు+అను, వహ్ని= తపుడు అనే పేరు కల అగ్ని; నిరంతర, తపస్+నిరూఢుఁడు+అయి= ఎల్లప్పుడును తపస్సు చేయటంలోనే మిక్కుటమైన దీక్షకలవాడు అయి; అతి+అపరిమితమైన ఘోర, తేజస్+విపుల+ఆత్ములన్= మిక్కుటమైన దారుణమైన ప్రకాశంతో ఎక్కువగా కూడుకొని ఉన్నట్టి వారలను అనగా మిక్కిలి భయంకరమయిన తేజస్సుతో వెలుగొందే వారలను; కపట, వృత్తి, నిపుణులన్= మోసం చేయటంలో మిక్కిలి సామర్థ్యం కలవారిని; పంచ, దశ పుత్త్రులన్= పదునైదుమంది కొడుకులను; కనియెన్= (కొడుకులుగా) పొందాడు.

తాత్పర్యం: 'తపుడు'- అనే పేరు గల ఆ అగ్నిహోత్రుడు భయంకరమైన తేజస్సుతో జాజ్వల్యమానంగా వెలుగొందే కొడుకులు పదునైదుగురిని కన్నాడు. ఆ పుత్రులు మోసం చేయటంలో మిక్కిలి సామర్థ్యం కలవారు.

వ. ఆ పదియేవురు సుభీముండు, నతిభీముండును భీముండును భీమబలుండును నతిబలుండు నను వా రొక్క మొగియును, సుమిత్త్రుండును మిత్త్రవంతుఁడును మిత్త్రజ్ఞుండును మిత్త్ర వర్ధనుండును మిత్త్రధర్ముండును నను వా రొక్క మొగియును, సురప్రవీరుండును వీరుండును సువేషుండును సువర్చసుండును సురహంతయు నను వారొక్క మొగియునుగానిట్లు మూఁడుమొత్తంబు లై యజమానుల యజ్ఞఫలంబు లపహరించు చుండుదురు; తత్ప్రశాంత్యర్థంబై యాగంబులందు నగ్నిచయనంబు సేయునది. 162

ప్రతిపదార్థం: ఆ పది+ఏవురు= ఆ పదునైదు మంది; సుభీముండును; అతి భీముండును; భీముండును; భీమబలుండును; అతిబలుండు అనువారు; ఒక్క, మొగియును= ఒక పక్షంలోనూ; సుమిత్రుండును, మిత్రవంతుండును, మిత్రజ్ఞుండును, మిత్రవర్ధనుండును మిత్రధర్ముండును అనువారు; ఒక్క మొగియును= ఒక పక్షంలోను; సురప్రవీరుండును, వీరుండును, సువేషుండును, సువర్చసుండును, సురహంతయును; అనువారు; ఒక్క, మొగియును= ఒక పక్షమున్నూ; కాన్= ఒక వర్గం లోని వారలు అగునట్లుగా; ఇట్లు= ఈ

రీతిగా; మూఁడు, మొత్తంబులు+ఐ= మూడు కక్ష్యలుగా చీలి; యజమానుల యజ్ఞ ఫలంబులు= యజ్ఞాలు చేసేవారి యజ్ఞఫలాలు; అపహరించు చుండుదురు= దొంగలిస్తూ ఉంటారు; తత్+ప్రశాంతి+అర్థంబు+ఐ= వారలను అదుపులో పెట్టేదానికై; యాగంబులందున్= క్రతువులలో; అగ్ని, చయనంబు= అగ్నిని సంస్కరించటం; చేయునది= చేయాలి.

తాత్పర్యం: తపుడికి పదునైదుగురు పుత్రులు పుట్టి, మూడువర్గాలుగా చీలి పోయారు. ఒక వర్గంలో ఉన్నవారు. 1. సుభీముడు 2. అతిభీముడు 3. భీముడు 4. భీమబలుడు 5. అతిబలుడు. మరియొక వర్గంలోని వారు 1. సుమిత్రుడు 2. మిత్రవంతుడు 3. మిత్రజ్ఞుడు 4. మిత్రవర్ధనుడు 5. మిత్రధర్ముడు. మూడవవర్గంలోని వారు. 1. సురప్రవీరుడు 2. వీరుడు 3. సువేషుడు 4. సువర్చసుడు 5. సురహంత. పై మూడు వర్గాలలోని పదునైదుగురు యజ్ఞాలను చేసేవారిని బాధించి వారినుండి యజ్ఞఫలాలను దొంగిలిస్తూ ఉన్నారు. వారిని అదుపులో పెట్టటానికి అగ్నికి సంస్కారం చేయటం అవసరమైనది.

తే. అధిప! విహగాకృతుల నొప్పు నగ్ని చయన ।
ముల యుదగ్రపక్షాఘాతములను విప్ర
వరుల మంత్రఘోషములను వారు నిహతు ।
లై భయంపడి చేరరు యజ్ఞభూమి. 163

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ఓ ధర్మరాజా!); విహగ+ఆకృతులన్= పక్షుల ఆకారాలచేత; ఒప్పు= విలసిల్లే; అగ్ని, చయనములన్= అగ్నులను పేర్చటం చేత; ఉదగ్ర, పక్ష, ఆఘాతములను= గొప్పవైన రెక్కల తాకిడి చేతను; విప్ర వరుల, మంత్ర, ఘోషములను= బ్రాహ్మణోత్తములు మంత్రాలను పెద్దగా చదవటం చేతను; వారు= ఆ పదునేవురు యజ్ఞఫల హర్తలు; నిహతులు+ఐ= కొట్టబడిన వారై; భయము,పడి; భయంపడి= భీతిచెంది; యజ్ఞభూమిన్= యజ్ఞం జరిగే ప్రదేశాన్ని; చేరరు= సమీపించరు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ పదునేవురిని విప్రులు భయపెట్టి యజ్ఞశాలను చేర నివ్వరు. బ్రాహ్మణోత్తములు మంత్రాలను ఉచ్చరించటంచేతనున్నూ, అగ్నులను పక్షులఆకారంతో పేర్చటంచేతనున్నూ, వారు రెక్కలచేత కొట్టబడి యజ్ఞశాలను చేరరు.

వ. తపుండు మఱియు సకలయజ్ఞభాగభుజు లైన పుత్త్రుల నేవురం గనియె; నం దగ్రజుండు. 164

తాత్పర్యం: తపుడు సమస్త యజ్ఞభాగాలనూ భుజించేవారైన అయిదుగురు కొడుకులను కన్నాడు. వారిలో పెద్దవాడు.

సీ. వైశ్వానరుం డను వహ్ని చాతుర్మాస్య ।
విధులందు భూసురవితతిచేతఁ
బర్జన్యసహితుఁ డై పరమార్చనముఁ గాంచు ।
నధిప!; రెండగు నాతఁ డఖిలమునకుఁ
బ్రభుఁడు దానై విశ్వపతి యన విలసిల్లు; ।
వినుము! మూఁడగు వాఁడు విశ్వమునకు
నాత్ముఁడై విశ్వకుం డన నొప్పు; నాలవు ।
నతఁడు భూతముల యాహార వితతి

తే. వెలయఁ బక్వము సేయుట విశ్వభుక్కు ।
నాఁగఁ బెంపొందు; గోపతి నామధేయుఁ
డై సమస్తధర్మక్రియలందు హేతు ।
వై ప్రశస్తి వహించు నేనగు నతండు. 165

ప్రతిపదార్థం: అధిప= ఓ రాజా!; వినుము; వైశ్వానరుండు+అను, వహ్ని= వైశ్వానరుడు అనే పేరు గల అగ్ని; చాతుర్మాస్య, విధులందున్= నాలుగు నెలల దీక్షకు సంబంధించిన నోములలో; భూసుర వితతిచేతన్= బ్రాహ్మణుల సముదాయంచేత; పర్జన్య సహితుఁడు+ఐ= మేఘుడితో కూడుకొన్న వాడై;

పరమ+అర్చనమున్+కాంచున్= గొప్ప పూజను పొందుతాడు; రెండు+అగు+ఆతఁడు= రెండవ వాడు; అఖిలమునకున్= అంతటికిని; ప్రభుండు= పాలకుడు; తాను+ఐ= తానే అయి; విశ్వపతి+అనన్= విశ్వపతి అనే పేరున; విలసిల్లున్= ఒప్పారును; మూఁడు+అగు, వాఁడు= మూడవవాడు; విశ్వమునకున్= ప్రపంచానికి; ఆత్ముఁడు+ఐ= అంతర్యామి అయి; విశ్వకుండు+అనన్+ఒప్పున్= విశ్వకుడు అనే పేరుతో విలసిల్లుతాడు; నాలవు+అతఁడు= నాలుగవ వాడు; భూతముల= జీవులయొక్క; ఆహార వితతి= తినుబండారాల సముదాయాన్ని; వెలయన్= ఒప్పిదంగా; పక్వము+చేయుట= ద్రగ్గేటట్లుగా చేయటం వలన; విశ్వభుక్కు, నాఁగన్= విశ్వభుక్కు అనే పేరుతో; పెంపొందున్= విస్తరిస్తాడు; గోపతి నామధేయుఁడు+ఐ= గోపతి అనే పేరు కలవాడై; ఏను+అగు+అతండు= ఐదవ వాడు; సమస్త, ధర్మ, క్రియలందున్= అన్ని విధాలైన ధర్మకార్యాలలో హేతువు+ఐ= కారణభూతుడై; ప్రశస్తి, వహించున్= కీర్తిని పొందుతాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! తపుడు (యజ్ఞఫలహర్తలైన ఆ పదిహేనుమంది పుత్రులను మాత్రమే గాక) యజ్ఞభాగభోక్త లైన కొడుకుల నైదుగురను కన్నాడు. వారిలో మొదట పుట్టినవాడు 'వైశ్వానరుడు' . ఆ వైశ్వానరుడు- బ్రాహ్మణులచేత మేఘుడితో పాటు పూజించబడేవాడు. నాలుగునెలల నోములలో అతడు అర్చించబడేవాడు. ఓ ధర్మరాజా! రెండవవాడి పేరు - విశ్వపతి. సార్థక నామధేయుడు. అతడు సమస్తసృష్టికి ప్రభువు. మూడవవాడి పేరు 'విశ్వకుడు' అతడు విశ్వానికి అంతర్యామి. నాలుగవవాడి పేరు 'విశ్వభుక్కు'. అతడు భూతాల తినుబండారాలను పక్వం చేసేవాడు. అయిదవవాని పేరు 'గోపతి'. అతడు సర్వధర్మక్రియలకు హేతుభూతుడు.

వ. మఱియు భానుం డను వహ్నికి సోమపుత్త్రియైన బృహద్భాసయందు బల దుండును మన్యుమంతుండును ధృతిమంతుండును నాగ్రయణుండును

నగ్నియు సోముండును నన నార్వురు గొడుకులు నిశ యను కూఁతురుం బుట్టిరి; సకలతపఃఫలంబులు నిర్వహించుట కయి పురందరుండు మను నామ ధేయుం డైన కొడుకుం బడసె; నమ్మనువు భానుపుత్త్రియైన నిశాకన్యం బెండ్లియై, ప్రాజాపత్యుం డను పేరఁ బరఁగి పరమబ్రాహ్మణులచేత నర్చితుం డయ్యెఁ; నివ్విధంబున ననేక వహ్నులు సకలధర్మ క్రియాసాధకు లై వెలింగిరి; దక్షిణాగ్ని ప్రముఖంబు లైన వహ్నులు వాయుహతిం జేసి యన్యోన్య సంస్పృష్టంబు లయ్యె నేనియు, రజస్వలాది సంకరంబులం బొరసె నేనియు, మృతక జాతకాది సంస్పర్శనంబునం బొందెనేనియుఁ, దత్ప్రాయశ్చిత్తార్థం బై యష్టాకపాలేష్టి సేయ వలయు' నని చెప్పి మఱియు మార్కండేయుం డిట్లనియె. 166

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; భానుండు+అను, వహ్నికిన్= భానుడు అనే పేరు కల అగ్నికి; సోమపుత్త్రి+ఐన= సోముడి కూతురు అయిన; బృహద్భాసఅందున్; బలదుండును; మన్యుమంతుండును; ధృతిమంతుండును; ఆగ్రయణుండును; అగ్నియున్; సోముండును; అనన్= అనగా; ఆర్వురు కొడుకులు= ఆరుగురు కుమారులు; నిశ+అను, కూఁతురున్= నిశ అనే పేరు కల పుత్త్రికయు; పుట్టిరి= జన్మించారు; సకల, తపస్+ఫలంబులు= అన్ని తపస్సులయొక్క ఫలితాలను; నిర్వహించుటకున్+ అయి= సాధించటం కొరకు; పురందరుండు= పురందరుడు అనేవాడు; మను నామ ధేయుండు+అయిన= మనువు అనే పేరు కలిగినట్టి; కొడుకున్+పడసెన్= పుత్రుడిని కన్నాడు; ఆ+మనువు; భానుపుత్త్రి+ఐన= భానుడు అనే వాడి కూతురు అయిన; నిశా కన్యన్= రాత్రి అనే కన్నెను; పెండ్లి+ఐ= వివాహ మాడి; ప్రాజాపత్యుండు; అను, పేరన్+పరఁగి= అనే నామంతో విలసిల్లి; పరమ, బ్రాహ్మణులచేతన్= గొప్ప విప్రుల చేత; అర్చితుండు+అయ్యెన్= పూజించబడ్డాడు; ఈ+విధంబునన్= ఈ విధంగా; అనేక వహ్నులు= పెక్కు అగ్నిహోత్రులు; సకల,

ధర్మ, క్రియా, సాధకులు+ఐ= అన్ని ధర్మ కార్యాలను సాధించే వారయి; వెలింగిరి= ప్రకాశించారు; దక్షిణ+అగ్ని, ప్రముఖంబులు+ఐన= దక్షిణాగ్ని మున్నగు నట్టివి అయిన; వహ్నులు= నిప్పులు; వాయు, హతిన్+చేసి= గాలిచేత కొట్టబడటంచేత; అన్యోన్య, సంస్పృష్టంబులు= ఒక దానితో మరియొకటి కలయిక చెంది నట్టివి; అయ్యెన్+ఏనియున్= అయినప్పటికిని; రజస్వల+ఆది, సంకరంబులన్= ముట్టు అయిన ఆడువారిమైల సోకటం, పొరిసెన్+ఏనియున్= పొందినప్పటికిని; మృతక, జాతక+ఆది, సంస్పర్శనంబునన్+పొందెను+ఏనియున్= చావు, పుట్టుక మొదలైన వాటిచేత కలిగే మైల సోకటం వలన దోషం కలిగినప్పటికి; తత్+ప్రాయశ్చిత్త+అర్థంబు+ఐ= ఆ దోష నిష్కృతి కొరకై; అష్ట కపాల+ఇష్టి= ఎనిమిది మట్టి పాత్రలచేత సంస్కరించబడెడి క్రతువు; చేయన్‌వలయున్= చేయాలి; అని; చెప్పి; మఱియున్; మార్కండేయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'భానుడు అనే వహ్నికి అతడి భార్య (సోమపుత్రి) అయిన బృహద్భాస యందు బుధుడు, మన్యుమంతుడు, ధృతిమంతుడు, ఆగ్రయణుడు, అగ్ని, సోముడు అనే ఆర్గురు కొడుకులున్నూ, నిశ అనే కూతురున్నూ కలిగారు. పురందరుడు సర్వతపస్సులఫలాలు పొందటానికై మనువు అనే పేరు గల కొడుకును కన్నాడు. ఆ మనువు భానువహ్నిపుత్రిక అయిన నిశ అనే వధువును పెండ్లాడాడు. ఆ మనువుకే ప్రాజాపత్యుడు అనే గౌరవ నామధేయం ఏర్పడింది. అతడిని బ్రాహ్మణోత్తములు పూజించారు. ఈ విధంగా పెక్కు వహ్నులు ధర్మక్రియలకు హేతుభూతులు అయ్యారు. దక్షిణాగ్ని మొదలైనవి గాలి తాకిడికి ఒకదానితో ఒకటి కలిసి పోయినప్పుడున్నూ; ముట్టయిన స్త్రీలు తాకుట చేతనున్నూ ఏర్పడిన దోషాలను పరిహరించటానికి, పురుడువలన మరణంవలన ఏర్పడే మైలచేత కలిగే దోషాలను పరిహరించటానికి 'అష్టాకపాలేష్టి' ఎనిమిది మట్టి పాత్రలలో అగ్నికి సంస్కారం చేసి చేసే క్రతువు చేయవలసి వస్తుంది' అని చెప్పి, మరల మార్కండేయమహర్షి ఈ విధంగా చెప్పాడు.

విశేషం: సోమపుత్రి అను నెడ సోముడి కూతురు అని అర్థం చెప్పుకొనటమే ఉత్తమ పద్ధతి. సోముడు అనగా చంద్రుడు, శివుడు, వాయువు, పితృదేవతలలో ఒకడు, వసువులలో ఒకడు, కుబేరుడు, యముడు, సుగ్రీవుడు అనే వివిధార్థాలు ఉన్నాయి. అట్లే మనువు, భానుడు మున్నగు చోట్ల అవి నామధేయాలుగానే స్వీకరించాలి.

క. 'ఆపుఁ డను వహ్ని యతులిత ।
రూప యయిన ముదిత యను తరుణియందు జగ
ద్దీపకు నపారతేజు మ ।
హాపూజ్యుం గనియె నగ్ని నద్భుతనామున్. 167

ప్రతిపదార్థం: ఆపుఁడు+అను, వహ్ని= 'ఆపుడు' అనే పేరు కల అగ్ని; అతులిత, రూప+అయిన= సాటి లేని అందం గల; ముదిత+అను, తరుణి+అందున్= ముదిత అనే పేరుకల జవ్వనియందు; జగత్+దీపకున్= లోకాలను వెలుగొంద జేసే వాడిని; అపార తేజున్= మిక్కిలి ఎక్కువ అయిన కాంతి కలవాడిని; మహా, పూజ్యున్= గొప్పగా ఆరాధించబడే వాడిని; అద్భుత నామున్= అచ్చెరువు కొలిపే పేరు కల వాడిని; అగ్నిన్= అగ్నిని; కనియెన్= కన్నాడు (పుత్రుడుగా పడశాడు).

తాత్పర్యం: ఆపుడు అనే వహ్నికిని, అతిలోక సౌందర్యవతి అయిన ముదితకు అచ్చెరువు గొలిపే పేరు కల 'అగ్ని' ముద్దుబిడ్డ అయి జన్మించాడు.

విశేషం: మానవచరిత్రలో నాగరకతా క్రమపరిణామ వికాసంలో 'అగ్ని' నిర్వహించిన భూమిక ఉగ్గడించ దగింది. అగ్ని బహుముఖ ప్రయోజనాలను నిర్వహించింది. నిత్యాగ్నిహోత్రతత్పరులు- అగ్నిసంప్రదాయాన్ని నిలబెట్టి యున్నారు. అర్థవాద రూపాన ఈ అగ్నిహోత్రాలను నిర్వహించిన కుటుంబాల వివరణాన్ని ఈ ప్రకరణంలో మహాభారతం వివరించినట్లు ఎంచవచ్చును.

చ. అతఁడు త్రిలోకతంత్రము నిరంతర మై చన నిర్వహించుచున్
శతమఖుఁ డాది యైన సురసంతతికిం బ్రియ మొప్ప హవ్యముల్

సతతము మోచి యిచ్చుచు భృశం బగు తద్భర మోర్వలేక సు
వ్రత నిరతుం డధర్వుఁ డనువానికి నిట్లను నాదరంబుతోన్. 168

ప్రతిపదార్థం: అతఁడు= (ఆ అగ్ని); త్రిలోక తంత్రము= మూడు భువనాల వ్యవహారం; నిరంతరము+ఐ+చనన్= ఎల్లప్పుడును కొనసాగేదిగా జరుగగా; నిర్వహించుచున్= నెరపుతూ; శతమఖుఁడు+ఆది+ఐన= దేవేంద్రుడు మొదలైన; సుర సంతతికిన్= వేల్పుల సముదాయానికి; ప్రియము+ఒప్పన్= ప్రీతి విలసిల్లేటట్లుగా; హవ్యముల్= హోమంలో వేల్చే ద్రవ్యాలు; సతతమున్= ఎల్లప్పుడు; మోచి+ఇచ్చుచున్= బరువును భరించి ఇస్తూ; భృశంబు+అగు= మిక్కుటమైన; తత్+భరమున్= ఆ బరువును; ఓర్వలేక= భరించలేక; సువ్రత, నిరతుండు= మంచి నోమును దీక్షతో నెరవేర్చునట్టి (ఆ అగ్ని); అధర్వుఁడు+అను వానికిన్ అధర్వుడు అనే పేరు గలవానికి; ఆదరంబుతోన్= మన్ననతో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: మూడులోకాల వ్యవహారాలను ఎడతెగనిదీక్షతో అగ్ని నిర్వహిస్తున్నాడు. దేవేంద్రుడు మున్నగు వేల్పులకు యజ్ఞాలలో సమర్పించబడే హోమద్రవ్యాలను తాను మోచి సంప్రీతితో వారికి సమర్పిస్తూ ఉన్నాడు. ఈ నిరంతరభారాన్ని చాలాకాలం నిర్వహించిన పిదప, డస్సి, అగ్ని- అధర్వుడు అనే వాడిని చేరి గౌరవంతో కూడిన అభిమానంతో ఇట్లా పలికాడు.

వ. 'ఏను దుర్బలుండ నైతి; నీవు దేవతలకు హవ్యంబులు మోచి యి' మ్మని వానిం బంచి, తాను సముద్రంబు సొచ్చి యందు దాఁగుటయు, దేవత లద్దేవముఖుం డున్న యెడ రోయం దొడంగిన నబ్ధిచరంబు లైన మత్స్యంబులు సురలకు నగ్నిదేవుండు జలధి నుండుట సెప్పుటయుం గనలి యనలుండు మీలం జూచి' జనంబులు మిమ్ము నిర్దయు లై వధియింతురు గావుత' మని శాపం బిచ్చె; నప్పుడు. 169

ప్రతిపదార్థం: ఏను= నేను (అనగా అగ్ని); దుర్బలుండన్+ఐతి(ని)= బలం లేనివాడను అయినాను; నీవు= నీవు; దేవతలకున్= వేల్పులకు; హవ్యంబులు= హోమంలో వేల్చబడిన ద్రవ్యాలు; మోచి+ఇమ్ము+అని= వహించి ఇమ్ము అని; వానిన్= అధర్వుడిని; పంచి= నియమించి; తాను= అగ్ని; సముద్రంబు= సముద్రంలో; చొచ్చి= ప్రవేశించి; అందున్= ఆ సముద్రంలో; దాఁగుటయున్= రహస్యంగా నివసించటమున్నూ; దేవతలు= వేల్పులు; ఆ+దేవముఖుండు= ఆ అగ్ని; ఉన్న+ఎడన్= ఉన్నచోటు; రోయన్+ తొడంగినన్= వెదకటానికి పూనుకొనగా; అబ్ధిచరంబులు+ఐన= సముద్రంలో తిరుగాడునట్టి; మత్స్యంబులు= చేపలు; సురలకున్= దేవతలకు; అగ్ని దేవుండు; జలధిన్+ ఉండుట+చెప్పుటయున్= సముద్రంలో (దాగి) ఉండటాన్ని చెప్పగా; కనలి= కోపగించి; అనలుండు= అగ్నిహోత్రుడు; మీలన్+చూచి= చేపలను చూచి; జనంబులు= ప్రజలు; మిమ్మున్= మిమ్ము (చేపలను); నిర్దయులు+ఐ= జాలి లేని వారై; వధియింతురు+కావుతన్= చంపుదురు గాక!; అని; శాపంబు+ఇచ్చెన్= శాపం ఇచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: 'నేను ఇంక బలంలేనివాడను అయినాను. ఓ అధర్వుడా! నీవు దేవతలకు హోమద్రవ్యాలను మోచికొనిపోయి అందించునది' అని పలికి అతడిని అందుకు నియమించి, అగ్నిహోత్రుడు సముద్రంలో ప్రవేశించి దాగాడు. అంతట వేల్పులు అగ్నిదేవుడు ఎచట దాగాడో తెలియటానికై వెదక సాగారు. సముద్రంలో చరించే చేపలు అగ్నిదేవుడి ఉనికి దేవతలకు తెలియ చెప్పాయి. అప్పుడు చేపలపై ఆగ్రహించి అగ్నిదేవుడు 'జనులు జాలి లేకుండగా మిమ్ము చంపగలరు' అని శాప మిచ్చాడు.

విశేషం: శాపం:- భవిష్యత్కాలంలో అవశ్యంగా జరుగ గలదు అనే విధి వాక్యం. ఇందులో మూడు అంగాలు ఉంటాయి. 1. భవిష్యదర్థకం ఇది. 2. శపించేవాడు గొప్ప మహిమ కలవాడై ఉంటాడు. 3. ఇది కోపహేతువు. ఫలము ఏదో ఒక కీడు.

ఆ. హవ్య వహనమునకు నమరోత్తములు దన్ను ।
వేయువిధుల నొలసి వేడుకొనిన
నెట్లు నియ్యకొనక యెంతయు విసిగి స ।
మీరసఖుఁడు దనదుమేను విడిచె. 170

ప్రతిపదార్థం: హవ్య వహనమునకున్= హోమంలో వేల్చిన ద్రవ్యాలను మోయటానికి; అమర+ఉత్తములు= వేల్పులలో గొప్పవారు; తన్నున్= తనను (అగ్నిని); వేయు విధులన్= అనేక విధాలుగా; ఒలసి= పూని; వేడుకొనినన్= ప్రార్థించగా; ఎట్లున్= ఏ రీతిగా; ఇయ్యకొనక= అంగీకరించక; ఎంతయున్= మిక్కిలి; విసిగి= అలసి పోయి; సమీరసఖుఁడు= గాలి నెచ్చెలి - అగ్ని; తనదు మేను= తన శరీరం; విడిచెన్= వదిలాడు.

తాత్పర్యం: దేవతలలో శ్రేష్ఠులు అగ్నిహోత్రుడిని మరల హోమద్రవ్యాలను మోచి తమకు అందించాలని వేయి విధాల ప్రార్థించారు. కాని, అగ్ని అందులకు సమ్మతించలేదు. అంతే కాక, అతడు విసిగి వేసారి తనదేహాన్ని త్యజించాడు.

వ. ఇట్లు సంత్యక్తశరీరుం డై ధరాతలంబు ప్రవేశించుటయు, నతనిచేత విడువంబడిన దేహంబువలనం బూయంబున గంధకంబు, నస్థుల దేవదారువును, శ్లేష్మంబున స్ఫటికంబును, బిత్తంబున మరకతంబును, వాతంబునఁగృష్ణశిలయు, నఖంబుల నభ్రకంబును, స్నాయుసంచయం బునం బ్రవాళంబునుం బుట్టె; నతండు భూగర్భస్థితుండై ఘోరతపంబు సేయుచున్నంత భృగ్వంగిరఃప్రముఖులైన మహామునులు నిజతపోబలంబున నతనికి నాప్యాయనంబు సేయుటయుఁ దేజస్వి యై ధరణి వెలువడి వచ్చి యమ్మహాత్ముం డమ్మహామునులం జూచి తదీయతేజంబు దనకు దుస్సహం బగుటయు భయంపడి క్రమ్మఱ నంబుధి సొచ్చి యడంగిన. 171

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సంత్యక్త శరీరుండు+ఐ= వదలి పెట్టబడిన దేహం కలవాడై - అనగా దేహాన్ని త్యజించిన వాడై; ధరాతలంబు= భూమి ప్రదేశాన్ని; ప్రవేశించుటయున్= చొరబడటమున్నూ; అతని చేతన్; విడువన్+పడిన= వదలిపెట్టబడిన దేహంబువలనన్= శరీరంలోని; పూయంబునన్= చీము రసినుండి; గంధకంబున్= గంధకము (ఉపధాతు విశేషమైన మందు దినుసు) (దీపావళి 'రోలు రోకలి' ప్రేలుడు పదార్థాలలో ఒకటి); అస్థులన్= ఎముకల నుండి; దేవదారువును= దేవదారు చెట్టును; శ్లేష్మంబునన్= కఫం నుండి; స్ఫటికంబును= కర్పూరమును; పిత్తంబునన్= పిత్తమనే దేహ ధాతువు నుండి; మరకతంబును= నవరత్నాలలో ఒకటి అయిన; 'పచ్చ'ను; వాతంబునన్= దేహధాతువులలో ఒకటి అయిన గాలి నుండి; కృష్ణ శిలయున్= పాషాణాన్ని (నల్లరాయిని); నఖంబులన్= గోళ్ల నుండి; అభ్రకంబును= బేగడను (కాకిబంగారము); స్నాయు సంచయంబునన్= నరాల, రక్త నాళాల సముదాయం నుండి; ప్రవాళంబునున్= పగడమును; పుట్టెన్= ఆవిర్భవించాయి; అతండు= (ఆ అగ్నిహోత్రుడు); భూగర్భ స్థితుండు+ఐ= భూమిలోపలి భాగంలో ఉన్నవాడై; ఘోరతపంబు= కఠిన మైన తపస్సు; చేయుచున్+ ఉన్నంతన్= సలుపుతూ ఉండగా; భృగు+అంగిరస్+ప్రముఖులు+ఐన= భృగువు అంగిరసుడు మున్నగు; మహా+మునులు= గొప్ప ఋషులు; నిజ, తపస్+బలంబునన్= తమ దైన తపస్సు యొక్క గొప్ప శక్తి వలన; అతనికిన్= (అగ్ని హోత్రుడికి); ఆప్యాయనంబు+చేయుటయున్= తృప్తి కల్గించగా; తేజస్వి+ఐ= కాంతి కలవాడై; ధరణిన్= భూమినుండి; వెలువడి వచ్చి= బయటకు వచ్చి; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్పవాడు (అగ్ని హోత్రుడు); ఆ+మహా+ మునులన్= ఆ గొప్ప ఋషులను; చూచి= కాంచి; తదీయ, తేజంబు= వారల యొక్క కాంతి; తనకున్= (అగ్నిహోత్రుడికి); దుస్సహంబు= సహించటానికి అలవికానిది; అగుటయున్; భయంపడి= భీతిచెంది; క్రమ్మఱన్= మరల; అంబుధి+చొచ్చి= సముద్రంలో ప్రవేశించి; అడంగినన్= దాగి ఉండగా.

తాత్పర్యం: ఈ విధంగా, శరీరాన్ని విడిచిపెట్టినవాడై అగ్నిదేవుడు భూమిలోకి ప్రవేశించాడు. అట్లా అగ్ని చేత విడువబడిన కళేబరంనుండి ఎన్నియో పదార్థాలు ఆవిర్భవించాయి. చీమురసినుండి గంధకం ఏర్పడింది. ఎముకలనుండి దేవదారు చెట్లు పుట్టాయి. కఫంనుండి కర్పూర మేర్పడింది. పిత్తంనుండి నవరత్న విశేషమైన 'పచ్చ' జనించింది. వాతంనుండి పాషాణశిల రూపొందింది. గోళ్ల నుండి కాకిబంగారం ఉద్భవించింది. నరాల, రక్త, నాళాల నుండి పగడ మేర్పడింది. అగ్నిహోత్రు డాపైన భూగర్భంలోనే ఉండి కఠోరతపస్సు చేశాడు. భృగుడు మున్నగు మహర్షులు అతడి తపస్సును మెచ్చి అతడిని ఆశీర్వదించారు. అగ్నిహోత్రు డంతట తృప్తి చెంది, భూగర్భం నుండి బయటకు వచ్చాడు కాని, అతడు ఆ మహర్షుల తేజస్సును చూచి భయపడి మరల సముద్రంలోకి పోయి దాక్కొన్నాడు.

క. విను జననాయక! సంయమి ।
జనములు వహ్నిపని యంతఁ జాలించి ప్రియం
బున నంచితవిధి సంగ్రహ ।
మునకై పూజించి రధికపుణ్యు నధర్వున్. 172

ప్రతిపదార్థం: జననాయక!= ప్రజలకు నేత వయిన ఓ ధర్మరాజా!; విను= వినుము; సంయమిజనములు= ఋషుల సమూహాలు; వహ్ని పని= అగ్ని కార్యం; అంతన్= అంతట; చాలించి= ఆపి; ప్రియంబునన్= ప్రీతితో; అంచితవిధి సంగ్రహమునకై= చేయవలసిన క్రియలను చేయటానికై; అధికపుణ్యున్= గొప్ప పుణ్యం కలవాడిని; అధర్వున్= అధర్వుడిని; పూజించిరి= అర్చించారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆలకించుము. అంతట మునిగణాలు అగ్నిని వదలి పెట్టి, తాము చేయవలసిన విధ్యుక్త ధర్మాలను నిర్వహించటానికై అధర్వుడిని అర్చించ సాగారు.

వ. అయ్యధర్వాగ్ని తేజంబును నమ్మును లతనికిం జేయు బహుమానం బునుం దన్ముఖంబున నమరులు దృప్తు లగుచునికియుం జూచి సహింపక పావకుండు సకలభూతంబులుఁ జూచుచుండనంబుధి వెలువడి వచ్చి నిఖిలలోక హితార్థంబుగా నెప్పటియట్ల హవ్యవహత్వంబు నంగీకరించె; ని ట్లనేకశాఖం బయిన యగ్ని వంశంబు ప్రశంసాభాజనం బయ్యెఁ; నగ్ను లెంద ఱైనను దదాత్మ యైన తేజం బొక్కటి' యని చెప్పిన విని సంతసిల్లి యమ్మహామునికి ధర్మతనయుం డి ట్లనియె. 173

ప్రతిపదార్థం: ఆ+అధర్వ+అగ్ని, తేజంబునున్= అధర్వుడు అనే ఆ అగ్నియొక్క కాంతిని; ఆ+మునులు; అతనికిన్+చేయు= (అధర్వుడికి) ఒనరించే; బహుమానంబునున్= గౌరవమర్యాదను; తద్+ముఖంబునన్= ఆతని మొగం నుండి; అమరులు= దేవతలు; తృప్తులు+అగుచున్+ఉనికియున్= తనివి చెందటమున్నూ; చూచి= అరసి; సహింపక= ఓర్వజాలక; పావకుండు= అగ్నిహోత్రుడు; సకల భూతంబులున్= అన్ని భూతాలున్నూ; చూచుచున్= చూస్తూ ఉండగా; అంబుధి= సముద్రంనుండి; వెలువడి= బయటకు వచ్చి; నిఖిలలోక, హిత+అర్థంబుగాన్= అన్ని లోకాలకు మేలు చేకూరేటట్లుగా; ఎప్పటి+అట్లు+అ= యథా ప్రకారం; హవ్య వహత్వంబున్= హోమంలో వేల్చబడే ద్రవ్యాలను తాల్చటాన్ని; అంగీకరించెన్= సమ్మతించాడు; ఇట్లు= ఈ విధంగా; అనేక, శాఖంబు+అయిన= పెక్కు కొమ్మలుగా ఏర్పడిన; అగ్ని వంశంబు= అగ్ని యొక్క కుటుంబం; ప్రశంసా, భాజనంబు+అయ్యెన్= కీర్తించ తగింది అయింది; అగ్నులు= వహ్నులు; ఎందఱు+ఐనను= ఎందరు అయినప్పటికి; తద్+ఆత్మ+ఐన= వారి అందరికి ఆత్మ, లేక సారభూతం అని చెప్ప దగిన; తేజంబు= కాంతి; ఒక్కటి= ఒక్కటే; అని= అంటూ; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; సంతసిల్లి= సంతోషించి; ఆ+మహామునికిన్= ఆ గొప్ప ఋషికి; ధర్మతనయుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: అధర్వుడు అనే పేరు గల ఆ అగ్ని యొక్క కాంతిని, ఆ ఋషులు అతడికి చేసే గౌరవమర్యాదలను చూచి, ఆతడిద్వారా వేల్పులు తనివి పొందటాన్ని గ్రహించి, ఓర్వజాలక అగ్నిహోత్రుడు అన్ని భూతాలు చూస్తూ ఉండగా సముద్రగర్భంనుండి బయటకు వచ్చి యథాప్రకారం తాను హోమద్రవ్యాలను వహించటానికి సమ్మతించాడు. అఖిలలోకాలకు ఆవిధంగా శ్రేయస్సు కల్గించాడు. ఈ రీతిగా అగ్నివంశంలో ఎందరెందరో ఉగ్గడించదగిన వారు విలసిల్లారు. అగ్నులలో ఎందరెందరో వేరు వేరు వారలు విలసిల్లినప్పటికిన్నీ, అందరిలో వెలుగొందిన తేజం ఒక్కటే' అని మార్కండేయమహర్షి ధర్మరాజుకు వివరించి చెప్పాడు. అంతట ధర్మరాజు ఈ విధంగా పలికాడు.

క. 'మునినాథ! మహాసేనుం ।
డనలునకుం గృత్తికలకు హరునకు సుతుండై
న నిమిత్త మేమి తెలఁ గే ।
వినవలతుం జెప్పవే! సవిస్తరఫణితిన్'. 174

ప్రతిపదార్థం: మునినాథ!= ఋషులకు వల్లభుడవైనవాడా! అనగా మునులలో శ్రేష్ఠుడవైన ఓ మార్కండేయుడా!; మహాసేనుండు= కుమారస్వామి; అనలునకున్= అగ్నిహోత్రుడికి; కృత్తికలకున్= కృత్తికలు అనే చుక్కలకు; హరునకున్= శివుడికి; సుతుఁడు+ఐన= కొడు కైన; నిమిత్తము= కారణం; ఏమి తెలుఁగు= ఎటువంటిది; ఏన్= నేను; విన వలతున్= విన గోరుతున్నాను; సవిస్తర, ఫణితిన్= విపుల మైన పద్ధతిలో; చెప్పవే= చెప్పవా? (చెప్పుము).

తాత్పర్యం: 'ఓ మార్కండేయమహామునీ! కుమారస్వామి ఏవిధంగా అగ్నిహోత్రుడికి, కృత్తికలకు, శివుడికి పుత్రుడయ్యాడో విన గోరుతున్నాను. దయచేసి నాకు సంపూర్ణంగా వివరించి చెప్పుము'.

వ. అనిన మార్కండేయుం డతని కిట్లని చెప్పెఁ; దొల్లి దైత్యులతోడ రణంబు సేసి యోటువడి దేవగణసహితుం డై దేవేంద్రుండు దొలంగిపోయి దానవుల నోర్వనోపునట్టి మహాసత్త్వుం డగు సేనాపతి నెందుఁ బడయుదు నొకో! యని యొక్కనాఁడు మానసం బను శైలంబునకుం జని యం దొక్కయెడ నొక్కరుండ కార్యచింతాపరుం డై యున్న యెడ. 175

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; మార్కండేయుండు; అతనికిన్= (ధర్మరాజునకు); ఇట్లు+అని చెప్పెన్= ఈ విధంగా పలికాడు; తొల్లి= పూర్వకాలంలో; దైత్యుల తోడన్= రాక్షసులతో; రణంబు+చేసి= యుద్ధంచేసి; ఓటువడి= ఓడిపోయి; దేవగణ సహితుండు+ఐ= వేల్పుల సముదాయంతో కూడిన వాడై; దేవేంద్రుండు= వేల్పుల దొర; తొలంగిపోయి= (యుద్ధం నుండి) ఆవలికి పోయి; దానవులన్= రాక్షసులను; ఓర్వన్+ఓపునట్టి= జయించజాలునట్టి; మహాసత్త్వుండు+అగు= గొప్ప బలం కలవాడైన; సేనాపతిన్= సేనకు నాయకుని; ఎందున్= ఎచ్చట; పడయుదున్+ఒకో+అని= పొందగలనో అని; ఒక్కనాఁడు= ఒకానొకరోజున; మానసంబు+అను, శైలంబునకున్+చని= మానసం అనే పేరు కల కొండవద్దకు వెళ్లి; అందున్= (ఆ కొండ మీద); ఒక్క+ఎడన్= ఒకచోట; ఒక్కరుండు+అ= ఏకాంతంగా ఉండి; కార్య, చింతా, పరుండు+ఐ= చేయవలసిన పనిని గూర్చి యోచించేవాడై; ఉన్న+ఎడన్= ఉండగా.

తాత్పర్యం: అనిన, మార్కండేయుడు ధర్మరాజుకు ఈ విధంగా చెప్పాడు: పూర్వకాలంలో రాక్షసులతో యుద్ధం చేసి దేవేంద్రుడు ఓడిపోయాడు. వేల్పుల సముదాయం ఎంతగా పోరాడినా వారికి విజయం లభించలేదు. ఇక రాక్షసులపై గెలుపు ఏ విధంగా లభిస్తుందా! అని దేవేంద్రుడు ఏకాంతంగా యోచింపసాగాడు. అతడు మానసం అనే పేరుగల కొండపైకి వెళ్ళి ఒకచోట ఆలోచన చేస్తున్నాడు.అప్పుడు.

తే. 'ఒక్క దనుజాధముండు మొఱ్ఱో యనఁగ ।
నన్నుఁ జెఱఁగొని పోయెడు నన్నలార!
యెవ్వ రిట విడిపింపరే యింత వట్టు ।
పుణ్యమునఁ బోవరయ్య! కారుణ్యబుద్ధి'. 176

ప్రతిపదార్థం: అన్నలార!= అయ్యలారా!; నన్నున్= నన్ను; ఒక్క= ఒక; దనుజ+అధముండు= రాక్షసులలో నీచుడు; మొఱ్ఱో+అనంగన్= (ఆపదలో ఉన్నట్లు) 'కేక' వేయగా; చెఱ+కొని పోయెడున్= నిర్బంధించి తీసికొని పోతున్నాడు; ఇటన్= ఇచట; ఎవ్వరు= ఎవరు? విడిపింపరే= చెరనుండి బయట పడ వేయరా; ఇంత+పట్టు= ఈ మాత్రం; కారుణ్య బుద్ధిన్= జాలిగల మనస్సుతో; పుణ్యమునన్+పోవరు+అయ్య= పుణ్యమార్గాన ప్రవర్తింపరా!.

తాత్పర్యం: సోదరులారా! ఒక నీచరాక్షసుడు నన్ను చెఱపట్టి బలాత్కారంగా తీసికొని పోతున్నాడు; ఇక్కడ నన్ను ఈ రాక్షసుడిబారినుండి కాపాడేవారు ఎవ్వరూ లేరా? నా మొఱ ఆలకించి పుణ్యం కట్టుకొనే వారు ఎవ్వరూ లేరా?

వ. అని యిట్లు సువ్యక్తం బైన వనితావిలాపంబు వీతెంచినం బురందరుండు నిజాంతరంగంబు గరుణాతరంగితం బగుటయు 'నోడ కోడకు మిదె యేను వచ్చితి' ననుచు నద్దిక్కునకు నడచి ముందట నతిభయంకరాకారుం బటుగదాహస్తు నప్రచలితవిద్యుల్లతారుచిరమూర్తి యైనదాని నొక్క కన్నియం గొని గగనతలంబునం బఱచువానిం బ్రబలవలాహకవినీలదేహుఁ గేశి యను దానవుం గని సరభసుం డై. 177

ప్రతిపదార్థం: అని; ఇట్లు; సువ్యక్తంబు+ఐన= స్పష్టంగా వినిపిస్తున్న; వనితా, విలాపంబు= ఆడుదాని ఆర్తధ్వని; వీతెంచినన్= రాగా; పురందరుండు= దేవేంద్రుడు; నిజ+అంతరంగంబు= తన హృదయం; కరుణా, తరంగితంబు+అగుటయున్= దయఅనే అలలతో నిండినది కావటం చేత;

ఓడకుము+ఓడకుము= భయపడకుము భయపడకుము; ఇదె= ఇదుగో ఇప్పుడే; ఏను= నేను; వచ్చితిన్= (నిన్ను ఆదుకోటానికి) వచ్చాను; అనుచున్= అని పలుకుతూ; ఆ+ దిక్కునకున్= ఆ ఆర్తనాదం వెడలిన వైపునకు నడచి; ముందటన్= ఎదురుగా; అతిభయంకర+ఆకారున్= మిక్కిలి వెరపు గొలిపే రూపం కలవాడిని; పటు గదా హస్తున్= గొప్ప గదను పూనిన చేయి కలవాడిని; అప్రచలిత, విద్యుత్+లతా, రుచిర, మూర్తి+ఐన దానిన్= కదలకుండా ఉన్నట్టి మెరపుతీగ వలె వెలుగొందే రూపం కల దానిని; ఒక్క కన్నియన్= ఒక కన్యకను; కొని= పట్టుకొని; గగన, తలంబునన్= ఆకాశస్థలాన; పఱచువానిన్= పరుగెత్తేవాడిని; ప్రబల, వలాహక, వినీల, దేహున్= గొప్ప మబ్బువంటి నల్లని శరీరం కలవాడిని; కేశి+అను, దానవున్= కేశి అనే పేరు కల రాక్షసుడిని; కని= చూచి; సరభసుండు+ఐ= వేగంతో కూడినవాడై.

తాత్పర్యం: అట్లా ఒక స్త్రీయొక్క ఆర్తనాదం వినిపించింది. దేవేంద్రుడు వెంటనే తన హృదయం జాలిచేత కరగి పోవటం చేత 'భయపడకుమమ్మా! ఇదుగో నేను ఇక్కడనే ఉన్నాను; ఇప్పుడే వచ్చి నిన్ను కాపాడగలను' అని గట్టిగా పలుకుతూ ఆ యేడ్పు వచ్చిన వైపునకు తరలి వెళ్ళాడు. అంతట అక్కడ ఒక రాక్షసుడు మిక్కిలి వెరపు గొలిపే రూపం కలవాడు, నల్లనిమబ్బును పోలిన దేహం కలవాడు, గొప్ప గదను చేత ధరించిన వాడు కన్పించాడు. అతడు స్థిరమైనసౌదామని వంటి శరీరసౌందర్యం గల ఒక కన్యకను చెఱబట్టి ఆకాశంలో పరుగెత్తుతున్నాడు. కేశి అనే ఆ రాక్షసుడిని చూచి దేవేంద్రుడు మిక్కుటమైన వేగంతో (తరువాతి పద్యంతో అన్వయం).

ఇంద్రుఁడు కేశి యను రాక్షసునిఁ బాఱఁదోలుట (సం. 3-213-10)

ఉ. 'ఓరి దురాత్మ! యీ యబల నోడక యేటికిఁ బట్టినాడ వం
భోరుహనేత్ర విడ్వు; మెట వోయినఁ బ్రాణము గొందు నింకఁ బ్ర
స్ఫారమహీధరప్రకరభంగవిహారధురీణ ముగ్ర దై
త్యారుణరంజితోగ్ర కులిశాస్త్రము సు మ్మిదె' యంచు డాసినన్. 178

ప్రతిపదార్థం: ఓరి, దురాత్మ!= ఓరీ పాపహృదయం కలవాడా! చెడ్డ ఆత్మకల రాక్షసుడా!; ఈ+అబలన్= ఈ ఆడుదానిని; ఓడక= వెనుదీయక; ఏటికిన్= ఎందుకు; పట్టినాఁడవు= చెఱగొన్నావు; అంభస్+రుహ+నేత్ర= పద్మాల వంటి కన్నులు కల ఆడుదానిని; విడ్వుము= వదలి పెట్టుము; ఎట+పోయినన్= నీవు ఎక్కడికి వెళ్లి నప్పటికిని; ఇంకన్= ఇక; ప్రాణమున్+కొందున్= (నీ) అసువులను తీస్తాను- అనగా నిన్ను చంపుతాను; ప్రస్ఫార, మహీధర, ప్రకర, భంగ, విహార, ధురీణము= నిడివి ఐన కొండల సముదాయాన్ని ముక్కలుగా చేస్తూ తిరుగాడటంలో సామర్థ్యం కలది; ఉగ్ర, దైత్య+అరుణ, రంజిత+ఉగ్ర+కులిశ+అస్త్రము= భయం కలిగించే రాక్షసులను చంపటంచేత వారి నెత్తుటిచే ఎర్రనైన వజ్ర మంత్రాయుధం; సుమ్ము= సుమా; ఇదె= ఇదిగో; అంచున్= అంటూ; డాసినన్= సమీపించగా.

తాత్పర్యం: 'ఓ నీచ రాక్షసుడా! ఈ ఆడుదానిని ఎట్టి శంక లేకుండ, ఎందుకు చెరబట్టినావురా? పద్మాల వంటి కన్నులు కల ఈ అబలను వెంటనే విడిచిపెట్టుము. నీవు ఎటు పారిపోయినా నిన్ను నేను విడువను. నీ అసువులు తీయగలను. ఇదిగో! నావద్ద వజ్రాయుధం ఉన్నది. దీనితో నేను లోగడ ఎందరినో రాక్షసులను వధించిఉన్నాను. వారి నెత్తురుతో ఎర్రబడినట్టిది సుమా ఈ వజ్రాయుధం. ఎన్నో కొండలను కూల్చినట్టిది నా వజ్రాయుధం' అంటూ దేవేంద్రుడు ఆ రాక్షసుడిని సమీపించాడు.

మత్తకోకిలము

ఘోరవిక్రముఁడైన కేశియుఁ గ్రోధఘూర్ణితచిత్తుఁ డై
ధీరుఁ డుక్కున నిల్చి యగ్గదఁ ద్రిప్పి వాసవు వైచె; న
వ్వీరుఁడున్ గద చూర్ణితంబుగ వ్రేసె నాసుర భంగిఁ బొం
గారి దారుణవజ్రపాతరయంబునం బటుహస్తుఁడై. 179

ప్రతిపదార్థం:ఘోర, విక్రముఁడు+ఐన= భయంకర మైన పరాక్రమం కలవాడైన; కేశియున్= కేశి అనే దానవుడుకూడ; క్రోధ, ఘూర్ణిత, చిత్తుఁడు+ఐ= కోపం చేత తిరుగుడు పడిన మనస్సు గలవాడై; ధీరుఁడు= ధైర్యం గలవాడు; ఉక్కునన్= బలంతో; నిల్చి= నిలువబడి; ఆ+గదన్= ఆగదను; త్రిప్పి= గిరగిర వేగంగా త్రిప్పి; వాసవున్+వైచెన్= దేవేంద్రుడిపై ప్రయోగించాడు; ఆ+వీరుఁడున్= ఆ శూరుడుకూడ; గద= గద; చూర్ణితంబుగన్= పొడి అయ్యేటట్లుగా; ఆసుర భంగిన్= రాక్షసుడి మాదిరిగనే (అనగా) ఆ కేశిదానవుడు (ప్రయోగించినట్లుగానే); పొంగారి= ఉత్సహించి; పటు హస్తుఁడు+ఐ= గొప్ప బాహువు కలవాడై; దారుణ, వజ్ర, పాత, రయంబునన్= భయాన్ని కొలిపే వజ్రపుదెబ్బయొక్క వేగంతో; వ్రేసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: వెఱపు కొలిపే పరాక్రమం కల ఆ కేశి రాక్షసుడు, కోపంచేత తిరుగుడు పడిన మనస్సు గలవాడు ఔతూ దేవేంద్రుడిని ఎదిరించి ఆతడిపై తన గదను గిరగిర త్రిప్పి ప్రయోగించాడు. దేవేంద్రుడున్నూ ఆ దానవుడు ప్రయోగించినట్లుగనే బలం గల బాహువుతో వేగంగా తన వజ్రాయుధాన్ని ప్రయోగించి ఆ గదను ముక్కలు ముక్కలుగా చేశాడు.

విశేషం: వృత్త లక్షణానికి చూడు: ఆరణ్య. 4.267 విశేషం.

ఆ. అసుర వీఁక నొక మహాచలశృంగంబు ।
విఱిచి వైచె నమరవిభునిమీఁద
గోత్రవైరి ఘోరకులిశాభిహతి వ్రయ్య ।
నడిచె దానిఁ జదల నదరు లెగయ. 180

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు; వీఁకన్= ఉత్సాహంతో; ఒక= ఒక; మహా+అచల, శృంగంబు= గొప్ప కొండ శిఖరాన్ని; విఱిచి= విరగగొట్టి; అమర, విభుని మీఁదన్= దేవతల ప్రభువు మీద; వైచెన్= ప్రయోగించాడు; గోత్రవైరి= (పర్వతాలకు శత్రువు అయిన) ఇంద్రుడు; దానిన్= ఆ కొండ శిఖరాన్ని; ఘోర, కులిశ+అభిహతిన్= భయంకరమైన వజ్రం యొక్క దెబ్బ చేత; చదలన్= ఆకసంలో; అదరులు= నిప్పు కణాలు; ఎగయన్= వ్యాపించగా; వ్రయ్యన్+అడిచెన్= ముక్కలు ముక్కలుగా అయ్యేటట్లు కొట్టాడు.

తాత్పర్యం: రాక్షసుడు ఉత్సాహంతో ఒక కొండశిఖరం పెల్లగించి దేవేంద్రుడిపై ప్రయోగించాడు. అంతట దేవేంద్రుడు తన వజ్రాయుధాన్ని ప్రయోగించి ఆ కొండ శిఖరాన్ని ముక్కలు ముక్కలు చేసి వేశాడు. అప్పుడు ఆ గిరిశిఖర వజ్రాయుధాల రాపిడికి ఆకసాన నిప్పుకణాలు వ్యాపించాయి.

వ. ఇట్లు దన సాధనంబులు విఫలంబు లైనం దలంకి దానవుం డక్కన్నియ దిగవిడిచి పఱచిన, నింద్రుండు దానిం జేరంజని 'నీ వెవ్వరిదాన? వీ రక్కసుచేత నెట్లు పట్టువడి?' తనిన నది యతని కిట్లనియె 'నయ్యా! యే నరిష్టనేమి యను ప్రజాపతి కూఁతుర, దేవసేనయనుదాన, దైత్యసేన చెలియల; నేనును మాయప్పయుం గేళికౌతుకంబునఁ దండ్రియనుమతంబు వడసి సఖీజన సహితంబుగా వెడలి యిమ్మానసనగంబు సాను దేశంబులం గ్రుమ్మరుచుండం గేశి నామధేయుం డైన యీ యసురాధముండు. 181

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; తన, సాధనంబులు= తన పరికరాలు; విఫలంబులు+ఐనన్= వ్యర్థాలు కాగా; తలంకి= భయపడి; దానవుండు= రాక్షసుడు; ఆ+కన్నియన్= ఆ కన్యను; దిగవిడిచి= అచ్చట వదలిపెట్టి; పఱచినన్= పారిపోగా; ఇంద్రుండు; దానిన్+చేరన్+చని= ఆమె దగ్గరకు వెళ్లి; నీవు+ఎవ్వరి దానవు= నీవు ఎవ్వరి అమ్మాయివి; ఈరక్కసుచేతన్= ఈ రాక్షసుడిచేత; ఎట్లు= ఏ రీతిగా; పట్టు+పడితి= చెఱపెట్టబడిన దానవు అయినావు; అనినన్= అని అడుగగా; అది= ఆమె; అతనికిన్= దేవేంద్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది; అయ్యా= ఆర్యా; ఏను=నేను; అరిష్టనేమి+అను= అరిష్ట నేమి అనే పేరుకల; ప్రజాపతి కూఁతురన్= ప్రజాపతి యొక్క పుత్రికను; దేవసేన+అనుదానన్= దేవసేన అనే పేరు గల దానిని; దైత్యసేన, చెలియలన్= దైత్యసేన అనే పేరుగల ఆమె సహోదరిని; ఏనును= నేనున్నూ; మా+అప్పయున్= మా అక్కయున్నూ; కేళి కౌతుకంబునన్= విహరించుటయెడ గల ప్రీతి చొప్పున; తండ్రి+అనుమతంబు+పడసి= తండ్రి యొక్క అనుజ్ఞను పొంది; సఖీజనసహితంబుగాన్= చెలికత్తియలతో కలసి; వెడలి= వెళ్లి; ఈ+మానస, నగంబు= ఈ మానస పర్వతం (యొక్క); సాను దేశంబులన్= చరియల యందు; క్రుమ్మరుచున్+ఉండన్= విహరిస్తూ ఉండగా; కేశి నామధేయుండు+ఐన= కేశి అనే పేరు కల; ఈ+అసుర+అధముండు= రాక్షసులలో నీచుడు అయిన ఈతఁడు.

తాత్పర్యం: ఈ విధంగా తన ఆయుధాలు వమ్మయి పోగా, భయపడి ఆ రాక్షసుడు ఆ కన్యను వదలి పారిపోయాడు. అంతట ఇంద్రుడు ఆ కన్యకను చేరి, ఓదార్చి, 'నీవు ఎవ్వరిదానవు? ఈ రాక్షసుడికి ఎట్లా చిక్కావు?' అని అడిగాడు. ఆమె, 'ఆర్యమహాశయా! నేను అరిష్టనేమి అనే ప్రజాపతి కూతురిని. నా పేరు దేవసేన. మా అక్క పేరు దైత్యసేన. నేనున్నూ మా అక్కయున్నూ తండ్రిగారి అనుమతి పొంది, చెలికత్తెలతో కలిసి ఈ మానస పర్వతం యొక్క చరియలలో విహరిస్తూ ఉన్నాం. అంతట కేశి అనే పేరు కల ఈ నీచరాక్షసుడు ఈ అత్యాచారానికి ఒడిగట్టాడు.

క. పలుమాఱు వచ్చి తన దు ।
ర్విలసితములు మాకుఁ జూపు వేడుక దోఁపన్
బలుకును మేలమునఁ జెనకఁ ।
దలఁచుఁ గదియు మదనకదనదళితహృదయుఁ డై. 182

ప్రతిపదార్థం: పలుమాఱు= చాల పర్యాయాలు; వచ్చి; తన దుర్విలసితములు= తనయొక్క చెడు హొయలు; మాకున్+చూపున్= మాకు (నాకున్నూ మా అక్కకున్నూ) ప్రదర్శిస్తాడు; వేడుక తోఁపన్+పలుకును= తన కుతూహలం బయలు పడేటట్లుగా మాటలాడుతాడు; మేలమునన్= పరిహాసంతో; చెనకన్+తలఁచున్= నొప్పించ తలుస్తాడు; మదన, కదన, దళిత, హృదయుఁడు+ఐ= మన్మథుడికి సంబంధించిన యుద్ధంకొరకై (రతిక్రీడ కొరకై) వికసించిన డెందం కలవాడై; కదియున్= సమీపిస్తాడు.

తాత్పర్యం: కేశి రాక్షసుడు ఎన్నో మారులు మా దగ్గరకు చేరి, అతడి యొక్క హొయలు ప్రదర్శిస్తూ ఉండేవాడు. వేళాకోళం చేస్తూ ఉండేవాడు. మన్మథక్రీడకు సంబంధించిన కోర్కెలు ప్రదర్శిస్తూ సమీపిస్తూ ఉండేవాడు.

తే. వాని చేష్టలన్నియు దైత్యసేన కభిమ ।
తంబు లై యుండు; నాకు నెంతయును దుస్స
హములు; వినవె! యిమ్మెయిన యక్కమలనయనఁ ।
గోరి దానవుఁ డెలయించి కొంచుఁ జనియె. 183

ప్రతిపదార్థం: వినవె= (శ్రద్ధతో) వినవయ్యా!; వాని చేష్టలు+అన్నియున్= ఆ రాక్షసుడి యొక్క పనులు అన్నీ; దైత్యసేనకున్= దైత్యసేనకు (మా అక్కకు); అభిమతంబులు+ఐ+ఉండున్= ఇష్టమై ఉండేవి; నాకున్+ఎంతయును, దుస్సహములు+అ= నాకు మాత్రం ఎంత మాత్రమూ సహించరానివిగా ఉండేవి; ఇమ్మెయిన్+అ= ఈ రీతిగానే; ఆ+కమలనయనన్= ఆ అమ్మాయిని (పద్మాల వంటి కనులు కలదానిని); కోరి= వరించి; దానవుఁడు= రాక్షసుడు; ఎలయించి కొంచున్= తన వశం చేసికొంటూ; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శ్రద్ధతో వినుము. అతడి చేష్టలన్నీ దైత్యసేనకు ఇష్టమై ఉండేవి. నాకు మాత్రం సహించరానివిగా ఉండేవి. దానితో ఆ రాక్షసుడు ఆమెను వశం చేసికొని తీసికొని వెళ్ళాడు.

తే. అంతఁ బోక వెండియు వచ్చి యింత సేసె ।
నద్దురాత్ముఁడు నన్ను; మీ దైన కరుణఁ
దొడరి దుఃఖసాగరమునఁ బడుట దప్పె' ।
ననిన నయ్యింద్రుఁ డనియె నయ్యతివఁ జూచి. 184

ప్రతిపదార్థం: ఆ+దురాత్ముఁడు= ఆ చెడ్డవాడు; అంతన్+పోక= ఆ విధంగా చేసి- వెడలక; వెండియున్ వచ్చి= మరల వచ్చి; నన్నున్= నన్ను; ఇంత+చేసెన్= ఇంత (ఇంతటి ఆగడం) ఒనరించాడు; మీదైన, కరుణన్= మీ యొక్క దయవలన; తొడరి= పూని; దుఃఖ, సాగరమునన్+పడుట= శోకం అనే సముద్రంలో పడిపోవటం; తప్పెన్= తప్పింది; అనిన్= అని చెప్పగా; ఆ ఇంద్రుఁడు= ఆ+దేవేంద్రుడు; ఆ+అతివన్+చూచి= ఆ వనితను చూచి; అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: మా అక్కను ఆకర్షించి లేవదీసికొని పోవటంతో ఆగక, ఆ దుర్మార్గుడు మరల నా దగ్గరికి వచ్చి ఇంతటి ఆఘాయిత్యం చేశాడు. మీ దయవలన నేను ఇట్టి దుఃఖసాగరంలో పడిపోకుండ తప్పించుకోగలిగాను' అని దేవసేన పలుకగా, ఇంద్రుడు ఆమెతో ఇట్లా బదులు పలికాడు.

క. 'విను, దక్షతనూజలు మా ।
జననియు మీ తల్లియును; నిజంబుగ మా కీ
వనుజ వయితి; వనజానన!
యొనరంగా వేఁడు నీకు నొక వర మిత్తున్'. 185

ప్రతిపదార్థం: వనజ+ఆనన!= పద్మం వంటి మొగం కలదానా!; విను= ఆలకించుము; మా జననియున్= మా తల్లియున్నూ; మీ తల్లియును= మీ జననియున్నూ; దక్షతనూజలు= దక్షుడి యొక్క పుత్రికలు; నిజంబుగన్= యథార్థంగా; మాకున్= నాకు; ఈవు= నీవు; అనుజవు+అయితి(వి)= సహోదరివి అయినావు; ఒనరంగాన్= ఒప్పిదమౌనట్లుగా; వేడుము= కోరుకొనుము; నీకున్= నీకు; ఒక వరము= ఒక కోరిక; ఇత్తున్= అనుగ్రహిస్తాను.

తాత్పర్యం: పద్మం వంటి మొగం కల సుందరీ!; వినుము; నీవు నాకు చెల్లెలి వౌతావు. మీ అమ్మగారు మా అమ్మగారు దక్షుడి పుత్రికలే. అందుచేత కోరుకో. ఇష్టమైన వరాన్ని నీకు నేను ప్రసాదిస్తాను.

విశేషం: శాపానికి ప్రతియోగ కల్పన - వరం. కోరినవరం ప్రసాదించే మహిమ మహానుభావులకు ఉంటుంది.

వ. అనిన దేవసేన దేవేంద్రున కి ట్లనియె. 186

తాత్పర్యం: అని అనగా దేవసేన దేవేంద్రుడితో ఇట్లా అన్నది.

తే. 'అనఘ! మాతండ్రి యొక్కనాఁ డతిముదమున ।
నన్ను నుపలాలనము సేసి 'నాతి! నీవు
ప్రథిత పౌరుషుఁ డగు భర్తఁ బడయు' దనియె; ।
నట్టి వానిని నీవు నా కరయవలయు. 187

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా (ఓ దేవేంద్రుడా!); మా తండ్రి= మా నాన్న; ఒక్కనాఁడు= ఒక రోజున; అతి, ముదమునన్= మిక్కిలి సంతోషంతో; నన్నున్; ఉపలాలనము+చేసి= గారాబం చేసి; నాతి!= ఓ అమ్మాయీ!; నీవు; ప్రథిత పౌరుషుఁడు+అగు= గొప్ప పేరు కెక్కిన పరాక్రమశాలి అయినట్టి; భర్తన్= పెనిమిటిని; పడయుదు(వు)= పొందుతావు; అనియెన్= అని చెప్పాడు; అట్టివానినిన్= (మా తండ్రిగారు చెప్పినట్లు గొప్పపరాక్రమవంతుడిని); నీవు= నీవు; నాకున్= నాకు; అరయ వలయున్= వెదకవలెను (నాకు భర్తగా సమకూర్చాలి).

తాత్పర్యం: అని చెప్పిన పిమ్మట, దేవసేన దేవేంద్రుడిని ఈ విధంగా అడిగింది: 'పాపరహితుడ వైన ఓ మహానుభావా! మా జనకుడు చిన్నప్పుడు నన్ను గారాబం చేసి, 'అమ్మా! నీకు గొప్ప పేరుప్రతిష్ఠలు ఆర్జించిన మహాపరాక్రమశాలి భర్త కాగలడు' అని చెప్పాడు. ఆయనమాటలు నిజం చేయటమే నేను నీనుండి కోరుకొనే వరం.

చ. అనిమిష దానవేంద్రులకు నైన నజయ్యుఁడు, నుగ్రవైరిభం
జనుఁడు, త్రిలోకరక్షణవశంవదుఁడున్, భవదిష్టమిత్రుఁడున్
ఘనగుణకీర్తనుండు నగు కాంతునిఁ గోరెద; నా మనోరథం
బు నెరయ సంఘటించి సురపుంగవ! నన్నుఁ గృతార్థఁ జేయవే!' 188

ప్రతిపదార్థం: సురపుంగవ!= దేవతలలో శ్రేష్ఠుడవైన వాడా!; అనిమిష, దానవ+ఇంద్రులకున్+ ఐనన్= దేవతలలో రాక్షసులలో శ్రేష్ఠులు అయిన వారికి కూడ; అజయ్యుఁడు= గెలువ శక్యం కానివాడు; ఉగ్ర, వైరి, భంజనుఁడు= భయంకరులైన శత్రువులను చంపేవాడు; త్రి, లోక, రక్షణ, వశంవదుఁడున్= మూడు లోకాలను రక్షించటం తనకు స్వాధీనమై ఉన్నవాడు; భవత్+ఇష్ట, మిత్రుఁడున్= నీకు అనుగు నెచ్చెలి అయిన వాడు; ఘన, గుణ కీర్తనుండును+అగు= గొప్ప గుణాలు కలిగి ఉండటంచేత కొనియాడబడేవాడు అయిన; కాంతునిన్= భర్తను; కోరెదన్= వాంఛిస్తాను; నా మనోరథంబు= నా కోరిక; నెరయన్= సిద్ధించేటట్లుగా; సంఘటించి= ఒనగూర్చి; నన్నున్= నన్ను; కృతార్థన్+చేయవే= ధన్యురాలిని చేయవా?.

తాత్పర్యం: దేవతలలో శ్రేష్ఠుడవైన ఓ దేవేంద్రుడా!; నీవు అనుగ్రహించిన మేరకు నేను వరం కోరుకొంటున్నాను. దేవతలలో రాక్షసులలో శ్రేష్ఠులకు కూడ గెలువ శక్యం కానివాడు. భయంకరులైన శత్రువులను పరిమార్చేవాడు, మూడులోకాల రక్షణం తనకు వశమైనవాడు, నీకు ఆప్తమిత్రుడు అయినవాడు, నాకు భర్త కావలెనని కోరుకొంటున్నాను. నా కోరిక ఈడేర్చి నన్ను ధన్యురాలినిగా చేయ వేడికోలు'.

వ. అనిన నింద్రుండు దీనికిం బతి యెవ్వం డగు నొకో! యని కొండొక విచారించు నెడ, నమ్ముహూర్తంబు రౌద్ర నామకంబయి సోమ సూర్యసంగమ కారణం బయిన యమావాస్యాముఖం బై యుండం, బూర్వసంధ్యారాగ రక్తాంబుద ప్రతిబింబ పటల పాటలితోదకం బయిన జలనిధి సమీపంబున నమరాసుర సమర సంకులంబుగా నరుణకిరణుం డుదయించుచుండఁ దత్కాలంబున భృగ్వంగిరఃప్రముఖు లైన మునులు వేల్చు హవ్యంబులు మోచికొని హవ్యవహనుండు సూర్యమండలంబు ప్రవేశించుచుండం గనుంగొని, యిది సూర్యసోమాగ్ని సమాగమం బయిన రౌద్ర నామక

ముహూర్తంబు గావున సూర్యసోమాగ్ని తేజంబున జనియించిన వాఁడు
దీనికిఁ బ్రియుండు గావలయు నని మనంబున నిశ్చయించి, యతం డా
క్షణంబ. 189

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; ఇంద్రుండు= వేలుపుదొర; దీనికిన్= ఈమెకు (దేవసేనకు); పతి= భర్త; ఎవ్వండు+ అగున్+ఒకో= ఎవ్వడు కాగలడో; అని; కొండొక విచారించు+ఎడన్= కొంతసేపు ఆలోచించే టప్పుడు; ఆ+ముహూర్తంబు= ఆ లగ్నం; రౌద్ర, నామకంబు+అయి= రౌద్రం అనే పేరు కలిగినదై; సోమ, సూర్య, సంగమ, కారణంబు+అయిన= సూర్యుడున్నూ చంద్రుడున్నూ కలియటానికి హేతువైన; అమావాస్యా, ముఖంబు+ఐ= కృష్ణపక్షంలోని కడపటి తిథియొక్క ఆరంభం కలదై; ఉండన్= ఉండటం చేత; పూర్వ, సంధ్యా, రాగ, రక్త+అంబుద, ప్రతిబింబ, పటల, పాటలిత+ ఉదకంబు+అయిన= ఉదయసంధ్యా కాలంలోని ఎర్రని వెలుగులతో ఎర్రబడిన మబ్బుల ప్రతిబింబ సముదాయంచేత ఎర్రబడినట్లున్న నీరు గల; జలనిధి, సమీపంబునన్= సముద్రం దగ్గర; అమర+అసుర, సమర, సంకులంబుగాన్= దేవతలు రాక్షసులు చేసే యుద్ధ సంక్షోభంవలె; అరుణ కిరణుండు= సూర్యుడు, ఎఱ్ఱని కిరణాలు కలవాడు; ఉదయించుచున్+ ఉండన్= పొడుస్తూ ఉండగా; తద్+కాలంబునన్= ఆ సమయంలో; భృగు+అంగిరస్+ప్రముఖులు+ఐన= భృగువు, అంగిరసుడు మున్నగునట్టి; మునులు= ఋషులు; వేల్చు, హవ్యంబులు= యజ్ఞకుండాలలో వేసే హోమద్రవ్యాలు; మోచికొని= వహించి; హవ్యవహనుండు= అగ్నిహోత్రుడు; సూర్య, సోమ+అగ్ని, సమాగమంబు+అయిన= సూర్యుడున్నూ, చంద్రుడున్నూ, అగ్నిహోత్రుడున్నూ, కలిసేది అయిన; రౌద్ర, నామక, ముహూర్తంబు= రౌద్రం అనే పేరు కల లగ్న సమయం; కావునన్= కాబట్టి; సూర్య, సోమ+అగ్ని తేజంబునన్= సూర్యుడి యొక్కయు, చంద్రుడి యొక్కయు, అగ్నిహోత్రుడి యొక్కయు కాంతితో; జనియించినవాఁడు= పుట్టినవాడు; దీనికిన్= ఈమెకు (దేవసేనకు); ప్రియుండు= భర్త; కావలయున్= కావాలి; అని= అంటూ;

మనంబునన్= మనసులో; నిశ్చయించి= నిర్ణయించి; అతండు= దేవేంద్రుడు; ఆ+క్షణంబు+అ= ఆ త్రుటిలోనే.

తాత్పర్యం: దేవసేన వేడిన వరం వినినంతనే దేవేంద్రుడు ఈ విధంగా యోచించాడు. 'ఈమెకు భర్త ఎవ్వడౌతాడు? ఈ ముహూర్తం రౌద్రం అనే పేరు కలది గదా! ఈనాడు తిథి అమావాస్య. అమావాస్యనాడు సూర్యుడు చంద్రుడు ఏకరాశిలో కలిసి ఉంటారు. అంతేకాక- ఇది సూర్యోదయ సమయం. ఈ ప్రభాతకాలంలో సూర్యుడి ఎర్రని కిరణాలచేత ఎర్రనైన మబ్బులు ప్రతిబింబించటంచేత, సముద్రం కూడ ఎరుపురంగుకలదై కన్పిస్తున్నది. దేవదానవ యుద్ధాన్ని తలపింపజేస్తూ సముద్రం సంక్షుభితమై ఉన్నది. బాలభానుడు ఉదయిస్తున్న ఈ లగ్నంలో భృగువు, అంగిరసుడు మున్నగు మహర్షులు యజ్ఞకుండాలలో వేల్చిన హోమద్రవ్యాలను వహించి అగ్నిహోత్రుడు సూర్య మండలం ప్రవేశిస్తున్నాడు. ఇది సూర్యుడు, చంద్రుడు, అగ్నిహోత్రుడు కలిసిన రౌద్రముహూర్తం. కాబట్టి సూర్య చంద్రాగ్నిహోత్రుల తేజస్సులో జన్మించినవాడు ఈ దేవసేనకు భర్త కాగలడు' అని నిర్ణయించుకొన్నాడు.

విశేషం: అమావాస్య-కృష్ణపక్షంలోని కడపటి దివసం. ఆనాడు సూర్యుడు చంద్రుడు ఆకసంలో ఒకేచోట ఉంటారు. కాని, చంద్రుడు చర్మచక్షువులకు అమావాస్యనాడు కన్పించడు గదా! భారతీయుల జ్యోతిష పరిజ్ఞానం పేర్కొనదగింది. దుర్భిణీ యంత్రాలు లేని ప్రాచీనకాలంలో పాశ్చాత్యులకు తెలియని అంశాలు ఎన్నో ఆనాడు ప్రాచీనభారతీయులకు సుగమాలు. దేవసేన- వరం కోరిన ముహూర్తాన్ని బట్టి దేవేంద్రుడు ఆమెకు ఎటువంటి భర్త- భవిష్యత్కాలంలో లభిస్తాడో జ్యోతిష గణితాన్ని అన్వయించి తెలిసికొనగలిగాడు.

క. బాలం దోడ్కొని యబ్జజు।
పాలికిఁజని మ్రొక్కి త్రిదశపాలుఁడు 'దేవా!
యీ లలనకుఁ దగు వరునిఁ గృ।
పాలుఁడవై యొసఁగు' మనినఁ బద్మజుఁ డనియెన్. 190

ప్రతిపదార్థం: త్రిదశ పాలుఁడు= వేల్పుల దొర అయిన ఇంద్రుడు; బాలన్+తోడ్కొని= కన్యకను తన వెంటపెట్టుకొని; అబ్జజు పాలికిన్+చని= బ్రహ్మదేవుడి కడ కేగి; మ్రొక్కి= నమస్కరించి; దేవా!= ఓ బ్రహ్మదేవా!; ఈ, లలనకున్= ఈ అమ్మాయికి; తగువరునిన్= యోగ్యుడైన భర్తను; కృపాలుఁడవు+ఐ= దయ కలిగినవాడవై; ఒసఁగుము= ఇమ్ము; అనినన్= అని చెప్పగా; పద్మజుఁడు= తామరపువ్వులో పుట్టిన వాడైన బ్రహ్మ; అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు ఆ కన్యకను తన వెంట పెట్టుకొని బ్రహ్మదేవుడి కడకు వెళ్ళి నమస్కరించి ఇట్లా పలికాడు; 'దేవా! ఈమెకు యోగ్యుడైన భర్తను ప్రసాదించుము. నీవు దయామయుడవు' అనగా, బ్రహ్మదేవుడు ఇట్లా బదులు పలికాడు.

విశేషం: త్రిదశపాలుఁడు అనగా దేవతలను పాలించేవాడు. త్రిదశులు - అనగా దేవతలు - ఎల్లప్పుడు ముప్పదేండ్ల వయసుతో ఉండే నిత్య యౌవనులు అన్నమాట.

ఉ. 'దీపితవిక్రమాస్పదుఁడు దీనికి వల్లభుఁ డయ్యెడుం ద్రిలో
కీపరిరక్షణక్షముఁడు గీర్తితమూర్తి యొకండు; వాఁడ మీ
యాపదలెల్లఁ బాపుటకునై ధృతిఁ బూను నశేష దేవసే
నాపతి భావమున్ విబుధనాయక! శీఘ్రమ భావ్య మింతయున్.'191

ప్రతిపదార్థం: విబుధ నాయక!= వేల్పులకు నేతవైన దేవేంద్రా!; దీపిత, విక్రమ+ఆస్పదుఁడు= ప్రజ్వలించబడిన పరాక్రమానికి నెలవు అయినవాడు; త్రిలోకీ పరిరక్షణ క్షముఁడు= మూఁడులోకాలను కాపాడ గల సామర్థ్యం కలవాడు; కీర్తిత మూర్తి= పేరు ప్రతిష్ఠలను ఆర్జించిన ఆకారం కలవాడు; ఒకండు= ఒకడు; దీనికిన్= ఈమెకు (ఈ దేవసేనకు); వల్లభుఁడు= భర్త; అయ్యెడున్= కాగలడు; వాఁడు+అ= అతడే; మీ ఆపదలు+ఎల్లన్= మీకు దాపురించే కష్టాలను అన్నింటిని; పాపుటకున్+ఐ= పోగొట్టుట కొరకై; అశేష, దేవ సేనాపతి భావమున్= సమస్త మైన దేవతల సేనలకు ఆధిపత్యాన్ని; ధృతిన్+పూనున్= స్థైర్యశౌర్యాలతో వహిస్తాడు. ఇంతయున్= ఇది అంతయు; శీఘ్రము+అ= మిక్కిలి వేగంగానే; భావ్యము= జరుగుతుంది.

తాత్పర్యం: ఓ దేవేంద్రా!, ఈ దేవసేనకు గొప్ప వీరుడు భర్త కాగలడు. ఆతడు మూడులోకాలను కాపాడగల సామర్థ్యం కలవాడౌతాడు. ఆతడే మీ ఆపదలను పారద్రోలి మిమ్ములను రక్షించగలడు. దేవసైన్యాల కన్నింటికి ఆతడు సేనాపతి కాగలడు. ఇది అంతా సమీప భవిష్యత్కాలంలోనే జరుగుతుంది సుమా!

విశేషం: ఈ దేవసేన భర్త 'అశేష దేవసేనాపతి' కాగలడు అనటంలో సుకుమార సుందర మైన వ్యంగ్యం ఉన్నది. దేవసేనాపతి= దేవసేన యనే కన్యకు భర్త అని సుస్పష్టమైన అర్థం సుగమం. అశేష దేవసేనాపతి భావము-అంటే దేవతల సర్వసేనా నాయకుడు (సేనా నాయకత్వము) అనేది మరొక అర్థం. దేవసేన భర్త, దేవసేన అనుకన్యకకు భర్తయేగాక, దేవతల సర్వసేనలకు నాయకుడు కూడ కాగలడని బ్రహ్మ వచించాడు. దేవసేన సార్థక నామధేయురాలు కావటం ఇక్కడ చమత్కారం.

వ. అనినం బ్రీతుం డై పితామహు వీడ్కొని యింద్రుండు సనియెఁ; దదనంతరంబ వసిష్ఠ ప్రముఖులైన సప్త మహామును లమావాస్యాహోమంబు సేయ సమకట్టిన, నమరు లందఱు నందుల హవిర్భాగంబులు గొనుటకు నాసన్ను లగుటయు. 192

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; ప్రీతుండు+ఐ= సంతృప్తిచెందిన వాడై; పితామహున్= బ్రహ్మదేవుడిని; వీడ్కొని= సెలవుగైకొని; ఇంద్రుండు; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+ అ= అటు పిమ్మట; వసిష్ఠ, ప్రముఖులు+ఐన= వసిష్ఠుడు మున్నగువారైన; సప్త, మహామునులు= ఏడుగురు ఋషులు; అమావాస్యా, హోమంబు+చేయన్, సమకట్టినన్= అమావాస్యనాడు

అగ్నికుండాలలో హోమాలు చేయటానికి పూనగా; అమరులు+అందఱున్= వేల్పులు ఎల్లరు; అందులన్, హవిస్+భాగంబులు= ఆ హోమద్రవ్యాలలో తమ తమ వంతులు; కొనుటకున్= స్వీకరించటానికి; ఆసన్నులు+ అగుటయున్= చేరగా.

తాత్పర్యం: అనగా సంతృప్తి చెంది ఇంద్రుడు బ్రహ్మదేవుడికడ సెలవు గైకొని వెడలిపోయాడు. ఆ తరువాత, వసిష్ఠుఁడు మున్నగు మహర్షులు ఏడుగురు అమావాస్యా హోమం చేయటానికి ఉద్యమించారు. దేవతలు అందరు తమ తమ హవిస్సుల వంతులు తీసికొనటానికి సంసిద్ధులై సమీపించారు.

క. ఆహవనీయ ముఖంబున ।
నాహూతుం డై హుతాశుఁ డమ్మును లిడఁగా
నాహుతులు గొని దివిజ సం ।
దోహమునకు వరుస నొసఁగఁ దొడఁగెం బ్రీతిన్. 193

ప్రతిపదార్థం: ఆహవనీయ, ముఖంబునన్= త్రేతాగ్నులలో మొదటిదైన ఆహవనీయం అనే పేరుగల అగ్ని పేరున; ఆ హూతుండు+ఐ= పిలువబడినవాడై; హుతాశుఁడు= అగ్నిహోత్రుడు; ఆ+మునులు= ఆ ఋషులు; ఆహుతులు= దేవతల నుద్దేశించి మంత్రపురస్సరంగా వేల్చబడిన హోమద్రవ్యాలు; ఇడఁగాన్= సమర్పించగా; కొని= గ్రహించి; దివిజ, సందోహమునకున్= వేల్పుల గుంపులకు; వరుసన్= క్రమంగా; ప్రీతిన్= సంతసంతో; ఒసఁగన్+తొడఁగెన్= ఇవ్వసాగాడు.

తాత్పర్యం: సప్తర్షులు ఆహవనీయ మనే పేరున తనను ఆహ్వానించగా, అగ్నిహోత్రుడు ఆ మునులు సమర్పించిన హోమద్రవ్యాలను గైకొని వాటిని దేవతలకు క్రమానుక్రమణిక చొప్పున సంతసంతో అందించసాగాడు.

అగ్నిదేవుండు మునిపత్నులం గామించుట (సం. 3-213-42)

సీ. ఆ సమయంబున నమ్మునీంద్రుల భార్య ।
లందఱు సుస్నాన మొందఁ జేసి
రమణీయ మాల్యాంబర విభూషణాద్యలం ।
కారంబు లొనరించి గారవమునఁ
జనుదెంచి పతులకు సన్మతిం బరిచర్య ।
సేయుచు మెలఁగంగ వాయుసఖుఁడు
మెలఁతల వాలిక మెఱుఁగుఁ గన్నుల యొప్పుఁ ।
దెలినవ్వుమొగముల విలసనములు

తే. నడబెడంగులు నన్నువనడుములందు ।
వెలయు వళులభావంబులు వలుఁదచన్నుఁ
గవల నిక్కును నేర్పడఁ గని, కరంగి ।
మదనమార్గణ విదళిత హృదయుఁడయ్యె. 194

ప్రతిపదార్థం: ఆ, సమయంబునన్= ఆ కాలంలో; ఆ+ముని+ఇంద్రుల, భార్యలు= ఆ గొప్ప ఋషుల పెండ్లాలు; అందఱున్= అందరును; సుస్నానము= మంచి అభ్యంగన స్నానం; ఒందన్= ఇంపారగా; చేసి= ఆచరించి; రమణీయ, మాల్య+అంబర, విభూషణ+ ఆది+అలంకారంబులు= అందమైన పువ్వులు, బట్టలు, నగలు మొదలైన సింగారింపులు; ఒనరించి= చేసికొని; గారవమునన్= మన్ననతో; చనుదెంచి= వచ్చి; పతులకున్= భర్తలకు; సత్+మతిన్= మంచి బుద్ధితో; పరిచర్య+ చేయుచున్= సేవచేస్తూ; మెలఁగంగన్= తిరుగాడగా; వాయుసఖుఁడు= అగ్నిహోత్రుడు; మెలఁతల, వాలిక, మెఱుఁగు+కన్నుల+ఒప్పున్= వనితల నిడివి అయిన వెలుగొందే నేత్రాల అందాన్ని; తెలినవ్వు మొగముల విలసనములు= తేట వైన ముఖాలలో విస్తరిల్లే నవ్వుల సింగారాలను; నడ బెడంగులు= నడకల ఒయ్యారాలు;

అన్నువ నడుములందున్= సన్నని నడుములలో; వెలయు= ఒప్పారు; వళుల భావంబులు= మడతల పొందికలు; వలుఁద, చన్నుఁ గవల నిక్కును= గబ్బిగుబ్బల పొటమరింతలను; ఏర్పడన్+కని= స్పష్టంగా చూచి; కరంగి= ద్రవించి; మదన, మార్గణ విదళిత, హృదయుఁడు+అయ్యెన్= మన్మథుడియొక్క బాణాలచేత చీల్చబడిన గుండె కలవాడయ్యాడు.

తాత్పర్యం: అమావాస్యా హోమం చేస్తున్న సమయంలో సప్తర్షుల భార్యలు అందరున్నూ చక్కగా స్నానం చేసి అందమైన పువ్వులు ముడుచుకొని, క్రొత్త బట్టలు కట్టుకొని, ఆభరణాలు ధరించి, సహధర్మచారిణులై తమ తమ భర్తలకు గౌరవంతో శుశ్రూష చేస్తూ ఉన్నారు. వాయుసఖుడైన అగ్నిహోత్రుడు సప్తర్షుల భార్యల సౌందర్యాన్ని చూచి, కనువేదురుతో భ్రమందసాగాడు. ఆ అంగనల వాలుచూపులు, నునుసోగనేత్రాలు, మందహాసాలు చిందే వదనాలు, నడకలలోని ఒయ్యారాలు, సన్నని నడుములలోని ముడతలు, గబ్బిగుబ్బల పొటమరింతలు చూచి కరగి అగ్నిహోత్రుడు మన్మథబాణాలకు గురి అయి చలించిన హృదయం కలవాడయ్యాడు.

వ. ఇట్లు వికలేంద్రియుండై వైశ్వానరుం డమ్మునిపత్నులయందుఁ దగిలిన డెందంబు మగిడింప నేరక వారలం గదియ నప్పళించి గార్హపత్యకుండం బునం దావేశించి. 195

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; వికల+ఇంద్రియుండు+ఐ= వశం తప్పిన ఇంద్రియాలు కలవాడై; వైశ్వానరుండు= అగ్ని దేవుడు; ఆ+ముని, పత్నుల యందున్= ఆ ఋషుల భార్యల యందు; తగిలిన= అంటిన; డెందంబు= హృదయం; మగిడింపన్, నేరక= త్రిప్పజాలక; వారలన్= (ఆ మునుల భార్యలను); కదియన్+అప్పళించి= దగ్గరగా ఉండి స్పృశింపగోరి; గార్హపత్య కుండంబునందున్= గృహస్థులు గార్హపత్యమనే పేరుగల అగ్నిని వెలిగించే కుండంలో; ఆవహించి= చేరి.

తాత్పర్యం: ఈ విధంగా అగ్నిహోత్రుడు ఇంద్రియనిగ్రహాన్ని కోల్పోయిన వాడై, ఆ ఋషులభార్యలయందు తగుల్కొనిన తన హృదయాన్ని మరలించ జాలకపోయాడు. ఆ మునీంద్రుల భార్యలను సమీపంలో ఉండి తాకగోరినవాడై, అతడు గార్హపత్య కుండంలో చేరాడు.

విశేషం: అగ్నులు మూడుతెరగులు 1) ఆహవనీయం 2) గార్హపత్యం 3) దక్షిణం. యజ్ఞానికి అనువైనది ఆహవనీయం. గృహస్థులకు అనువైనది గార్హపత్యం. దక్షిణం త్రేతాగ్నులలో అగ్రగణ్యం. ఇది శ్రోత్రియ బ్రహ్మచారులకు అనువైనది.

చ. అతివలు దన్నుఁ జేరుటకు నాసపడుం, బొరిఁ జేరుచోట నా
యత విలసచ్ఛిఖాగ్రముల నల్లన వారల నంటుఁ, గౌతుకం
బతిశయమై తదంగలత లాదటఁ గౌఁగిటఁ జేర్పఁ గోరుఁ, గం
పిత ధృతి యై కలంగుఁ, గడుఁబెల్లగు రాగరసంబు ముంపఁగన్. 196

ప్రతిపదార్థం: అతివలు= అంగనలు (ఆ మునిభార్యలు); తన్నున్= తనను (అగ్నిహోత్రుడిని); చేరుటకున్= దగ్గరకు రావటానికి; ఆసపడున్= ఆశిస్తాడు; పొరిన్= క్రమంగా; చేరుచోటన్= కలిసిన స్థలంలో; ఆయత, విలసత్+శిఖా+ అగ్రములన్= నిడివి అయి ఒప్పారే జ్వాలలయొక్క కొసల భాగాలచేత; అల్లన= మృదువుగా; వారలన్= (ఆ ముని భార్యలను); అంటున్= తాకుతాడు. కౌతుకంబు+అతిశయము+ఐ= వేడుక మిక్కుటమై; తద్+అంగ, లతలు= వారల శరీరాలు అనే తీగలను; ఆదటన్= ఆసక్తితో; కౌగిటన్+ చేర్పన్+కోరున్= ఆలింగనం చేసుకో గోరుతాడు; కంపిత, ధృతి+ఐ= చలించిన స్థైర్యం కలవాడై; కడున్= మిక్కిలి, పెల్లు+అగు= ఎక్కువ అయిన; రాగ, రసంబు, ముంపఁగన్= వలపు ప్రవాహం ముంచెత్తగా; కలంగున్= బాధ పడతాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు ఆ మునిభార్యలు తన దరికి చేరవలెనని పరితపించసాగాడు. తన దరికి చేరినప్పుడు, వరుసగా వారిని తన జ్వాలలచేత

మృదువుగా తాకి స్పర్శసుఖం అనుభవించాడు. సుకుమార మైన లతలను బోలు వారి శరీరాలను తాక గోరాడు. వారిని తన కౌగిలిలో బంధించ తలపోశాడు. ఈ విధంగా ఆతడు తన స్థైర్యాన్ని కోలుపోయి మన్మథ వికారానికి లోనై బాధపడసాగాడు.

విశేషం: ఇందులో మన్మథావస్థలు మనోహరంగా వర్ణించబడ్డాయి. ఈ కాముకచేష్టలు నిసర్గరమణీయాలు. అలం: స్వభావోక్తి.

వ. అంత నమ్మునీంద్రుల హోమవిధి సమాప్తం బగుటయు, జాతవేదుండు మదనవేదనాభరంబు సహింప నోపక నిర్జనం బయిన వనంబునకుం జని మునిపత్నీసమాగమంబు దుర్లభంబుగా వగచి వెగడంది శరీరంబు దిగ విడువ సమకట్టు నెడ, తదీయవల్లభ యైన స్వాహాదేవి తత్ప్రకారం బంతయు నెఱింగి, యతనికిం బ్రియంబు సేయునది యై సప్తమునులలో నంగిరసుభార్య శివ యను దాని రూపంబు గైకొని చని, యేకతంబ యున్న హుతాశనుం గనుంగొని యిట్లనియె. 197

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; ఆ+ముని+ఇంద్రుల, హోమ, విధి= ఆ ఋషులలో శ్రేష్ఠులైన వారల యొక్క యజ్ఞం; సమాప్తంబు+అగుటయున్= పూర్తి కావటం చేత; జాతవేదుండు= అగ్ని హోత్రుడు; మదన వేదనాభరంబు= మన్మథ బాధ యొక్క బరువు; సహింపన్+ఓపక= ఓర్వజాలక; నిర్జనంబు+ అయిన= జనులు లేనట్టి; వనంబునకున్+చని= అడవికి వెళ్ళి; ముని, పత్నీ, సమాగమంబు= ఋషుల భార్యల యొక్క కలయిక; దుర్లభంబుగాన్= పొందరానిదిగా; వగచి= విచారించి; వెగడు+అంది= దిగులుతో నిస్పృహ చెంది; శరీరంబు= దేహం; దిగవిడువన్, సమకట్టున్+ఎడన్= త్యజించటానికి పూనుకొని ఉండగా; తదీయ, వల్లభ+ఐన= ఆతడి భార్య అయిన; స్వాహాదేవి= స్వాహా అనే పేరు గల శ్రీమతి; తద్+ప్రకారంబు+ అంతయున్+ఎఱింగి= ఆ తీరు నంతటిని తెలిసికొని; అతనికిన్= (అగ్ని దేవుడికి); ప్రియంబు=

ప్రీతిని; చేయునది+ఐ= కలిగించేదై; సప్త, మునులలోన్= ఏడుగురు ఋషులలో; అంగిరసు, భార్య= అంగిరసుడు అనే మునియొక్క పెండ్లం; శివ+అను దాని రూపంబు= శివ అనే పేరు గల ఆమెయొక్క ఆకారాన్ని; కైకొని= స్వీకరించి; చని= వెళ్లి; ఏకతంబు+అ+ఉన్న= ఒంటరిగానే ఉన్న; హుతాశనున్= అగ్నిహోత్రుడిని; కనుంగొని= దర్శించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఆ తరువాత సప్తర్షులు ప్రారంభించిన అమావాస్యా హోమం ముగిసింది. ఇక ఆతడికి సప్తర్షుల భార్యలు కనిపించరుగదా! అందువలన అగ్నిహోత్రుడు విరహబాధ చేత తపించి, మన్మథ తాపం ఓర్వజాలక, చింతతో జనం లేని అరణ్యంలోకి పోయి, తన దేహం పరిత్యజించ సమకట్టాడు. అప్పుడు అగ్నిహోత్రుడిభార్య స్వాహాదేవి ఆ వృత్తాంతాన్ని పసికట్టి తనభర్తకు ప్రీతి కలిగించటానికై తాను సప్తర్షులలో నొకడైన అంగిరసుడి భార్య శివ అనే ఆమె రూపాన్ని ధరించి, అడవికి వెళ్లి అక్కడ ఒంటరిగా ఉన్న అగ్నిహోత్రుడిని చేరి ఇట్లా పలికింది.

తే. 'అంగిరసుభార్య నేను శివాభిధాన; ।
ననఘ! నాకును నాతోడి యంగనలకు
ననుదినంబును నతిమనోహర విలాస ।
మైన నీమూర్తిపైఁ గోర్కి యడరియుండు. 198

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! ఏను= నేను; అంగిరసు, భార్యన్= అంగిరసుడు అనే మునియొక్క భార్యను; శివా+అభిధానన్= శివ అనే పేరు గలదానిని; నాకును; నాతోడి+అంగనలకున్= నాతోపాటు కల వనితలకును (అనగా సహవ్రతులైన సప్తర్షుల భార్యలకును); అనుదినంబును= ప్రతి దినం కూడా; అతి మనస్+హర, విలాసము+ఐన= మిక్కిలిగా మనస్సును ఆకర్షించే హొయలు కలది అయిన; నీ మూర్తిపైన్= నీ ఆకారంపై; కోర్కి= అభిలాష; అడరి+ఉండున్= అతిశయమై ఉంటుంది.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! నేను అంగిరసుడు అనే మునీశ్వరుడి భార్యను. నా పేరు శివ. నాకున్నూ, నాతోడి వారలయిన సప్తర్షుల భార్యలకున్నూ నీమీద వలపు ఏర్పడింది. నిత్యం మనోహర మైన నీ ఆకారంపై మేము అందరం మరులుగొన్నాం.

ఉ. నీ మదిచంద మిట్టి దని నిక్క మెఱుంగక మే మజస్రముం
గామశరాహతిం గలఁగి కాఱియ వొందుదు మాత్మలందు; నీ
కామము మాదెసం గలిమి కౌతుకచేష్టలయం దెఱింగి యు
ద్దామ మనోరథప్రచలితస్థితి నందఱముం గ్రమంబునన్. 199

ప్రతిపదార్థం: నీ మది చందము= నీ మనస్సు యొక్క విధం; ఇట్టిది+అని= ఇటువంటిది అని; నిక్కము= నిజం; ఎఱుంగక= తెలియ జాలక; మేము= మేము (సప్తర్షుల భార్యలం); అజస్రమున్= ఎల్లప్పుడున్నూ; కామ, శర+ఆహతిన్= మన్మథుడి బాణాలతో కొట్టబడటంచేత; ఆత్మలందున్= మా మనస్సులలో; కలఁగి= వెత చెంది; కాఱియ+పొందుదుము= బాధపడుతుంటాం; నీ కామము= నీ కోరిక; మా దెసన్+కలిమి= మా యందు ఉండటం; కౌతుక, చేష్టల+అందున్= వేడుక చూపే పనులలో (హావభావాలలో); ఎఱింగి= తెలిసికొని; ఉద్దామ, మనోరథ, ప్రచలిత, స్థితిన్= మిక్కిలియైన కోరికచే సడలిన మానసిక పరిస్థితి గలిగి; అందఱమున్= (సప్తర్షుల భార్యలం అందరమున్నూ); క్రమంబునన్= వరుసగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: నీ మనస్సు ఏ రీతిగా ఉన్నదో మాకు తెలియక మేము సదా మన్మథతాపానికి చిక్కి వెత చెందాం. కాని, నీకు కూడ మాయందు వలపు ఉన్నదని నీ వేడుకచేష్టలతో గూడిన హావభావాలవలన తెలిసికొన్నాం. ఇక, మేమందరమున్నూ మిక్కుటమైన కోరికచేత చలించని మనోనిబ్బరం కలవారమై, క్రమంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. నినుఁ గవయందలంచి యిట నెమ్మిమెయిం జనుదెంచినార మిం
పునఁ జెలు లెల్లఁ; దొల్త ననుఁ బొమ్మని పంచిన వచ్చితిన్; మనం
బనవరతానురాగమున నంగజకేళి భజింపు మింక నొం
డని యెడ సేసితేనిఁ గుసుమాస్త్రుఁడు సైఁపఁడు నన్నుఁ బావకా!'200

ప్రతిపదార్థం: పావకా!= అగ్నిహోత్రుడా!; నిన్నున్; కవయన్+తలంచి= పొందగోరి; ఇటన్= ఇక్కడకు; నెమ్మి మెయిన్= ప్రీతితో; ఇంపునన్= ఇష్టంతో; చెలులు+ఎల్లన్= సఖులం అందరం; చనుదెంచినారము= వచ్చాం; తొల్తన్= మొదట; ననున్= నన్ను; పొమ్ము+అని, పంచినన్= వెళ్లుము అని నియోగించగా; వచ్చితిన్= వచ్చాను; మనంబు= మనస్సు; అనవరత+ అనురాగమునన్= ఎల్లప్పుడును వలపుతో ఉండేటట్లుగా; అంగజ కేళి= మన్మథ క్రీడ- సంభోగం; భజింపుము= అనుభవించుము; ఇంకన్= ఇకమీద; ఒండు+అని= వే రొక మాట చెప్పి; ఎడ+చేసితి+ఏనిన్= దూరం చేశావా; కుసుమ+అస్త్రుఁడు= పూవులు మంత్ర బాణాలుగా కలవాడు - మన్మథుడు; నన్నున్= నన్ను; సైఁపఁడు= ఓర్వడు.

తాత్పర్యం: ఓ అగ్నిదేవుడా! నీ మీద వలపు చొప్పున, నిన్ను పొందాలి- అనే తమకంతో మే మందరం వచ్చాం. సఖులు అందరూ నన్ను ముందుగా నీ దగ్గరికి వెళ్లాలని నిర్ణయించి ఇటకు పంపారు. అందుచేత నేను నీదరికి వచ్చాను. నీవు మనసార నన్ను మన్మథ క్రీడలో తనుపుము. కాక, మరొక రకంగా పలికి నన్ను నిరాకరించావా, నన్ను మన్మథుడు సైపడు సుమా!'

వ. అనిన సంతసిల్లి యగ్నిదేవుండు దానిం గైకొనియె; నదియును నతని నభిమత భోగంబులం బ్రీతునిం జేసి, తదీయ తేజోధాతువు ధరియించి యచ్చోటు వాసి యాక్షణంబ గరుడి యై గగనంబునకు నెగసి యతిత్వరిత గమనంబున శ్వేతపర్వతంబునకుం జని యందొక్కయెడ శరవణస్తంబ సంవృతం బైన కాంచనకుండంబు నందు నిజభర్తశుక్లంబు సంగ్రహించి, మఱియును. 201

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; సంతసిల్లి= సంతోషించి; అగ్నిదేవుండు= అగ్నిహోత్రుడు; దానిన్+కైకొనియెన్= దానిని స్వీకరించాడు (ఆమెను అంగీకరించాడు); అదియును= ఆమెయును (స్వాహా దేవియు); అతనిన్= అగ్నిహోత్రుడిని; అభిమత, భోగంబులన్= ఇష్టమైన సౌఖ్యాలచేత; ప్రీతునిన్+చేసి= సంతృప్తి చెందిన వాడిగా చేసి; తదీయ, తేజస్+ధాతువు= ఆతడి యొక్క శుక్లాన్ని; ధరియించి= వహించి; ఆ+చోటు+పాసి= ఆ స్థలం వదలిపెట్టి; ఆ, క్షణంబు+అ= ఆ ముహూర్తంలోనే, వెనువెంటనే; గరుడి+ఐ= ఆడ గరుడపక్షి అయి; గగనంబునకున్+ఎగసి= ఆకసానికి ఎగిరి; అతి, త్వరిత, గమనంబునన్= మిక్కిలి వేగం కల పయనంతో; శ్వేత పర్వతంబునకున్+చని= తెల్లకొండకు వెళ్లి; అందున్+ఒక్క+ఎడన్= ఆ శ్వేతపర్వతంలో ఒక చోట; శరవణస్తంబ సంవృతంబు+ఐన= రెల్లుగడ్డికాడల చేత చుట్టుకొనబడిఉన్న; కాంచన, కుండంబునందున్= బంగారు కుండలో; నిజ భర్త శుక్లంబు= తన పెనిమిటి వీర్యాన్ని; సంగ్రహించి= నిక్షిప్తం చేసి, కూర్చిపెట్టి; మఱియును ఇంకను.

తాత్పర్యం: ఆ మాటలకు అగ్నిహోత్రుడు సంతోషించాడు. అంతట ఆమె అగ్నిహోత్రుడిని శృంగారభోగంలో తేల్చి, ఆతని వీర్యాన్ని వహించి, ఆచోటు విడిచి ఆడగరుడపక్షి అయి ఆకాశానికి ఎగిరి, మిక్కిలి వేగంగా పయనించి శ్వేతపర్వతానికి చేరింది. అక్కడ ఒక చోట రెల్లుగడ్డికాడలచేత చుట్టుకొనబడిఉన్న ఒక బంగారు కుండలో తనభర్త శుక్లాన్ని కూర్చిపెట్టింది.

క. మునిపత్నులరూపులు గై ।
కొని యిట్టుల వరుసఁ బుష్పకోమలి ప్రియుఁ బ్రీ
తునిఁ జేయుచు రేతస్కం ।
దన మొనరించుచును వచ్చెఁ దత్కలశమునన్. 202

ప్రతిపదార్థం: మునిపత్నుల రూపులు= ఋషుల భార్యల ఆకారాలు; కైకొని= స్వీకరించి; ఇట్టులన్= ఈ విధంగానే; వరుసన్= క్రమంగా; పుష్పకోమలి= పువ్వు వంటి సౌకుమార్యం కలది (స్వాహాదేవి); ప్రియున్= భర్తను (అగ్నిహోత్రుడిని); ప్రీతునిన్+చేయుచున్= సంతృప్తి చెందినట్టివాడిని చేస్తూ; తద్+కలశమునన్= ఆ కుండలో; రేతస్కందనము= శుక్లాన్ని ప్రోగు చేయటం; ఒనరించుచును వచ్చెన్= చేయసాగింది.

తాత్పర్యం: పూవుబోడి అయిన స్వాహాదేవి క్రమంగా మునులభార్యల రూపాలు గైకొని, వరుసగా అగ్నిహోత్రుడి కడ కేగి, ఆతడిని సంతుష్టుడిని చేసింది. ఈ రీతిగా ప్రతి పర్యాయమున్నూ ఆమె తన భర్త శుక్లాన్ని రెల్లుగడ్డి నడుమన ఉన్న కలశంలో నిక్షిప్తం చేసింది.

తే. విను, పతివ్రతాతిలక మై వెలయునట్టి ।
యయ్యరుంధతి రూపంబు నలవరింప
నెట్లు నేరద కాని యయ్యింతి యున్న ।
యువిద లార్వుర రూపులు నొనరఁ దాల్చె. 203

ప్రతిపదార్థం: విను= వినుము; ఆ+ఇంతి= ఆ వనిత (స్వాహాదేవి); పతివ్రతా, తిలకము+ఐ= పతివ్రతలలో శ్రేష్ఠురాలు అయి; వెలయు+అట్టి= ఒప్పారే; ఆ+అరుంధతి రూపంబున్= ఆ అరుంధతి యొక్క ఆకృతిని; అలవరింపన్+ఎట్లు+నేరదు+అ+కాని= తాల్చటానికి ఏ విధంగానూ అనువు లభింపనిదైనది కాని; ఉన్న= తక్కిన; ఉవిదలు+ఆర్వుర, రూపులు= వనితలు ఆర్గురి ఆకారాలు; ఒనరన్+తాల్చెన్= ఒప్పేటట్లుగా ధరించింది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఈ విషయాన్ని అవధానంతో ఆలకించుము. స్వాహాదేవి ఆర్గురుఋషులభార్యల రూపాలు ధరించి అగ్నిదేవుడిని తృప్తి పొందించగలిగింది కాని, పతివ్రతలలో శ్రేష్ఠురాలైన 'అరుంధతి' రూపాన్ని మాత్రం ధరించలేకపోయింది. (అరుంధతి వసిష్ఠ మహర్షి భార్య.)

వ. ఇవ్విధంబున నాఱుమాఱులు ప్రస్కందితం బైన యగ్నితేజంబున.204

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆఱుమాఱులు= ఆరు సారులు; ప్రస్కందితంబు+అయిన= స్రవింపజేయబడిన; అగ్ని, తేజంబు= అగ్నిహోత్రుడి వీర్యం.

తాత్పర్యం: ఈ విధంగా ఆరుమారులు స్రవింపజేయటం ద్వారా సేకరించబడిన అగ్నియొక్క వీర్యంనుండి.

కుమారస్వామి యవతారము (సం. 3-211-17)

క. **ఆదిత్యనిభుఁడు విపుల ।**
ద్వాదశబాహుండు షడ్వదనుఁ డఖిలదిశా
రోదోంతరంబు వెలుఁగ మ ।
హోదారుండై కుమారుఁ డుదయం బయ్యెన్. 205

ప్రతిపదార్థం: ఆదిత్య, నిభుఁడు= సూర్యుడితో సమానుడు; విపుల; ద్వాదశ, బాహుండు= నిడివి అయిన పండ్రెండు చేతులు కలవాడు; షట్+వదనుఁడు= ఆరు మొగాలు కలవాడు; అఖిల, దిశా, రోదస్+అంతరంబు= అన్ని దిక్కుల మధ్యభాగం; వెలుఁగన్= ప్రకాశించగా; మహా+ఉదారుండు+ఐ= మిక్కిలి గొప్పవాడయి; కుమారుఁడు= (కుమార స్వామి); ఉదయంబు+అయ్యెన్= ఉద్భవించాడు.

తాత్పర్యం: సూర్యసమానుడు, నిడివిఅయిన పన్నెండు బాహువులు కలవాడు, ఆరు ముఖాలు కలవాడు; సర్వదిశలలో ఆకసానికి భూమికి మధ్య గల ప్రదేశమంతా వెలుగొందేటట్లుగా, మిక్కిలి గొప్పవాడయిన కుమారస్వామి జన్మించాడు.

వ. **ఇట్లు శుక్లపక్షంబునం బాడ్యమియందు వీర్యనిషేకంబును, విదియయందు గర్భవ్యక్తియుఁ, దదియయందు శరీరమాత్రావిర్భావంబునుం, జతుర్థియందు సకలావయవ సంపూర్ణతయు నై యుదయించిన**

కుమారుండు పంచమి యందు సముత్థితాకారుండై, పేర్చిత్రిపురదహన సాధనం బైన హరకార్ముకం బమ్మహీధరంబునందు నిక్షిప్తంబై యున్న దానిం బుచ్చుకొని గుణధ్వని సేసిన, నమ్మహాధ్వని విని కలుషించి యైరావత సుప్రతీకంబులను దిగ్గజంబు లయ్యగ్ని భవుమీఁదం బఱతెంచిన నమ్మహాభుజుండా రెంటినిం బెనఁచిపట్టి రెండుచేతుల ధరియించి, తన సహజం బైన శక్తి యొక్క కేలం, గ్రీడార్థ కలితం బైన కుక్కుటం బొక్కకేలను, బరిపూర్యమాణనినదం బైన శంఖంబు గరద్వయంబునం దాల్చి, హస్తయుగళంబున గగనంబు వ్రేయుచుం బాణియుగ్మంబు వక్త్రంబుల నిడికొని బాల్యోచితంబులైన యంగుళి చర్వణంబులు పొరిఁబొరి నొనరించుచు, నిశిత సాయకంబునం గ్రౌంచపర్వత విభేదనంబు సేసి, పటుశక్తిపాతంబున శ్వేతశైలశృంగభంగంబు గావించి చెలంగి యాఱు ముఖంబుల నొక్కపెట్ట యార్చినం, బ్రళయభైరవారావభీషణం బైన తదాఘోషణంబున. 206

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; శుక్లపక్షంబునన్= శుక్లపక్షంలో; పాడ్యమి అందున్= మొదటి తిథియందు; వీర్యనిషేకంబును= శుక్లాన్ని ఉంచటమున్నూ; విదియ+అందున్= రెండవ తిథియందు; గర్భవ్యక్తియున్= కడుపు కనుపించట మున్నూ; తదియయందున్= మూడవ తిథియందు; శరీర మాత్ర+ఆవిర్భావంబునున్= దేహం మాత్రం ఉదయించటమున్నూ; చతుర్థియందున్= నాలుగవ తిథియందు; సకల+అవయవ, సంపూర్ణతయున్+ఐ, ఉదయించిన= అన్ని అంగాలు నిండి పుట్టిన; కుమారుండు= కుమారస్వామి; పంచమి యందున్= ఐదవ తిథియందు; సముత్థిత+ఆకారుండు+ఐ= బాగా లేచి నిలబడే రూపం కలవాడు అయి; పేర్చి= అతిశయించి; త్రిపుర దహన సాధనంబు+అయిన= మూడు నగరాలను కాల్చి వేయటానికి ఉపకరణం అయిన; హరు, కార్ముకంబు= శివుడి యొక్క విల్లు; ఆ+మహీధరంబు నందున్= ఆ కొండయందు; నిక్షిప్తంబు+ఐ= ఉంచబడినదై; ఉన్నదానిన్=

ఉన్నటువంటి దానిని; పుచ్చుకొని= గ్రహించి; గుణ, ధ్వని, చేసినన్= అల్లెత్రాటిని మ్రోగించగా; ఆ+మహా, ధ్వని= ఆ గొప్ప శబ్దం; విని= ఆలకించి; కలుషించి= ఆగ్రహం చెంది; ఐరావత సుప్రతీకంబులు+అను= ఐరావతం, సుప్రతీకం అనే పేళ్ళు కల; దిక్+గజంబులు= దిగ్గజాలు- దిక్కులలో ఉండే ఏనుగులు; ఆ+అగ్నిభవుమీఁదన్= ఆ అగ్నియొక్క కుమారుడి మీద; పరతెంచినన్= ఎదుర్కొనటానికి రాగా; ఆ+మహాభుజుండు= గొప్ప భుజాలు కలవాడు అనగా ఆ మహాపరాక్రమశాలి; ఆ రెంటినిన్= (ఆ ఐరావత సుప్రతీకాలను రెండింటిని); పెనఁచిపట్టి= కదలకుండగా బిగియబట్టి; రెండు, చేతులన్= రెండు హస్తాలతో; ధరియించి= తాల్చి; తన, సహజంబు+ ఐన= తనకు నైసర్గికంగా సంక్రమించిన; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని; ఒక్క కేలన్= ఒక చేతిలో; క్రీడా+అర్థ, కలితంబు+ఐన= వినోదం కొరకై కూడుకొని ఉన్న; కుక్కుటంబున్= కోడిని; ఒక్కకేలను= ఒక చేతితోనూ; పరిపూర్యమాణ నినదంబు+ఐన= బాగా పూరింపబడి నినదించేదైనట్టి; శంఖంబు= సంకువు; కరద్వయంబునన్= రెండు చేతులతోను; తాల్చి= ధరించి; హస్త, యుగళంబునన్= రెండు చేతులతో; గగనంబు వ్రేయుచున్= ఆకసాన్ని చరుస్తూ; పాణి యుగ్మంబు= రెండు చేతులు; వక్త్రంబులన్= నోళ్ళలో; ఇడికొని= ఉంచి; బాల్య+ఉచితంబులు+అయిన= శిశువుకు తగినవైన; అంగుళి చర్వణంబులు= బొటన వ్రేళ్ళను చప్పరించటం; పొరిన్+పొరిన్+ ఒనరించుచున్= మాటిమాటికి చేస్తూ; నిశిత, సాయకంబునన్= గొప్పదైన 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించటంచేత; శ్వేత, శైల, భంగంబు, కావించి= తెల్లకొండ శిఖరాన్ని క్రిందకు పడగొట్టి; చెలంగి= అతిశయించి; ఆఱు ముఖంబులన్= ఆరు మోములతో; ఒక్కపెట్ట= ఒకేసారి; ఆర్చినన్= గొప్ప కేకవేయగా; ప్రళయ, భైరవ+ఆరావ, భీషణంబు+ఐన= ప్రళయకాలంలోని శివగణాధిపుడు చేసే భయంకరనాదంవలె భీతి కలిగించేది అయిన; తద్+ఆఘోషణంబునన్= ఆతడియొక్క (కుమారస్వామి చేసిన) పెద్ద అరుపు వలన.

తాత్పర్యం: ఈ విధంగా కుమారస్వామి ఆవిర్భవించి, దినదినాభివృద్ధి పొందాడు. శుక్లపక్షంలో పాడ్యమినాడు వీర్యనిషేకం, రెండవ తిథి విదియనాటికే గర్భం కన్పించటం, మూడవ తిథి తదియనాటికి దేహం మాత్రం ఆవిర్భవించటం జరిగి, నాలుగవ తిథి చతుర్థి నాటికి సాంగోపాంగంగా సంపూర్ణమైన ఆకృతి ఆతనికి లభించింది. పంచమి నాడు లేచి నిల్చినవాడై కుమారుడు ఆ కొండలో దాచబడి ఉన్నట్టి వింటిని - పరమశివుడు త్రిపురాలను కాల్చినట్టి కోదండాన్ని - పుచ్చుకొని, అల్లెత్రాటిని మ్రోగించాడు. ఆ మహాధ్వనికి అలిగి, ఐరావత సుప్రతీకాలు అనే రెండు దిగ్గజాలు ఆ కుమారుడిపైకి విజృంభించాయి. అంతట ఆ మహావీరుడు ఆ రెండు దిగ్గజాలను తన రెండు చేతులతో నణచి పెట్టాడు. ఒక చేతిలో తనకు పుట్టుకతోడనే సంక్రమించిన 'శక్తి' అనే ఆయుధాన్ని ధరించాడు. ఒక్క చేతితో వినోదార్థం ఒక కోడిని పట్టుకొన్నాడు. రెండు చేతులతో పట్టి శంఖాన్ని పూరించాడు. రెండు చేతులతో ఆకసాన్ని చరచాడు; రెండు చేతులు నోళ్ళలో ఉంచుకొని, శిశుసహజంగా బొటన వేళ్ళను లీలగా చప్పరించాడు. ఒక వాడిబాణాన్ని ప్రయోగించి క్రౌంచపర్వతాన్ని బ్రద్దలు కొట్టాడు. తన గొప్ప ఆయుధమైన 'శక్తి'ని ప్రయోగించి శ్వేతశైలశృంగాన్ని విరుగ గొట్టాడు. తదుపరి తన ఆరు మొగాలతో ఆ కుమారుడు సింహనాదం చేశాడు. కుమారస్వామి కావించిన ఆ ధ్వని ప్రళయకాలంలో శివగణాధిపుడైన భైరవుడు చేసే భయంకరనాదం వలె పిక్కటిల్లింది.

విశేషం: 1. శివుడు రాక్షసులకు ఆవాసాలైన మూడుపురాలను నాశనంచేశాడు- అందువల్లే అతడు త్రిపురాంతకు డయ్యాడు. ఇది పురాణగాథ. 2. దిగ్గజాలు:- దిగ్గజాలు ఎనిమిది. 1. ఐరావతం 2. పుండరీకం 3. వామనం 4. కుముదం. 5. అంజనం 6. పుష్పదంతం 7. సార్వభౌమం. 8. సుప్రతీకం. ఇవి ఎనిమిది దిక్కులలో భూమిని మోస్తాయని సాహితీసమయం. ప్రళయం:- జగత్తు అంతా నశించే కాలం. అప్పుడు లయకారుడైన శివుడు ప్రళయతాండవం చేస్తాడు. భైరవుడు

అనగా శివుడు అని అర్థం. శివగణాధిపులలో భైరవుడు సుప్రసిద్ధుడు. ఈ ప్రకరణంలో భైరవశబ్దానికి శివగణనేత అని అర్థం చెప్పటం సమంజసం.

మ. కులశైలంబులు గ్రక్కునం గదలెౕ దిక్కుల్ వ్రయ్య లయ్యెన్; మహీ
వలయం బంతయు దిర్ధిరం దిరిగె; దేవవ్రాతముల్ సాధ్వసా
కులతం బొందెఁ; బయోధు లన్నియును సంక్షోభించె; సప్తాశ్వస
ప్తులు బిట్టుల్కి రథంబు నల్దెసలకుం బో నీడ్చె సంభ్రాంతమై. 207

ప్రతిపదార్థం: కుల శైలంబులు= కుల పర్వతాలు; గ్రక్కునన్+కదలెన్= వేగంగా చలించాయి; దిక్కుల్= దిక్కులు; వ్రయ్యలు+అయ్యెన్= పగిలాయి; మహీ, వలయంబు+అంతయున్= భూమండలం సమస్తమున్నూ; దిర్దిరన్+తిరిగెన్= గుండ్రంగా గిరగిర తిరిగింది; దేవ వ్రాతముల్= వేల్పుల సముదాయాలు; సాధ్వస+ఆకులతన్+పొందెన్= భయంతో కూడిన సంచలనానికి లోనయ్యాయి; పయోధులు= సముద్రాలు; అన్నియును; సంక్షోభించెన్= ఆకులతను పొందాయి; సప్త+అశ్వ, సప్తులు= సూర్యుడి యొక్క గుర్రాలు; బిట్టు= మిక్కిలి; ఉల్కి= భయపడి; సంభ్రాంతము+ఐ= ఎక్కువ మోహానికి లోనై తిరుగుడు పడి; రథంబు= తేరును; నల్ దెసలకున్= నాలుగు దిక్కులకు; పోన్+ఈడ్చెన్= పోయేటట్లుగా లాగాయి.

తాత్పర్యం: కులపర్వతాలు వేగంగా చలించాయి, దిక్కులు బ్రద్దలయ్యాయి. భూమండలం గిరగిర తిరుగసాగింది, వేల్పుల సమూహాలు తొట్రుపాటుతో సంచలించాయి. సముద్రాలు పొంగులు వారాయి, సూర్యుడి గుర్రాలు మిగుల భ్రమ చెంది రథాన్ని ఇటు నటు నాలుగుదెసలకు ఈడ్వసాగాయి.

విశేషం: (1) కులపర్వతాలు ఏడు. "మహేంద్రో మలయ స్సహ్య శ్శుక్తిమాన్ గంధమాదనః, వింధ్యశ్చ పారియాత్ర శ్చ సప్తైతే కులపర్వతాః". ఈ ఏడు కులపర్వతాలున్నూ భూమిని భరించేవి- అని పురాణకథనం. అందుచేత 'మహీధరము'- భూమిని మోసేది అనగా పర్వతం అనే అర్థ మేర్పడింది. (2) సప్తాశ్వుడు అనగా సూర్యుడు. సూర్యుడి రథానికి ఏడు గుర్రాలు అని ప్రాచీన సాహిత్యసమయం.

క. ఇట్టిమహోత్పాతంబులు ।
పుట్టినఁ గని మునులు లోకములకు శుభముగా
నెట్టన శాంతికవిధు ల ।
ప్పట్టున నొనరించి రాత్మభావనపరులై. 208

ప్రతిపదార్థం: ఇట్టి= ఈ విధమయిన; మహా+ఉత్పాతంబులు= గొప్పవైన భూతవికారాలు (ఉపద్రవాలు); పుట్టినన్= కలుగగా; కని= చూచి; మునులు= ఋషులు; లోకములకున్= జగాలకు; శుభముగాన్= మేలు కలిగేటట్లుగా; నెట్టన= బాగుగా; శాంతిక విధులు= ఉపద్రవాలు తొలగించటానికై చేసే జపహోమాలు మున్నగు క్రియలు; ఆత్మ భావన పరులు+ఐ= బ్రహ్మజ్ఞానంలో నిల్పిన బుద్ధి కలవారై; ఆ+పట్టునన్= ఆ వేళ; ఒనరించిరి= చేశారు.

తాత్పర్యం: ఈ విధంగా ఏర్పడిన భూతవికారాలను కాంచి, ఆ ఉపద్రవాలు ఉపశమించి లోకకల్యాణం కలుగటానికై జ్ఞానులు అయిన ఋషులు శాంతికవిధులగు జపహోమాదిక్రియలను ఆ సమయంలో నెరవేర్చారు.

విశేషం: ఉత్పాతాలు - శుభాన్ని అశుభాన్ని సూచించే ప్రకృతివికారాలు. ఇవి మూడు విధాలు :- 1. దివ్యం:- సూర్యగ్రహణం చంద్రగ్రహణం మొదలైనవి. 2. అంతరిక్షం :- ఉల్కాపాతం మున్నగునవి. 3. భౌమము:- భూకంపాలు ఉప్పెనలు మున్నగునవి.

వ. ఆ సమయంబునం జైత్రరథ వననివాసు లైన జనులందఱుం గూడి 'యంగిరః ప్రముఖ మునీంద్రుల భార్యలకు నగ్నిదేవువలనం బుట్టిన బాలుండు లోకంబులకు నిట్టి యనర్థంబు సేయం దొడంగె' నని యాక్రోశించిన, నయ్యపవాదంబునకు రోసి యా సప్తమునులలోన వసిష్ఠుండు దక్కఁ దక్కిన యార్వురుఁ దమ వనితలం బరిత్యజించిరి;

మఱియును గొందఱు జనులు 'వీ రేమి సేయుదు? రన్నిపోకలం బోయినది వహ్ని భార్యయ కాక' యని పలుకం జొచ్చి; రంత నమ్మహామునులపాలికిఁ బావకాంగన సనుదెంచి యిట్లనియె. 209

ప్రతిపదార్థం: ఆ, సమయంబునన్= ఆ వేళను; చైత్ర రథ, వన, నివాసులు+ ఐన= 'చైత్ర రథం'- అనే పేరుగల అడవిలో ఉండునట్టి; జనులు+అందఱున్+ కూడి= ప్రజలు అందరున్నూ కలిసి; అంగిరస్+ప్రముఖ, ముని+ఇంద్రుల, భార్యలకున్= అంగిరసుడు మున్నగు ఋషివరేణ్యుల పెండ్లాలకు; అగ్నిదేవువలనన్+పుట్టిన= అగ్నిదేవుడివలన జన్మించిన; బాలుండు= పిల్లవాడు; లోకంబులకున్= జగములకు; ఇట్టి= ఈ విధమైన; అనర్థంబు= ఉపద్రవం; చేయన్+తొడంగెన్= చేయడానికి ఉపక్రమించాడు; అని= అంటూ; ఆక్రోశించినన్= ఎలుగెత్తి దుఃఖంతో ప్రకటించగా; ఆ+అపవాదంబునకున్= ఆ నిందకు; రోసి= వెత చెంది; ఆ సప్తమునులలోనన్= ఆ ఏడుగురి ఋషులలో; వసిష్ఠుండు+తక్కన్= వసిష్ఠుడు మినహాయించి; తక్కిన+ ఆర్వురున్= మిగిలిన ఆరుమంది ఋషులున్నూ; తమ, వనితలన్= తమ భార్యలను; పరిత్యజించిరి= వదలి పెట్టారు; మఱియును+కొందఱు జనులు= మరికొందరు ప్రజలు; వీరు+ఏమి+చేయుదురు= (ఈ ఋషుల భార్యలు) ఏమి చేయగలరు; ఇన్ని+పోకలన్+పోయినది= ఇన్ని విధాలైన పద్ధతులలో వెళ్లింది; వహ్నిభార్య+అ, కాక= అగ్ని దేవుడి ఇల్లాలు మాత్రమే కదా అని, పలుకన్+చొచ్చిరి= అని చెప్పసాగారు; అంతన్= అటుపిమ్మట; ఆ+మహా, మునుల, పాలికిన్= ఆ గొప్ప ఋషుల దగ్గరకు; పావక+అంగన= అగ్ని దేవుడి ఇల్లాలు; చనుదెంచి= వచ్చి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఆ సమయంలో 'చైత్రరథం' అనే పేరు గల అడవిలో నివసించే జనులందరు కూడి, 'ఈ ఉపద్రవం కలిగించింది ఋషులభార్యలకు అగ్నిదేవుడివలన జన్మించిన బాలకుడు' అని ఘోషించారు. ఆ నిందకు తాళజాలక, వసిష్ఠుడు తప్ప తక్కిన ఋషులు ఆర్గురూ తమ భార్యలను వదలి వేశారు. కాని, కొందరు ప్రజలు 'పాపం ఈ ఋషులభార్యలు చేసిన

తప్పు ఏమున్నది? ఈ నాటకం అంతటిని ఆడింది అగ్నిదేవుడి భార్యయే కదా' అని పలికారు. అంతట అగ్నిదేవుడిభార్య ఆ మునుల దగ్గరకు వెళ్లి ఈ విధంగా చెప్పింది.

క. 'వినుఁ డేను వహ్నివలనం ।
గనిన కుమారుండు వాఁడు; గడు నిజ మిది; మీ
వనితలకుం బని గా; దిటు ।
సనునే కులసతుల విడువ సత్పురుషులకున్?' 210

ప్రతిపదార్థం:వినుఁడు= ఆలకించండి; ఏను= నేను; వహ్నివలనన్= అగ్నిదేవుడి వలన; కనిన= కన్నట్టి; కుమారుండు= కొడుకు; వాఁడు= (ఆ బాలుడు); కడున్, నిజము+ఇది= ఇది అచ్చమైన సత్యం; మీ వనితలకున్+పని+కాదు= (ఇది) మీ భార్యలవలన జరిగిన కార్యం కాదు; ఇటు= ఈ రీతిగా; సత్+పురుషులకున్= మంచి మగలకు; కులసతులన్= పతివ్రతలైన భార్యలను; విడువన్+చనునే= విడిచిపెట్టటం మంచిదా? (కాదని భావం).

తాత్పర్యం: 'అయ్యలారా!, నా మనవి ఆలకించ వేడికోలు. ఈ బాలుడు నాకును నా భర్త అయిన అగ్నిదేవుడికిని జన్మించినవాడు. ఇది మీ భార్యలవలన జరిగిన పని కాదు. సజ్జనులు పతివ్రతలైన భార్యలను విడనాడటం న్యాయం కాదు గదా!'

వ. అని యెంత సెప్పిన వారొడంబడ రైరి; తదనంతరంబ విశ్వామిత్రుండు గుమారు కడ కరిగి యద్దేవు శరణంబు సొచ్చి వివిధ వాక్యంబులం బ్రస్తుతించి, తదాదేశంబున నతనికి జాతకర్మాదివిధు లొనరించిన, నదియంతయు నెఱింగి యమరు లెల్ల నమరేంద్రుం గానఁ జని యిట్లనిరి. 211

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; ఎంత+చెప్పినన్= ఏ విధంగా చెప్పినప్పటికి; వారు= (ఆ ఆర్గురు మునులు); ఒడంబడరు+ఐరి= సమ్మతించని వారు అయ్యారు- అంగీకరించలేదు; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మటనే;

విశ్వామిత్రుండు= విశ్వామిత్రుడు అనే ఋషి; కుమారు కడకున్+అరిగి= (ఆ) బాలకుడి దగ్గరకు వెళ్లి; ఆ+దేవున్= ఆ వేల్పును; శరణంబు+చొచ్చి= ఆశ్రయించి; వివిధ, వాక్యంబులన్= పలుతెరగుల మాటలచేత; ప్రస్తుతించి= పొగడి; తద్+ఆదేశంబునన్= ఆతడి యొక్క ఆజ్ఞ మేరకు; అతనికిన్= (ఆ బాలుడికి); జాత, కర్మ+ఆది, విధులు= పుట్టినపుడు చేయవలసిన జప హోమాలు, వ్రతాలు మున్నగు క్రియలు; ఒనరించినన్= చేయగా; అమరులు+ఎల్లన్= వేల్పులు అందరున్నూ; అది+అంతయున్+ఎఱింగి= ఆ విషయాన్నంతా తెలిసికొని; అమర+ఇంద్రున్+కానన్+చని= దేవేంద్రుడిని చూడటానికి వెళ్లి; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా అగ్నిభార్య చెప్పింది. కాని ఆ ఋషులు సమ్మతించలేదు. అటు పిమ్మట విశ్వామిత్రుడు అనే ఋషి ఆ బాలకుడివద్దకు వెళ్లి ఆతడిని శరణువేడుకొని, ఆతడి అనుమతిప్రకారం ఆతడికి జాతకర్మాదులను నెరవేర్చాడు. ఆ విషయాన్ని అంతా తెలిసికొని దేవతలు దేవేంద్రుడి వద్దకు వెళ్లి ఈ విధంగా పలికారు.

విశేషం: జాతకర్మం= బిడ్డ పుట్టినప్పుడు జరిగే మంత్ర తంత్ర కర్మకాండం. పుట్టినప్పటినుండి గిట్టేవరకు జరిగేవి షోడశ కర్మలు. అందులో జాతకర్మం ఒకటి. వీటికి సంస్కారాలు అని పేరు. షోడశకర్మలు. 1. గర్భాధానం 2. పుంసవనం 3. సీమంతం 4. జాతకర్మం 5. నామకరణం 6. అన్నప్రాశం 7. చౌలం 8. ఉపనయనం 9. ప్రాజాపత్యం 10. సౌమ్యం 11. ఆగ్నేయం 12. వైశ్వదేవం 13. గోదానం 14. సమావర్తనం 15. వివాహం 16. అంత్యసంస్కారం.

ఉ. 'దారుణశౌర్యధుర్యుఁ డతిదర్పిత చిత్తుఁడు వహ్నిసూనుఁ డ
న్వీరుఁడు నిన్నుఁ గైకొనక వీఁకమెయిం జనుదెంచు నిప్డు దు
ర్వారత నీ పదంబు గొనువాంఛ నవశ్యముఁ; గాన యింతలో
నీరస మెత్తి వాని వధియింపుము చెచ్చెర విక్రమోద్ధతిన్. 212

ప్రతిపదార్థం: దారుణ, శౌర్య, ధుర్యుఁడు= ఘోరమైన పరాక్రమం వహించేవాడు; అతి, దర్పిత, చిత్తుఁడు= మిక్కిలి గర్వం కల మనస్సు గలవాడు; వహ్ని సూనుఁడు+అన్+వీరుఁడు= అగ్నిదేవుడి కొడుకు అనే వీరుడు; నిన్నున్+కైకొనక= ఇంద్రుడవైన నిన్నుసైతం లెక్కపెట్టక; వీఁక మెయిన్= ఉత్సాహంతో; ఇప్డు= ఇప్పుడు; దుర్వారతన్= అడ్డగించటానికి అనువు కాకుండగ; నీ పదంబున్= నీ పదవిని; కొను వాంఛన్= గ్రహించే కోరికతో; అవశ్యమున్= తప్పనిసరిగా; చనుదెంచున్= వస్తాడు; కాన= కావున; ఇంతలోన్= ఈ లోపుగా; ఈరసము+ఎత్తి= ఆగ్రహించి; చెచ్చెరన్= వేగంగా; విక్రమ+ఉద్ధతిన్= పరాక్రమం యొక్క ఆధిక్యం చొప్పున; వానిన్= ఆ బాలుడిని; వధియింపుము= చంపుము.

తాత్పర్యం: అగ్నికుమారుడు మిక్కుటమైన పరాక్రమం కలవాడు. మిక్కిలి గర్వం కలవాడు. నిన్ను కూడ సరకు గొనడు; నీ పదవిని ఆక్రమించవలె ననెడి దురుద్దేశంతో ఉత్సాహం చొప్పున తప్పక నీ పయి దండెత్తి రాగలడు. కావున, నీవు ఈ లోపుగనే ఆగ్రహించి ఆతడిని వేగంగా సంహరించుము.

వ. అట్లయిన నీకు నింద్రత్వంబు శాశ్వతం బగు; నేమును బ్రదుకుదుము; లోకంబు లవ్యాకులంబు లగు' నని నం బురందరుం డప్పుడ సప్తమాతృకలం బిలిచి 'మీరు సని వహ్నిసంభవుం డైన కుమారు సమయించి, నాకుఁ బ్రియంబు సేయుం' డని పంచినం, బనిపూని వారు ఘోరంబుగా నతనిపై నడరి తదీయ తేజోవిశేషంబునకు భయంబంది. యతని శరణంబు సొచ్చి, 'యేము లోకమాతలము; మాయందు నీవు మాతృభావంబు సేయ నర్హుండ' వని నం గుమారుండు వారి నభినందించి చేకొనియె; నంత నగ్నియు నిజపుత్త్రుపాలికి వచ్చి, యతని చేతంబూజితుం డయి తదీయ రక్షాపరత్వంబున నిలిచె; మాతృగణంబు క్రోధంబునం బుట్టినయది లోహితాస్య యను భామిని కుమారునకు దాదియై యుపలాలనంబు సేయుచుండె; నఖిలభూతగణంబులుం బఱతెంచి క్రౌంచారిం బరివేష్టించె; నది యంతయు విని కలుషించి. 213

ప్రతిపదార్థం: అట్లు+అయినన్= ఆ విధంగా జరిగితే; నీకున్= నీకు; ఇంద్రత్వంబు= ఇంద్రపదవి; శాశ్వతంబు+అగున్= ఎల్లప్పుడు ఉండేది కాగలదు; ఏమును= మేము కూడా; బ్రదుకుదుము= (హాయిగా) జీవించ గలం; లోకంబులు= జగాలు; అవ్యాకులంబులు+అగున్= కలత చెందినట్టివి కాగలవు; అనినన్= అని చెప్పగా; పురందరుండు= దేవేంద్రుడు; అప్పుడు+అ= వెనువెంటనే; సప్తమాతృకలన్+పిలిచి= ఏడుగురు తల్లులను ఆహ్వానించి; మీరు= మీరు (సప్త మాతృకలు); చని= వెళ్ళి; వహ్ని, సంభవుండు+ఐన= అగ్ని దేవుడికి పుట్టినట్టి; కుమారున్= బాలకుడిని; సమయించి= చంపి; నాకున్= నాకు; ప్రియంబు+ చేయుండు= సంతృప్తి సంఘటించండి; అని= అని చెప్పి; పంచినన్= ఆజ్ఞాపించి పంపగా; వారు= (ఆ సప్త మాతృకలు); పని, పూని= ఆ కార్యం నెరవేర్చ వలెననే దీక్షను వహించి; ఘోరంబుగాన్= క్రూరంగా; అతనిపైన్= ఆ బాలకుడిపై; అడరి= విజృంభించి; తదీయ, తేజస్+విశేషంబునకున్= ఆతని యొక్క దేదీప్యమానమైన వెలుగుకు; భయంబు+అంది= వెరపు చెంది; అతనిన్, శరణంబు+చొచ్చి= అతడికి లొంగిపోయి, అతడిని కాపాడుమని వేడుకొని; ఏము= మేము; లోక మాతలము= జగాలకు తల్లులం; మా అందున్= మా యెడల; నీవు= నీవు; మాతృ భావంబు+ చేయన్+అర్హుండవు= తల్లి యెడల చూపే ప్రేమను చూపతగినవాడవు; అనినన్= అని పలుకగా; కుమారుండు= బాలుడు; వారినిన్= వారిని (సప్త మాతృకలను); అభినందించి= గౌరవించి; చేకొనియెన్= మన్నించి ఆదరించాడు; అంతన్= అటు పిమ్మట; అగ్నియున్= అగ్ని హోత్రుడున్నూ; నిజపుత్త్రుపాలికిన్= తన కొడుకు దగ్గరికి; వచ్చి= అరుదెంచి; అతని చేతన్= (కుమారుడిచేత); పూజితుండు+అయి= అర్చించబడినవాడై; తదీయ, రక్షా, పరత్వంబునన్= ఆతడి యొక్క సంరక్షణలో ఉన్నవాడై; నిలిచెన్= ఉన్నాడు; మాతృగణంబు క్రోధంబునన్= తల్లుల సముదాయం యొక్క కోపం వలన; పుట్టిన+అది= జన్మించినట్టిది; లోహితాస్య+అను, భామిని= లోహితాస్య అనే పేరు కల స్త్రీ (ఎర్రని మొగం కలది లోహితాస్య); కుమారునకున్= బాలుడికి; దాది+ఐ= పరిచర్యలు చేసేదై (మాతృస్థానీయ అయి); ఉపలాలనంబు+ చేయుచున్+ఉండెన్= ప్రేమతో సేవలు చేస్తూ ఉన్నది; అఖిల, భూత గణంబులున్= సమస్తమైన భూతాల సముదాయాలు; పఱతెంచి= అరుగుదెంచి; క్రౌంచారిన్= (క్రౌంచ+అరిన్) కుమారుడిని; పరివేష్టించెన్= చుట్టును చేరి కొలుస్తూ ఉన్నారు; అది+అంతయున్+విని= ఆ విషయాన్ని అంతా ఆలకించి; కలుషించి= ఆగ్రహం చెంది

తాత్పర్యం: ఆ విధంగా నీవు ఆ బాలకుడిని సంహరిస్తే నీకు ఇంద్రపదవి శాశ్వతంగా దక్కగలదు; మేముకూడా హాయిగా జీవించగలం' అని చెప్పగా విని, దేవేంద్రుడు వెంటనే సప్తమాతృకలను పిలిచి 'మీరు అగ్నిహోత్రుడి కుమారుడిని చంపండి' అని ఆజ్ఞాపించాడు. ఆ సప్తమాతృకలు దేవేంద్రుడి పనుపు చేయటానికి ఉద్యమించి, కుమారుడి దగ్గరకు వెళ్ళారు. కాని, కుమారుడి దేదీప్యమానమైన తేజస్సును చూచి, భయపడి, అతడిని శరణువేడి, అతడికి పాదాక్రాంతలు అయి ఇట్లా అన్నారు. 'మేము లోకమాతలం; నీవు మమ్మల్ని తల్లులవలెనే చూడదగును.' అనగా కుమారుడు తనను శరణు చొచ్చిన ఆ సప్తమాతృకలను అభినందించి మన్నించాడు. అంతట అగ్నిహోత్రుడుకూడ తన తనయుడి కడకు వచ్చి, అతడిని సంరక్షించే పనిలో ఉండి, అతడిచేత పూజించబడుతూ ఉన్నాడు. సప్తమాతృకలకోపం నుండి ఉద్భవించిన లోహితాస్య అనే స్త్రీ, కుమారుడికి మాతృస్థానీయ యైన దాదిఅయి గారాబంగా అతడిని పెంచుతూ ఉండింది. అఖిల భూతగణాలు స్వచ్ఛందంగా వచ్చి కుమారుడి చుట్టూ చేరారు. ఆ విషయాన్నంతా తెలిసికొనిన దేవేంద్రుడు కోపించాడు.

విశేషం: సప్తమాతృకలు= ఏడ్గురు తల్లులు 1. బ్రాహ్మి 2. మాహేశ్వరి 3. కౌమారి 4. వైష్ణవి 5. వారాహి 6. ఇంద్రాణి 7. చాముండ.

ఇంద్రుఁడు కుమారస్వామిపై నెత్తివచ్చుట (సం. 3-216-3)

ఉ. స్కందునిమీఁద నెత్తి బలగర్వితుఁడై నడతెంచె నుద్భట
స్యందన సామజాశ్వభట సంకుల సైన్య సమగ్ర దేవతా

బృంద సమేతుఁడై భువనభీకరసంగరకాంక్ష నింద్రుఁ డ
స్పందితశౌర్యుఁ డగ్నికణజాత భయంకరవజ్రహస్తుఁడై. 214

ప్రతిపదార్థం: అస్పందిత శౌర్యుఁడు= చలించని పరాక్రమం కలవాడు ఇంద్రుడు; బలగర్వితుఁడు+ఐ= బలంచేత గర్వించినవాడై; ఉత్+భట, స్యందన, సామజ+అశ్వ, భట, సంకుల, సైన్య, సమగ్ర, దేవతా, బృంద, సమేతుఁడు+ఐ= అతిశయించిన, రథాలతో, ఏనుగులతో, గుర్రాలతో, సైనికులతో, క్రిక్కిరిసిన సేనఅందున్న వేల్పుల సముదాయంతో కూడినట్టివాడై; భువన, భీకర, సంగర, కాంక్షన్= లోకభయంకరమైన యుద్ధంమీది కోరికతో; అగ్ని కణ, జాత, భయంకర, వజ్ర హస్తుఁడు+ఐ= నిప్పు కణాలు విరజిమ్మటం చేత వెరపు గొలిపే వజ్రాయుధాన్ని చేతియందు ధరించినవాడై; స్కందుని మీఁదన్= కుమారస్వామి పైకి; ఎత్తి= దండెత్తి; నడతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: తన శక్తిసామర్థ్యాలమీది నమ్మకంచేత ఏర్పడిన గర్వంతో, ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న రథాలు ఏనుగులు భటులతో కూడిన అపార దేవతాసైన్యంతో లోకభయంకరమైన యుద్ధం చేయటానికి ఉత్సహించిన వాడై, నిప్పులు చెరగుతున్న వజ్రాయుధాన్ని చేతపట్టినవాడై దేవేంద్రుడు కుమారుస్వామిపై దండెత్తి వచ్చాడు.

వ. అంత. 215

తాత్పర్యం: అప్పుడు.

తరలము.

తరళదీధితిపుంజనిర్భరదారుణాయుధపాణు లై
తెరలఁ ద్రోచి దివౌకసుల్ పఱతెంచి యార్చుచుఁ దాఁకి రా
శరవణోద్భవు; నాతఁడుం దగ సంభ్రమస్ఫుటరోష వి
స్ఫురితనిష్ఠురహాసజృంభణమున్ వహించినఁ జెచ్చెరన్. 216

ప్రతిపదార్థం: దివౌకసుల్= దేవతలు; తరళ, దీధితి, పుంజ, నిర్భర, దారుణ+ఆయుధ, పాణులు+ఐ= ప్రకాశించే కాంతుల సముదాయంచేత చుట్టుకొనబడి భయంకరంగా కనిపించే ఆయుధాలు కల చేతులు కలవారై; తెరలన్+త్రోచి= ఉప్పొంగి వచ్చి; పఱతెంచి= వేగంగా అరుగుదెంచి; ఆర్చుచున్= కేకలు వేస్తూ; ఆ శరవణ+ఉద్భవున్= రెల్లుగడ్డి గుంపులో జన్మించిన ఆ కుమారస్వామిని; తాఁకిరి= ఎదుర్కొన్నారు; ఆతఁడున్= ఆ కుమారుడుకూడా; తగన్= అనువుగా, సంభ్రమ, స్ఫుట, రోష, విస్ఫురిత, నిష్ఠుర, హాస, జృంభణమున్= వేగిరిపాటుతో వ్యక్తమైన కోపంచేత వ్యాపించిన కఠోరమైన అతిశయించిన నగవును; వహించినన్= పొందగా; చెచ్చెరన్= వేగంగా.

తాత్పర్యం: అటు పిమ్మట దేవతలు తళతళ వెలుగొందుతున్న భయంకర మైన ఆయుధాలు చేతులలో ధరించినవారై ఉత్సాహం ఉప్పొంగేటట్లుగా కేకలు వేస్తూ కుమారస్వామిపై దండెత్తి వచ్చారు. అప్పుడు ఆ కుమారస్వామి వేగిరపాటుతో కూడిన కోపంవలన ఏర్పడిన కఠోరమైన నవ్వు తన పెదవులపై విరియగా, వేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: వృత్తలక్షణానికి చూడు: ఆరణ్య. 4.402 విశేషం.

తే. అతని ముఖగహ్వరంబుల నద్భుతముగ ।
నుగ్రదహనశిఖావళు లుద్భవించి
వేల్పుమూఁకల నరికట్టి వేల్పుఁ దొడఁగె; ।
నంత నెంతయు సంభ్రాంతు లగుచు సురలు. 217

ప్రతిపదార్థం: అతని, ముఖ, గహ్వరంబులన్= ఆ కుమారస్వామి మొగాలు అనే గుహలనుండి; అద్భుతముగన్= అచ్చెరువు కొలుపుతూ; ఉగ్ర, దహన, శిఖా+ ఆవళులు= భయంకరమైన అగ్ని జ్వాలల సముదాయాలు; ఉద్భవించి= పుట్టి; వేల్పు మూఁకలన్= దేవతల గుంపులను; అరికట్టి= అణచివేసి;

వేల్పన్+తొడఁగెన్= కాల్చివేయసాగాయి; అంతన్= అటు పిమ్మట; సురలు= దేవతలు; ఎంతయున్; సంభ్రాంతులు+అగుచున్= మనస్సు చెదరినవారు ఔతూ.

తాత్పర్యం: ఆ కుమారస్వామి ముఖాలనే గుహలనుండి ఆశ్చర్యకరంగా అగ్నిజ్వాలల సముదాయాలు వెలువడి, దేవతల గుంపులను అణచివేసి కాల్చసాగాయి. అంతట దేవతలు మనస్సు చెదరినవారు ఔతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నీ కింకరులము మమ్ముం ।
జేకొని కృపఁ గావు' మనుచు శిఖినందను న
స్తోకబలు శరణు వేఁడినఁ ।
జేకొని దాహభయ ముడుగఁ జేసె నతండున్. 218

ప్రతిపదార్థం: నీ, కింకరులము= నీ యొక్క సేవకులం; మమ్మున్= మమ్ము; చేకొని= స్వీకరించి; కృపన్+కావుము= దయతో కాపాడుము; అనుచున్= అని పలుకుతూ; అస్తోక, బలున్= ఎక్కువ శక్తి కలవాడిని; శిఖినందనున్= అగ్నిహోత్రుడి పుత్రుడైన కుమారస్వామిని; శరణు వేడినన్= అభయాన్ని ప్రార్థించగా; అతండున్= ఆ కుమారస్వామియును; చేకొని= స్వీకరించి; దాహ, భయము= అగ్నివలన ఏర్పడిన వెరపును; ఉడుగన్+చేసెన్= తొలగిపోయేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: అంతట దేవతలు, 'ఓ మహానుభావా! మేము నీకు భృత్యులం; మమ్మ నీ దాసులుగా స్వీకరించి దయతో కాపాడునది' అంటూ కుమారస్వామిని ప్రార్థించారు. కుమారస్వామి వారిపై జాలికలిగి, శరణార్థులైన ఆ దేవతలను అగ్నిభయంనుండి తప్పించి, వారికి అభయం ఇచ్చాడు.

వ. ఇట్లు దేవతలు గుమారు నాశ్రయించినం జూచి బలసూదనుండు క్రోధఘూర్ణితనయనుండై యతనిమీఁద వజ్రంబు వైచిన, నది తదీయ

దక్షిణపార్శ్వంబుఁ దాఁకిన, నం దొక్క పురుషుండు గాంచనవర్ణుండును శక్తి ధరుండును మేషవదనుండును నై విశాఖుం డను పేరం బ్రభవించె; మఱియునుం గన్యాకుమార గణంబు లనేకంబులు వుట్టె; నది యెల్లనుం గని జనితభయుం డై హరిహయుం డగ్నిసంభవు నభయం బని కొలిచె; నంత నమరులు సంతసిల్లి సింహనాదంబులు సెలంగ షణ్ముఖు శతముఖులం బరివేష్టించి' రని చెప్పి వెండియు మార్కండేయుం డి ట్లనియె. 219

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దేవతలు= వేల్పులు; కుమారున్+ ఆశ్రయించినన్= కుమారస్వామిని శరణు వేడగా; చూచి= అరసి; బలసూదనుండు= దేవేంద్రుడు; క్రోధ, ఘూర్ణిత, నయనుండు+ఐ= కోపం చేత తిరుగుడు పడిన కన్నులు కలవాడై; అతని మీఁదన్= (ఆ కుమార స్వామిపై); వజ్రంబు= వజ్ర మనే ఆయుధాన్ని; వైచినన్= వేయగా; అది= (ఆ వజ్రాయుధం); తదీయ, దక్షిణ పార్శ్వంబున్= ఆ (కుమారస్వామియొక్క) కుడివైపు దేహభాగాన్ని; తాఁకినన్= స్పృశించగా; అందున్= (ఆ కుడి పార్శ్వంలో); ఒక్క, పురుషుండు= ఒక మగవాడు; కాంచన వర్ణుండును= బంగరు మిసిమిరంగు కలవాడున్నూ; శక్తి ధరుండును= శక్తి అనే ఆయుధాన్ని తాల్చిన వాడున్నూ; మేష వదనుండునున్= మేక మొగం కలవాడున్నూ; ఐ= అగుచు; విశాఖుండు+అనుపేరన్= విశాఖుడు అనే పేరు కలవాడై; ప్రభవించెన్= పుట్టాడు; మఱియునున్= ఇంకను; కన్యా, కుమార, గణంబులు+ అనేకంబులు= పెక్కుమంది బాల బాలికల గుంపులు; పుట్టెను= ఉద్భవించాయి; అది+ఎల్లనున్+కని= ఆ సంఘటనను అంతటిని చూచి; జనిత, భయుండు+ఐ= పుట్టిన భయం కలవాడై - అనగా భయపడి; హరిహయుండు= దేవేంద్రుడు; అగ్ని సంభవున్= అగ్నిహోత్రుడికొడుకైన కుమారస్వామిని; అభయంబు+అని, కొలిచెన్= శరణు వేడుకొనెను; అంతన్= పిమ్మట; అమరులు= దేవతలు; సంతసిల్లి= సంతోషించి; సింహ నాదంబులు+చెలంగన్= సింహ గర్జనలు ధ్వనించగా; షట్+ముఖ,

శతమఖులన్= ఆరు మొగాల దేవర అయిన కుమారస్వామిని, నూరు జన్నముల దేవర అయిన దేవేంద్రుడిని; పరివేష్టించిరి= చుట్టును చేరి కూర్చొన్నారు; అని చెప్పి= అని పలికి; వెండియున్= తిరిగి; మార్కండేయుండు= మార్కండేయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా, దేవతలు కుమారస్వామిని శరణువేడటంచేత దేవేంద్రుడు ఆగ్రహోదగ్రు డయ్యాడు. అతడు కుమారస్వామిపై తన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ వజ్రాయుధం కుమారస్వామి శరీరంలోని కుడి భాగాన తాకింది. అప్పుడు ఆ భాగంనుండి ఒక పురుషుడు బంగరుమిసిమిరంగు కల శరీరంతో, మేక మొగంతో జన్మించాడు. ఆ పురుషుడు శక్తి అనే ఆయుధాన్ని ధరించాడు. అతడిపేరు విశాఖుడు. అతడితో పాటు లెక్కకు మిక్కిలి బాల బాలికలు ఉద్భవించారు. ఆ వింతసన్నివేశాన్ని చూచి భయపడి దేవేంద్రుడు తాను కూడ కుమారస్వామిని శరణు వేడాడు. అక్కడ ఉన్న దేవతలందరు సంతోషింతో సింహనాదాలు చేస్తూ కుమారస్వామి దేవేంద్రుల చుట్టూ చేరి నిల్చారు' అని చెప్పి మార్కండేయమహర్షి మరియు ఈ విధంగా తెలిపాడు.

సీ. అయ్యగ్నిసంభవు నాయతోన్నతబాహు, ।
నాముక్తకవచుఁ, దేజోమహిష్ఠు,
నాలోహితాంబరు, హారికుండలకర్ణుఁ, ।
గనకరత్నోజ్జ్వల ఘనకిరీటు,
సంపూర్ణయౌవను, సర్వలక్షణయుక్తుఁ ।
గని, యనురాగిల్లి కమలనిలయ
సాకార యై వచ్చి యఖిలంబుఁ జూడంగ ।
సితపద్మహస్త యై యతనిఁ బొందె;

ఆ. శ్రీసమేతుఁడై విశేషకాంతిస్ఫూర్తి ।
నొలసి పూర్ణచంద్రుచెలువు దాల్చి
యున్నవానిఁ జూచి రుత్ఫుల్లలోచన ।
కుముదు లగుచు మునులు నమరవరులు. 220

ప్రతిపదార్థం: కమల నిలయ= పద్మ నివాసిని అయిన లక్ష్మీదేవి; ఆ+అగ్ని, సంభవున్= అగ్నిహోత్రుడి కుమారుడైన ఆ కుమారస్వామిని; ఆయత+ఉన్నత, బాహున్= నిడివి అయిన మరియు ఎత్తైన భుజాలు కలవాడిని; ఆ ముక్త కవచున్= ధరించబడిన కవచం కలవాడిని- అనగా కవచం ధరించిన వాడిని; తేజస్+మహిష్ఠున్= దేదీప్యమాన మైన వెలుగు చేత గొప్ప వాడైన వాడిని; ఆలోహిత+అంబరున్= మిక్కిలి ఎర్ర నైన వస్త్రాలు కలవాడిని; హారి, కుండల, కర్ణున్= అందమైన దుద్దులు గల చెవులు కలవాడిని; కనక, రత్న+ఉజ్జ్వల, ఘన, కిరీటున్= బంగారంతో మణులతో ప్రకాశించే గొప్ప కిరీటం కలవాడిని; సంపూర్ణ, యౌవనున్= నిండు జవ్వనంతో తొణికిసలాడుతున్న వాడిని; సర్వ, లక్షణ, యుక్తున్= అన్ని మంచి గుణాలతో కూడిఉన్న వాడిని; కని= చూచి; అనురాగిల్లి= ప్రేమించి; స+ఆకార+ఐ, వచ్చి= శరీర ధారిణి అయి అరుగుదెంచి; అఖిలంబున్+చూడంగన్= సమస్తం (సర్వభూతాలును) చూస్తూఉండగా; సిత, పద్మ, హస్త+ఐ= తెల్లని తామరపువ్వులను రెండు చేతుల్లో ధరించినదై; అతనిన్= ఆకుమారస్వామిని; పొందెన్= చేరింది; మునులున్= ఋషులును; అమర, వరులున్= దేవతలలో శ్రేష్ఠులును; శ్రీ, సమేతుఁడు+ఐ= లక్ష్మీదేవితో కూడిన వాడై; విశేష, కాంతి, స్ఫూర్తిన్+ఒలసి= గొప్పదైన వెలుగు యొక్క వ్యాప్తిచేత ఒప్పారి; పూర్ణ, చంద్రు, చెలువు+తాల్చి= నిండు చందురుడి పోలుపు ధరించి; ఉన్నవానిన్= ఉన్న వాడిని, కుమార స్వామిని; ఉత్+పుల్ల, లోచన, కుముదులు+అగుచున్= బాగా వికసించిన తెల్లకలువలవంటి కన్నులు కలవారు ఔతూ; చూచిరి= తిలకించారు.

తాత్పర్యం: అగ్నిహోత్రుడి పుత్రుడైన ఆ కుమారస్వామి నిడివి అయి ఎత్తైనభుజాలు కలవాడు. కవచాన్ని ధరించిన వాడు. దేదీప్యమానమైన వెలుగు వెల్లి విరిసిన ముఖం కలవాడు. మిక్కిలి ఎర్రనైన వస్త్రాలు ధరించినవాడు. మణులు పొదిగిన బంగారు కిరీటం ధరించిన వాడు. నిండు జవ్వనం తొణికిసలాడుతున్నవాడు. సర్వ సద్గుణ విరాజితుడు. అట్టి అతడిని చూచి ప్రేమించి, లక్ష్మీదేవి శరీరధారిణి అయి వచ్చి అతడిని చేరింది. ఆమె చేతిలో శృంగారకమలం విరిసి ఉంది. ఆ రీతిగా లక్ష్మీయుక్తుడై దేదీప్యమానంగా వెలుగొందుతున్న కుమారస్వామిని పూర్ణచంద్రుడివలె సౌందర్యంతో ఒప్పారేవాడిని ఋషులు వేల్పులు ఆనందంతో ఆశ్చర్యంతో తిలకించారు.

వ. అంత షష్ఠదివసంబు సంప్రాప్తం బయ్యె; నందు మహామునులందఱు మహాసేను నతిభక్తిం బూజించి, కృతాంజలులై యిట్లనిరి. 221

ప్రతిపదార్థం: అంతటన్= అటు పిమ్మట; షష్ఠ దివసంబు= ఆరవ రోజు; సంప్రాప్తంబు+అయ్యెన్= వచ్చింది; అందున్= అక్కడ; మహా, మునులు+ అందఱున్= గొప్ప ఋషులు అందరున్నూ; మహాసేనున్= కుమారస్వామిని; అతిభక్తిన్= మిక్కిలి పూజ్యభావంతో; పూజించి= ఆరాధన చేసి; కృత+అంజలులు+ఐ= ఘటించిన కైమోడుపులు కలవారలై- నమస్కరించిన వారై; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: ఆ పిమ్మట ఆరవదినం వచ్చింది. అచట ఉన్న గొప్ప ఋషులు కుమారస్వామిని భక్తితో ఆరాధించి, నమస్కారాలు చేసి ఈ విధంగా పలికారు.

ఉ. 'పుట్టిన యాఱునాళులకుఁ బొంపిరివోయి జగంబు లన్నియున్
దట్టుఁడ వై జయించితి ముదంబుగ నీదు మహత్త్వ మెంతయుం
జిట్టలు గాదె! యిట్టి యవిజేయుఁడ వింద్రపదంబు నీక కాఁ
బట్టము గట్టి యేలుము కృపన్ మము నెల్లను వహ్నిసంభవా!' 222

ప్రతిపదార్థం: వహ్నిసంభవా!= అగ్నిహోత్రుడి కొడుకు వయిన ఓ కుమార స్వామీ!; పుట్టిన= జన్మించిన; ఆఱు, నాళులకున్= ఆరు రోజులకు; పొంపిరి+పోయి= అతిశయించి; జగంబులు+అన్నియున్= లోకాలు అన్నింటిని; దట్టుఁడవు+ఐ= ధీరుడవై; ముదంబునన్= సంతోషంతో; జయించితి(వి)= గెలిచావు; నీదు, మహత్త్వము= నీ యొక్క గొప్పదనం; ఎంతయున్= మిక్కుటంగా; చిట్టలు+కాదె= అచ్చెరువు కొల్పేది కదా; ఇట్టి+అవిజేయుఁడవు= ఈ విధంగా ఓటమి చెందని వీరుడవు; ఇంద్ర పదంబు= ఇంద్రుడి యొక్క పదవి; నీకున్+అ+కాన్= నీకు మాత్రమే ఉండేటట్లుగా; పట్టము+కట్టి= పట్టాభిషేకం చేసి; మమున్+ఎల్లను= మమ్ముల నందరిని; కృపన్= దయతో; ఏలుము= పరిపాలించుము.

తాత్పర్యం: 'అగ్నిదేవుడి పుత్రుడవైన కుమారస్వామీ! నీ మహిమ మిగుల ఆశ్చర్యకరమైనది. నీవు పుట్టిన ఆరురోజులకే అవలీలగా జగాలనన్నింటిని జయించావు కదా! నీవు అజేయుడవైన మహావీరుడవు. కాబట్టి ఇంద్రపదవిని అధిష్ఠించి, దయతో నీవు మమ్ములను అందరిని పరిపాలించుము'.

వ. అనినం గ్రౌంచారి వారలం జూచి' యింద్రపదవి నుండువారి కెయ్యది కరణీయం?' బని యడుగుటయు వా రిట్లనిరి. 223

తాత్పర్యం: అని పలుకగా, కుమారస్వామి అక్కడ ఉన్నవారిని చూచి 'ఇంద్రపదవిలో ఉండేవారు నెరవేర్చవలసిన పని ఏది?' అని ప్రశ్నించగా, వారు ఇట్లా బదులు పలికారు.

మ. 'బలముం దేజము నించి లోకముఁ గృపం బాలించు టర్కేందు భూ
జల తేజః పవనాంబరంబులకు నస్థైర్యంబు గాకుండ ని
శ్చలశక్తిస్థితి నీఁగి శిష్టజనరక్షాదుష్టశిక్షాసమా
కలనం బింద్రపదస్థుఁ డౌ నతనికిం గర్తవ్యముల్ షణ్ముఖా!' 224

ప్రతిపదార్థం: షట్+ముఖా!= ఆరు మోముల దేవరా!; ఇంద్ర పదస్థుఁడు+ఔ= ఇంద్రుడి యొక్క పదవిలో ఉండే; అతనికిన్= అతడికి; బలమున్= శక్తిని; తేజమున్= వెలుగును; నించి= నింపి; లోకమున్= జగత్తును; కృపన్=

దయతో; పాలించుట= ఏలుట; అర్క+ఇందు, భూ, జల, తేజస్+పవన+ అంబరంబులకున్= సూర్యుడికి, చంద్రుడికి, భూమికి, నీటికి, అగ్నికి, గాలికి, ఆకసానికిన్నీ; అస్థైర్యంబు+కాకుండన్= చలనం లేకుండా, అనగా తిరంగా ఉండటానికై; నిశ్చల, శక్తి, స్థితిన్+ఈఁగి= చలించని సామర్థ్యం ఒసగి; శిష్ట, జన రక్షా, దుష్ట, శిక్షా, సమ్+ఆకలనంబు= మంచివారిని రక్షించటం చెడ్డవారిని శిక్షించటం జరుపుతుండటం; కర్తవ్యముల్= చేయవలసిన పనులు.

తాత్పర్యం: 'ఆరుమోములదేవరా! ఓ కుమారస్వామీ! స్వీయసామర్థ్యం తేజస్సు లోకంలో నిలిపి, దుష్టులను శిక్షించటం శిష్టులను రక్షించటం మూలంగా పరిపాలన చేయటం, పంచభూతాలు సూర్యచంద్రులు తిరంగా ఉండేటట్లు చూడటం ఇంద్రపదవి నధిష్ఠించేవాడు చేయదగిన పనులు.

చ. అనునెడ నింద్రుఁ డిట్లనియె, 'నట్లయినం గడులెస్స; దేవ! నీ
వనిమిషనాయకత్వమునయం దభిషిక్తుఁడవై ముదంబుతో
ననుఁ బని గొమ్ము నీదు కరుణన్ దొసఁ గెల్లను దీఱి యుండెదన్;
ఘనతర శౌర్యసారుఁడవు గావున నర్హుఁడ వింద్రలక్ష్మికిన్. 225

ప్రతిపదార్థం: అను+ఎడన్= అని చెప్పేటప్పుడు; ఇంద్రుఁడు= వేలుపుదొర; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు+అయినన్= ఆ విధంగా జరిగితే (అనిన దేవతల ప్రార్థన మేరకు కుమారస్వామి ఇంద్రపదవిని స్వీకరిస్తే); కడు= మిక్కిలి; లెస్స= మంచిది; దేవ!= ఓ కుమారస్వామీ!; నీవు; అనిమిష నాయకత్వమున+అందున్= దేవతల యొక్క నాయకత్వంలో; అభిషిక్తుఁడవు+ఐ= అభిషేకించబడిన వాడవు అయి (అభిషేకం ప్రభుత్వ లాంఛనం); ముదంబుతోన్= సంతోషంతో; ననున్= నన్ను; పని+కొమ్ము= పనులను చేయటానికై నియోగించుము; నీదు కరుణన్= నీ యొక్క దయవలన; దొసఁగు+ ఎల్లను+తీఱి+ఉండెదన్= దోషాలు అన్నిటిని దాటిన వాడవై ఉండగలను; ఘనతర శౌర్యసారుఁడవు= గొప్పదైన పరాక్రమం యొక్క

సారాన్ని పొందిన వాడవు; కావునన్; ఇంద్ర లక్ష్మికిన్= ఇంద్రపదవి యొక్క ఐశ్వర్యానికి; అర్హుఁడవు= తగిన వాడవు, యోగ్యుడవు.

తాత్పర్యం: అనగా, ఇంద్రుడు ఈ విధంగా చెప్పాడు: 'దేవతలు చెప్పిన మాటలు బాగా ఉన్నవి. ఓ కుమారస్వామీ! నీవు దేవేంద్రపదవిలో అభిషిక్తుడవై నన్ను నీ భృత్యుడిగా ఏలుకొనుము. నేను నీ ఆజ్ఞప్రకారం నడచుకొనగలను. నాకంటె పరాక్రమంలో నీవు అధికుడవు కాబట్టి ఇంద్రపదవికి నీవే యోగ్యుడవు.

వ. ఏను దేవేంద్రపదవి నుండ నోడుదు; నెట్లనిన భవదీయ తేజోవిశేషంబులు సూచి విస్మితులై కొందఱు నీకు నింద్రపదవియందు వేడ్కపుట్టునట్లుగా నే మేనింజెప్పి నావలనం గొఱగామి కల్పించి, నీకును నాకును భేదంబు సేయం జూతురు; దానం జేసి నీవు కుపితుండవై నాయెడం గృపదప్పిన నెవ్వారికి వారింప నలవిగాదు; లోకభయంకరంబైన విగ్రహంబు ప్రవర్తిల్లుఁ గావున నవశ్యంబును దివిజరాజ్యంబు నీక యొప్పించితి; మమ్మెల్ల నేలి కొ' మ్మనినఁ గుమారుండు నవ్వుచు ని ట్లనియె. 226

ప్రతిపదార్థం: ఏను= నేను; దేవ+ఇంద్ర, పదవిన్= వేల్పులకు ప్రభువు అయిన ఇంద్రుని పదవిలో; ఉండన్+ఓడుదున్= ఉండుటకు జంకెదను; ఎట్లు+అనినన్= అందుకు కారణం ఏమి అని అడిగితే; భవదీయ, తేజస్+విశేషంబులు= నీయొక్క దేదీప్యమైన గొప్పకాంతి మున్నగునవి; చూచి= అరసి; విస్మితులు+ఐ= అచ్చెరువు పొందిన వారై; కొందఱు= కొంతమంది; నీకున్; ఇంద్ర, పదవి+అందున్= వేల్పులకు ప్రభువుగా ఉండే పదవిలో; వేడ్క= ఆసక్తి; పుట్టునట్లుగాన్= కలుగునట్లుగా; ఏమి+ఏనిన్+చెప్పి= ఏదో ఒకటి కల్పించి పలికి; నా వలనన్= నాయందు; కొఱగామి కల్పించి= లోటుపాటు నిరూపించి; నీకును, నాకును= నీకును నాకును మధ్య; భేదంబు+చేయన్+చూతురు= శత్రుత్వం ఏర్పడేటట్లు ప్రయత్నాలు చేయగలరు; దానన్+చేసి= అందువలన; నీవు; కుపితుండవు+ఐ= కోపం చెందిన వాడవై; నా+ఎడన్= నా యెడల; కృపన్+తప్పినన్= దయమాలితే,

ఆగ్రహిస్తే; ఏ+వారికిన్= ఎట్టి వారికినైనను; వారింపన్= ఆపుటకు; అలవి+కాదు= శక్యం కాదు; లోక, భయంకరంబు+ఐన= లోకానికి అంతటికీ భయం కలిగించేది అయిన; విగ్రహంబు= కయ్యం; ప్రవర్తిల్లున్= ఏర్పడుతుంది; కావునన్= కాబట్టి; అవశ్యంబును= తప్పనిసరిగా; దివిజ రాజ్యంబు= దేవతల ఏలుబడి; నీకున్+అ= నీకు ఒక్కడికే; ఒప్పించితిన్= సమర్పించాను; మమ్మున్+ఎల్లన్= మమ్మలిని అందరిని (వేల్పుల నందరిని); ఏలి కొమ్ము= పరిపాలించుకొమ్ము; అనినన్= అని చెప్పగా; కుమారుండు= కుమారస్వామి; నవ్వుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'నేను దేవేంద్రపదవిని ఇక అధిష్ఠింప జాలను. ఎందుకంటే దేదీప్యమానమైన నీ తేజస్సు చూచి, అచ్చెరువు పొందిన కొంతమంది నీవే దేవతలకు తగిన ప్రభుడవు అని చెప్పి, నీకు దేవేంద్రపదవిపై అభిలాష కలిగేటట్లు చూడగలరు. అప్పుడు నామీద నీకు ఆగ్రహం ఏర్పడవచ్చును. అప్పుడు నీవు నాపై పరాక్రమించిన, నిన్ను ఆపగల వార లెవరు? మనమధ్య ఏర్పడే శత్రుత్వం జగత్తుకు వినాశకరం. అందుచేత నీకును, నాకును, లోకానికి మేలు కలుగ వలెననే మంచిఉద్దేశంతో ఈ దేవలోక రాజ్యాన్ని నీకు సమర్పించటానికి ఉద్యమించాను. నన్ను, నాతోడి వేల్పులను దయతో పరిపాలించుము' అని దేవేంద్రుడు అభ్యర్థించాడు. ఆ మాటలు విని ఆదరాభిమానాలు సూచించే నవ్వుతో కుమారస్వామి ఇట్లా బదులు పలికాడు.

ఉ. 'అట్టివి యేల పుట్టు? నమరాధిప! నీవ జగత్ప్రభుండ వై
యిట్టల మైన తేజము వహించి సుఖంబున నుండు; మేను నీ
చుట్టమనై భుజాబలము సొంపున నీ కెలసంబు దీర్చెదం;
జట్టన నన్నుఁ బంపుము భృశంబుగ నెయ్యది కార్య మిత్తటిన్?' 227

ప్రతిపదార్థం: అమర+అధిప!= ఓ దేవేంద్రుడా!; అట్టివి= అటువంటివి - అనగా చెప్పుడుమాటలవలన మనమధ్య ఏర్పడే విభేదాలు; ఏల= ఎందువలన;

పుట్టున్?= కలుగుతాయి;నీవు+అ= నీవు మాత్రమే; జగత్+ప్రభుండవు+ఐ= లోకాలను పరిపాలించే రాజువుఅయి; ఇట్టలము+ఐన= హెచ్చు అయిన; తేజము= దేదీప్యమానమైన కాంతి; వహించి= ధరించి; సుఖంబునన్+ఉండుము= సౌఖ్యాన్ని అనుభవించుము; ఏను= నేను; నీ చుట్టమను+ఐ= నీ యొక్క బంధువును ఐ; భుజా, బలము, సొంపునన్= పరాక్రమం యొక్క సొగసుచేత; నీ కెలసంబు= నీ యొక్క పని; తీర్చెదన్= నెరవేరుస్తాను; చట్టనన్= శీఘ్రంగా; నన్నున్= నన్ను; పంపుము= నియోగించుము; ఈ+తటిన్= ఈ సందర్భాన; భృశంబుగన్= వేగంగా; కార్యము= నెరవేర్చవలసిన పని; ఎయ్యది= ఏది?

తాత్పర్యం: 'ఓ దేవేంద్రా! చెప్పుడుమాటలవలన నీకును నాకును మధ్య శత్రుత్వం ఎన్నటికిని ఏర్పడదు. నీవు మనస్సులో ఎట్టి సంకోచాన్ని పెట్టుకొనవలదు. నీవు గొప్ప తేజస్సు కలవాడవు. అనుభవజ్ఞుడవు. పరిపాలనలో సామర్థ్యం ఉన్నవాడివి. నీవే దేవలోకాన్ని నిశ్చితంగా ఏలుకొనుము. నేను నీకు బంధువుగా నీ అండ నిలిచి నా పరాక్రమం ప్రదర్శించి నీ పనులను నిర్వహించగలను. ఇప్పుడు అవశ్యం నెరవేర్చదగిన కర్తవ్యాన్ని సూచింపుము. వెంటనే నెరవేర్చగలను'.

చ. అనవుడు సంతసిల్లి యతఁ డాతని కిట్లను 'నట్టు లైన నీ
పనుపున నేను సత్యహితభాషణ! యింద్రపదంబునందు ని
ల్చి నెగడువాఁడ నైతి; సురసేనల కెల్లను నాయకుండ వై
ఘనభుజ! నీవు సత్కృప జగద్భయమోచన మాచరింపవే!' 228

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; అతఁడు= (దేవేంద్రుడు); సంతసిల్లి= సంతోషించి; ఆతనికిన్= (కుమారస్వామికి); ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; సత్యహిత భాషణ!= నిజంగా మేలొనగూర్చునట్టి దానిని వచించేవాడా, ఓ కుమార స్వామీ!; అట్టులు+ఐనన్= ఆ విధంగా అయితే; (అనగా నీవు చెప్పినట్లుగా నీవు నాకు బంధువుగా ఉండి, నాకు అండగా

నిలిస్తే); నీ పనుపునన్= నీ అనుమతి చొప్పున; ఏను= నేను; ఇంద్ర, పదంబు నందున్= దేవేంద్ర పదవిలో; నిల్చి= ఉండి; నెగడువాఁడన్+ఐతిన్= ఒప్పునట్టివాడను అయినాను; ఘన, భుజ!= గొప్ప బాహువులు కలవాడా! మిక్కుటమైన పరాక్రమం కలవీరుడా!; సుర, సేనలకున్+ఎల్లను= సమస్తమైన వేల్పుల భటులకు; నాయకుండవు+ఐ= నేతవు అయి-సేనాధిపతివై; నీవు; సత్+కృపన్= మంచి దయతో; జగత్+భయ, మోచనము= లోకానికి ఏర్పడిన భీతిని తొలగించటం; ఆచరింపవే!= చేయువా! (చేయుము).

తాత్పర్యం: అని కుమారస్వామి చెప్పాడు. ఆ మాటలు విని దేవేంద్రుడు మిక్కిలి సంతసించాడు. అంతట దేవేంద్రుడు కుమారస్వామితో ఈ విధంగా అన్నాడు: 'సత్యాన్ని వచించేవాడా! నామేలు కోరి వచించేవాడా! నీ మాటలు విశ్వసించి నీ అనుమతి చొప్పున నేను ఈ దేవేంద్రపదవిలో ఉండటానికి అంగీకరిస్తున్నాను; గొప్ప పరాక్రమంగల మహాబాహుడా! నీవు దేవతా సైన్యానికి నాయకుడవై, సర్వసేనాపతివై పరాక్రమ ప్రాభవంతో లోకంలో ఏర్పడి ఉన్న భయాన్ని తొలగించటానికి దయతో పూనుకొనుము'.

వ. అనినఁ గుమారుండు మరుత్పతి కిట్లనియె. 229

తాత్పర్యం: అనగా కుమారస్వామి దేవేంద్రుడితో ఇట్లా అన్నాడు.

* * *